

SEPTEMBER '64 — 60 P.



ఆగస్టు 21 విడుదల
DBN PRODUCTIONS
డి.బి.ఎన్ వారి
దాగుడు మూతలు
నిర్మాత డి.బి.నారాయణ • దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు
మాటలు ముళ్ళపూడి వెంకటరమణ • సంగీతం కె.వి.మహదేవన్
శ్రీఫిలింస్ విడుదల



నెలకు రూ. 100/- చొప్పున రాబోయే 12 సంవత్సరాల పాటూ మీరు 12-సంవత్సరాల దేశరక్షణ సర్టిఫికెట్లను కొనినట్లైతే ఆ 12 సంవత్సరాల తరువాత ప్రతి మాసానికి ఒక సర్టిఫికెట్టు గడువు తీరి మీకు నెల ఒక్కింటికి రూ. 175/- చొప్పున ఆదాయాన్ని తీసుకు వస్తుంది. పన్ను లేనటువంటి ఈ నెలసరి ఆదాయము వృద్ధాప్యములో మీకు నిశ్చితమైన పెన్షనును తీసుకువస్తుంది.

మీకు ప్రతి నెలావచ్చే పెన్షను

మీరు ఇష్టపడినట్లైతే, ఈ సర్టిఫికెట్ల గడువు తీరిన తరువాత అవశ్యాసొమ్ములో 75 రూపాయలను మీరు వుంచుకొని, మిగిలిన అసలు మూలధనం 100 రూపాయలను తిరిగి దేశరక్షణ సర్టిఫికెట్లలో మదుపు పెట్టవచ్చును. ఆ విధముగా క్రొత్తగా మదుపు పెట్టిన తేదీనుంచి మరియొక పన్నెండు సంవత్సరాల పాటు మీకు గాని, మీపై ఆధారపడివుండేవారికి గాని నిశ్చితమైన ఆదాయము లభిస్తుంది. మీకుగాని, మీపై ఆధారపడివుండే వారికి గాని దేశరక్షణ సర్టిఫికెట్లు అత్యున్నతమైన ధన భద్రత సమకూర్చే సాధనాలు.

దేశ రక్షణ సర్టిఫికెట్లను కొనండి

జాతీయ పొదుపు ఉద్యమ సంస్థ



సచిత్ర మాసపత్రిక

జ్యోతి

బకింగ్‌హామ్‌పేట, విజయవాడ-2.

విడిప్రతి వెల : 60 పైసలు — ఏడాది చందా : ఏడు రూపాయలే

సంపుటి **2** సెప్టెంబరు **1964** సంచిక **9**

పాఠక మహాశయా! ఈ నెల

ఇదో వరస...

ముఖచిత్రం :

మద్రాసులో స్టిల్ సత్యంగారింట వివాహసందర్భంలో ఇద్దరుమిత్రులు.

మేనేజింగ్ ఎడిటరు : వి. వి. రాఘవయ్య

సంపాదక వర్గం :

నండూరి రామమోహనరావు, ముళ్ళపూడి వెంకటరమణ, బాపు, వి. ఎ. కె. రంగారావు, రావి కొండలరావు.

ఉత్తరాయణం

"బ్రతుకు బాటలో" "నీవన్నది నిజం". అనే కథలు హృదయానికి హత్తుకుపోయే రచనలు. భమిడిపాటి రామగోపాలంగారి "నీపద్ధతి మార్చుకో" కథ బాగానేవుంది. భార్యాభర్తలు యెదుర్కొనే సమస్యలను కథా వస్తువుగా తీసికొని చక్కని శైలిలో మనోజ్ఞముగా రచించారు.

మిస్ జి. వి. సరస్వతి,
గణపతినగరం.

ఆగష్టు సంచికలో ప్రచురించిన "నీ పద్ధతి మార్చుకో" అనే కథ నిజానికి దగ్గరగా నున్నది. ఈ నెలలో వేసిన కథలు అన్నీ బాగానే యున్నవి. 'సెక్రటరీ' సీరియల్ కథ చదువుచున్న కొలది యింకా చదవాలనే ఉన్నది. ముఖ్యముగా అన్ని మాసపత్రికలకన్న మీ "జ్యోతిలో" జోక్సు చాల బాగుండును. ఈనెల ఉత్తరాయణంలో ఒక మిత్రుడు శ్రీ ఆర్. వెంకటేశ్వర రావు, మద్రాసు వ్రాసినరేఖ అంత సమంజసముగాలేదు. ఎందుకనగా ఉత్తరాలు ప్రతి సంచికకు ముఖ్యము; ఎందుకనగా ఉత్తరాలవలననే పుస్తకములోని లోపములను సరిదిద్దుకొని అభివృద్ధి అగుటకు అవకాశముండును.

డి. సాయన్న, యన్. బుచ్చన్న,
లక్సెట్టిపేట.

ఆగష్టు "జ్యోతి"లో బాగా నచ్చినవి: ఒకటి కథాసంగ్రహమ్, రెండోది ఉచ్చారణ. 'ఉచ్చారణ' వ్యాసము. సాహిత్యాభిమానులకు, పరిశోధకులకు ఉపయోగంగా ఉంది. రచనగూడ మంచి ఇంటరెస్టుగా ఉంది. ప్రతినెల జ్యోతిలో ఈలాంటి సాహిత్య సంబంధ వ్యాసములు ప్రకటించినచో బాగుంటుందని నా తలంపు. ఈ నెల జ్యోతి జోక్సుగూడా ఇంటరెస్టుగా ఉన్నవి.

పి. సుదర్శన్ రెడ్డి, హైద్రాబాద్.


ఆగష్టునెల "జ్యోతి" కంతటికీ ఒక్క 23 వ పేజీలో కార్టూను చాలు వినోదానికి. ఇక పోతే, కవిత్రయం రచించిన వ్యాసం బ్రహ్మాండంగా వుంది. కథలన్నీ పాత రచయితలవే కనబడుతున్నాయి. కొత్త రచయితలకు ప్రోత్సాహమిస్తారని ఆశిస్తున్నాను.

"బాలరాజు", వైజాగ్.

"జ్యోతి" మాస పత్రిక 2, 3 తారీఖులకే కాపీలు దొరకనంత విరివిగా గుంటూరులో అమ్ముడుపోతున్నందుకు నేను సంతోషిస్తున్నాను. పేజీ క్రిందవేస్తున్న హాస్యోక్తులు సంగ్రహించినవో (ఇతర భాషలనుంచి) లేక పాతవో వేసి మళ్ళీ నవ్వించడానికి ప్రయత్నిస్తున్నారు. ఇటువంటివి స్వంతమన్నట్లు ప్రకటించడం సబబుకాదేమో! క్రిందమూలాన్ని పేర్కొనడం మంచిదని నా వుద్దేశ్యం—

వి. బాలకృష్ణరావు, గుంటూరు.

"జ్యోతి" జన్మించి రెండవ సంవత్సరం నడుస్తున్నా కథలవిషయంలో చెప్పుకోతగ్గ అభివృద్ధి ఏం కనిపించడంలేదు. "ఉచ్చారణ" బాగుంది. కాని ఒకమాట. వ్రాసిన ముగ్గురూ కవులు కాదుగా? అలాంటప్పుడు



కవిత్రయం అనేకంటే 'రచయిత్రుత్రయం' అనివుంటే బాగుండేది కదూ ?

శ్రీ సుధ, విజయవాడ.

(● వచన రచయితలను కవులనగూడదని ఎక్కడా లేదనుకుంటాము)

"ఉచ్చారణ" చెత్తగా ఉంది—

జి. సు. రావు, వాల్తేరు.

ఆగస్టు సంచిక "జ్యోతి"లో శాకర్ల దశరథరామిరెడ్డి, నెల్లూరుగారి ఉత్తరానికి జవాబుగా ఈ క్రింది వాక్యాలను ప్రచురించ వలసినదని కోరుతున్నాను.

"మూగమనసులు" సినిమా కలకత్తాలో విడుదల కాలేదని నాకు తెలుసు. అయినా ఆ కథలో వ్రాశానంటే—ఈ కథ వాస్తవంగా జరిగినది జరిగినట్లు నేను రాయలేదు. చారిత్రాత్మకంగా, కలకత్తాలో, కాలానికీ—కథకీ సంబంధంలేదు. ఒక సిటీపేరు తీసుకోవటం కాస్మాపాలిటన్ వాతావరణం కోసం. అనేక సినిమాలు వస్తూ పోతూఉంటాయి. ఎప్పుడైనా మన జీవితానికి సినిమాకి పోలిక కల్పించ వచ్చు.

రోజూ జరిగే సంఘటనలకి కాలంతో మార్పులేదు. ప్రేమ ఒక పక్కనే ఉంటే కలిగే బాధకి మాత్రమే విజయ తనను గౌరితో పోల్చుకుంటుంది కథకి ఆసినిమాతో అంత కంటె సంబంధంలేదు.

కథలు ఊహించిరాస్తారు. కథలో ఆఖరి భాగం—ఇంకో రెండు సంవత్సరాలు పోయాక వాళ్ళ సంసారం అవిధంగాఉందని రాగల మార్పు ఊహించి వ్రాసినది. అది కథ కదా. నేనది పొరపాటు అని భావిం చటంలేదు. ఐనా కుతూహలంతో విమర్శించి నందుకు సంతోషంగా నా జవాబు ఇస్తు న్నాను.

"అరవింద", జమ్ షెడ్ పూర్.

ఈనెల స్వరలహరిలో రమాసుందరి చిత్రంలో: 'నచ్చావురా చక్కనోడా' అనే పాట తెరపై మీనాకుమారి పాడినటుగా శ్రీనివాస్‌గారు వ్రాశారు. కానీ ఆచిత్రంలో మీనాకుమారి నటించలేదనే నా నమ్మకం. ఆ పాట తెరపైపాడినది రాజశ్రీ. నర్తనశాల లోని పాటలలో తలమానికాలైన సలలిత రాగసుధా. సఖియా వివరింపవే పాటలను వారు పేర్కొనకపోవడం చాలా లోటనిపిం చింది.

లావణ్యకుమారి, బొబ్బిలి.

'స్వరలహరి'ని "జ్యోతి"కి అమూల్యా భరణముగా రూపొందించిన సంపాదకవర్గం వారికి, ఆ శీర్షికను అత్యంత ప్రతిభావంత ముగా నిర్వహించిన పి. బి. శ్రీనివాస్‌గారికి మా శుభాభినందనలు. అన్ని వ్యాసాలు అత్యు త్తమంగా వున్నాయి. అందులో ముఖ్యంగా శ్రీ పెండ్యాల, అశ్వత్థామ, కె. వి. మహదేవన్, వేణు, సుసర్ల గురించిన వ్యాసాలు అమితంగా ఆకర్షించాయి.

శిష్టా, మద్రాసు.

"సెక్రటరీ" సీరియలు చదివినకొద్ది చదవ బుద్ధిఅవుతూ చాలా బాగున్నది. 'జయంతి' పాత్రకు సంబంధించిన 'రాజశేఖర'మే కాకుండా, 'శివరామ్' మరియు 'ప్రకాశం' అను వ్యక్తులుకూడా ప్రవేశించి కథ మంచి సస్పెన్సుగా నడుస్తున్నది. ఇంత మంచి సీరియలును మా కందజేయుచున్న రచయిత్రికి మా ధన్యవాదాలు. అరవింద గారు రచించిన "బ్రతుకుబాటలో" చాలా బాగుంది. 'ఉచ్చారణ' గూర్చి కవిత్రయము బాగా రాశారు.

కె. రాధాకృష్ణారావు, ఘనుమకొండ.

కథలు ఎంతో బాగున్నాయి. 'సెక్రటరీ' చాలా బాగుంది. శైలికూడ లలితమధురంగా, మనోరంజకంగా ఉంది. ఈ నెలలోనే మరొక రచన నాకు బాగా నచ్చింది. భమిడి

పాటి రామగోపాలంగారి "నీ పద్ధతి మార్చుకో" చెప్పదలచుకున్న విషయాన్ని చక్కగా సూటిగా చెప్పారు రచయిత. తరువాత కవిత్రయంవారి 'ఉచ్చారణ' నవ్వు పుట్టించింది.

కె. లీలాభాస్కర్, హైదరాబాదు.

'స్వరలహరి' ఆపివేస్తున్నారంటే ఏదో పోగొట్టుకొంటున్నట్లుగా యున్నది. సినీ రంగంలో విశేష ప్రతిభతో వెలుగుతున్న శ్రీనివాస్‌గారు ఖాళీ చేసుకొని "జ్యోతి" కొరకై 'స్వరలహరి'ని వ్రాసియివ్వడం చాలా ఆనందించవలసిన విషయం. ఎ. ఎం. రాజాగార్ని ఎందుకు పరిచయం చెయ్యలేదో అర్థంకావడంలేదు. కనీసం కొంతకాలమన్నా ఈ శీర్షిక నడపండి. లేదా ఇకనుంచి ప్లేబ్యాక్ సింగర్స్‌నైనా పరిచయంచెయ్యండి


లోలుగు అప్పాజీ, రాజమండ్రి.

"నీ వన్నది నిజం" నిజం మనం ఆడ వాళ్ళను భోగ్యవస్తువులుగా మాత్రమే చూస్తున్నాం. వాళ్ళుకూడా భోగ్య వస్తువులుగా కనిపించటానికే తాపత్రయపడుతున్నారు. వారి తాపత్రయం ఈడేరటానికిగాను అంతులేని సాధనాలు – క్రీములూ, పౌడర్లూ, సబ్బులూ, లోషనులూ, సెంట్లూ, నైలాన్ చీరలూ, జుట్టుముళ్ళూ, శాల్సులూ, బెల్టులూ – అనేకంగా ఎడ్వర్టయి జవుతున్నాయి. ఆడ వాళ్ళు అప్సరసల్లే ఉండేలాగు చెయ్యటానికి ఆధునిక శాస్త్ర విజ్ఞానమూ, టెక్నిక్కులూ, చిట్కాలూ, పరిశ్రమలూ ఏకోన్ముఖంగా పనిచేస్తున్నాయి. గోళ్ళరంగులూ, పెదవుల పూతలూ, బ్లీచ్‌లూ, ఓ జడరెంట్లూ (బి. ఓ. విరుగుళ్ళు). డెపిలేటరీలూ ఒక్కందుకే కృషిచేస్తున్నాయి – ఆడదాన్ని అత్యంత ఆకర్షణీయమైన భోగ్యవస్తువుగా ప్రదర్శించటానికి. ఈ పరిస్థితిని నే నాక్షేపించడంలేదు. దాని ఫలితాలనుభవించక తప్పదనే నా నమ్మకం.

భోగ్యవస్తువులతో ఉన్న చిక్కేమిటో మనందరికీ తెలుసు. అవి వికటిస్తాయి. రుచిగాఉందని జిహ్వాచాపల్యంకొద్దీ అదే పనిగా ఆవకాయో, మామిడిపళ్ళో, గోంగూర పులుసో, మరోటో తినేవాడికి అది వికటించక తప్పదు. కత్తిపట్టినవాడు కత్తితోనే చస్తాడన్నారు. దేన్ని ప్రేమించే వాడు దానితోనే తీసుకుంటాడంటే అందులో అబద్ధం ఏమీ లేదు. "నాకు నిజంగా ఇష్టమైనవన్నీ అనారోగ్యకరంగానో, అవినీతిగానో, చట్టవిరుద్ధంగానో ఉంటాయి" అన్న దొక బ్రిటిషు విదుషీమణి. అందుచేత శాంతంగా చేతకాదని చిన్నవాళ్లు మరీ ఇష్టమైనవాటిని మరీ జాస్తిగా ఆస్వాదించకుండా ఉండటం మంచిది. ఆడవాళ్ళను "వన్ సైడెడ్‌గా ప్రేమించేవాళ్ళకి కేన్సర్ ఆఫ్ ది మైండ్" వస్తుంది దానికి చికిత్స లేదు. ఔను, నిజం; ఔను, నిజం! "నీ వన్నది నిజం" నిజం!

కొ. కు. రా., మద్రాసు.

● ఆగస్టు "జ్యోతి"లో ప్రచురించిన శ్రీసుభా కథ "నీ వన్నది నిజం" అంతకు ముందు "రాగిణి" అనే పత్రికలో ప్రచురితమైనదేననే విషయాన్ని మా దృష్టికి వెలుగులోకి ఇద్దరు పాఠకులు తీసుకువచ్చారు. వారికి మా కృతజ్ఞత. ఇట్టి పొరబాటు ఇక ముందు జరుగకుండా యత్నించగలమని మనవి. ఆ కథను చాల నెలల క్రిందటే "నెలవంక" అనే పత్రికకు తాము పంపించామని, దానివిషయమై ఉత్తరాలు వ్రాసినా జవాబులేదని, ఇక ప్రచురణ జరుగదనే ఉద్దేశ్యంతో ఆ కథ మరొక ప్రతిని "జ్యోతి"కి తాము పంపించామని, "రాగిణి" పత్రికవారు దాన్ని ప్రచురించిన విషయం తమకు తెలియదని, అదిఎలాజరిగిందోకూడా తమకు తెలియదని శ్రీసుభాగారు మా లేఖకు సమాధానం వ్రాశారు.



లాల్ ఖిల్లావద్ద నిరాడంబరంగా జరిగిన 17 వ స్వాతంత్ర్య దినోత్సవ సభలో ప్రసంగిస్తున్న ప్రధాని శాస్త్రి.

రాజకీయ వాతావరణం

పెనుభూతంగా తయారైన తిండి కొరత

ఆహార సమస్యపై విమర్శలు సమాధానాలు - అన్నీ వింటుంటే చాలామందికి, ఏనుగుదగ్గరికి వెళ్ళి యెవరికి తోచినట్లుగా వారు తమ తమ అనుభవాలు చెప్పిన ఆరుగురు గుడ్డివాళ్ళకథ గుర్తుకొస్తుంది.

ఈనాటి ఆహార సమస్యకుమూలకారణం ప్రభుత్వ విధానమే అంటారు ప్రతిపక్షాలవారు. "దొంగనిల్వలను" బయటికితియ్యాలి: ధాన్యం వ్యాపారం, బ్యాంకులు, జాతీయం చేస్తేనే నిల్వదారుల అగడాలు అరికట్టడం జరుగుతుంది అంటారు కమ్యూనిస్టులు. అప్పే అదేంకాదు. ప్రభుత్వం చేస్తున్న అనాలోచితమైన భూసంస్కరణలు, పన్నుల విధానాలే ఇంత సందిగ్ధ వాతావరణానికి కారణం; అందరికీ సుఖ్పరంగా స్వేచ్ఛ ఇచ్చేసి, యెక్కడా 'కంట్రోల్' అనే ప్రమేయం లేకపోతే అంతా సాఫీగా నే సాగిపోతుంది అంటారు స్వతంత్రపార్టీవారు.

ఆందోళన, ఆవేదన, కేకలు ప్రదర్శనలు - రాబోయేవి "భారత్ బంద్" — అహమ్మదాబాద్‌లో జరిగిన అల్లర్లలో ఆరు నిండుప్రాణాలు బంద్" అయిపోయాయన్నా. ఇంకా వేడితగ్గటంగాని, ప్రశాంతంగా సమస్యను చర్చించటంగాని జరగటం లేదు. ఎవరి ప్రయోజనాలు వారివి. యెవరి ఆలోచనలు వారివి —

పూర్తిగా పాలనయంత్రాంగానికి సంబంధించిన (ఎడ్మినిస్ట్రేటివ్ ప్రాబ్లం) ఆహార సమస్య రాజకీయపు రాపిడులమధ్య చిక్కుబడిపోయి నలిగిపోతుంటే - బాధపడేది మీరు నేను - మనమే.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, ప్రణాళికలు వేసుకోవటం ప్రారంభించిన తరువాత పుష్కరం దాటింది. వేలకోట్ల రూపాయలు ధారాపాతంగా ఖర్చు అయిపోతున్నా, దేశంలో ఆర్థికతకు ఒక స్థిరత్వంగాని, ఒక పొందిక గాని లభ్యంకాలేదు. నడిసముద్రంలో పడవ ప్రయాణంలాగా వుంది.

ఈ సంవత్సరంలో బియ్యం, గోధుమల పంట యెనిమిదికోట్ల టన్నులని అధికార్ల అంచనా. నలభైఅయిదుకోట్ల ప్రజలకు ఇది సరిపోదు. అందుకే పి. యల్. 480 క్రింద అమెరికానుంచి ఆహారధాన్యాలు దిగుమతి చేసుకుంటున్నాం.

పరుటికి, ఈయేటికి పంటలో పెరుగుదల చూసుకుంటే పదిలక్షల టన్నులకు మించి లేదు

జనాభా పెరుగుదల చూడబోతే భయం వేస్తుంది - సంవత్సరం తిరిగేసరికి మన దేశంలో జనాభా బెల్జియం లో మొత్తం జనాభా యెంతో అంత పెరుగుతుంది. ఐదేళ్ళు గడిచేసరికి బ్రిటన్ లో జనాభా అంత పెరుగుదల కనిపిస్తుందని అధికార్ల మాటలే....

ప్రస్తుతానికి మాత్రమే చూచుకుంటే - ముందున్నదంతా మునుళ్ళ పండగే. సంక్రాంతి పండగ వెళితేనేకాని కొత్త ధాన్యం రాదు. అంతవరకు....

బియ్యం నిలవలు కరిగిపోతున్నాయి' గత రెండుమూడు నెలలలో దాదాపు ఇరవై ముప్పై శాతందాకా బియ్యం ధరలు పెరిగిపోయినాయి, ఇంకా పెరిగిపోతున్నాయి శాశ్రప్రమాణంలో....

ప్రస్తుతం దేశంలోవున్న ధాన్యం నిల్వలు అవసరాలకు సరిపోతాయని, చెయ్యవలసిన దల్లా సామదాన భేదోపాయాలతో "అక్రమ నిల్వలను" బయటకు లాగటం. వెంట వెంటనే యెప్పటికప్పుడు వినిమయదార్లకు పంచిపెట్టటం.

కేంద్ర ఆహారమంత్రి శ్రీ సుబ్రహ్మణ్యం రాష్ట్ర ఆహార మంత్రులను సమావేశ పరచి సమస్యనంతా వివరించారు. అందరు కలిసి ఆలోచించుకున్నారు. తీసుకోవలసిన చర్యలు కూడా నిర్ణయించుకున్నారు.

దేశవ్యాప్తంగా కనిష్ఠ, గరిష్ఠ ధరలను నిర్ణయించి, వ్యాపారస్తులు ప్రభుత్వం నిర్ణయించిన 'సరస ధరలకే' అమ్మకం జరిపించాలని 'గట్టిగా హెచ్చరించారు.'

"అక్రమ నిల్వలను" తీయించడానికి రక్షణ నిబంధనలను కూడా ప్రయోగిస్తామన్నారు.

ఎక్కడ యేలోపం జరిగినా వెంటనే 'టెలిఫోన్' ద్వారా చెప్పినచాలు, ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

కాని....

ఫలానాచోట ఫలానా 'అక్రమ నిలవలను' బహిర్గతం చేసి స్వాధీనం చేసుకున్నాం అని ఇంతవరకూ యేమూలనుంచీ 'వార్తాహరులు' రాలేదు.

నగరంలోకి ప్రతిరోజూ ప్రభుత్వం 'గోదౌన్ల'నుంచి బియ్యం బస్తాలు కదిలి వెళుతూనే వుంటాయి. అవి వెళ్ళవలసిన చోటికే వెళుతున్నాయి మనం వెళ్లాలనుకునే చోట్లకు మాత్రం వెళ్ళటంలేదు.

అసలు ఆహారధాన్యాలువుండగా, బయటికి లాక్కుని రాగలిగేందుకు ...వున్నాయనటం కిట్టని కమ్యూనిస్టులు చేసే దుష్ప్రచారం అంటారు.

వారికి వ్యతిరేకులైన 'ప్రతిపక్షీయులు.' అప్పేకాదు. కాంగ్రెసు ప్రభుత్వం అక్రమ నిల్వదారులతో లాలూచీపడి తీసుకోవలసిన గట్టిచర్యలు తీసుకోవటం లేదు అందుకే ఇదంతా అంటారు కమ్యూనిస్టులు వారి అనుబంధీయులు.

ఏది యేమైనా బియ్యం మాత్రం బజారులో సమృద్ధిగానే దొరుకుతున్నాయి కాని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రం దొరకటంలేదు. దొరికేచోట్లు "చౌక దుకాణాలు" - అక్కడ, ప్రతిచోటా ఫర్లాంగున్నర 'క్యూలు' సినిమాహాలులో ఆఖరి టిక్కెట్టుకోసం పడికాపులు కాసినట్లు వుంటాయి....

"ఆహార సమస్య - ధర స్థిరీకరణ": ప్రతి రాజకీయ నాయకుడికీ ఈరోజుల్లో ముఖ్యమైన 'టాకింగ్ టాపిక్' రాజకీయ 'ప్రతినాయకుల' చేతుల్లోని బ్రహ్మాండమైన అస్త్రం -

సామాన్యుల్లో, వీధుల్లో, చౌకదుకాణాల ముందుమాత్రం అంతా ప్రాణసంకటం. నెల నెల గుమాస్తాల జేబుల్లోనుంచి దబాయించి మరీక తీరించుకుంటున్నారు.' అధికధరలను వ్యాపారస్తులంతా —

మళ్ళీ ఆహార సమస్య దగ్గరకువస్తే —

అది కేంద్రానికి రాష్ట్రాలకు మధ్య జరిగే అదోరకం మూచ్చట కూడానేమో అనిపిస్తుంది తరుగు రాష్ట్రాలు తమ అవసరాలను మరింతగా హెచ్చువేసి కేంద్ర ప్రభుత్వానికి చూపిస్తే, మిగులు రాష్ట్రాల వారుకూడా యిదే గుణింతాన్ని వల్లెవేసి, తమ ధాన్యాలు తమకే చాలవనే ధోరణి చూపిస్తారు. మధ్యలో నిలబడ్డ కేంద్ర ఆహారమంత్రికి అంతా మిథ్యావేదాంతం అయిపోతుంది; అయిపోయింది.

ధాన్యం కంట్రోల్స్ పెడితే, ప్రొక్యూర్‌మెంటు ప్రారంభిస్తే, అవసరమైన సిబ్బంది నిండుగా లేరనేది బాగా తేటతెల్లమైన నగ్న సత్యం. అక్రమ నిల్వలను ప్రభుత్వం వెళ్ళ పరచుకోలేకపోవటానికి యిదొక ముఖ్య కారణం అంటారు ఒక మంత్రిగారు.

వచ్చేపంటలకాలం నాటికి దేశవ్యాప్తంగా భారీయెత్తున ఒక కార్పొరేషన్ ద్వారా ఆహార ధాన్యాలను కొనుగోలు చెయ్యటానికి ప్రభుత్వం నిర్ణయించుకుంది. దేశంలో జరిగే ఆహార ధాన్యాల వ్యాపారంలో అర్థ భాగం ఈ కార్పొరేషన్ చేబట్టాలనేది ప్రభుత్వ సంకల్పం. ఈలోపుగా ఒక పరిశీలక సంఘం యేర్పాటుచేసి దేశంమొత్తానికి సరసధరలు నిర్ణయించి, ఆ ధరలప్రకారం కార్పొరేషన్‌వారు కొనుగోలు చేస్తారట. దీనికి కావలసిన సిబ్బందిని సమస్తం అయత్త పరుచుకుంటున్నారు.


ఇది దీర్ఘకాలానికి పనికివచ్చే యేర్పాటు. ఈలోగా అనేక విధాల ధాన్యం నిల్వలను బజార్లలోకి రప్పించి సరస ధరలకు అమ్మించటం ప్రభుత్వం తలపెట్టిన తాత్కాలికపు యేర్పాటు. విదేశాలనుంచి విరివిగా ఆహార ధాన్యాల దిగుమతి చేసుకొనటం మరో యేర్పాటు. ఈ యేర్పాట్లకు కావలసిన సిబ్బందినికూడా త్వరితంగానే ఆయత్త పరచాలనేది ప్రభుత్వ నిర్ణయం.

అయినా పైన చెప్పిన ప్రభుత్వచర్యలు రోగానికి కాస్తంత ఉపశమనాన్ని కలిగిస్తాయేకాని, మౌలికంగా పరిష్కారాన్ని కలిగించలేవు. అదేమిటో పరిశీలిస్తే అసలు అధికాహారోత్పత్తికి సరైన చర్యలు ప్రభుత్వం తీసుకోలేదేమో అనిపిస్తుంది

ప్రధానంగా అధికాహారోత్పత్తిని సాధించాలంటే చెయ్యవలసింది 'ప్రచారం' మాత్రమేకాదు. ఎన్ని ప్యాకేజీ పథకాలు వేసినా, ఎంత సిబ్బందిని నియోగించి 'ఆధునిక రీతులగురించి' 'ప్రబోధం' జరిపించినా, అసలైన 'రైతు సమస్యలు' పరిష్కరింపబడనంతకాలం, అంతా వృథానే అవుతుంది.

ఈ నాడు రైతుస్థితి యేమిటి, సరిఅయిన జీవనవృత్తి అతనికి లభ్యమవుతోందా లేదా? ఈ విషయాలు అర్థ చేసుకున్నప్పుడే రోగానికి తగిన మందు పడుతుంది.

అప్పుడే అధికాహారోత్పత్తి సాధ్యపడుతుంది అప్పుడే అన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారం రష్యా ప్రధాని కృశ్చేవ్ అన్నట్లు దేశంలో ఆహారం పండించలేకపోయాం అనిపించినప్పుడు దానిని ఒప్పుకోగలిగిన మనోధైర్యంకూడా వుండాలి. అప్పుడే కాస్తంత త్వరితంగాకూడా ఆలోచించగలుగుతాం. అంతేగాని, క్రిందటి సంవత్సరంకంటె ఈ సంవత్సరం పంటలు కాస్త మెరుగేలే అని సంతృప్తిపడితే ఆత్మవంచనవుతుంది.



న్యూఢిల్లీలో "జవహర్లాల్ నెహ్రూ దృక్పథం, మనధ్యేయం" అనే ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకిస్తున్న రాష్ట్రపతి రాధాకృష్ణన్,

ఈ నాడు దేశంలో నాలుగుకోట్ల తొంభై లక్షలమంది-కొద్దో గొప్పో పొలంకలిగిన వ్యవసాయదారులున్నారు. మనలో ఇరవై కోట్లమంది జనాభా కేవలం వ్యవసాయం మీద బ్రతుకుతున్నారు.

వీళ్ళ బ్రతుకు లెలా వున్నా యనేది ఆలోచిస్తే—

సాధారణంగా ఒక ఆఫీసులో పనిచేసే బంట్రోతుకు నెలకు వంద రూపాయలు వస్తాయి. సాలుసరి పన్నెండువందలు నికరాదాయం అతనిది.

నికరాదాయం తాకపోయినా మొత్తం ఆదాయం (గ్రాస్‌యిన్‌కం) సాలుసరి పన్నెండువందలు రావాలంటే రైతుకు మూడెకరాల భూమి వుండాలి. ఇంత భూమి కలిగిన రైతులు యెంతమంది వుంటారో అందరికీ తెలిసినదే.

అంతేకాకుండా ఈ పన్నెండు వందలలో భూమి శిస్తు, ఇతరఖర్చులు పోను మిగిలే నికరాదాయం సాలుసరి వెయ్యికి మించదు.

వ్యవసాయ కూలీల పని సరేసరి. సంవత్సరం పొడుగునా ప్రతిరోజూ కూలి దొరకటం దుర్లభం. దొరికినా రోజుకు రెండు రూపాయలుండటం గగనం.

వీరందరి జీవన వ్యవస్థను గురించి. ఇన్ని ప్రణాళికలు గడిచినా, సరైన ఆలోచన యెవరైనా చేశారా అనే ప్రశ్న వేస్తే సమాధానం పూజ్యం ...

పల్లెటూళ్ళకూ, బస్తీలకు ఖర్చులలో యేమాత్రం వ్యత్యాసంలేదు. ఇళ్ళద్దె ఒక్కటే తేడా. పాలు పెరుగుకూడా పల్లెల్లోనూ, బస్తీలలోమాదిరే కొనుక్కోవాలి. కిరసనాయిలు, యెరువులు, అన్నీ బస్తీ మాదిరిగానే...

ప్రస్తుతం మనం అవలంబిస్తున్న వ్యవసాయ విధానంలో పూర్తిగా మార్పురావాలి.

ముఖ్యంగా రైతుకు వ్యవసాయం 'గిట్టుబాటు' అయిన నాడే భూమిని సేద్యం చెయ్యటంలో అతను ఆసక్తిచూపిస్తాడు.

ప్రభుత్వం యింతవరకు చేసిన భూసంస్కరణలు ఒకవిధమైన సందిగ్ధ వాతావరణాన్ని సృష్టి చేశాయికూడా. రైతులలో కొనుగోలుశక్తి క్రమంగా నశించిపోతోంది. డబ్బు తిరుగాడటల్లేదు. అందుమూలంగా భూమిమీద రైతు పెట్టగలుగుతున్న పెట్టుబడి నానాటికి దిగనాసిల్లిపోతోంది. ఇదొక వ్యాధి.

ప్రభుత్వం, వ్యవసాయాన్ని కూడా ఓ ప్రధాన పరిశ్రమగా పరిగణించాలి. ఒక భారీ పరిశ్రమమీద పెట్టుబడులను ఖర్చు పెట్టినట్లే వ్యవసాయంమీదకూడా ఖర్చు పెట్టాలి.

రష్యాలాంటి దేశమే తన వ్యవసాయోత్పత్తినిగురించి అంతయిదిగా ఆత్మపరిశీలన చేసుకుంటుంటే మనంమాత్రం యెందుకు వెనకాడాలి ?

ఐ. ఎ. యస్. ఆఫీసర్లను తయారు చేసుకున్నట్లే, ఎగ్రికల్చరల్ ఆఫీసర్లను కూడా తయారు చేసుకుని ప్రతి తాలూకాకు నియోగించి వ్యవసాయోత్పత్తిని ఒక క్రమ పద్ధతిలో అభివృద్ధి పరచిననాడే దేశంలో ఆహార సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుంది. వ్యవసాయాన్ని నమ్ముకున్న వాడికి అందరితోపాటు సరిఅయిన జీవన భృతి కలిగిననాడే, పండుగా ఆహారాన్ని అతనూ పండిస్తాడు

ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న వ్యవసాయ పరిశీలకబృందం ఈ సూచనలనుకూడ గమనిస్తుందని నా ఆశ.

నెహ్రూ గాంధి

ఇన్నాళ్ళూ శ్రీమతి ఇందిరాగాంధి.
ఇప్పుడు శ్రీమతి ఇందిరా నెహ్రూగాంధి.

అలా ఆవిడ ఈమధ్య ఒక సందర్భంలో సంతకంచేశారు అలాగే ఇకమీద సంతకం చేస్తారట.

కారణం—అది శ్రీ నెహ్రూ తుదికోరిక. తన పేరుకూడా తనవారు ధరించాలని. తనకు కొడుకైనా కూతురైనా మిగిలినది ఒక్క ఇందిరే అని ఆయన వ్యక్తంచేశారుట.

మనుమలు రాజీవ్ సంజీవ్‌లుకూడా ఇప్పుడు, రాజీవ్‌నెహ్రూగాంధి, సంజీవ్ నెహ్రూగాంధి.

—అనంతం.

జ్యోతి



పగటి కలలు

ముళ్లపూడి వెంకటరమణ


పగటి కలలగురించి రాత్రిపూట కబుర్లేమి టనకండి- చాల మంది రాత్రి కలలకు ముందుగానే వీటిని ఏర్పాటు చేసుకొంటారు. పగటి కలలు కనడానిగ్గాని, వాటినిగురించి వినడానిగ్గాని తీరికా ఓపికా ఉండవు. పగటికలలు మాకలవాటు లేదని బుకాయించకండి. ఒకవేళ నిజంగా లేపోతే అలవాటు చేసుకోండి. ఒంటికి చాలా మంచిది.

ఎందుకంటే, పగటికల అనేది మనిషికి దేవుడిచ్చిన మంచి వరాల్లో ఒకటి. మనసులో పేరుకుపోయిన దురాశలను, నిరాశలను అందీ అందని ఆశలుగా పరిమార్చివేసే మందు మితంగా సేవిస్తే కండకూ గుండెకూ పుష్టినిచ్చే దివ్యౌషధం.

ఇందులో అందం ఉంది. ఆనందం ఉంది. కొన్ని ద్రవ్యాలు ఇచ్చే ఉత్తేజం ఉంది. మరీ గాఢమైన పగటికలలు ఎండమావులవంటివయినా, అంతవేడి వుండదు. అంత నిస్పృహ కలిగించవు. అంత చేదు కాదు. కాని చేదుకూడా కాస్త ఉన్న మాట నిజం. గులాబీని ఆఘ్రాణిస్తూవుంటే ముల్లు సన్నంగా గుచ్చుకుంటుంది. సిగరెట్టు కాలుస్తూ కునుకుతీస్తే మధ్యమధ్య మేలుకొలుపు పాడుతుంది. అలాగే ప్రతి పగటి కలకీ ఒక మేలుకొలుపు - అలారం టైంపీస్‌లా ఏర్పాటయి వుంటుంది. కాని పగటి కలకీ తేడా ఒకటి - అది అప్రయత్నంగా కనేది. క్షణంలో సగంలో యుగంసేపనిపించేటంత పెద్ద కల కనచ్చు. ఇది ప్రయత్న పూర్వకంగా ఆరంభించేది. ఎంతసేపు కల వుంటే, అంతసేపూ బుర్ర పనిచేస్తూనే వుండాలి.... కావలసిన ముడిసరుకు కోరిక. తీరిక.

కోరిక ఉంటే, తీరిక లేకపోయినా కంటారు చాలామంది. కోరిక కట్టుబడి ఎత్తరమైనవి. రోడ్డుమీద నడుస్తున్నా, బస్సులో జనంమధ్య నించున్నా, ఆఫీసులో చివాట్లు తింటున్నా కూడా పగటికల అర్జెంటుగా కనవచ్చు.

జ్యోతి



గొప్పవాడు, బీదవాడు, బలవంతుడు, అర్భకుడు, మేధావి, మేదకుడు, సమర్థుడు, అసమర్థుడు అన్న భేదం లేకుండా అందరికీ ఉచితప్రవేశం లభించే స్వర్గసీమ పగటికల. ముఖ్యంగా రెండోకోవ మనుషులకు దివ్యౌషధం.

అనునిత్యం, అనుక్షణం ప్రపంచమంతటా కోట్లకొద్దీ పగటికలలు ఉత్పత్తి అవుతూనే వుంటాయి. వాటిలో బద్ధకిస్టులు హోరాహోరీగా పనిచేస్తూ వుంటారు. దురదృష్టవంతులు డెర్బీస్వీప్‌లో ఆరుకోట్ల రూపాయలు.... రూపాయలా డాలర్లా.... డాలర్‌కెన్ని? - ఐదు రూపాయలా .... ఐదార్లు....ప్చ్.... ఆరుకోట్లు బహుమతి అందుకుంటారు. ఆఫీసు ఉద్యోగులు మానేజర్‌ని బిలదీసి అడగాల్సిన నాలుగూ అడిగేసి కడిగేస్తూ వుంటారు. రచయితలు వెయ్యి పడగలు నవలలు, మహాప్రస్థానం గేయాలు, కామేశ్వరరావుగారి వ్యాసాలు అవలీలగా రాసేస్తూ వుంటారు. ఇంజనీర్లు తొలిసారిగా రేడియోలూ, విమానాలూ, టెలివిజన్‌లూ కనిపెడుతూ ఉంటారు. నాగేశ్వరరావులా, సావిత్రిలా, రేలంగిలా నటించి పారేస్తూ వుంటారు. కాముకులు ప్రపంచ సుందరులందరినీ - కలకొకరుచొప్పున - పెళ్లాడి కాపరాలు చేస్తూ వుంటారు. అన్ని కలలకీ చివర - ఓ గుండుసూదిలాటి నిజం సున్నితంగా గుచ్చుకొని మెల్కొలుపు పాడుతుంది. సన్నటి నిట్టూర్పుతో, అది కల, ఇది ఇల అన్న గ్రహింపుతో కథ ముగుస్తుంది. విషాదాంతం అని తెలిసిగూడా ప్రతి వ్యక్తి మోజుపడి కనేవి. పగటికలలే.... ఆనందబాష్పాలు దుఃఖబాష్పాలు కలపటంలోనే ఆ మాధుర్యం ఉందేమో....

పగటికలలలో తేలిక రకం ఉన్నాయి. అవి కలగాని కలలు. ఇవి టెక్నికలర్‌లా తీర్చిదిద్ది ఉండవు. ఇట్టే చెరిగిపోవు. అవి జీవితాంతం ఆడించి తిప్పలుపెట్టే కలలు.

జీతపు రాళ్ళతో అప్పులన్నీ తీర్చిపారేసి అరువులేకుండా ఇల్లు నడపడం.... అసలది కాదు, జీతంలో ఇకనించి నెలకి పదిరూపాయలు మిగిలేటట్టు చేసుకోవాలనుకోవడం.

ఎవరు వారు?



క్షౌరశిల్పి ఈసడింపుతో చూసి, మొక్కల్ని కత్తిరించే షియర్స్‌తోటి క్షౌరం చేస్తానంటే ఇంతలా జుట్టు పెరక్కుండా పెంద్రాళే వెళ్ళడం. ఈసారి నెలవారైతే సుబ్బరంగా రెస్టు తీసుకోవాలని దురాశపడడం. ఇలాటివే, నూటికి 90 మందిని తిప్పలుపెట్టే వాటిలో నెలవుచాటి విశ్రాంతి ఒకటి. నేనెరిగిన కుటుంబరావుగారు ఒకరున్నారు - ప్రసిద్ధ కథకుడు కాదు. ఆయన అసలు కలలు కనరు. కన్నా, హాల్తుబద్ధంగా కని వాటిని తక్షణం సాధ్యమైనంతగా పరిమార్చి వేస్తాడు - నే చెప్పేది పెద్దకుటుంబరావున్న రావుగారి గురించి.

వాట్‌సార్ ఏమిటండీ ఈ లైఫు, ఏమిటంట. పొద్దున్న లేచింది లగాయితూ ఎవడో తరుముతున్నట్టు మొహం కడుక్కోడం, కాఫీతాగడం, పేపరు చూడ్డం, తినడం, జీను వేసుకుని పరిగెత్తడం, పరిగెడుతూ పనులుచెయ్యడం, ఇల్లు చేరడం, తరుముతున్నట్టే తినడం, పడ్డీసు, ఛఛ.... రన్నింగురేసులా వుంది. బొత్తిగా రెస్టుండటం లేదు ఈ కాలపు మానవుడికి. అంటాడాయన ఎవరో తరుముతున్నట్టు, అని వెళ్ళిపోతాడు. ఒక్కక్షణం ఆగడా ... ఒక అరనిముషంసేపు ఆయన ముఖం ప్రసన్నంగా ఉంటుంది. కళ్లు అరమోడ్చి తనలోతను చిరునవ్వు నవ్వుకుంటాడు.

ప్చ్ ... ఈసారి... రేపు సెలవునాడు ఏమైనాసరే పూర్తిగా రెస్టు తీసుకుతీరతాను, అంటాడు - మనం ఒద్దన్నట్టు. ఆ అరనిముషం ఆయన ఎవరో తరుముతున్నట్టే ఒక పగటికల కంటాడన్న మాట.

"సెలవునాడు రెస్టంటే ఏలాగని మీ ఉద్దేశ్యం" అని అడిగాను. చెప్పమంటారా? అంటాడాయన హుషారుగా. చెప్పడంలోనే అనుభవించినంత ఆనందం కనపిస్తుందాయన ధోరణిలో.

ఆ పవిత్రదినాన ఆయన రోజూలాగా ఆరింటికి లేవడు. ఎనిమిదిన్నరకి బద్ధకంగా కళ్ళు తెరుస్తాడు. తెరిచాక మళ్ళీ మూస్తూ, తెరుస్తూ ఆలోచిస్తూ బద్ధకంగా



ఓ అరగంటసేపు అలాగే పడుకుంటాడు. తొమ్మిదింటికి, మానేజరుగారి పెద్దక్కాయిలా బెడ్ కాఫీ తాగుతాడు తరవాత పళ్ళు తోము. టిఫిను తిని, సంచి పట్టుకుని కూరలమార్కెట్టుకు వెళ్తాడు. దారిలో వాళ్ళతో-వీళ్ళతో పిచ్చాపాటి చెప్పి కూరలు తీసుకుని ఇంటికి వస్తాడు. పదిన్నరవించి వంటింట్లో కూర్చుని పెళ్ళాంతో కబుర్లాడుతూ కూరలు స్వయంగా తరుగుతాడు. వీలైతే కొన్నిటిని తనే పోపేస్తాడు ఈలోగా శ్రీనించి మంగళం వరకూ పేపరు సావకాశంగా చదువుకుంటాడు. పన్నెండింటికి భోంచేసి, హాయిగా పడకేస్తే నా సామిరంగా. ఇంకా చాలా వున్నాయి అలాటి కలలు. సాయంత్రం టిఫిను, క్లబ్బు. లేదా గుడీ, బైస్కోపు....

మొన్నటి వారంనాడు అవిరంగా చెయ్యాలని శనివారం సాయంత్రం సుస్నాతుడై సంకల్పించాడు. పగటికలలు పండినవాడిని గాబట్టి ఈయనదేమాత్రం పండుతుందోచూదామని, అరింటికే వెళ్ళి వాళ్ళింటి సావిట్లో కూర్చున్నా....

అనాడు ఆయనకి రివాజయిన ప్రకారం ఆరున్నరకే తెలివొచ్చింది. లేచి సావిట్లో కొచ్చి కటుక్కున నాలిక్కరుచుకున్నాడు. ఎనిమిదిన్నరదాకా లేవకూడదనుకున్నాడుగాని వెధవది అలారంపీసులా అలవాటైపోయింది. పైగా-పెరట్లోదాసీది, గుమ్మంలో పాలవాడు. సావిట్లో పిల్లలు ఎలక్షన్‌లో ఉపన్యాసకుడి కంఠాలా గొంతెత్తి మాట్లాడుకుంటున్నారు.

అమ్మని కాఫీ తెమ్మనరా .... అన్నాడు కుర్రాడితో.

మొహం కడుక్కోవా నాన్నా అన్నాడు వాడు.


కాఫీ తెమ్మంటే ... అన్నాడాయన.

అవిడవచ్చింది. విధూరంగాకపోతేపాచి మొహంతో కాఫీయా... లెండిలెండి అంది.

అమ్మా కాఫీగిన్నె వేస్తారా, అల్ల వారింటికెళ్ళిరానా. అంటుంది పెరట్లో పనిమనిషి.

లేవండీ అది వెళ్ళిపోతుందట. పోతే మళ్ళీ నే తోముకుచావాలి., అంది ఇల్లాలు. కుటుంబరావుగారు పెరట్లోకి పరిగెత్తాడు.

అరగంట తరవాత మా ర్కెట్టులో కూరలు కొనబోయారాయన. బోలెడు కూరలు కొని, హాయిగా తిరిగ్గా అన్నీ తరగాలని లెక్కలువేస్తూ వచ్చిన పెద్దమనిషికి వంకాయ రూపాయండి, దొండకాయ రూపాయపావలా అంటూ ధరల దండకం చదివేసరికి ఉషారు చల్లారిపోయింది. రెండ్రూపాయల కూరలు కొంటేగాని అరగంట తిరిగిన సరదా తీరేట్లా కనబడదే.



ఏవిటీ ధరలిలా మండిపోతున్నాయి అని మండిపడుతూ కాసిని కూరలు కొని ఇంటికి బయల్దేరాడు.


వీళ్ళందరికి పోగరణపాలంటే ఇలా కాదూ....అసలూ....నెమ్మదిగా ఆయన పగటికలల స్వర్గసీమలోకి జారిపోయాడు. అందులో ఆయన ప్రధానమంత్రి, ధరలు పెంచితే డొక్క చీరేస్తానని రూల్సు వేయించి. ప్రజలని కాపాడాలన్న పట్టుదలతో అదే ఎలక్షను ప్లాటుఫారంగా ఎన్నికై, మెంబరై మంత్రయ్యాడు....

కుటుంబరావుగారి పగటికల వయినాలు నీ కేం తెలుసునని మీరడక్కండి ఆయన ముఖంచూస్తే ఆయన కల ఎప్పుడు ఆరంభమైందో మీక్కూడా తెలిసిపోతుంది. చూస్తూవుండగానే ఆయన చూపులో ఒకరకం శూన్యత కనిపిస్తుంది. కోపంమీద కలగంటున్నపుడు ముక్కుపుటాలు పూరిస్తాడు. గడ్డం కొనదేరుతుంది. పిడికిళ్ళు వాటంతటవే కొ స్తబిగుసుకుంటాయి. ఇంకోపదిక్షణాలకల్లా ముఖంలో ఎరుపుదిగుతుంది. బిగించుకున్న నరాలు సడలుతాయి. ముఖంలో ప్రసన్నత వెన్నెలలా కాస్తుంది ఉండుండి చిరునవ్వులు పూస్తాయి. అంటే అర్థం-కోపంకొద్దీ మినిస్టరయిన కుటుంబరావుగారు - మంత్రికాగానే మండుతున్న ధరంమాట మరిచిపోయి వరండా అంత కారులో వెనుకసీటులో కూర్చొని వెళ్తున్నా డన్నమాట. సన్మాన సభలో దండ వేయించుకుంటున్నా డన్నమాట. బాదంహల్వా చలిమిడిముద్దఅంత పుచ్చుకోడమేకాక పిల్లలికి పొట్లాలు కట్టించి పంపిస్తున్నా డన్నమాట. పూలదండలన్నీ తుంచి ఆవిడగారిమీద పూలవాన కురిపిస్తున్నా డన్నమాట. ఇవన్నీ ఆయన ముఖకవళికలో మనం సునాయాసంగా చదువుకోవచ్చు.

ధరల మంటలు చల్లార్చే కలలో పడుతున్న కుటుంబరావుగారి కాలికి. ఇలలో ఆంధ్రాకోడ్డుమీద కంకర్రాయి ఒకటి తక్కున తగిలింది. తక్షణం ఆయన మంత్రి పదవి త్యాగంచేసి అమ్మబాబోయ్ అన్నాడు. ధరలకన్న ఎక్కువగా ఒళ్ళుమండిం దాయ

వకీ. తక్షణం, కాలికి మందేనావేసుకోకుండా పి. డబ్ల్యు. డి శాఖలో మంత్రి అయి, రహదార్లశాఖ పని పట్టించడం మొదలుపెట్టాడు. ఆయన ముఖంలో కర్కశత్వం, ఆ పళ్ళు గిట్టకరుచుకోవడం చూస్తే ఆయన సెక్రటరీలచేత, రోడ్డు కంట్రాక్టర్లచేత రోడ్లమీద రాళ్ళేరించి చదును చేయిస్తున్నాడనిపించింది.

రెండు తీవ్రమైన కలలు కని ఇంటికొచ్చేసరికి ఆయనకి ప్రాణం చాలొచ్చింది. కూరలు నువ్వే ఏడూ అని భార్యకు సూచించి, మంచినీళ్ళు తాగి అరుగుమీద కూర్చొని అప్పుడే వచ్చిన ఆదివారం పత్రిక విప్పాడాయన.



కాస్త అందులో కథలూ వ్యాసాల సెక్షనిలా పారెయ్యండి అంటూ ఒక చెయ్యి వచ్చి పేపరు లాక్కుని కావలసింది తీసుకుని మిగతా కాయితాలు ఆయనముందు పడేసింది. కుటుంబరావుగారు ఆపాదమస్తకం కోపంతో, ఉక్రోషంతో వణికిపోయాడు.

తరవాత అరగంటవరకూ చూపు పేపరు మీద ఉన్నా, మనసు పక్క పెద్దమనిషి జబర్దస్తీమీద ఉంది.

రెస్టు తీసుకుంటున్నారా? అన్నాను వెళ్ళి.

నాబొంద. . అన్నాడు ముక్తసరిగా.

బహుశా ఆయన కల్చరల్ మినిస్టరయి, ప్రజలకి పేపరుకొనే అలవాట్లు, పక్కవాడిది లాక్కోకుండా ఉండే నిగ్రహం మప్పుతున్నాడనుకున్నాను.

హడావుడిలో టిఫిను ప్రోగ్రాం మరిచిపోయినందువల్ల కోపంతోటే ఆకలి చుర్రుమంది. ఆదివారంకదా అని దేవుడిపాటలు పాడుతూ సావకాశం మడికట్టుకున్న ఇల్లాలుమీదకు తిరిగిందదంతా. ఆదివారం నాడయినా స్తిమితంగా తిని పడుక్కునే యోగం లేదు. అంటూ లేచాడాయన.

ఆవిడ నీళ్ళకడవ దింపింది.

తొంగిచూసి నవ్వుతుంటున్న పిల్లలికి రెండువేసి. వెళ్ళగొట్టి ఇల్లాలును బ్రతిమాలాడాయన. ఇపుడు నేనేమన్నానే - అంటూ.

అవిడ కోపం తగ్గినందువల్లనో, అన్నం మాడువాసన వచ్చినందువల్లనో మొత్తానికి అవిడ గుమ్మంమీంచి లేచింది.

భోజనం అయి అమ్మయ్య అనేసరికి ఆఫీసరుగారి జవాను కబురుతెచ్చాడు-ఆయాసపడుతూ. అదెంత పనో అని వెళ్ళిన వాడికి ఆయన నడ్డివిరిగే పని చెప్పాడు. పిల్లలకి మ్యాపులు వేసిపెట్టాలయ్యా గొడవ పెడుతున్నారు-అంటూ అటు తిరిగి పడుకున్నా డాఫీసరుగారు.

ప్రపంచంలో విద్యావిధానాన్ని రద్దుచేస్తూ, సంతాన నియంత్రణం కఠినంచేస్తూ ఓ పగటి కల కని, పని పూర్తిచేసి నాలుగింటి కింటికి చేరిన కుటుంబరావుగారు వాలుకుర్చీలో రామచంద్రా అంటూ వాలిపోయారు.

ఈసారి సెలవునాడు పూర్తి రెస్టు తీసుకోవాలండీ అన్నారు ఎదురుగా లేని నాతో, పదిహేనేళ్ళగా నడుస్తోందాయన కల. ఇంకా ఫలించలేదు. నా కొకటే మార్గం తోచింది. ఈసారి సెలవునాడు పదినిమిషాలు తీరిక చేసుకుని-ఒక సెలవునాడు పూర్తిగా రెస్టు తీసుకున్నట్టు ఒక టెక్నికలర్ పగటికల కనిపారెయ్యడం మంచిది అని. ▯▯▯

(ఆలిండియా రేడియో సౌజన్యంతో)



ఆశించని ఆనందం

లోపల్నించి తెరలు తెరలుగా వచ్చే బాధతో మెలితిరిగి పోతున్నది నాగరత్నం. ఆగలేక ఒకో్కసారి "అమ్మా!" అని అరుస్తున్నది గట్టిగా. తలంతా చిందర వందరగా రేగి, ముంగురులు ముఖాన్ని కప్పడానికి ప్రయత్నిస్తున్నాయి. వచ్చటి నుదుటిమీద నల్లటి ముంగురులు, వింత అందాన్ని తెస్తుండే కూతురివైపే చూస్తున్నది చిట్టెమ్మగారు.

"అమ్మాయిగారికి కాస్త వేడి వేడి కాఫీ యివ్వండమ్మా. కడుపులో కాస్త వేడి నీళ్ల పడ్డాయంటే. త్రాణ వస్తుంది" అన్నది మంత్రసాని మాలక్ష్మి. అమ్మాయిగారి పేరుతో తన గొంతుకూడా తడుస్తుంది కదా అన్న ఆశతో.

'ఈ గండం ఎలాగోలా కాపాడు వెంకన్నబాబూ' అనుకుంటూ కాఫీ సేవ డానికి యింట్లోకెళ్ళింది చిట్టెమ్మగారు.

"ఊరికే అదుస్తే పోతుందా అమ్మాయి గోరూ! కాస్త ఓగ్గపెట్టుకోవాలిగాని", పక్కలు సవరిస్తూ "అయినా, తెలియని తనం, అందులో తొలిచూలాయె" నెమ్మదిగా గొణుక్కుంది మాలక్ష్మి.

మాలక్ష్మికి వృద్ధాప్యం పైబడినా పురుటి కేసులకు వెళ్ళడం మానలేదింకా. పెద్ద పెద్ద యిళ్ళన్నీ ఆమె చేతిలోనే ఉంటాయి. ఆమెను కదిపితే చాలు. తను ఎవరింట్లో ఎన్ని పురుళ్ళు పోసిందీ, ఆనాడు తను బొడ్డుకోసి ప్రపంచంలో ప్రవేశింపజేసిన బిడ్డకు తనే మళ్ళీ పురుడు పోసిన సంగతి వరకు వర్ణించి చెప్పుకొస్తుంది.

ఆ మధ్య మరీ అవస్థగా ఉందని ఒక ప్రసూతి కేంద్రం స్థాపించారక్కడ. ఒక మిడ్‌వైఫ్, అనుభవంగల ఒక నర్సుకూడా వచ్చి అక్కడే మకాం పెట్టారు. కాని ఏం లాభం? వాళ్ళను ఒక్కళ్ళూ పిలవరు. ఒకవేళ చొరవగా వాళ్ళే వెళ్తే "మాకు మా మంత్రసాని ఉందిలెండమ్మా, మీ అవసరం లేదు" అని ముఖంమీదే అని సాగనంపేస్తారు.

ఒకవేళ ఎవరన్నా నాగరికులు వాళ్ళని పిలిపిస్తే, ఈ సంగతి తెలిసిన మాలక్ష్మి ఆఘమేఘాలమీద వెళ్ళి వాళ్ళనక్కడ నుంచి తరిమేసేవరకూ ఊరుకునేది కాదు.

నాగరత్నం ప్రొద్దుటినుంచికూడా నొప్పులు పడుతూనేవుంది. ఆమె పడే బాధ వర్ణనాతీతం. అది చూసి భరించలేక పోతున్నాడు తండ్రి భూషయ్య. అక్కడికీ ఉండబట్టలేక "పెద్ద డాక్టరమ్మను తీసుకురానా" అని అడిగాడు అదుర్దాపడే స్వరంతో. ఊరుకోండి. మాలక్ష్మి ఇక్కడే వున్నది విన్నదంటే...." గుసగుసలగా అన్నది చిట్టెమ్మగారు.

"మరీ సోద్యాలు పోతారేమన్నా. ఇదివరకంతా మేము పురుళ్ళు పోసుకోలేదా, సుఖంగా లేమా? మా అత్తకు పోసింది, నాకు పోసింది, నా కోడలికి పోసింది. ఈ మాలక్ష్మివాళ్ళే కదా? దీని హస్తవాసి ఎంత మంచిది కాకపోతే మీరంతా చల్లగా ఉంటారు? గుమ్మంలోదాన్ని విడిచిపెట్టి ఎక్కడో ఉన్నదానికోసం పరుగు లెట్టానంటావేం?" కాస్త ఘాటుగానే మందలించింది భూషయ్య తల్లి రావమ్మగారు.

"అది కాదే...." ఏదో చెప్పబోయాడు భూషయ్య. అతని మాట కడ్డం వస్తూ "ఏదీ కాదు! అయినా మా తిప్పలు మావిగాని కాస్సేపు నువ్వు బైటకుపో. నువ్విక్కడున్నంత సేపూ, నీకూ తోచదు, మాకూ తోచనివ్వవు" మెత్తగా కసురుకుంది రావమ్మగారు. తల్లిమాటకి అయిష్టంగానే కదిలాడు భూషయ్య.

"ఇదిగో, మిమ్మల్నే! వెళ్ళమన్నారు కదా అని పొలిమేర దాటిపోయేరు కొంపదీసి. ఏ క్షణాని కేం అవసరం వస్తుందో, కాస్త ఈ చుట్టుప్రక్కలే పిలుపుకు అందేలా ఉండండేం." పిలిచి చెప్పింది చిట్టెమ్మగారు.

ఓ చెవితో వాళ్ళ సంభాషణంతా వింటున్న మాలక్ష్మికి, గుండె కుదుటబడింది. గొప్పింటి పడుచులు నీళ్ళాడితే చాల పెద్ద మొత్తమే దొరుకుతుందని కొండంత ఆశతో ఎదురుచూస్తుంది మాలక్ష్మి. అందులో భూషయ్య ఆ ఊరిలోకెల్లా ధనవంతుడని పేరుబడినవాడు. పైగా ఒక్కర్తే కూతురు. నాగరత్నం చాల అపురూపంగా పెరిగింది.

అతని గారాబు కూతురుకి పురుడుపోస్తే తనకు లోటులేకుండా పెద్ద మొత్తమే ముడుతుందని మాలక్ష్మి ఆశ.

"ఇంకెంత సేపటికి వస్తుందంటావు?" ఆత్రుతగా అడిగింది. చిట్టెమ్మగారు.

"మనుమడిని ఎప్పుడు ఎత్తుకుందునా అని అమ్మగారి ఆత్రం. ఇదిగో, పెద్దనొప్పులారంభించాయి. ఇంకాసేపటికో, కూసేపటికో పండంటి అబ్బాయిని చూడరూ," బోసినోటితో నవ్వులు గుమ్మరిస్తూ నాగరత్నంవైపు చూసింది మాలక్ష్మి.

'పండంటి అబ్బాయి' అన్న మాట చెవుల్లో పడగానే అదిరిపడింది నాగరత్నం. "అబ్బాయి! అమ్మో, అబ్బాయే? వద్దు వద్దు అబ్బా యెందుకు? అమ్మాయే కావాలి; నాకు అమ్మాయే కావాలమ్మా లేకపోతే వారు, వారు ... రానివ్వరే నన్ను" అంత బాధలోనూ నాగరత్నం గట్టిగా అరచి చెప్తుంటే చిట్టెమ్మ, రావమ్మగార్లు, మాలక్ష్మి అందరూ విభ్రాంతులై రత్నంవైపు చూస్తూండిపోయారు.

తను ఈ అయిదు సంవత్సరాలనుంచి దాచుకొస్తున్న రహస్యం కాస్తా ఈ నాటితో బైటపడిపోతుంది కాబోలునని శంకిత మనస్కురాలైంది రత్నం.

ఆమె భయమేకాని ఎవరూ ఏమీ అనుమానించలేదు. ఏమిటని ఆరా తీయనూలేదు. ఇంతకి రెట్టింపు బాధపడినాసరే. ఈ బాధలో తన ప్రాణాలు పోయినా సరేగాని, మగపిల్లాడు మాత్రం వద్దు. ఈ సారి మనస్సులోనే అనుకుంది రత్నం.

పాపం నాగరత్నానికి తెలియదు; పాతిక సంవత్సరాల క్రితం తన అత్తగారుకూడా ఇదే అవస్థలో ఇట్లాగే భగవంతుని ప్రార్థించిందని. కాని ఆమె కోరికకూడా ఇట్లాగే వ్యర్థమైపోయిందని. తెలిస్తే ఏం చేసేదో మరి...."

తను వచ్చేస్తోంటే అత్తగారు "బంగారుబొమ్మలాంటి అమ్మాయి నెత్తుకురావాలి సుమా!" అన్నది. పైకి ఆప్యాయత కనబరచినా అంతరంగంలో మాత్రం "నువ్వుగాని అబ్బాయిని కన్నావో నీ కాపురంలో నీళ్ళే సుమా!" అన్న భావాన్ని వ్యక్తం చేసింది.

ఇక భర్త విశ్వనాథం కఠోరంగా ఆజ్ఞాపించాడు. "ఇదిగో - విన్నే. నాకు అమ్మాయంటేనే యిష్టం సుమా! అమ్మాయితో గాక అబ్బాయితో వచ్చావా? ఇక నీకూ నాకూ రామ్ రామ్. ఇక నువ్వు నా గడపలో కాలు పెట్టలేవు తెలుసా! ఇదిమాత్రం జ్ఞాపకంపెట్టుకో...." అని.

ఆ నాటి మాటలు ఇప్పటికీ తన చెవుల్లో గింగురు ప్రతిధ్వనిస్తూనే ఉన్నవి. ఏ బిడ్డ పుడుతుందో తన కేం తెలుసు? అక్కడికీ ఆగలేక కనిపించిన సాధువులను, జ్యోతిశ్శాస్త్రం తెలిసిన పండితులను అడిగేది సిగ్గు విడిచి కొందరు "ముద్దబంతి పూవులాంటి అమ్మాయిని గంటావు" అంటే, మరి కొందరు "చందమామలాంటి కొడుకుని ఎత్తుకుంటావు" అని ఆశీర్వదించేవారు. అందుకని తనకు ఫలాన బిడ్డ అని నిర్ధారణ చేసుకోలేకపోయింది రత్నం.

ఈసారి విపరీతమైన బాధతో "అమ్మా" అంటూ ఓ పొలికేకలాంటిది పెట్టింది. ఆ వెంటనే ఏదో పెద్ద బరువు దిగిపోయినట్లు, కడుపంతా చాల తేలికైపోయినట్లు అనుభూతి పొందిన వెంటనే గాఢంగా నిశ్వసిస్తూ సొమ్మసిల్లినట్లు పడిపోయింది రత్నం. ఆ అర్థ చైతన్యావస్థలోనే, తల్లి, నాయనమ్మ ఒకేసారిగా "ఏ బిడ్డ?" అనడం, మాలక్ష్మి "చందమామలాంటి అబ్బాయిగోరమ్మా; ఈ సారి పట్టుచీర తప్పదులెండి" అనడం లీలగా వినిపించింది. ఏదో చెప్పాలన్నట్లు

ఎమ్. ప్రభావతి

పెదవులు కదిపినప్పటికీ చీకటిలాంటి తెర కమ్మేసినందున ఏమీ చెప్పలేకపోయింది నాగరత్నం.

● ● ●

కొందరి కొందరి జీవితాల్లో అనుకోని సంఘటనలు అతి విచిత్రంగా తటస్థపడుతూ, వాళ్ళ జీవితగతులనే మార్చివేస్తాయి అటువంటి విచిత్ర సంఘటనతోనే నాగరత్నం ఒక యింటిదైంది.

అప్పటికి నాగరత్నం పదిహేనేళ్ళ బాలిక. చూసే యువక హృదయాలను వెఱ్ఱెత్తించే అందమామెది. ప్రతి యువకుడూ ఆమెతో మాటలు కలపడానికి, స్నేహం చేసుకోవడానికి ఉబలాటపడేవాడేకాని అందుకేమాత్రమూ అవకాశం యిచ్చేదికాదు నాగరత్నం.

ఒకసారి ఎవరో దూరపు బంధువుల యింటికి పెళ్ళినిమిత్తమై వెళ్ళారు నాగరత్నం; తల్లి, తండ్రి, నాయనమ్మలతో సహా. అతను మగపెళ్ళివారి తరపు బంధువులలో ఒకడు. మనిషి చూపులకు అందమైన వాడిగానే కనిపిస్తాడు. కాని అతని గుణమే అదోరకమైనదని ఒక్క రోజులోనే నిర్ణయాని కొచ్చిన నాగరత్నం అతన్ని చాల అసహ్యించుకోసాగింది. అతను ప్రతి చోట తారసిల్లడం, అవసరం లేకపోయినా పెళ్ళికాని పిల్లలను పలకరించడం, వాళ్ళెదురుగా గూఢార్థంతోకూడిన మాటలు విసరడం, వెనకపాటుగా వెళ్ళి వాళ్ళ జడలుపట్టుకుని లాగడం, చూడనట్లు నటిస్తూ వాళ్ళని రాచుకుంటూ తిరగడం. ఇదంతా చూస్తున్న నాగరత్నం చాలా కోపగించుకుంది. ఇదొక్కటేకాదు నాగరత్నం కోపానికి కారణం. పనిలేకపోయినా అతను తనను పలకరించబోవటం, తను విననట్లుగా తప్పించుకుపోవడం జరిగేవి. నాగరత్నం అతన్ని ఎంత చీదరించుకునేదో అతనంతగా వెంటాడేవాడు అక్కడున్న మూడురోజులు మూడు యుగాల్లా గడిపింది నాగరత్నం. ఇంకా రెండు రోజులు ఆగమని పెళ్ళివారు బ్రతిమాలినా, నాగరత్నం బలవంతంమీదే ఇంటిముఖం పట్టారు పెద్దవాళ్ళు.

ఇది జరిగి పక్షం రోజులు గడిచాయో లేదో నాగరత్నాన్ని చూడటానికెవరో వస్తున్నారని, వాళ్ళకి చాల ఆస్తి వుందని, ఒక్కడే కొడుకని చెప్పుకోసాగారు అమ్మలక్కలు.

తన జీవిత భాగస్వామి గురించి బంగారు కలలు కంటున్న నాగరత్నాని కీమాటలు మధురానుభూతుల నందజేశాయి. అనుకున్న వేళకి పెళ్ళివారు రానే వచ్చారు. బ్రహ్మాండమైన ఏర్పాటులతో ఘనంగానే సత్కరించారు ఆడపెళ్ళివారు మగ పెళ్ళివారిని.

అసలే అందమైనది. అందులో పెళ్ళి చూపులకోసం ప్రత్యేకంగా అలంకరించారేమో ఆ సమయంలో నాగరత్నం దివి నుండి భువికి దిగివచ్చిన దేవకన్యలా మెరిసిపోయింది. తల్లి, నాగరత్నాన్ని తీసుకొచ్చి పెళ్ళివారికెదురుగా కుర్చీలో కూర్చోపెట్టి వెళ్ళిపోయింది. సిగ్గుల బరువుతో తలన్నా ఎత్తి చూడలేకపోయింది.

ఒకప్రక్క మనస్సు పూరికే పీకుతున్నది. 'ఒక్కసారి తలెత్తి చూస్తే ...' అని. కాని స్త్రీ సహజమైన సిగ్గు సంకోచాలు, ఆమె తలను ఎత్తనివ్వటంలేదు. నిముషాలు దొర్లిపోతున్నాయి. వరుడి తరపువారినుంచి ఏవో ప్రశ్నలు వస్తున్నాయి. వాటి కన్నిటికీ తండ్రే జవాబిస్తున్నాడు ఓపిగ్గా. కూర్చుని కూర్చుని నడుం నొప్పిపెడుతున్నది నాగరత్నానికి. ఆమె అవస్థ కనిపెట్టారా అన్నట్లు ఎవరో అన్నారు. "ఇక లోపల కెళ్ళిపోమ్మా" అని బ్రతుకుజీవుడా అని లేచింది.

'ఇదే మంచి సమయం అతన్ని చూడటానికి, ఇది దాటిందంటే మళ్ళీ నీకా అవకాశం వుండదు' అని మనస్సు హెచ్చరించింది. దానితో చటుక్కున తలెత్తిచూసింది. అంతే, తన కాళ్ళక్రింద భూమి క్రుంగిపోతున్నట్లు, తనని పాతాళ లోకంలోకి లాక్కుపోతున్నట్లు అనిపించిపోయింది. తను చూసేది యధార్థమేనా? లేక తన కళ్ళు చేస్తున్న మోసమా! భయ సంకోచాలతో మళ్ళా మళ్ళా చూసింది. అవును, అతనే వందమంది మంచివాళ్ళలో నిలబెట్టినా పోల్చుకోగలదు. సందేహంలేదు. ఆనాడు ఎవర్నిచూసి నిలువెల్లా చీదరించుకుందో అతనే, ఇతను. తన కాబోయే భర్తరూపంలో కూర్చుని ఎట్లా కులుకుతున్నాడో? ఆమె మరి అక్కడ నిల్చోలేకపోయింది.

ఇరుగు పొరుగులు, పరిచయస్తులు, బంధువులు అందరూ అడుగుతున్నారు. "పెళ్ళికొడుకుని చూశావా? ఎట్లా ఉన్నాడు? నచ్చినట్లేనా....లేక అనుమానమా? ఆ నచ్చకేం? కన్నొంకరా, కాలొంకరా? బోలెడంత ఆస్తి. వారసుడా ఒక్కడు. అదంతా మన రత్నానిదేనర్రా" అని తలో మాట విసురుతున్నారు. కాని ఆమె వినడంలేదు. ఆమె మనసు ఎక్కడో ఏ దూరతీరాలనో పరిశీలిస్తున్నట్లు నిశ్శబ్దంగా ఉంది ఆమె నర్థంచేసుకోలేని అమ్మలక్కలు "అబ్బో! అప్పుడే ఎంత జాణతనం నేర్చావే? రేపు ఆ మూడుముడులూ పడ్డాయంటే ఇక మాబోటి వారెవరూ నీ కంటికి ఆనరన్నమాటే" అని నవ్వుతున్నారు.

సాధారణంగా కొన్నికొన్ని యిళ్ళలో తల్లిగాని, తండ్రిగాని, అమ్మాయిని పిలిచి 'ఏమ్మా అబ్బాయి నచ్చాడా? నీ కేమైనా అభ్యంతరమా?" అని అడగరు. సరికదా "మనం దాని మంచిని కాంక్షించేవారమే కదా" అన్న తృప్తి ప్రకటిస్తారు.

ఆతరువాత ఆ కష్ట నిష్ఠురాలన్నీ అనుభవించేది ఆ అమ్మాయి.

నాగరత్నం విషయంలో కూడా యిదే నిజమైంది. ఆమె ఎంత నిరోధించినప్పటికీ ఈపెళ్ళి అనే సంకెళ్ళనుంచి తప్పించుకోలేకపోయింది. ఏమైనా అనడానికి కూడా

● ఒక మిత్రుడు తన కారును ఇంకో మిత్రుడికి ఇచ్చాడు. రెండో వాడు ఎప్పటికీ రాకపోయేసరికి మొదటి మిత్రుడు కంగారు పడ్డాడు. కంగారు పడుతున్న సమయంలో కారు తీసుకువెళ్ళిన మిత్రుడొచ్చాడు.

"అమ్మయ్యా! వచ్చావుగదా, ఎప్పటికీ రాకపోయేసరికి దేన్నో కొట్టావనుకున్నాను"

"పడినినట్టుంది — ఎవడేనా నన్నుకొట్టాల్సిందేగాని, నేను మాత్రం చచ్చినా ఒకడిని కొట్టనుసుమా"

"అబ్బ! అంత ఘటికుడివన్నమాట"

"అవును — ఇప్పుడదే జరిగింది!"

నందివ్వకుండా ఎంత పుణ్యంచేస్తే యింత గొప్ప సంబంధం వస్తుంది? అని పొగిడే ఆ నోళ్ళకు తెరిపి ఉండడంలేదు. ఇక తను విరోధించి లాభంలేదని విధిమీద భారం వేసి ఊరుకుంది.

అనుకున్న దానికంటే చాల అట్టహాసంగానే జరిగిపోయింది పెళ్ళి. అంతమంది పెద్దలముందు బ్యాండువాయిద్యం హోరులో బ్రాహ్మణ పురోహితుడు మంత్రాలు చదువుతుండగా అతని అర్ధాంగి అయింది, నాగరత్నం. ఇప్పుడు తను కాదు అన్నా ఎవరూ అంగీకరించరు. ఇక ఈ జీవితమంతా కష్టమైనా, దుఃఖమైనా, సంతోషమైనా, ఈ విష వలయంలో పడి కొట్టుకోవలసిందే. ఇదే ఈ మూడుముడుల రహస్యం కాబోలు? ఈ పెళ్ళి జరుగుతున్నందుకు తనలో ఏ మధురభావాలు పొంగి పొర్లడం లేదు. ఇదివరకు యెలా ఉందో ఇప్పుడూ అలాగే శూన్యంగా ఉంది.


ఆ రోజు ఏకాంతంగా భర్తదగ్గర కెడుతున్నప్పుడు మనసులో అనుకుంది నాగరత్నం, 'మంచివాడో చెడ్డవాడో, దుర్మార్గుడో సన్మార్గుడో, నీతిపరుడో అవినీతిపరుడో, ఎవరైనాగాని అతన్ని అగ్ని హోత్రంముందు భర్తగా స్వీకరించినపుడు మనసా, వాచా అతన్నే పూజిస్తాను, ప్రేమిస్తాను, సేవిస్తాను, నన్ను నేను సమర్పించుకుంటాను' అని నిశ్చిత మనస్కురాలైంది. అతడు! పందిరిమంచంమీద ఠీవిగా పడుకుని సిగరెట్‌మీద సిగరెట్ కాలుస్తూ పొగతో తెల్లటి మేఘాలను సృష్టిస్తూ చిన్మయానందాన్ని పొందుతున్నాడు. గదిలో అడుగు పెడుతూనే సిగరెట్ ఘాటుకి ఉక్కిరిబిక్కిరైపోయిన నాగరత్నం చెంగుతో ముక్కు, నోరు మూసుకుని అక్కడే నిల్చుండిపోయింది బొమ్మలా.

ఒక్క క్షణం కన్నార్పకుండా చూసి అతను దగ్గరగా 'రా' అన్నట్లు సైగచేసి పిలిచాడు. నిల్చున్నదగ్గిరనుంచి ఒక్క అంగుళమన్నా కదలలేదు నాగరత్నం. లేచి కూర్చున్నాడతను. చేతిలో సిగరెట్ కాలుతున్నది అగ్నిశిఖలా.

"నన్ను గుర్తించావా?" అడిగాడు దర్పం ఉట్టిపడే స్వరంతో. కనుబొమ్మలెత్తి చూసింది నాగరత్నం మౌనంగా. "నిన్నే కోరి ఎందుకు చేసుకున్నానో తెలుసా?" ఆ ఒక్క వాక్యంలోను ఎంతో కసి, ద్వేషం, అహంకారం ఇంకా ఇంకా ఎన్నో భావాలు ద్యోతకమవుతున్నాయి. ఈసారి పెదవి కదల్చలేదు నాగరత్నం. భార్య మౌనాన్ని చూస్తుంటే రానురాను సహనం చచ్చిపోతున్నదతనిలో. "ఏం! మాట్లాడవేం?" ఉరుమురుము మేఘంలా గర్జించాడు. "ఆ రోజు అంత అహంకారంతో జవాబిచ్చావు మరి... ఆ అతిశయమంతా ఏమయింది? ముంగిలా నిల్చున్నావు నా ముందు?" దానికీ నిశ్శబ్దమే జవాబయ్యింది.

భార్య రెక్కపట్టుకుని లాగాడు. ఈ హఠాత్ సంఘటనకు నిలదొక్కుకోలేని నాగరత్నం తూలి అతని ఒడిలో పడిపోయింది. ముక్కు దగ్గిర ఆచ్ఛాదన తొలగిపోవడంతో దగ్గుతెర కమ్మేసింది. ఆఖరి దమ్ములాగి సిగరెట్ అవతల పారేసి గుప్పుమంటూ వదిలాడా పొగను భార్యముఖం మీదికి. దగ్గుతో ఉక్కిరిబిక్కిరౌతూ చప్పున ముఖాన్ని రెండు చేతుల్లో దాచేసుకుంది నాగరత్నం.

మొదటిరోజు ఇట్లా మొదలైన దాంపత్యంలో ఈనాలుగైదేళ్ళల్లో ఎట్టి మార్పూ రాలేదు. ఇక ముందు వస్తుందనే ఆశాలేదు. మార్పులేని దినచర్యతో యాంత్రికంగా గడిచిపోతున్నాయి రోజులు. తన సంసారం



గురించిగాని, భర్త అలవాట్లు గురించిగాని ఎప్పుడూ ఎవరితోనూ, ఆఖరికి తల్లితో కూడ చెప్పలేదు నాగరత్నం తన కెలాగూ సుఖంలేదు. ఇకముందు ఉండబోతుంది అనే ఆశా లేనప్పుడు, తన అవస్థలేవో తను పడక, తల్లిదండ్రుల మనస్సుకి కూడ శాంతి లేకుండా చేయడం ఎందుకు? అన్న ఉద్దేశ్యమే అందుకు కారణం.

ఒక్కోసారి భర్త మోటు ప్రవర్తనకు కళ్ళవెంట నీరు తిరిగేది. వయసులో ఉన్న ఇరుగుపొరుగు యువతులు ఇంటికొస్తే తన ఎదుటే వాళ్ళతో సరస సంభాషణలు చేయడం, వాళ్ళ పమిటచెంగులు పట్టుకుని లాగడం, ఇంటి దాసీలతో నవ్వుతూ ఛలోక్తులు విసరడంవంటి దృశ్యాలు కంటబడినప్పుడు భర్త సిగ్గులేనితనానికి ఈసడించుకునేది. లోలోపలే కుమిలిపోయేది కాని పన్నెత్తి ఒక్క మాటన్నా 'ఇవి మీకు తగదు' అని హెచ్చరించలేకపోయేది.

సరసుడైన ఆ కొడుకు చేష్టలను చూసి ఆ తల్లి ఒక్కర్తే మురిసిపోయేది. "మా విశ్వం మీ మామగారి పోలికేనే అమ్మాయి! నేను కాపరానికొచ్చినాకూడ ఆయన పోకిళ్ల మానేవారు కాదుసుమా. ఉండబట్టలేక నేనే దెబ్బలాడి, ఏడ్చి, నానా రభస చేసేదాన్ని కాని. అయితే మాత్రం నా అల్లరే కనిపించేది కాని ఆతిరుగుళ్ళు మానారా ఏమైనానా? అసలు మా మామగారుకూడా అలాగే తిరిగేవారటలే? ఇన్ని మాట లెందుకు? అసలీ యింటి వంశోద్ధారకులే అంతట, లేక లేక ఒక్క కొడుకు పుట్టడం, పెద్దవాళ్ళ గారాంతో ఏకు మేకై తిరగటం, ఇదే వరసమ్మా" అని అత్తగారు సగం విచారం, సగం సంతోషం కలిపి చెబుతుంటే నాగరత్నం గుండె లదిరిపడేవి.

అయితే రేపు తనకు పుట్టబోయే బిడ్డకూడా తన తండ్రి అడుగుజాడల్లోనే నడుస్తాడన్న

మాట. భగవాన్! నా కటువంటి కొడుకు వద్దు. అటువంటి కొడుకువలన తనకి సుఖం ఉండదు. ముఖ్యంగా కోడలిగా వచ్చే ఆ అభాగ్యురా లెవరోగాని జీవితాన్ని ఎంతైనా ద్వేషించుకుంటుంది తనలా.

తను జీవితాన్నిగురించి ఎన్ని కలలుగంది, ఏదీ, ఏ ఒక్కటీ నిజంకాలేదు. ప్రతిరోజూ తనకో గండమే. భర్త కోపానికి గురికాకుండా గడిచిన రోజులేదు. ప్రతి చిన్న విషయానికి కోపం ప్రదర్శిస్తాడు. తల దువ్వుకుని శుభ్రమైన బట్టలు కట్టుకుంటే చాలు. "ఏ మొగుడికోసం ఈ సింగారింపంతా?" అరిచేవాడు. అందుకు జడిసి తల దువ్వుకోకుండా మాసిన చీరతో, తిరుగుతుంటే "వెధవముఖం ఎప్పుడూ మడ్డి ఓడుతూనే ఉంటుంది. ఒక శుచి, శుభ్రత ఏమీ లేదు. ఇటువంటి పెళ్ళాన్ని పెట్టుకుని ఏ భర్త సుఖపడగలడు? అందుకే పరాయి కొంపలవెంట పడతారు" అని చీదరించుకునేవాడు. ఒక్క రోజన్నా భర్త అనురాగంతో ఆప్యాయతగా పలకరిస్తాడేమో అని ఎదురుచూసే నాగరత్నానికి అది గగన కుసుమమే అయ్యింది. ఎప్పుడూ చిరచిర లాడుతూ, కోపంతో ధుమధుమలాడే భర్త ముఖంచూస్తే "ఆదరణగా మాట్లాడకపోతే పోనీగాని, ఈ క్షణంలో ఏ రభసా జరక్కుండా మాత్రంచూడు భగవాన్" అని భయంతో ఆకులా కంపించిపోయేది.

సంసారంలో సుఖశాంతులు లోపించడం, భర్త ఉగ్ర స్వభావానికి మానసికంగా బాధపడుతూ, దిగులుతో క్రుంగిపోవడంతో నాగరత్నం చాల చిక్కిపోయింది దానికితోడు విపరీతమైన వేవిళ్ళు. ఏమి తిన్నా ఇమడటంలేదు. కొద్దిరోజుల్లోనే తను తండ్రి కాబోతున్నాడని తెలిసినప్పుడు భర్త విశ్వానికి చాల సంతోషమైంది. తన సంతోషాన్ని ఎట్లా ప్రకటించాలో అతనికి తెలియదు. భార్య ఒకర్తీ కూర్చుని ఉన్నప్పుడు అడిగేవాడు "అమ్మ చెప్పినమాట నిజమేనా?" అని. ఆ అడిగే తీరులో ఒక సౌమ్యతగాని ఆప్యాయతగానికనిపించలేదు. పైగాఅధికార పూర్వకంగా అడిగేటప్పటికి అదిరిపడింది నాగరత్నం. మళ్ళీ ఏ అవాంతరం వచ్చిపడిందో అని భయగ్రస్తురాలవుతూ నెమ్మదిగా "ఏ మాటా?" అంది.

అంతకంటె విడమర్చి ఎలా అడగాలో తెలియలేదతనికి. మొదటినుంచీకూడా అతనికి తను కోరింది చెలిమినో, బలిమినో పొందడమే తెలుసుగాని, స్త్రీ అనురాగాన్ని ఎట్లా పొందాలో, ఆమెను ఎట్లా లాలించాలో తెలియదు. ఒక్కగానొక్క కొడుకన్న గారాబంతో అతనేంకోరితే అది అందజేసేదా తల్లి. పెద్దయ్యి బుద్ధితెలుసునే వయసులో చెడు సావాసాలుపట్టి అతను మరింత పాడైనాడు. అందమైన ఆడపిల్ల కనిపిస్తే చాలు అతని కోతిగుణం ఊరుకోనిచ్చేది కాదు. వాళ్ళ వెనకాల పడి అల్లరిపెట్టి, ఏడిపించి, వీలైతే లొంగదీసుకోవడమే అతని ధ్యేయంగా పరిణమించింది.

ఆపెళ్ళిలో నాగరత్నం అందం, హుందాతనం. అతన్ని పూర్తిగా ఆకర్షించాయి. అందుకే ఏదో విధంగా ఆమెతో మాటలు కలపాలని, వీలైతే స్నేహం చేసుకోవాలని కాంక్షించాడు. అందు కవకాశం యివ్వని నాగరత్నం అతన్నో పురుగుక్రింద జమకట్టి చీదరించుకునేది. ఇలా లాభం లేదని ఆమెని అవమానించైనా తనకసి తీర్చుకోవాలని సమయంకోసం చూస్తుండగా, లభించిందా అవకాశం. పెళ్ళి ఊరేగింపుతో బైలుదేరిన నాగరత్నం మధ్యలోనే ఆగి తనకి తలనొప్పిగాఉందని, ఇకముందుకిరాలేననితల్లితో

చెప్పి బయలుదేరింది. ఇటువంటి అవకాశం కోసమే ఎదురుచూస్తున్న విశ్వం గర్వంగా నవ్వుకుంటూ ఆమెను వెంబడించాడు. పెళ్ళివారి యింటికి పోవాలంటే, రోడ్డు దారిన వెళ్తే కాస్త దూరమనిపిస్తుంది. దగ్గరదారిలో వెళ్ళాలంటే రెండుమూడు ఇరుకు సందులు దాటాలి. సందులు నిర్మానుష్యంగా ఉంటాయి. అయినా గుండె ధైర్యంగల నాగరత్నం దగ్గిరదారే పుచ్చుకుంది. ఇంకొక్క సందుదాటితే వచ్చే మొదటి యిల్లే పెళ్ళివారిది. నిర్భయంగా నడిచివెడుతున్నది నాగరత్నం. ఆ సందు కాస్తా దాటేస్తే ఇక తన ప్లాను జన్మతో నెరవేరదు అన్న ఆత్రుతతో, కాస్త దూరంగా వెంబడిస్తున్న విశ్వం రెండంగల్లో ఆమె సమీపానికి చేరి గబుక్కున చెయ్యిపట్టుకున్నాడు. ఈ హఠాత్ సంఘటనకు నిర్విణ్ణురాలై క్షణం నిల్చుండిపోయిన రత్నం అంతలో తేరుకుని భయంతో అరవబోయింది కాని, విపరీతమైన భయంవలన ఆమె గొంతు పెగలలేదు. అతని చేతిలోంచి తన చెయ్యి లాక్కోవాలని చాల ప్రయత్నించి, పెనుగులాడింది కాని అంత తేలికగా వదిలేరకం కాదు విశ్వం. అందులో చీకటి ఒకటి అతనికి అండగా నిల్చుందా సమయంలో.

"మాట్లాడించబోతే మా పెడసరంగా తిరిగావే. ఇప్పుడు రమ్మను నీతాత ఎవడు వచ్చి రక్షిస్తాడో" వికటాట్టహాసం చేశాడు విశ్వం. అతని గొంతుబట్టి అతడెవరో, ఎందుకు బలాత్కరిస్తున్నాడో క్షణాల్లో గుర్తుపట్టిన నాగరత్నం. లేడిలా బెదరిపోయింది. 'దుర్మార్గుడు అన్నంతపని చేస్తాడు కాబోలు. ఇప్పుడు తను తప్పించుకునేదెలా? 'ఊరేగింపుతో వెళ్ళినా తనకీ విషమపరిస్థితి తటస్థపడేది కాదేమో? ఎట్లా ఇప్పుడు?' పరిపరి విధాల పోయేమనసుతో చుట్టూ చూసింది. ఎవరన్నా వస్తారేమో, తననీ అవస్థనుండి కాపాడి రక్షిస్తారేమో నని. ఎవరూ వస్తున్న జాడే కనిపించలేదు. ఉన్నట్టుండి "అరే! ఎవరది వచ్చేది?" గట్టిగా అరిచింది నాగరత్నం. అదిరిపడుతూ అటు తల త్రిప్పాడు విశ్వం. ఇదే అదనని అతనిచేతిమీద కరిచింది గట్టిగా. బాధతో అతను 'అబ్బా' అని అరుస్తూ చెయ్యి లాక్కున్నాడు. అంతే సుడిగాలిలా దూసుకుపోయింది నాగరత్నం. కన్నుమూసి తెరిచేలోగా ఇదంతా జరిగిపోయింది. చేతికి చిక్కిన పిట్ట జారిపోయినా, అప్పటి ఆమె సమయస్ఫూర్తికి మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు. ఆనాటి పట్టుదలే వాళ్ళ దాంపత్యానికి ప్రథమ సోపానమైంది. కేవలం పట్టుదలేగాక నాగరత్నం గుణం, ఆమె అందం, అతన్ని లొంగదీసుకున్నాయి. కాని భర్తననే అహం

● "ఒకాయనకు బోలెడు డబ్బుంది మేడలు, కార్లు, సర్వావసతులూ వున్నాయి. సుఖమూ శాంతీ హాయీ కూడా అతని దగ్గరే వున్నాయి. ఇంతెందుకు — అసలతనిదగ్గర లేనివంటూ లేనే లేవు"

"పొరపాటు — అతని దగ్గర లేనివి రెండున్నాయి — నువ్వు మరచిపోయావు"

"ఏమిటవి?" అన్నాడు మొదటి మిత్రుడు అమితాశ్చర్యంగా.

"చీకూ చింతా"

భావంతో. భార్యను చీటికి మాటికి బాధిం చశం అతని సరదాలలో ఒకటి.

'గర్భిణీ స్త్రీ ఏది కోంతే అది తెచ్చి పెట్టాలి' అని. ఆమెకు ఫలానిది తినాలనే కోర్కె ఉన్నప్పటికీ సిగ్గు. సంకోచాలవలన ఆ కోర్కెను పైకి వ్యక్తం చేయలేరనే మాటలు అడపా దడపా వింటుండేవాడు కాబట్టి భార్య నోరుతెరచి. తన కోరిక వెల్ల డించకపోయినా రకరకాల పళ్ళు. స్వీట్సు తెచ్చి. ఆమె ఎదురుగా ఉంచేవాడు తింటుంది కదా అనే భావంతో. కాని ఎన్ని రోజులైనాసరే అవి అలాగే ఎండి. కుళ్ళి పాడవటమే కనిపించేదికాని. భార్య తిన్న సూచనలేమీ కనిపించేవి కాదు. ఇక అత నికి ఎంతైనా కోపం వచ్చేది. ఛీ. ఈ ఆడాళ్ళు ఏం మనుష్యులో ? అని విసు క్కునేవాడు. లేదా భార్యను ఉద్దేశిస్తూ "ఇదిగో. ఇటుచూడు ! ఈపైన ఎప్పుడైనా ఇవి మిగిలినట్లుచూశానో ఊరుకోను సుమా! ఒక్కటన్నా మిగల్చకుండా తినేయాలి తెలుసా ? ఆ .... లేకపోతే - నా సంగతి తెలుసుకదూ ?" అనేవాడు.

తల్లి వచ్చింది తీసుకెళ్ళడానికి. భార్యను పంపడం విశ్వానికెంతమాత్రమూ యిష్టం లేదు. అలాగని ఆమెను ఆపనూలేదు. తన యిష్టాయిష్టాలను తెలుసుకోకుండా తల్లి రాగానే సంభ్రమంతో బైలుదేరే భార్యను చూస్తుంటే అతనికి చాల కోపంగా ఉంది. కోపోద్రేకంతో ఊగిపోతూ అన్నాడు భార్యతో "చూడు, నాకు ఆడపిల్ల అంటేనే యిష్టం సుమా ! నువ్వుగాని మొగపిల్లాడిని కన్నావో. వాడిపీక పిసికి. నీప్రాణాలుకూడా తీసేస్తాను తెలుసా ? ఒకవేళ నీపుట్టింటి వాళ్ళ అండ చూసుకుని కులుకుతావేమో. ఇక నీ బ్రతుకంతా పుట్టింటిలోనే వెళ్ళ మారుద్దుగాని." కర్కశమైన స్వరంతో చెబుతుంటే నాగరత్నం అదిరిపడింది.


భర్తకి ఒక అభిప్రాయమంటూ కలిగిం దంటే దానిని మార్చడం హరిహరాదులకు కూడా శక్యం కాదని తెలుసామెకు. అందుకే చెమ్మగిల్లిన కళ్ళను వత్తుకుంటూ ఎలాగో యివతలపడింది.

భార్యను బెదిరించడానికి అన్నప్పటికీ నిజాని కతనికి ఆడపిల్ల అంటే చాల యిష్టము. ప్రేమాను. ఇరుగు పొరుగు ఇంటి పసిపాపలతో ఆడుతూ కూర్చుంటాడు. వాళ్ళకి రకరకాల ఆట బొమ్మలుతెచ్చి బహూకరించి. వాళ్ళు మురిసిపోతుంటే చూసి సంతోషిస్తాడు. తన చిన్నతనంనుంచీకూడా. నాకో చెల్లెలుంటే ఎంత బాగుండును అను కునేవాడు. తల్లి ఆడ పిల్లలమీదగల మోజు కొద్దీ కొడుకునే కూతురులా అలంకరించి ఆ ముచ్చట తీర్చుకునేది.

తన తల్లికి ఆడపిల్లలంటే చాలయిష్టమని అతనికి తెలుసు. తల్లికోసమైనా తనకోఆడ పిల్ల పుడితే ఎంతబాగుణ్ణు' అని అతని ఊహ. కాని భార్య ఆడపిల్లనుగాక మొగ పిల్లాడిని ప్రసవించిదని తెలుస్తే ఏంచేస్తాడో ఆపిచ్చి మానవుడు ?

• • •

నాగరత్నం పూర్తి స్పృహలోకి వచ్చే సరికి కనీసం ఒకగంటన్నా జరిగివుంటుంది. కళ్ళువిప్పి చుట్టూ చూసింది. తల్లి ఆదుర్దాగా తనవైపే చూస్తున్నది. కూతురు కనులు తెరవగానే "అమ్మలూ"అంది అనురాగంగా. నాగరత్నానికింకా అనుమానం తీరలేదు. తనకుపుట్టిన బిడ్డ ఆడో మొగో తల్లినడిగితే? కాని ఏదో సిగ్గు. తెలియని భయంతో ఆమె నోరుపెగలనేలేదు. మరి కాసేపటికి మంత్ర సాని ఒక పసిబిడ్డతో అక్కడకు వస్తూనే "గుమ్మడిపండంటి అబ్బాయిని గన్నావు. కరువుతీరేలా చూసుకోవమ్మా." అని మేలమాడుతూ ఆ బిడ్డను నాగరత్నం ప్రక్కనే పడుకోబెట్టి వెళ్ళిపోయింది;



కన్నకొడుకుని కంటితో చూసుకోగానే అంతవరకు ఆమెను పీడిస్తున్న దిగులు. భయ సంకోచాలు ఎగిరిపోయాయి. కడు పుశోబాటు మనసుకూడా చాలా తేలికనిపిం చింది. చెయ్యివేసి నెమ్మదిగా ఆప్యాయ తగా నిమిరింది కొడుకు శరీరాన్ని. చేతికి అతి మెత్తగా. పూవుకన్న మృదువుగా. బిడ్డ దేహం తగులుతుంటే ఏదో పార వశ్యంలో క్షణం తన్మయురాలై కళ్ళు అర్ధ నిమీలితాలై పసిబిడ్డనే చూస్తుండిపోయింది

ఇటువంటి బిడ్డ కలగాలని ఎంతమంది యువతులు ఎన్ని కలలు గంటున్నారో ? ఎవరికీ దొరకని అదృష్టమేదో తనకి కలిగి నట్లు సంతోషంతో పొంగిపోయిం దామె హృదయం. తనెంత పాపిష్టురాలు ఈ బిడ్డ వద్దని ఎన్ని దేవుళ్ళకు మ్రొక్కుకుంది ... ఏమైనాగానియ్యి. తన సంసారం విచ్ఛిన్న మైనాసరే ముద్దులు మూటగట్టే ఈ పసి వాడిని వదులుకోలేదు. ఆ బిడ్డను చూస్తుంటే ఆమెకు గర్వం. ఏదో ధైర్యం. నిర్వచించ లేని ఆనందోత్సాహాలు పెల్లుబుకుతున్నాయి.

అప్పటి కప్పుడే ఎన్నో ఊహలు. తన కొడుకు తండ్రి అడుగుజాడల్లోగాక. ఎంతో బుద్ధిమంతుడైనట్లు పెద్దలంటే భక్తి. గౌర వాలు చూపిస్తున్నట్లు. ఆడపిల్లలను తన తోబుట్టువుల్లా తలచి. గౌరవిస్తున్నట్లు ఇట్లా ఎన్నో ఎన్నో ఆలోచనలు. ఊహాగానం చేస్తూ నిద్రపోయింది నాగరత్నం.

ఆ రోజే పురిటి స్నానం. తల్లి. బిడ్డ ఆరోగ్యంగానే ఉన్నందున. ఆ రోజే స్నానం చేయించారు. అంతవరకు అత్తవా రింటి వద్దనుంచి ఎవరూ రాలేదు. కబురు పెట్టినా ఎందుకు రాలేదో ? వారికి కోపం వచ్చిందేమో. ఆ కోపాన్ని ఈవిధంగా తీర్చుకుంటున్నారు కాబోలు అనుకుంది నాగరత్నం. భయంతో ఆమె మనసు ఏదో శంకిస్తున్నది. ఆ భయానికి నిర్వచనం చెప్పుకోలేక లోలోపలే బాధపడుతున్నది.

పుట్టినప్పుడు కాస్త సన్నగా ఉన్నప్పటికీ ఈ పదకొండు రోజుల్లోనే ఒళ్ళుచేసి బొద్దుగా, చూపులకు ముద్దు గొలుపుతూ ఉన్నాడు. బంగారు రంగుతో పోటీచేసే దేహంమీద తెల్లటి గ్లాస్కో చొక్కా, చేతికి మురుగులు, మెడలో పులిగోరు పతకం, కళ్ళకు కాటుకా, దిష్టిబొట్టుతో అలంకరించిన కొడుకుని ఒడిలో పెట్టుకొని కూర్చుంది నాగరత్నం. బాలింత రూపంలో కొత్త అందాన్ని పుంజుకొని చూపరులను ఆకర్షించేలా ఉంది నాగరత్నం కూడా. కూతురికి, మనుమడికి ఎక్కడ దృష్టి తగులుతుందో అని అందరూ వెళ్ళాక ఇన్ని మిరపకాయలు తెచ్చి కూతురుకి, మనుమడికి దిష్టితీసి పొయ్యిలో పోసివచ్చింది చిట్టెమ్మగారు.

తల్లి చాదస్తానికి నవ్వుకుంది నాగరత్నం.

"ఇప్పుడు నీకిలా నవ్వులాటగానే ఉంటుంది గాని కొన్ని రోజులు పోనియ్యమ్మా నీకే తెలిసివస్తుంది, కన్న 'మమకారం, మాతృత్వపు ప్రేమాను" అంది చిట్టెమ్మగారు వెళ్ళిపోతూ; అంతలోనే తిరిగొచ్చి కంగారుగా "అల్లుడుగారొస్తున్నారే, రత్నం' అంటూనే గబగబ లోపలకెళ్ళిపోయిందామె.

విశ్వం బండివాడికి డబ్బులిచ్చి, గుమ్మం బైట చెప్పులువిడిచి లోపలకు నడిచాడు. అతనికళ్ళు దేనికోసమో వెతుకుతున్నాయి ఆత్రుతగా. అతనికి అత్తగారింట్లో అంత చనువులేదు. పెళ్ళయ్యాక ఈ అయిదు సంవత్సరాలలోనూ ఏ రెండు, మూడుసార్లోవచ్చి ఉంటాడంతే. అందుకే అతనికి అత్తగారితో మాట్లాడాలంటే ప్రాణసంకటంగా ఉంటుంది తను వచ్చి అయిదు నిమిషాలు పైనే అయింది. అయినా ఒక్కళ్ళూ కనిపించరేం? ఎదురుగా కనిపించని భార్యమీద అత్తమామలమీద విసుక్కున్నాడు కాస్సేపు. అతని హృదయం దేనికోసమో తపిస్తున్నది. సిగ్గూ సంకోచాల వలన అక్కడే తచ్చాడుతూ నిల్చున్నాడు. ఇంతలో గుమ్మం ప్రక్కగా గాజులు గల గల్లాడినవి. ఉత్సాహంగా తలెత్తి అటు చూశాడు అత్తగారు చెంబుతో నీళ్ళు తెచ్చి అక్కడ పెడుతూ "కాళ్ళు కడుక్కో నాయనా" అంది ఆదరంగా.

ఎటూ చూడకుండా చప్పున చెంబు అందుకుని కాళ్ళమీద గుమ్మరించుకొచ్చాడు. కాళ్ళు చల్లపడగానే హృదయంకూడ కొస్త చల్లబడ్డట్లయ్యింది.

"భోజనానికి లేస్తారా? కాఫీ తెమ్మంటారా" అడుగుతున్న అత్తగారిని చూస్తుంటే అతగానికి అరికాలిమంట నెత్తికెక్కినట్లయింది. తను అంతదూరంనుంచి పరుగెత్తుకొచ్చింది, అన్నం కాఫీలకోసమా?

"నేను కాఫీ ఫలహారాలు తీసుకునే వచ్చానులెండి. ఇప్పుడా ప్రయత్నాలేమీ చేయవద్దు" అన్నాడు తెచ్చికోలు వినయంతో. అంతకంటె కఠినంగా మాట్లాడా లనుకునికూడా మాట్లాడలేకపోయాడు.

అల్లుని కా ఆత్రుత ఎందుకో కనిపెట్టిన అత్తగారు చిన్నగా నవ్వుకుంది. కొత్తగా పితృస్థానం పొందిన ప్రతి యువకుని మనసు యిట్లాగే ఉంటుంది అనుకుంది. "అదిగో ఆ గదిలో ఉంది అమ్మాయి" అంది అక్కడనుంచి తప్పుకుంటూ.

ఆ గదిలో నాగరత్నం చలనంలేని బొమ్మలా బిగుసుకుపోయి కూర్చుంది. అల్లుడు వచ్చాడనగానే ఆమె ఉత్సాహమంతా చల్లారిపోయింది. ఆయన ముఖంలో ఏం చూడాల్సివస్తుందో, ఆ నోటిలోంచి ఎంత

కఠినమైన మాటలు వినాల్సి వస్తుందో? ఒడిలో బిడ్డడు నిద్రపోతున్నాడు మత్తుగా. తన బిడ్డకు ఏ అపాయము కలుగకూడదని కాబోలు ఒక చెయ్యి బిడ్డ శరీరంమీదవేసి రాబోయే సన్నివేశానికి ఆయత్తపడేలా కూర్చుంది బింకంగా.

పరిచితమైన పద ధ్వని బరువుగా పడుతూ చేరువకొస్తున్నది. నాగరత్నం గుండె వేగంగా, అతి వేగంగా కొట్టుకుంటున్నది. అప్పుడు జరుగబోయే సన్నివేశాన్ని ముందే ఊహించుకున్నందున కాబోలు, భయోద్వేగాలతో ఆపాదమస్తకం కంపిస్తున్నదామె. అప్పుడే లోపల కడుగుపెట్టాడతను. చప్పుడుకి తలెత్తి చూసింది ఇద్దరి నేత్రాలు కలుసుకున్నాయి. నాగరత్నం చూపుల్లో 'నా బిడ్డను ఏమీ చేయరుకదూ?' అనే ప్రార్థన ప్రస్ఫుట మవుతున్నది. అతని చూపుల్లో వెఱ్ఱి ఆనందం, ఎనలేని ఉత్సాహం ద్యోతక మవుతున్నాయి. ఆ చూపుల భావం అర్థంచేసుకోలేని రత్నం బెదిరిపోతూ కళ్ళు వాల్చేసుకుంది. బిడ్డచుట్టూ ఉన్న ఆమె చేతులు మరింత బిగుస్తున్నాయి. హరి బ్రహ్మాదులు దిగివచ్చినా ఆ చేతులనుండి ఆ బిడ్డను వేరుచేయలేరనే దృఢనిశ్చయాన్ని వ్యక్తంచేస్తూ.

కాని అతని భావాలు మరోలా పరుగులు తీస్తున్నాయి. అతని కంటికి నాగరత్నం పూర్వంలా కనుపించడంలేదు. అంతకంటె ఎన్నోరెట్లు అందంగా ఆకర్షణీయంగా కనిస్తున్నది. బొడి వెంట్రుకలు పాయలుతీసి అల్లినప్పటికీ, జడలో యిమడని కొంగి వెంట్రుకలు మెలికలు తిరిగి చెంపలవెంట కదం త్రొక్కుతుంటే పచ్చటి ముఖానికి వింత శోభను గూరుస్తున్నవి. ఒత్తుగా కాటుక దిద్దుకున్న కనులు, నుదురు మధ్యలో రక్త సిందూరంలా మెరిసిపోయే కుంకుమబొట్టు మాతృత్వపు వైభవం చాటుతూ ఉబికిన వక్షోజాలు, చిక్కిన చక్కని దేహానికి వచ్చిచేరిన అందానికి ముగ్ధుడౌతూ, తన్మయత్వంతో మత్తుగా నడిచాడు ముందుకి.

ఎదురు చూసిన ఆ క్షణం వచ్చేసింది. అబ్బ! భయాందోళిత హృదయంతో కళ్ళు మూసుకుంది రత్నం. వెంటనే ఉలిక్కిపడుతూ "ఇదేమిటీ! ఎవరు తనను బంధించారు" అనుకుంటూ కళ్ళు తెరచి చూసింది. భర్త తన ప్రక్కనే కూర్చుని తనచుట్టూ చేతులువేసి తన తలను గుండెల కదుముకున్నాడు. ఎదురుచూడని సన్నివేశం! ఆ సమయంలో సంతోషించాలో విచారించాలో తెలియలేదు రత్నానికి. అయినా మనసు కూడదీసుకుని పొడారిన గొంతుతో అంది "అబ్బాయి" అని తడబడుతూ.

"చూశాను, ఎంత బాగున్నాడో. అంతా నీపోలికే వచ్చింది. అబ్బాయి అమ్మపోలికైతే అదృష్టంకదూ? నువ్వు ...నువ్వు, నిజంగా ఎంత బాగున్నావు? నీలో ఇంతందము, ఆకర్షణ ఉన్నాయని నా కిన్నాళ్ళు తెలియదు. మూర్ఖుడిని, నన్ను క్షమించవూ, ఇన్నాళ్ళు నిన్ను బాధపెట్టినందుకు?" అంటూనే బిడ్డతోసహా భార్యను గుండెల కదుముకున్నాడు.

భర్తలో కలిగిన మార్పుకు ఉప్పొంగిపోతూ "నాకిదే చాలు. ఈ అదృష్టాన్ని ఎప్పుడూ ఇలా ఉండేలా చెయ్యి ప్రభూ" అనుకుంది నాగరత్నం, ఆనందంతో చెమర్చిన కళ్ళను తుడుచుకుంటూ. ☐☐☐

కాముడు



ఆనాడు కామేశ్వర్రావు అనే కాముడికి భోగిపండుగలాటి సర్వాదినం.

ఎందుకనీ ? ....

ఆవేళ అతనికి ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాం వచ్చింది కాబట్టి ....

ఏమనీ ? ....

అతని భార్య చి॥సౌ॥ కల్యాణి బయల్దేరి (కొత్తగా కాపురానికి)రాబోతూందనీ....

ఎప్పుడూ ?

బయల్దేరడం ఆ దే రో జు - రావడం మర్నాడుదయం.

అందుకనే ఆరోజు అతనికి భోగి పండుగ - మర్నాడు పెద్దపండుగ - మహా పర్వదినం. అందుకనే ఆఫీసు వదలగానే తన 'ఇల్లు' అనబడే అద్దె గదికి పరిగెత్తుకుని వచ్చేసి, సబ్బుతో తలంటిపోసుకొని, సరికొత్త యిస్త్రీబట్టలు ధరించి, బూట్లు తొడుక్కొని హుషారుగా ఈలవేసుకుంటూ గది తలుపులు మూసి వీధిలో పడదామని ప్రయత్నిస్తుండగా అప్రయత్నంగా యీల కల్యాణి రాగంలోకి దిగిపోవడంవల్ల మరి వెళ్ళడానికి మనసొప్పక మేను వాల్చి కల్యాణి నాలపిస్తూ, తటాలున ప్రతి మధ్యమం శుద్ధ మధ్యమం కావడం వల్ల తన మనసు కల్యాణిమీద నిలవడం లేదని గుర్తించినవాడై, నాలుక్కరుచుకోబోయి, పూసివుండటంవల్ల ఆ ప్రయత్నం మానుకుని శాస్త్రోక్తంగా సారి నెత్తిమీద కొట్టుకుని, కల్యాణిపై మనసు లగ్నమవడం కోసం తన భార్య కల్యాణి స్వహస్తాలతో తనకు రాసిన ప్రణయ లేఖలు చదవడానికి పూనుకున్నాడు.

"ప్రియమైన భర్త గారికి,

తమ భార్య చి॥ సౌ॥ కల్యాణి శతకోటి నమస్కారాలుచేసి వ్రాయున దేమనగా...."

కాముడు తన భార్య అమాయకత్వానికి నవ్వుకున్నాడు. త న కు తానే చి॥ సౌ॥ కల్యాణి అని రాస్తుందేమిటి ? తుమ్మి 'చిరంజీవ' అనుకున్నట్టు ? స్నానంచేసి తనకు తానే శ్రీరామ రక్ష పెట్టుకున్నట్టు—

"ఇక్కడ నేను. మా నా న్న గా రు' గం॥భా॥స॥ అత్తయ్య, బుజ్జాయి కులాసా."

మళ్ళీ నవ్వుకున్నాడు కాముడు.

"ఎంత ప్రేమయితే మాత్రం కోడెదూడ 'బుజ్జాయి'ని కూడా మనుషుల్లో కలిపి కులాసా అంటుందేం ?... పిచ్చి...." అని.

"మీరక్కడ క్షేమంగా వున్నారని భావిస్తాను. మీరు నాలుగు ఉత్తరాలు రాసినా నేను జవాబివ్వలేదని మీకు కోపం వచ్చిందనుకుంటాను. నన్ను క్షమించండి. కవర్లు తెచ్చిపెట్టే దిక్కులేదు....యీ కవరు మా అమ్మ తెప్పించి పెట్టింది. మన ఎడబాటుకు మీరొక్కరేనా చింతించేది ? నాకుమాత్రం బాధగా లేదూ ?....చిన్నప్పటినుంచీ ఒక్క ఇంట్లో అంత ఇదిగా పెరిగాం కదా ? నా మనసు మీకు తెలియదూ ? నాకు మీమీద ప్రేమలేదని రాశారుగదా ? మీకు న్యాయమేనా ?"....

ఇంతవరకు చదివిన కాముడు మరి చదవలేక చదికిలబడి, దరిమిలా వెల్లకిలబడి తనయొక్క, కల్యాణియొక్క, జాయింటు జీవితాన్ని చిన్నతనం నుంచీ జ్ఞాపకం చేసుకోడం మొదలుపెట్టాడు.

● ● ●

అనగనగా ఓ జగదాంబ కడుపున షుమారు పందొమ్మిదేళ్ళక్రితం ఓ కాయ కాసింది. ఆ కాయపేరు కామేశ్వర్రావ్ ఉరఫ్ కాముడు అనే పండు. దాదాపు రెండేళ్ళ తర్వాత యీ కాయ వళ్ళంతా మన్ను పులుముకుని, బూడిద గుమ్మడిపండు వేషంలో చక్కగా నడుస్తూ, కూచుంటూ, లేస్తూ, పడిపోతూ పాకుతూ, దొర్లుతూ ముద్దు ముద్దు మాటలు కూస్తూ, పెరట్లో మట్టిపెళ్లలూ, బొగ్గులూ భోంచేస్తూవుండగా కాయ తాలూకు మేనమామ పెళ్ళాం కడు

పెండ్యాల నాగాంజనేయులు

వున ఓ నలుసు జన్మించింది. ఆ సమయంలో కాయ తల్లి అక్కడే వుంది. ఉన్న మనిషి వూరోక్కకుండా "ఒరేయ్ పండూ! నీకు పిల్లాం పుట్టిందిరా" అంటూ కాయను చంకనేసుకుని, చెంపలు కొరికేసి, సరాసరి తన అన్నగారి దగ్గరకెళ్ళి "అన్నయ్యా! ఇప్పుడే చెప్తున్నాను. నా పండుకూ మీ నలుసుకూ ముడెయ్యాలి తెలిసిందా?" అంది

"అలాగేలే జగదాంబా" అన్నాడు కాయ మేనమామ. నలుసుకు పదకొండోనాడు 'కల్యాణి' అని పేరుపెట్టారు. ఇది జరిగిన కొద్దిరోజుల్లో జగదాంబ ప్రత్యక్షదైవం (పతియే ప్రత్యక్షదైవం) మరో లోకాని కెళ్ళిపోవడంవల్ల, తన పండుతోబాటు ఆమె అన్నగారి పంచనజేరింది

కాముడి కిక్కడే అక్షరాభ్యాసం జరిగింది. మేనమామ చెప్పుచేతుల్లో భయ భక్తుల్తో చదువుకునేవాడు.

కాముడికి కల్యాణంటే భలే ఇష్టం. సన్నగా రివటలాగుండేదేమో చంకనేసుకుని పరుగెత్తేవాడు. ఇద్దరూ ఒక్కసారే ఒక్క కంచంలోనే అన్నంతినేవాళ్లు. ఒక్క మంచంలో పడుకునేవాళ్ళు. పెద్దవాళ్ళు "ఒరే కాముడూ నీ పెళ్లామేదిరా" అంటే కల్యాణి ఫొటో చూపించేవాడు. కల్యాణిని "నీ మొగుడేడే" అంటే కాముడి ఫొటో చూపించేది. పెద్దవాళ్ళలా అలవాటుచేశారు.

ఇలా కొన్నాళ్ళు - అంటే కామేశానికి 11 ఏళ్ళు, కల్యాణికి 9 ఏళ్ళు వచ్చాక ఈ 'మొగుడూ పెళ్ళాలు' అనే మాటలు వినబడితే ఇద్దరికీ సిగ్గులాటి కోప మొచ్చి ఉన్న పళాన ఏడ్చేవాళ్ళు "ఛీఛీ" అంటూ. అయినా ఇద్దరూ స్నేహంగానే వుండేవాళ్ళు. ఒకే కంచంలో తింటూ, ఒకే మంచంలో బబ్బుంటూను.

మరో రెండేళ్ళు పోయాక కంచాలూ, మంచాలూ చెరోటీ వచ్చాయి. ఎందుకనో! ఎందు కేవిటిలెండి! పెద్దాళ్ళే అలా చేశారు. పైగా చాటునేమోగాని... వాళ్ళ ఎదుట మాత్రం "మొగుడూ పెళ్లాలు" అనే మాటలు వాడ్డం మానేశారు.

ఇది జరిగినా వాళ్ళిద్దర్లో వీసమెత్తు 'ఇష్టం' క్షీణించలేదు. కానీ — కాముడికి 16 ఏళ్ళు దాటుతూండగా - అనగా స్కూలు ఫైనల్ పరీక్షలు జరుగుతూండగా, అతనింకా ఇంట్లోవాళ్ళతో "కుర్రవెధవ, పసివన్నాడి." అని అనిపించుకునే స్థితిలో చటుక్కున ఓరోజున కల్యాణికి 'పెద్దరికం' అంటగట్టేశారు పెద్దాళ్ళు. "ఇదేమిటీ?" అని విస్తుబోయాడు కాముడు. తను కల్యాణి కన్నా రెండేళ్ళు పెద్దగదా? తనకన్నా గభాల్న కల్యాణెలా పెద్దది కాగలిగింది, అదీ పాయింటు.

"హౌ ఈజ్ ఇట్ పాసిబుల్?" అనితనకు తనే ప్రశ్న వేసుకుని "ఇంపాసిబుల్" అని తనకు తనే సమాధానం చెప్పుకుని, ఎందుకైనా మంచిదని వాళ్ళమ్మ నడిగితే —

"ఓరి కుఱ్ఱనాగమ్మా! వెధవ ప్రశ్నలు వెయ్యకు. పరీక్ష ప్యాసయ్యే మార్గం చూసో.... నాకొంచెం పనుంది.... నువ్వలా కాసేపు తిరిగిరా" అని పంపించేసింది.

తల్లి మాట వినిపించుకుని పరీక్షలు పూర్తిచేశాడు. అయితే కల్యాణి ఇదివరకటిలా కాముడికి తన మొహం చూపించడంలేదు. పోనీ అతని మొహాన్ని చాటునుంచి చూసినట్టు రుజువులూ లేవు. ముఖ వీక్షణమే లేంది మాటలెక్కడ? ఒకటి రెండుసార్లు పలకరిద్దామనుకుంటే పరుగెత్తుకుపోయింది. చాలా రోజులు తపించిపోయాడు కల్యాణి దర్శనార్థం. కాని అదంతా గగన కుసుమమయింది.

'బడాయ్' అనుకున్నాడు. 'గర్వం' అనుకున్నాడు. 'పొగరుమోత్తనం' అనికూడా అనుకున్నాడు. ఊఁహూఁ! ఇన్నినుకున్నా గనబళ్ళేదు.

ఇలా అనుకుంటూండగా పరీక్ష ఫలితాలొచ్చి "కామేశ్వర్రావుకూడా ప్యాసయ్యాడండోయ్" అని ఆంధ్రదేశం నలుమూలలా గావుకేకలు పెట్టాయి. ఆ రోజు ఇంట్లో వాళ్ళంతా ఎగిరి గంతులేశారు. జగదాంబ వీధిగడపలో కూర్చుని రాత్రి జనసంచారమున్నంతవరకూ పిల్చి మరీ చెప్పింది తన కొడుకు ప్యాసైనట్టు.

కల్యాణి కామేశ్వర్రావు నెంబర్ని కంఠతా పడుతూ కూర్చుంది.

"అన్నయ్యా! మరి వీణ్ణి కాలేజీలో జేర్పిద్దాం" అంది జగదాంబ.

"లేకపోతే ఎలాగమ్మా? సరస్వతీదేవికి తీరని ద్రోహంకూడా చేసినవాళ్ళ మవుతాం" అన్నాడు అన్నగారు.

మరో ఇరవై రోజుల్లో కాముడు పి యు సి విద్యార్థయ్యాడు పట్నంలో. మేనమామే స్వయంగాచేర్చి, పొడుగులాగూ చొక్కాలు కుట్టించి, రూం ఏర్పాటుచేసి హితబోధ గావించి చక్కావచ్చాడు.

త్వరలోనే కాముడు కాలేజీలైఫ్ అనుభవించడం నేర్చుకున్నాడు. ఎంతసేపూ స్నేహితులు, మేటినీ లేక రెండో ఆట సినిమాలు, సినిమాలపై చర్చలు, ఇదేవిధంగా ఏడాదీ గడిపేసి పరీక్షలు తద్దినం పెట్టినంత శ్రద్ధగానూ తగలేసి పట్నమూ స్నేహితులకన్నా కల్యాణీ, మామయ్యే బలవంతులని తేల్చుకొని వూరికెళ్ళిపోయాడు.

"ఏరా కామేశం? ఎలా రాశావు పరీక్షలు?" అని నిలబెట్టి అడిగితే "బాగానే రాశాను మామయ్యా" అన్నాడు. కూర్చుంటూ.

నెల తిరక్కుండానే కాయకూ, కల్యాణి అనే నలుసుకూ ముడిపడిపోయింది. (పోనీ మూడు ముళ్ళనుకోండి).

ఎన్నో యుగాలనంతరం (వాళ్ళకేలెండి) మళ్ళీ కాముడూ కల్యాణీ ఒకళ్ళ నొకళ్ళు ముట్టుకోగలిగారు నెత్తిమీద బెల్లం జీలకర్ర పెట్టేటప్పుడూ. తాళి కట్టేప్పుడూ హోమగుండం చుట్టూ తిరిగేప్పుడూ, బిందెలో ఉంగరాలు తీసేప్పుడూ, ఒకళ్ళ కొకళ్ళు మంచిగంధం రాసుకునేప్పుడూ....

ఒకే వెండికంచంలో భోంచేయగలిగారు, ఒకళ్ళ నొకళ్ళు దొంగచూపులు చూసుకుంటూ.

ఈ నవ దంపతుల్ని చూసి కన్నకడుపులు బ్రహ్మానందపడి పోయాయి.

కల్యాణి తల్లి మరి కాస్త ముచ్చటపడి "చాలారోజుల తర్వాత ఒకే కంచంలో భోంచేస్తున్నారు ...మరి ఒకే మంచంలో...." అని భర్త నడిగితే "ఛ! ఉండవే! ఏమంత తొందర? వాడికేదన్నా ఉద్యోగం దొరకనీ" అన్నాడు భర్త నసుగుతూనే....,

కొద్ది రోజుల్లో పరీక్ష ఫలితాలొచ్చి. కామేశానికి బజార్లోనే కనబడి "ఈసారి సువ్వొక్క పార్టులోనే ప్యాసయ్యావు"అని చెప్పేశాయి. మామయ్య మాటంటే వణికిపోయే కాముడు ఇంటికొచ్చి, ముసుగు తన్ని చంకలో ఉల్లిపాయముక్క లెట్టుకుని, జ్వరం తెప్పించుకొని మూసినకన్ను తెరుస్తూ పడుకున్నాడు - మామయ్యొచ్చి ఏం కేక లేస్తాడోననే భయ తో. మామయ్యొచ్చాడు. మొహంమీద ముసుగు తొలగించాడు. మూసిన కళ్ళను ప్రేమతో తెరిచాడు.... కొయ్యబారి చూస్తున్నాడు కామేశం. "ఏరా కాముడూ, ఇలా అయిందేరా?" అన్నాడు మెత్తగా, నెమ్మదిగా .... "పరీక్షల్లో ఒకటే

జ్వరం మామయ్యా! అసలు పరీక్ష కెళ్ళడమే కష్టమైపోయిందీ" అని లంకణాలు పడ్డవాడిలాగా చెప్పాడు.

జగదాంబ, అత్తగారూ "పోన్లే నాయనా పెధవ పరీక్ష! మళ్ళీచదివి పాస్యవుదుగాన్లే పైయేటికి" అని సముదాయించారు.

కల్యాణిమాత్రం కన్నీళ్ళు పెట్టుకున్నట్టు కనిపెట్టాడు కాముడు. పరుగెత్తికెళ్ళి ఓదార్చుదామనుకున్నాడుగాని, ఆ పిల్ల దొరికితేనా?

ఇలాకాక్కాదని, తను ఇకమీదట బుద్ధిగా చదువుకుంటాననీ, పరీక్ష ప్యాసవుతాననీ ఒట్టువేస్తూ ఒక చిన్న ఉత్తరమ్ముక్క రాసి కల్యాణి పెట్టెలో పడేశాడు. తను ఆ అమ్మాయితో సర్దాగా మాట్లాడాలనుందనీ, ఆ అమ్మాయినెంతో గాఢంగా ప్రేమిస్తున్నాననీ కూడా రాశాడందులో.

మర్నాడు కాముడు కల్యాణి పెట్టెతెరిచే సరికి అందులో కల్యాణి తనకు రాసిన వుత్తరం వుంది. "అన్నమాట తప్పకుండా చదివి ప్యాసయి నా గౌరవం కాపాడతారని నమ్ముతున్నాను. నాకూ మీతో మాట్లాడాలని వుంది. మిమ్మల్ని చాలాచాలా గాఢంగా నేనూ ప్రేమిస్తున్నాను" అని రాసింది.

వాగ్దాన ప్రకారం - ఒక పక్క చిన్న చిన్న ప్రేమలేఖలు రాస్తూ, కల్యాణి రాగం పాడుకుంటూ మొత్తంమీద సెప్టెంబర్లో మిగతా రెండుపార్టులూ ప్యాసయ్యాడు. రిజల్ట్సు శుభవర్తమానం తెచ్చిన రోజున ఇంట్లోవాళ్ళంతా నిముషాలమీద ఒళ్ళు చేశారు. ఆ రోజునే కాముడూ, కల్యాణీ పెద్దవాళ్ళెవళ్ళూ దగ్గరగా లేకుండాచూసి కాసేపు మాట్లాడుకున్నారు - చాలా రోజుల తర్వాత.

తరచు ఇలాంటి అవకాశాలు దొరికినప్పుడు ఇలాగే మాట్లాడుకుంటూండే వాళ్ళు.

"ఒరే కాముడూ! ఇహ ఉద్యోగ ప్రయత్నమేదన్నా చెయ్యి" అన్నాడు మామయ్య ఒకరోజున -

"మరి బి. ఏ చదివించవా అన్నయ్యా?" అంది జగదాంబ చకితురాలవుతూ.

"ఇంకెందుకు లేమ్మా! బి ఏ లూ ఎం. ఏ లూనూ. ఇది పాసయ్యేసరికే వీడికి ఆయాసం, రొప్పు, దడ బయల్దేరాయి. ఆ వుద్యోగం కాస్తా చూసుకుంటే వాణ్ణీ, కల్యాణినీ ఆ కాస్త అడ్డూ తీసేసి పంపించేద్దాం" అన్నాడు మామయ్య.

"అవునమ్మా! ఉద్యోగం పురుష లక్షణం! వెంటనే ప్రయత్నం చేస్తా! నేను బతకడానికి చదువు చాలు. మామయ్య మాట మహా కరెక్టు" అన్నాడు కాముడు.

అంతరార్థగ్రాహి మామగారు చిరునవ్వు నవ్వుకున్నాడు.

గోడచాటునుంచి వింటున్న కల్యాణి మనసు స్వర్గసీమను చూస్తోంది.

ఆనాటినుంచీ రీముల కొద్దీ దరఖాస్తులు పడేశాడు. రోజూ ఓ అణా బలపాలు కొనుక్కొని కాళ్ళకట్టుకొని ఎలక్షను అభ్యర్థి ఓట్లకోసం తిరిగినట్టు తిరిగాడు ఉద్యోగాలకి.

కాముడు పడే అవస్థ ఆర్నెల్లపాటు గమనిస్తూ ఊరుకున్న మామగారు, "ఇహ నీవల్లకాదురేరా సన్నాసీ" అనేసి, తనే అతణ్ణి వెంటబెట్టుకొని, ఓ మంచి రోజున చెన్నాపట్నం తీసుకెళ్ళి ఓ స్నేహితుడి సహాయంతో నూరు రూపాయల గుమాస్తా ఉద్యోగం అయిదొందల రూపాయలకు బేరంచేసి మరీ కొనిపెట్టాడు.

"ఓ ఇరవై రోజుల్లోపలే ఆర్డర్లొస్తాయి. ఆర్డర్లు జారీఅయిన మరుక్షణమే ఉద్యోగంలో ప్రవేశించాలి" అన్నా డాఫీసు మేనేజరు.

మామయ్య చేతులుకట్టుకుని "అలాగేనండి! అయ్!" అన్నాడు

కాముడు తల తాటించాడు తాటికాయలాగా....

ఇంటికొచ్చేశారు మామా అల్లుళ్లూ. ఉద్యోగం దొరికిందని అందరూ సంబరపడ్డారు.

"అమ్మయ్య! నా కాముడి ధర్మమా అని మద్రాసు చూడబోతానుగావల్ను" అంటూ సరదాపడింది జగదాంబ.

ఆ కాస్త "అడ్డు" కోసం పాకులాడిందత్తగారు.

పదిరోజుల్లో 'ఆ కాస్త అడ్డు'కూ ముహూర్తం పెట్టించడమూ, మంత్రాలతో పీటలమీద తతంగము, భుజంమీదుగా చెయ్యి వేయించడమూ, ఆ తర్వాత దంపతులిద్దర్నీ శోభాయమానంగా అలంకరించబడిన పందిరి మంచంమీద కూచో పెట్టి దంపత్తాంబూలా లిప్పించడమూ - అన్నీ సవ్యంగానే జరిగాయి.

దంపతులిద్దర్నీ గదిలో స్వేచ్ఛగావదిలి తలుపు బయట గొళ్ళెపెట్టడం జరిగాక అమ్మలక్కల గుసగుసలూ, సన్నగా నవ్వుకోడమూ బాగానే వినబడ్డాయి వాళ్ళకు.

"సింగినాదం పోదూ!" అనుకున్నాడు కాముడు.

అందరిలాగే అతనూ తనకది మరపురాని మధురక్షణం కాబోతుందని దుంభి ప్రాయపడ్డాడు పాపం కల్యాణికూడా అలాగే పడింది. ఇద్దరూ మనసు విప్పి మాట్లాడుకున్నారు. ఇంతలో గది తలుపులు దబాదబా బాదటం, దంపతులిద్దరూ కంగారుపడిపోవటం, "కాముడూ!" అని మామయ్య కేక వినబడ్డంకూడా జరిగింది.

కాముడు బెరుకు బెరుగ్గా వచ్చి తలుపు తెరిచాడు. మామయ్య చేతిలో టెల్గ్రాంతో నిలబడున్నాడు

"ఒరే కాముడూ! వెంటనే బయల్దేరు. ఉద్యోగం ఆర్డర్లొచ్చేశాయి. మద్రాసు మెయిలుకు టైంకూడా ఎంతో లేదు" అంటూ తొందరపెట్టేశాడు

'బ్యార్'మని ఏడ్వబోయాడు కాముడు.

"రేపెడతాములే అన్నయ్యా!" అంటూ ప్రతిమాలింది జగదాంబ.

"పిల్లేమ మళ్ళీ రెండురోజుల్దాకా మంచిది కాదు. ఇప్పుడే వెళ్లాలి. ఐదొందలు పోసి కొన్న ఉద్యోగంకూడా" అన్నాడు మామయ్య కర్కశంగా.

"పర్వాలేదండి! రేప్రొద్దున్నే ..." అంటూ వచ్చిం దత్తయ్య.

"నోర్మయ్!" అన్నాడు మామయ్య.

జగదాంబకూడా కాముడివెంట వెళ్దామనుకుంది గాని, "కల్యాణిని కాపురానికి పంపేటప్పుడు వెళ్దువుగాన్లే" అన్నాడు మామయ్య.

వెంటనే మెయిల్లో మద్రాసొచ్చేసి ఉద్యోగంలో చేరిపోయాడు కామేశం. నెలరోజులు పూర్తిగాకుండానే కల్యాణిమీద భ్రమకల్గి సెలవడిగితే "ఇవ్వడానికి వీల్లేదు" అన్నాడు ఆఫీసు మేనేజర్.

కొన్నాళ్ళు జరిగాక కల్యాణిద్వారా అత్తయ్యకు బ్లడ్ప్రెషర్ వచ్చిందనితెలుసు కొని, ఈవంకతో ఊరెళ్లాలని మళ్ళీ సెలవు కోసం దేబిరిస్తే "ఆర్నెల్లుసర్వీసన్నా పూర్తి కాకుండా సెలవడిగితే చావబాత్తాను" అని కేకలేశాడు మేనేజర్.

విరహగీతాలు పాడుకుంటూ ఏడ్చేశాడు కాముడు.

ఇక ధైర్యంచేసి, కల్యాణి కాపురానికి పంపించే విషయం ఆలోచించవలసిందిగా

మామయ్యకు, జగదాంబకు, కల్యాణికీకూడా ఉత్తరాలు కురిపించడం మొదలెట్టాడు.

ఇదిగో అదుగో అంటూ మూణ్ణెల్లు జరిగాక, జగదాంబదగ్గర్నుంచి వుత్తరం వచ్చింది. "ఫలానా రోజున కల్యాణిని కాపురానికి తీసుకుని వస్తున్నాను" అని.

కల్యాణితోబాటు తన తల్లికూడా వస్తుందని విన్న కాముడు కొంచెం బాధపడ్డాడు. అందుకని—

"అమ్మా! నువ్వు రాసిన వుత్తరం అందింది. నువ్వుకూడా కల్యాణితోబాటు రావడం నాకు చాలా యిష్టమేగానీ, ఇక్కడ నీ మడికీ, ఆచారాలకూ మహాఇబ్బందిపడి పోతావేమోనని మహాబెంగపడిపోతున్నాను. ఇక్కడ రాముడువారి పత్రాలు దొరకవు. దొరికినా దీపారాధన చేసుకునేందుకు వత్తులుగానీ, పత్తిగానీ అసలే దొరకవు. పైగా నువ్వు శనివారవ్రిండీ. ఏకాదశిపిండీ విసురుకోడానికి తిరుగళ్ళు బొత్తిగా లేవు. కాబట్టి ఇవన్నీ సమకూరిన తర్వాత తప్పకుండా వద్దువుగాన్లే" అని తిరుగుటపాలో ఉత్తరం రాశాడు తల్లికి.

కాపురం పెట్టడానికి అతని స్తోమతకు ఒక్కటే గది దొరికింది పదిహేనురూపాయలకి. మరి తనూ కల్యాణీకాక మూడో మనిషుంటే ఏం బాగుంటుంది చెప్పండి. అంతే కారణం. ఇంకేంలేదు.

ఆ వుత్తరానికి తిరుగుటపాలో జవాబొచ్చింది.

"మడీ ఆచారాలు, అన్నీ సరిపెట్టుకుంటాను" అని రాసింది జగదాంబ.

తలే మండిపోయింది కాముడికి.

"ప్రియమైన తల్లిగారూ, మీరు కనుక ఇక్కడికొస్తే అక్కడ మామయ్య, అత్తయ్య బెంబేలు పడిపోతారు. అసలే అత్తయ్యకు బ్లడ్‌ప్రెషర్‌కూడానాయె. మీరు మామయ్యకు తోడుగావుండి అత్తయ్యనీ ఇంటినీ వెయ్యి కళ్ళతో కాపాడవలసింది. వాళ్ళు మనకింత సాయం చెయ్యగా మీరా మాత్రం త్యాగం చెయ్యలేరా! నన్ను ఇవాళ కాకపోతే రేపు చూస్తారు. నేనెక్కడికి పోతాను. మీరెక్కడికి పోతారు." అంటూ మళ్ళీ జవాబు రాశాడు.

దానికి మళ్ళీ సమాధానం రాలేదు.

ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాంమాత్రం వచ్చింది. 'కల్యాణి మెయిల్లో వస్తోంది స్టేషన్లో దింపుకోవలసిందీ' అని

● ● ●

కాసేపు ఉత్తరాలన్నీ చదివేసి వీధిలో పడ్డాడు. అప్పటికే టైం ఏడుగంటలైంది.


నెమ్మదిగా కల్యాణిరాగం ఆలపించుకుంటూ అలా బజార్లో నడవడం మొదలు పెట్టాడు. "ఏమోయ్! కామేశం!" అని తన వెనకాలనుంచి వినబడింది. తిరిగి చూశాడు. వాళ్ళ హెడ్‌గుమాస్తా! సతీసమేతుడై. చేతిలో ఒక గుడ్డల ప్యాకెట్‌తో తనని సమీపిస్తున్నాడు.

"నమస్కారం సార్!" అన్నాడు కాముడు.

"అలా చెప్పకుండా చెయ్యకుండా ఆఫీసునుంచి వచ్చేశావేమోయ్! పైగా మధ్యాన్నం రిజిస్టర్డ్ పోస్టులో వచ్చిన కాగితానికి వెంటనే జవాబిమ్మని చెప్పాను గదా.... అది పుటప్‌చెయ్యకుండా పారిపోయొచ్చావ్ ఏమిటి నీ వుద్దేశం?" గర్జించి పారేస్తున్నాడు హెడ్‌గుమాస్తా.

"అదికాదు సార్.... నా వైఫూ...." లాగుతున్నాడు కాముడు.

"ఏమిటోయ్? వైపు? నాకు లేదేమిటి వైపు?" మరింత దబాయిస్తున్నాడు హెడ్‌గుమాస్తా తన భార్యవంక చూస్తూ.



"కాదండీ.... రేపు మెయిల్లో...." మళ్ళీ కాముడు.

"ఆఁ! ఇవాళ మెయిల్లో వచ్చిన కాగితాన్నింత గొప్పగా తగలెట్టావు.... ఇహ రేపు మెయిల్లో వచ్చేవాటిని నిర్వాకంచేస్తావ్? నీ మూలంగా మేనేజర్ తిట్లు నాకు తగిలాయి."

"సారీ సార్; రేపు వుదయం"

"ఆఁ! ఇకా రేప్పొద్దునదాకా మురగబెట్టా ఆ కాగితాన్ని! నేనే తగలేశాలే! ఇంకెపుడూ ఇలాటి పన్లు చెయ్యకు" వార్నింగ్ ఇస్తున్నాడు గుమాస్తా.

"లేదు సార్! చెయ్యనుసార్? ఎక్స్యూజ్‌మీ! నాసంగతి చెప్పనీండిసార్! నన్ను మాట్లాడనీండిసార్" ప్రాధేయ పడ్డాడు కాముడు.

"సరే; ఏమిటో మాట్లాడునాయనా!" విసుక్కున్నాడు గుమాస్తా.

"రేపు మార్నింగ్. చీకటితో నాభార్య.... అదే నా వైఫ్ వస్తోంది మెయిల్లో"

"ఆఁహా! అయిందీ! రేపటినుంచీ సముద్రంలో దిగబోతున్నావన్నమాట!" అంటూ జోకేసి నెమ్మదిగా పెళ్ళాంవంక తిరిగాడు నవ్వుతూ.

ఆవిడ వ్వటికే కళ్ళు రెండూ ఎరుపు రంగుకు మార్చేసింది.

"వస్తానోయ్!" అంటూ వెళ్ళిపోయాడు హెడ్‌గుమాస్తా, సతీసమేతుడై.

బిక్కమొహం పెట్టాడు కామేశం. కాసేపటికి తేరుకుని "మీ మొహం! పోండి సార్!" అనుకున్నాడు!

ఆ రాత్రి గడియారం దారుణమైన నెమ్మదిగా తిరిగి తిరిగి నాలుగు గంటలు చూపించింది.

ఝామ్మంటూ అయిదు గంటలకల్లా స్టేషన్‌లో కాలెట్టాడు కాముడు.

ఎదురుగుండా బోర్డుమీద "హౌరా మద్రాస్ మెయిల్ 101 నిముషాలు లేటు" చూసి "చచ్చితి" అనుకున్నాడు "గోవిందః" అనుకున్నాడు. "నా ఖర్మ!" అని నుదుటి మీద కొట్టుకున్నాడు.

తలకిందులుగా నుంచుని చూశాడు. అయినా 101 మారలేదు.

ఇన్ని డైలాగులు చెప్పి, ఇంత ఏక్షను చేసినా రైల్వేవాళ్ళెవళ్ళూ బోర్డు మీద రాసింది సరిదిద్దలేదు. ఈ రాతని గురించి ఎంక్వయిరీలో కనుక్కున్నా వాళ్ళు తమది పొరపాటనీ అనలేదు. క్షమించమని అడగనూలేదు. తన ఇష్టదైవాన్ని కాసేపు తిట్టుకుని, అలసిపోయి, కాఫీతాగి, సిగరెట్లు పీల్చి, తాంబూలం వేసుకొని, స్టేషన్ ప్లానంతా బాగా పరిశీలించి మెయిలిక ఐదు నిముషాల్లో వస్తుందని మైక్‌ద్వారా విని మైక్‌లో చెప్పినవాడి కంఠం అచ్చు రఫీ కంఠమేననుకుంటూ తన ఇష్టదైవాన్ని స్తుతించి, కల్యాణిరాగం ఆలాపిస్తూ ప్లాటుఫారంమీదకు పరుగెత్తాడు.

మెయిలొచ్చి ఆగింది. ఇంజన్‌దగ్గర్నుంచే కల్యాణికోసం వెదకడం మొదలు పెట్టాడు. అయిదుపెట్టెలు దాటాక "అదిగో కల్యాణి!" అనుకుంటూ ఎదురుగెత్తి అటు తిరిగివున్న "కల్యాణిపై" చెయ్యేశాడు.

"కల్యాణి" తలకాయ యిటు తిరిగింది. కాముడి తలకాయ గిరగిరాతిరిగింది. దేహం మార్గశిర మాసంలో తెల్లారఝామున బావి దగ్గర స్నానం చేసినట్లు వణికింది.

"సారీ! యు ఆర్ మై వైఫ్ ...ఐ తాట్" అంటూపరుగెత్తుకుంటుండగా ఆ అమ్మాయి బిత్తరపోయి చూస్తోంది.

జరిగిన పొరపాటుకు పెద్దపెద్ద తిట్లు తిట్టుకుని, మరోసారలా జరక్కుండా జాగ్రత్తగా ముఖాల్ని పరిశీలిస్తూ మొత్తం మీద కల్యాణిని గుర్తుపట్టాడు - బ్రహ్మానంద పడ్డాడు కాముడు. అప్పుడే చిన్న 'కల' వస్తానని మారాం చేసింది.

"ఇదేమిటి? నాన్సెన్స్. ఇంతమంది జనం వుండగా నువ్వురావడమేమిటి? బుద్ధి లేదూ నీకు?" అంటూ కసురుకున్నాడు.

'కల' చిన్నబుచ్చుకుంది.

"సర్లే! ఏడవకు! సాయంత్రం మా ఇంటికిరా; నేనూ కల్యాణీ నీకోసం కాచుకుంటాం! మర్చిపోకుమళ్ళీ" అంటూ కలకు ధైర్యం చెప్పారు. 'కల' వెళ్ళిపోయింది.

కల్యాణినీ, పెట్టెనీ, సామాన్ల సంచినీ, తాటాకు బుట్టనీ గబగబా దింపేసి, పోర్టర్లని పిల్చి వాళ్ళ నెత్తికెక్కించి తనూ కల్యాణీ బయల్దేరబోతుండగా అంతవరకూ కల్యాణి వెనక మూగగా నిలబడివున్న అమ్మాయి వాళ్ళ వెంటపడడమే కాకుండా, తన చేతిసంచీ కూడా పోర్టరుచేతి కిచ్చి, "ఎంత దూరముంటుందక్కయ్యా మనిల్లు?" అంది కల్యాణితో.

"నాకు మాత్రమేం తెలుసు!" అంది కల్యాణి.

మతిపోయిన కాముడు "ఈ పాపెవరూ?" అన్నాడు.

"అదేమిటండీ! పదిహేనేళ్ళ అమ్మాయిని పట్టుకొని 'పాప' అంటారు!

"మనూళ్ళో సూరిపంతులుగారని తెలుగు మాస్టారొచ్చారు కొత్తగా. వాళ్ళమ్మాయి. వీళ్ళ అన్నగారు ఈ వూళ్లో వుంటున్నారట పదినెల్లనుంచీ వాళ్ళింటికెళ్ళాలని సర్దాపడి అప్పటికప్పుడు బయల్దేరి నా వెంట వచ్చింది. అడ్రసూ అదీ వుందిలెండి. సాయంత్రం ఆక్కడికి పంపించాలి మీరు" అంది కల్యాణి. "సాయంత్రందాకా

ఎందుకూ? ఇప్పుడే పంపించేద్దాం. పాపం వాళ్ళన్నయ్యను చూడాలని ఎంత ఇదై పోతోందో! ఏమ్మా!" అంటూ ఆ అమ్మాయివంక చూశాడు.

ఆపిల్లకేం మాట్లాడో తెలియలేదుగాబోలు కల్యాణివంక చూసింది. కల్యాణే అందుకుంది. "కాదులెండి! కాస్త మనిల్లుకూడా చూసి, యీపూట మనింట్లో భోంచేస్తుంది. చల్లబడ్డాక వాళ్ళన్నయ్యగారింటికి...."

"ఆ! ఈరోజుల్లో ప్రత్యేకం చల్లబడ్డం ఏమిట్లే! వర్షాకాలం కూడాను. అదికాదు నాపాయింటు. సాయంత్రం వర్షం వస్తుందో ఏమిటో ..." అంటూ తలగోక్కున్నాడు కాముడు.

"అంతకీవర్షమొస్తే మనింట్లోనే వుంటుంది తగ్గాక వెళ్ళిపోతుంది. ఏమిటి దానికి పెద్ద గొడవ చేస్తారు?" అంది కల్యాణి.

తాడెత్తున కోపమొచ్చింది కాముడికి ఎవరిమీద? ఆ పిల్లమీద! అక్కడికక్కడే బుగ్గలు వాయగొడదామనుకున్నాడు కాని తగ్గాడు మళ్ళీ. తగ్గి— "నీ పేరేమిటి తల్లీ" అని కరిచినట్టడిగాడు.

ఆ పిల్ల సమాధానం చెప్పలా.

"కుముదమండీ" అంది కల్యాణి

"ఏమిటీ! అముదమా!" అన్నాడు కసిగా.

కుముదం ఫక్కున నవ్వింది. కాముడికి చెవుడనుకుందో .... లేక వఠి పిచ్చివాడనుకుందో!

టాక్సీలో ముగ్గురూ ఇంటికి చేరారు.

"ఈ అముదాన్ని వదిలించుకోవడమెలా?" అనే సమస్యను శతవిధాల పరిష్కరించబోయి, ఎటూ తేలక ఏడ్వబోయి, మానేసి, కాఫీతాగి, జ్వరమొచ్చిందనీ, రెండు రోజులు సెలవు కావాలనీ సెలవుచీటీ రాసి మరో గుమాస్తాద్వారా పంపించి, ఇంటికొచ్చి అముదాన్ని చూసి అసహ్యించుకుంటూ పడుకున్నాడు. ఆ రోజు మ్యాటినీకెళ్ళాలనీ, సాయంత్రం వుడ్‌లాండ్సులో తనూ కల్యాణీ కలసి భోంచెయ్యాలనీ, ఆ తర్వాత ఇంటికొచ్చి కల్యాణితో కబుర్లు చెప్పాలని కలలుకంటే "ఏమిటీ కర్మ! కల్యాణికూడా ఆ కుముదాన్నే పూసుకు తిరుగుతుందే" అనుకున్నాడు.

కల్యాణి వంటచేసి కాముణ్ణి ఆహ్వానించింది. ముగ్గురూ ఒకేసారి భోజనానికి కూచున్నారు.

మొత్తంమీద సాయంత్రం మూడుగంటలైంది.

"కల్యాణీ! టాక్సీతీసుకురానా?" అన్నాడు హుషారుగా.

"ఉండండీ తొందరపడతారేమిటి? కుముదం ఫస్టుక్లాసుగా పాడుతుంది. కాసేపు విందాం! మీరూ కూర్చోండి పాడవే కుముదం" అని కుముదాన్ని ప్రోత్సహిస్తోంది.

చప్పబడ్డాడు కాముడు. కాసేపట్లో తేరుకుని —

"మరిత్వరగా పాడెయ్యమ్మా అముదం! మీ అన్నయ్య దగ్గరకి చిన్న కార్లో తీసికెళ్తా! ఊ! అర్జెంట్! ఒకే ఒక్కపాట చాలు!" అంటూ కూర్చున్నాడు.

కుముదం పాట మొదలెట్టి, వరసగా రెండు సినిమాల్లో పాటలు పూర్తిగా పాడింది.

జోరున వర్షమొచ్చింది ఉరుములు మెరుపులతో.

"మీ మాటే ఖాయమైందండీ!" అంది కల్యాణి నవ్వుతూ

"నీ మాటా ఖాయ మైనట్లేగా" అన్నాడు కాము దేడుస్తూ.

సాయంత్రం ఆరు గంటలయినా వర్షం పూర్తిగా తగ్గలేదు 'టీ'కాచింది కల్యాణి. 'వద్దు మొర్రో' అంటున్నా కుముదంచేత కూడా తాగించింది తత్ఫలితంగా కుముదం తెల్లవార్లూ మేలుక్కూచుంది

కాముడూ, కల్యాణికూడా ఆ అమ్మాయితో బాటే అయ్యారు.

సూర్యోదయం అయ్యేసరికి టాక్సీ తెచ్చాడు కాముడు కుముదాన్ని తీసుకుని వాళ్ళన్నగారింటి కెళ్తే ఆ యిల్లు తాళం వేసుంది. పక్కవాళ్ళను కనుక్కుంటే "నిన్న మధ్యాన్నం 12 గంటలకు బయల్దేరి తిరుపతెళ్ళారు; ఇవాళ మొక్కుబళ్ళు తీర్చుకుని, రేపంతా కొండమీదే వుండి, ఎల్లుండి పొద్దున్నే వస్తారు" అని చెప్పారు.

కుముదాన్ని తిట్టుకుంటూ మళ్ళీ ఇంటికి చేరాడు.

ఈసారి కల్యాణిమీదే కోపం వచ్చేసింది.

సెలవు దినాలు కాసినీ వృధా అయిపోయాయి కాముడికి. సోమవారం వచ్చింది. పొద్దున్నే కుముదాన్ని వాళ్ళన్నగారింటికి రవాణాచేశాడు. వాళ్ళూ అప్పుడే వచ్చారట! పరస్పర పరిచయాలు వగైరాల అనంతరం కాముడికి కాఫీ టిఫిన్లు ముట్టాయి. "అప్పుడప్పుడూ వస్తూండండి" అన్నారు వాళ్ళు.

"అలాగే" అని బయటపడ్డాడు కాముడు.

దార్లో మరో తన ఆఫీసు గుమాస్తా ఇంటికెళ్ళి "జ్వరం ఇంకా తగ్గలేదు! మరో రెండ్రోజులు సెలవిప్పించండి" అని సెలవు చీటీ రాసిచ్చి. తన వైఫ్ వచ్చిన సమాచారం. కొత్తకాపురం సమాచారం చాలా సర్దాగా ఆ గుమాస్తాకు చెప్పేసరికి "మరో రెండ్రోజులుకూడా సెలవుపెట్టండి కామేశ్వరరావుగారూ" అంటూ బతిమాలాడు గుమాస్తా. "పోన్లే. ఇంత బతిమాలుతున్నప్పుడు మనం కాదంటే ఏం బాగుంటుంద"ని మరో చీటీ రాసిచ్చి "థ్యాంక్స్" చెప్పి వెళ్ళిపోయాడు కాముడు.


తన ఇంట్లోకాలుపెట్టిన కాముడు 'శవీ'మని కొయ్యబారిపోయాడు.

"ఇదేమిట్రా నాన్నా ఇలా చిక్కిపోయావ్! బిడ్డకు సరైన తిండికూడా లేదు గావును! నీ కిష్టమని కొత్తావకాయకూడా తీసుకొచ్చాన్రా నాన్నా! వెధవది.... ఏమిటో మొన్న కల్యాణితో పంపిద్దామనుకుంటూనే మర్చిపోయాను. త్వరగాస్నానం చేసి రా నాన్నా; అన్నం వండిపెడతాను" అంటూ కాముణ్ణి ప్రేమతో నిమిరింది జగదాంబ.

"ఎప్పుడో! ఇంకెప్పుడో" అంటూ ఏడుపుమొఖం పెట్టాడు.

"ఇప్పుడే పెట్టేస్తానురా తండ్రీ! ఒక్క నిమిషం; ఇంక నీకేం భయంలేదు. శుభ్రమైన తిండి తిందువుగాని. అత్తయ్యక్కూడా కాస్త కులాసాగానే వుందా?....ఇంకిప్పట్లో నే నక్కడకి వెళ్ళనే వెళ్ళను. నీదగ్గరే ఉంటా! ఏడ్వకు! వచ్చేసన్నాని" అంటోంది జగదాంబ. చదికిలబడ్డాడు కామేశం — "లాభంలేదు! రెండు గదులున్న ఇల్లు చూడాల్సిందే" అని గొణుగుతూ. తలొంచుకుని నవ్వుకుంటూ బియ్యం ఏరుకుంటోంది కల్యాణి.

□□□



పంచాంగం పేజీలు తిరగవేస్తూ అప్పుడప్పుడు ఆత్రంగా లోనికిచూస్తున్నాడుజగన్నాధం.

"మామయ్యా...."

అంటూ వస్తున్న జ్యోతిని చూసి.

"ఏవమ్మా పురుడు వచ్చిందా" అని ఆత్రంగా అడిగాడు జగన్నాధం.

మామయ్య కంగారు చూసి మనస్సులోనే నవ్వుకుంది జ్యోతి.

తనకు తెలుసు. ఈ ఆత్రుత అంతా దేనికో! మగపిల్లవాడు కలిగాడేమో అని. ఇప్పుడు అసలు విషయం చెబితే?

మామయ్య గుండె ఆగిపోదూ?

"మగపిల్లవాడు కలిగాడు మామయ్యా" అంది నవ్వుతూ. ఆవార్త తనెందుకు చెప్పాలి అనుకుంది జ్యోతి.

"నక్షత్రం చాలా మంచిదమ్మా" అనుకుని మురిసిపోతున్నాడు జగన్నాధం.





"నాన్నా, నాన్నా! నా పందెమే నెగ్గింది. చెల్లాయి నా పోలికే" అంటూ పరుగెత్తుకుంటూ వచ్చింది ఎనిమిది సంవత్సరాల బాలిక కమల.

జగన్నాథం గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి. జ్యోతికేసి చూశాడు.

"క్షమించు మామయ్యా; అబద్ధం చెప్పాను ఆడపిల్ల పుట్టింది" అంది జ్యోతి తలవంచుకొని.

జగన్నాథం చేతిలోని పంచాంగం జారి క్రిందపడింది.

"నిన్ను దేనికి క్షమించటం వెర్రితల్లీ! నామీద భగవంతునికే దయలేదు. ఆయన చెలగాటానికి నాబోటి దరిద్రుడే దొరికాడు" అనుకొని నిట్టూర్చాడు జగన్నాథం.

మామయ్య అవస్థచూసి జాలిపడింది జ్యోతి.

"అమ్మా."

పిలిచాడు జగన్నాథం.

దగ్గరకు వెళ్ళింది జ్యోతి.

ఆప్యాయంగా తలనిమిరాడు.

"నేను నీచేత చాకిరీ చేయిస్తున్నానమ్మా. ఓర్పులో భూదేవతవు. నీ ఈడు పిల్లలతో కలసి ఆడుతూ, పాడుతూ స్కూలుకువెళ్ళి చదువుదామనే కోరిక నీకూ ఉంటుంది. కాని, ఈ మామయ్య నీకు యింటిచాకిరీ నప్పచెప్పాడు" అంటూ కళ్ళు తుడుచుకున్నాడు జగన్నాథం.

"ఛా. అదేమిటి మామయ్యా! అలా అంటావు? ఎవరింట్లో వాళ్ళు పనిచేసుకోవటం తప్పా ఏమిటి?

స్కూలుకు వెళ్ళకపోతేనేం? బావ నాకు చదువు చెబుతూనే ఉన్నాడుగా. డిగ్రీలు లేవుగాని యింగ్లీషు చక్కగా మాట్లాడగలను. సెలవులలో వచ్చినప్పుడల్లా బావ నాకు చెబుతూనే ఉన్నాడు లెక్కలూ, ఇంగ్లీషు. నీ వలా బాధపడకు మామయ్యా" అంది జ్యోతి.

"అల్పసంతోషివమ్మా. భగవంతుడు నిన్ను కాపాడతాడు" అంటూ ఆప్యాయంగా తల నిమిరాడు.

● ● ●

ఆ యింట్లో జ్యోతి లేనిదే ఒక్కక్షణం గడవదు. జగన్నాథం భార్య సీతమ్మ జబ్బు మనిషి. మధు పెద్దవాడు. తొలిచూలు అబ్బాయి. తరువాత నాల్గు కాన్పులు పోయాయి. తరువాత కమల. కమల తరువాత ఎనిమిది సంవత్సరాలకు మళ్లా ఇప్పుడు ఆడపిల్ల.

జగన్నాథం బట్టలకొట్టులో గుమాస్తా.

వచ్చే జీతపురాళ్ళు చాలవు. మందులు లేనిదే సీతమ్మ బ్రతకలేదు.

కమల పుట్టినదాకా జగన్నాథం తల్లి బ్రతికే ఉంది

కొమ్మ మారుతీదేవి

జగన్నాథం అప్పుల పాలవసాగాడు.

జగన్నాథానికి ఒక చెల్లెలుండేది. ఆమె కూతురే జ్యోతి.

జ్యోతికి చిన్నప్పుడే తల్లితండ్రులు కరువయ్యారు. జ్యోతి తల్లి చనిపోతూ,

జ్యోతిని మధుకిచ్చి పెళ్ళిచేయమని కోరింది.

మూడు తులాల బంగారం. వెయ్యి రూపాయిల రొఖ్ఖం యిచ్చింది. జగన్నాథం నిప్పులాంటి మనిషే కాని పరిస్థితుల ప్రభావంవల్ల బంగారం అమ్మివేసి డబ్బు వాడేసుకున్నాడు.

మెళ్ళో నల్లపట్టుత్రాడుతో కట్టిన ఆంజనేయునిబిళ్ళ తప్ప జ్యోతి వంటిమీద చిన్న మెత్తుబంగారం లేదు. ఆడపిల్లసొమ్ము వాడినందుకు ఎంతో బాధ పడుతూంటాడు జగన్నాథం జ్యోతికేసి చూసినప్పుడల్లా.

జ్యోతి అందమయిన పిల్ల.

బావ మధు అంటే ఆమె కెంతో ప్రేమ. మధుకు కూడా జ్యోతిపై చాలా యిష్టం. ఇంటి చాకిరీతో సతమతమవుతున్న జ్యోతిని చూస్తూంటే అతనికి ఎంతో బాధ కలిగేది.

మధు పట్నంలో యింజనీరు చదువుతున్నాడు. రెండు సంవత్సరాలు ఎలాగో పూర్తిఅయినాయి. మధును యింజనీరు చదివించడానికి మొదట్లో జగన్నాథం ఒప్పుకోలేదు.

"ఇప్పటికే అప్పులు తెస్తున్నాను. నేను పెద్దచదువులు చెప్పించలేను" అని మొర పెట్టుకున్నాడు జగన్నాథం. మధు ఉత్సాహం, జ్యోతి పట్టుదల, యజమాని రమణయ్య ప్రోత్సాహం-ఎలాగయితేనేం? అప్పుచేస్తూ చదువు చెప్పిస్తున్నాడు జగన్నాథం. డబ్బు అవసరం వచ్చినప్పుడల్లా తన యజమాని వద్దకేవెళ్ళి అప్పు తెచ్చుకునేవాడు జగన్నాథం. అడగ్గానే అప్పు యిస్తున్నందుకు రమణయ్యంటే ఎంతో గౌరవ మేర్పడింది జగన్నాథానికి.

దేవుడే నాకు రమణయ్యను చూపాడేమో అనుకునేవాడు. ఇంకొక్క మూడు సంవత్సరాలు ఓపికపడితే కొడుకే సంసారాన్ని ఆదుకుంటాడని తృప్తిచెందేవాడు.

సీతమ్మ ఆదొకమోస్తరు మనిషి ఆమె కెప్పుడూ రోగాలు, మందులు. మందులేనిదే రోజుగడవదు. ఇంట్లో అంత పనీ చేస్తున్నా జ్యోతిని కసురుకుంటూనే ఉండేది.

పోయిన ఏడాది సెలవలకు వచ్చినప్పుడు మధు బాగా మారిపోయాడు అతనికి ధన కాంక్ష పట్టుకుంది. తన స్నేహితులు ఖరీదైన బట్టలు ధరిస్తారని, తనకు కనీసం ఒక్క జతఅయినా లేదని, పదివేలు, ఎనిమిదివేలు కట్నం తీసుకుని వివాహాలు చేసుకుంటున్నారని అన్నాడు మధు.

జ్యోతి మనస్సు తల్లడిల్లింది. బావకూడా కట్నానికి ఆశపడి యింకొకపిల్లను వివాహం చేసుకోడుగదా? తనను వివాహమాడితే అప్పులు అప్పచెబుతుంది. తనతో ఈసారి అతను అంత చనువుగా మాట్లాడలేదు

మనసారా ప్రేమించిన బావ మరొకర్ని వివాహంచేసుకుంటుంటే తను చూడగలదా? భగవంతుడా ఏమిచేయదలచావు అంటూ వాపోయింది.

సీతమ్మకు పురుడు వచ్చాక బలహీనత ప్రారంభించింది.

నెత్తురులేక మనిషి తెల్లబడింది.

డాక్టరు పరీక్షించి, టి. బి. అని తేల్చేశాడు.

మందులు, యింజక్షన్లు వ్రాసియిస్తూ,

"ఇవి త్వరగా వాడాలి, ఆలస్యంచేస్తే ప్రమాదం. పళ్ళు కోడిగ్రుడ్లు బాగా తినకోవాలి" అన్నాడు.

జగన్నాథం గుండె గుభేలుమన్నది.

'గోరుచుట్టుపై రోకలిపోటా! అప్పు తెస్తున్నాను కాని ఒక్కపైసకూడా తీర్చలేకపోతున్నా భగవంతుడా! ఎంత అగ్నిపరీక్ష పెట్టావయ్యా? ఇప్పుడు కనీసం ఆరువందలైనా కావాలి. వడ్డీతో కలుపుకుని యిప్పటికి నాల్గువేలు అప్పుంది. యజమాని మంచివాడు కనుక అడిగినప్పుడల్లా తనకు సొమ్ము యిస్తున్నాడు. లేకపోతే తనకు ఆ అప్పుకూడా ముట్టదు.' అనుకొని బాధపడుతున్నాడు జగన్నాథం. చివరకు ఏమయితే అది అవుతుందని రమణయ్య వద్దకు వెళ్ళాడు.

"కూర్చోండి జగన్నాథంగారూ" అంటూ కుర్చీ చూపించాడు రమణయ్య.

"బాబూ! ఇప్పటికే మీ కెంతో ఋణపడివున్నాను. కనికరించండి బాబూ! పిల్లలుగలవాడిని. మా యింటిదానికి జబ్బుగాఉంది బాబూ! డాక్టరు పరీక్షించి టి. బి. అన్నాడు. సిగ్గువిడిచి అడుగుతున్నా. ఒక్క ఆరువందలు యిప్పించండి" అంటూ ప్రార్థించాడు జగన్నాథం.

"ఇప్పుడు మీకు డబ్బు అవసరం అంటారు. అంతేనా?" తాపీగా ప్రశ్నించాడు చుట్ట పొగ వదులుతూ రమణయ్య.

జగన్నాథం ఏమీ మాట్లాడలేదు.

"నే నొక సలహా చెబుతా వింటారా?" అన్నాడు రమణయ్య.

"చెప్పండి బాబూ" అన్నాడు ఆశతో జగన్నాథం.

"మీ అబ్బాయి మధుకు వివాహం చేసెయ్యండి" అన్నాడు నవ్వుతూ రమణయ్య.

"నేనే సంసారం ఈదలేక చస్తూఉంటే యింకా సంపాదనలేనివాడు వివాహం చేసుకుని ఏం సుఖపడ్తాడు బాబూ" అన్నాడు జగన్నాథం.

"మీరెంత అమాయకులండీ జగన్నాథంగారూ! యోగ్యుడు, తెలివయిన కుర్రవాడు, మీ మధుకు, మా జానకినిచ్చి పెళ్ళిచేస్తా. మీకు అంగీకారమేనా?

దాని తల్లిపోయినప్పట్నుంచి అల్లారుముద్దుగా పెంచుతున్నాను. సవతితల్లి బాధలు పెడుతుందేమోనని తిరిగి నేను వివాహం కూడా చేసుకోలేదు. మీకు తెలియనిదేముంది? స్కూలుఫైనలు ప్యాసయింది. పదివేలుకట్నమిస్తాను. పిల్లపేర అయిదెకరాల పొలం వ్రాసి యిస్తాను. వంటిమీద అయిదారు వేలు ఖరీదుగల బంగారం ఉంది. మీకు డబ్బు అవసరం. మీరు నా బాకీ కూడా తీర్చనక్కరలేదు." అన్నాడు రమణయ్య.

● నూజివీడు స్టేషనులోదిగిన ఆసామి :

"ఇక్కడికి నూజివీడు ఎంతదూరం?"

"పదమూడు మైళ్ళు."

"అబ్బో. స్టేషను ఇంతదూరంలో ఎందుకు కట్టారో?

"పట్నాలకి దగ్గిరగా వుంటుందని."

జగన్నాథానికి భూమికంపించినట్లయింది.

"బాబూ, మా మేనకోడలు జ్యోతి, మధు అన్యోన్యంగా ఉంటారు. ఆ అమాయకురాలు వాడిని నమ్ముకొంది. వారిద్దరి ప్రేమను నాశనం చేయలేను. అయినా, నా చెల్లెలికి చనిపోతున్నప్పుడు మాట యిచ్చాను జ్యోతిని మధుకిచ్చి వివాహం చేస్తానని" అన్నాడు భయంగా జగన్నాథం.

"మీరు యింకా పాతరోజుల్లో ఉన్నారు జగన్నాథంగారూ! అయినా ఆలోచించండి. జ్యోతి నాకు తెలుసు. మంచిపిల్ల. ఆ అమ్మాయి వివాహానికి రెండువేలు యిస్తా. ఇంకో సంబంధం చూసి పెళ్ళిచేయండి.

అల్లా వీల్లేదు అంటారా, మీ ఉద్యోగానికి సెళ్ళవదులుకుని, నా బాకీ తీర్చండి" అన్నాడు ఖచ్చితంగా రమణయ్య.

జగన్నాథానికి ఏమీ తోచలేదు. బావే తన భర్త అని ఆశలుపెట్టుకున్న జ్యోతిని విచారసముద్రంలో ముంచివేయనా? ఆమె ఆశ నిరాశ చేయనా? ఆడపిల్ల సొమ్ము కూడా తిన్న పాతకుణ్ణి దేవుడా? అసలు నీవు ఉన్నావా? ఉంటే నాకు చావు ఎందుకు రాసిపెట్టలేదు? నన్నిప్పుడే చంపు. చిత్రవధ చేయకు. రమణయ్య చెప్పినట్టు వప్పుకోకపోతే తను సర్వనాశనం కాక తప్పదు అనుకొంటూ లేచాడు జగన్నాథం

"మరి నాకు ఏసంగతి ఆలోచించి రేపు చెబుతారుగదూ? నెమ్మదిగా ఆలోచించండి తొందరలేదు" అన్నాడు రమణయ్య.

● ● ●

తలను చేతితో పట్టుకుని ఉసూరుమంటూ కూలబడిన జగన్నాథాన్ని చూసి అప్పుపుట్ట లేదనుకుంది సీతమ్మ.

"ఏమండీ? రమణయ్య ఏమన్నాడు?" ఉండబట్టలేక అడిగివేసింది సీతమ్మ.

"చెబుతా కానీ, జ్యోతి ఏదీ" అని అడిగాడు జగన్నాథం.

"ఏం, గుళ్ళోకివెళ్ళింది" అంది సీతమ్మ.

జరిగినదంతా చెప్పేశాడు జగన్నాథం.

"అవును. రమణయ్య చక్కగా చెప్పాడు; అలాచేస్తే ఏ బాధలు ఉండవు" అంది సంతోషంగా సీతమ్మ.

"ఏమిటే నీ వనేదీ? పాపం జ్యోతి సంగతి ఆలోచించావా? డబ్బుకోసం బిడ్డను అమ్ముకుంటామా?" అన్నాడు కోపంతో జగన్నాథం.

"బిడ్డను అమ్ముకోవటమేమిటి? పిచ్చి వారు కాకపోతే ఏమిటా మాటలు? కట్నాలు ఈనాడే ఉన్నవి కావు. ఏనాటినుంచో ఉన్నాయి. మీరుమాత్రం అప్పట్లో కొద్దో గొప్పో కట్నంతీసుకోలేదా? మీరూ అమ్ముడుపోయినట్లేనా? రమణయ్య అన్నట్లు జ్యోతికికూడా యింకో సంబంధం చూసి పెళ్ళిచేసేద్దాం" అంది సీతమ్మ.

"మధు ఈ పెళ్ళికి యిష్టపడడు జ్యోతి కెంత ద్రోహంచేస్తున్నామో ఆలోచించు" అన్నాడు జగన్నాథం.

"సిరి రా మోకాలడ్డు వారెవరండీ? మీరు ఊరుకోండి. నేను నచ్చచెప్తాను వాడికి నా మాటకు ఎదురుచెప్పలేడు వాడు. రెండు రోజులు బాధపడతాడు. ఊరుకుంటాడు. లేదా? నేనీ భయంకర రోగంతో జీవించడం కంటె ఏ నుయ్యో, గొయ్యో చూసుకుంటే మేలు. చేతికందిన అదృష్టాన్ని జారవిడువకూడదు. మీ రేమీ కలుగ చేసుకోకండి" అంది నిశ్చలంగా సీతమ్మ.

జగన్నాథం ఏమీ మాట్లాడలేకపోయాడు. ఒక అమాయకురాలి ప్రేమను కూకటి వేళ్ళతో పెల్లగించివేస్తున్నానే అని లోలోపల కుమిలి, కుమిలి ఏడ్చాడు.

బయటనుంచి యిదంతా వింది జ్యోతి.

ఆమె గుండెలలో శతఘ్నులు ప్రేలాయి.

తనవల్ల ఎంతమంది బాధపడుతున్నారు? తనుంటే వాళ్ళకు ఏం లాభం? నిజమే బావ తేంలోటు? బోలెడు కట్నం వస్తుంది.

బావ ఈమధ్య మారిపోయాడు కూడా. తను వాళ్ళకు బాధ కలుగచేస్తోందేమో. తను తొలగిపోవాలి. తను లేకపోతే వాళ్ళెంతో సుఖపడతారు. కాని తను ఎక్కడకు వెడుతుంది? యౌవనంలో వున్న తనను ఈపాడు ప్రపంచం బ్రతకనిస్తుందా?

● ● ●

ప్రకృతి ప్రళయతాండవ మాడుతోందా అన్నట్లు భీకరమయిన తుఫాను. అమావాస్య చీకటి నలుదెసల క్రమ్ముకొంది. వాతావరణం భయంకరంగా ఉంది.

డాక్టర్ రమేష్ పొరుగూరులో స్నేహితుని పెళ్ళిచూసి తిరిగి తన ఊరు వెడుతున్నాడు. ఏ చెట్టు అయినా విరిగి దారికి అడ్డంగా పడుతుందేమో ననే భయంవల్ల వేగంగా తోలుతున్నాడు కారు. కళ్ళు మిరిమిట్లుగొలిపేలా ఒక్క మెరుపుమెరిసింది. ఆ మెరుపులో ఒక దృశ్యం రమేష్ కంట పడింది. అతని ఒళ్ళు జలదరించింది. దూరాన రైలుకూత పెట్టింది.

రైలుపట్టాలకు అడ్డంగా ఎవరో పడి ఉన్నారు. పరుగెత్తాడు. ఆ వ్యక్తిని భుజాల మీద వేసుకున్నాడో లేదో గూడ్సు బండి వెళ్ళిపోయింది.

అమ్మయ్య అనుకున్నాడు రమేష్. అతని గుండెదడ కొంచెం తగ్గింది. ఆమె ముక్కు వద్ద చేయిపెట్టాడు. శ్వాస ఆడుతోంది. పర్వాలేదు స్పృహ తప్పింది. అంతే అనుకుని తృప్తిపడ్డాడు.

● ● ●

జ్యోతి నెమ్మదిగా కళ్ళుతెరచింది. తను ఎక్కడుంది? నలుప్రక్కలా చూచింది.

"ఎవమ్మా ఎలాగుంది" అంటూ ఆప్యాయంగా తల నిమురుతున్న ఆమె కేసి చూచింది జ్యోతి.

"కాఫీ తీసుకోండి" అంటూ అందించాడు రమేష్. "నన్నెందుకు బ్రతికించారు?" అంది ఏడుస్తూ జ్యోతి.

"పిచ్చిపిల్లా, ఆత్మహత్య మహాపాతకం. అయినా చావు బ్రతుకులు మనచేతిలో లేవమ్మా? అంతా ఈశ్వరేచ్ఛ నీవిక్కడ సుఖంగా ఉండచ్చు" అంది ఆవిడ, రమేష్ తల్లి అహల్యాబాయి

● ● ●

అహల్య ప్రేమ తల్లిప్రేమనే మరపిస్తోంది. వాళ్ళు చాలా భాగ్యవంతులనీ, రమేష్ పేరుమోసిన డాక్టరనీ బీదలకు ఉచితంగా వైద్యం చేస్తాడనీ, అందరిమంచి సంపాదించుకున్నాడని తెలుసుకుంది జ్యోతి.

అహల్య జ్యోతిని ఎంతో ప్రేమగా చూచుకొంటోంది. ఆమె వద్దన్నా వినక జ్యోతి ఆపనీ, యీపనీ కల్పించుకు చేసేది.

● ఒకడు: "నేను రోజుకు రెండుసార్లు గీస్తాను. మీరు?"

రెండోవాడు: "నలభై యాభైసార్లు."

మొదటివాడు: "అయ్యబాబోయ్. ఎందుకు?"

రెండోవాడు: "నేను మంగలిని."

రమేష్ దిగులుగా ఉంటాడు. ఏదో చెప్ప లేని బాధ ననుభవిస్తున్నట్లు ఉంటాడు. అహల్యకూడా అప్పుడప్పుడు ఏదో బాధ పడుతుండేది. జ్యోతి తెలుసుకుందామని ఎన్నోసార్లు ప్రయత్నంచేసేది కాని. తాను వారి కుటుంబ విషయాలపట్ల ఆసక్తి చూపడం ఉచితం కాదనుకుని ఊరుకునేది.

రమేష్ అంటే జ్యోతి కెంతో గౌరవ భావం కలిగింది. అతను తనంటే దూరంగా తొలుగుతాడు. వెకిలివేషాలు వేయడు. ఈ రోజుల్లో ఇలాంటి వారుండటం అరుదు అనుకుంది జ్యోతి తనను గురించి వారేమీ అడగలేదు. తనను అక్కడే ఉండమని అహల్య పట్టుపట్టింది. తానుమాత్రం ఎక్కడకు వెళ్తుంది? అక్కడే ఉండి పోయింది జ్యోతి.

ఆరుమాసాలు గడచిపోయాయి.

"అమ్మా ఇంకా అట్లాగే కూర్చొన్నారే!" పూజవేళవలేదూ? పూజకు అన్నీ సిద్ధం చేశానమ్మా" అంది జ్యోతి అహల్యతో.

"ఎందుకమ్మా పూజలు? ఎన్నిచేసినా ఏముంది ఫలితం?" అంది నిట్టూరుస్తూ అహల్య.

"ఒకరి బాధలు మరొకరికి చెప్పుకుంటే హృదయం తేలికవడ్తుంది. మీ బాధ ఏమిటో చెప్పండమ్మా" అని అడిగింది జ్యోతి.

"నాకు ఒక మేనకోడ లుండేది. పేరు నిర్మల. తెలివయినది. అందమయినది. దురదృష్టవంతురాలు. చిన్ననాడే తల్లితండ్రులను పోగొట్టుకుంది. నా దగ్గరే పెరిగేది. నిర్మల, రమేష్ ఎంతో అన్యోన్యంగా ఉండేవారు.

డాక్టరు చదువుకు అబ్బాయి పట్నం వెళ్ళి పోయాడు. మూడు సంవత్సరాలు గడిచాయి. అబ్బాయి పెళ్ళి చేసేద్దామనుకున్నాను కాని అబ్బాయి రమేష్ ఆఖరుసంవత్సరంలో చేసుకుంటాను. అప్పటికి నాచదువు పూర్తి అవుతుంది అన్నాడు

భగవంతుడు ఓర్వలేకపోయాడు.

హఠాత్తుగా జబ్బుచేసి నిర్మల శాశ్వతంగా కన్ను మూసింది. అబ్బాయి ఆమె శవాన్ని కూడా చూడలేదు. రమేష్ వచ్చేటప్పటికే ఆమె బూడిదయిపోయింది." అహల్య కళ్ళు తుడుచుకుంది.

"అప్పట్నుంచి రమేష్ అదోలా అయి పోయాడు.

ఎన్నిసార్లో చెప్పాను పెళ్ళిచేసుకోమని. కాని వాడు యిష్టపడటంలేదు. మహాలక్ష్మిలా నట్టింట్లో కోడలు మసులుతుందనీ. మనుమల అల్లరి చూడాలని అందరిలాగా నాకూ కోరిక ఉంటుంది. ఎప్పటికయినా భగవంతుడు తీరుస్తాడో? లేదో?

విచిత్రం ఏమిటంటే మా నిర్మల నీలాగే ఉంటుంది.

నిర్మల పోలికలు నీలో చాలావున్నాయి అన్నాడు రమేష్ రెండు. మూడుసార్లు" అంది అహల్య.

జ్యోతికూడా తన సంగతి చెప్పివేసింది.

"ఇన్నాళ్ళు నీవు చెప్పనూలేదు నేను అడగనూలేదు. 30, 40 వేలు నాకు లెక్కలోనివి కావు. ఓ ఆడపిల్లకు పెళ్ళి చేశాను గదా అని సంతోషిస్తాను. చెప్పమ్మా మీ యింటి అడ్రసు. మీ మామయ్యపేరు. వెళ్ళి అక్కడ పరిస్థితులు తెలుసుకు వస్తా" అంది అహల్య.

ఆమె విశాల హృదయానికి మనసులోనే జోహారు అర్పించింది.

"వద్దమ్మా. జరుగవలసినది జరిగిపోయింది" అంది జ్యోతి.



"అంటే? అప్పుడే వివాహం జరిగి ఉండవచ్చుననా నీ ఊహ?" అంది అహల్య.

"వివాహం అయిపోయిందమ్మా. మూడు నెలలక్రిందట నేను వాళ్ళ పెళ్ళి ఫొటో పేపర్లో చూశాను.

"పోనీలెండమ్మా వారి కష్టాలు గట్టెక్కాయి. నా కదే ఆనందం" అంది జ్యోతి.

"అమ్మా జ్యోతి నీవేమి అనుకోకుండా ఉంటే ఒక్కమాట చెపుతా వింటావా? అంది అహల్య.

"చెప్పండమ్మా. మీ కన్న నా కెవరున్నారు ఈ లోకంలో. చనిపోతున్నదానిని రక్షించారు. ఆదరించారు. చెప్పండమ్మా" అంది జ్యోతి.

"జ్యోతీ!"

రమేష్ బాధను నీవైనా తొలగించడానికి ప్రయత్నం చేస్తావని ఆశిస్తున్నాను. శూన్యమైన ఈ యింటిలో నువ్వు జ్యోతివయి ప్రకాశించు. ఇంతకన్నా నేనేమి చెప్పగలను? అంది అహల్య.

"తప్పక ప్రయత్నిస్తానమ్మా కాని నేను పేదదాన్ని" అంది జ్యోతి.

● ● ●

పౌర్ణమిచంద్రుడు పదహారు కళలతో ప్రకాశిస్తున్నాడు. విరియబోసిన విరజాజులు, నైట్‌క్వీను పరిమళాలను వెదజల్లుతున్నాయి. రేడియోలో ఏదో పాట మధురంగా వినిస్తోంది. రమేష్ గదిలోనికి పాలగ్లాసుతో వచ్చింది జ్యోతి.

"పాలు తీసుకోండి"....

జ్యోతి మాటవిని పుస్తకం చదువుతున్న రమేష్ తలయెత్తి ఆశ్చర్యంగా చూశాడు

జ్యోతి తనతో ఎప్పుడూ మాట్లాడలేదు. పాలుపెట్టేసి వెళ్ళిపోతూ ఉండేది. జ్యోతి యింకా అక్కడే నిలబడడం చూసి ఆశ్చర్య పోయాడు రమేష్.

"నిలబడ్డారే. కూర్చోండి" అన్నాడు రమేష్. ఏమని చెప్పేది? ఎట్లా మాట్లాడేది, అనుకుని తికమకపడింది జ్యోతి. ఆఖరికి సాహసించి.

"చనువు తీసుకుని అంటూన్నందుకు మీరు ఏమి అనుకోవద్దు. పెద్దావిడ, అమ్మగారి కోరిక తీర్చండి. మీరు వివాహం చేసుకోండి" అంది జ్యోతి.

నవ్వి అన్నాడు రమేష్ "మీకు అమ్మ, నిర్మల విషయం చెప్పిఉండవచ్చు. నిర్మల పోలికలు ఉన్న యువతి నాకు కనుపించటం లేదు."

"నిర్మల పోలికగల అమ్మాయిఉంటే వివాహం చేసుకుంటారా" అని అడిగింది జ్యోతి.

"తప్పక చేసుకుంటా కాని, ఆ అమ్మాయికి నేను నచ్చవద్దూ" అన్నాడు నవ్వుతూ రమేష్.

జ్యోతి మాట్లాడలేదు. చిరునవ్వు నవ్వింది.

"మీ సంగతి నాకు అమ్మ చెప్పింది మీరు యిక్కడకు వచ్చిన వెంటనే చెప్పివేస్తే అమ్మ తప్పక మీ బావగారితో మీ వివాహం జరిపించిఉండేది" అన్నాడు రమేష్

"అవన్నీ మరచిపోవటం మంచిది. ఆ జన్మ వేరు, నాకు మీరు పునర్జన్మ ప్రసాదించారు" అంది జ్యోతి తలవంచుకొని.

"మీలో నిర్మల పోలికలు చాలా ఉన్నాయి. అమ్మతోగూడా రెండుసార్లు అన్నాను. మిమ్మల్ని చూస్తే నిర్మలను చూసినట్లుగా ఉంటుంది" అన్నాడు బాధగా నిట్టూర్చి.

"నిర్మలలేని స్థానంలో నన్ను నియమిస్తారా ?" అడిగింది జ్యోతి.

"జ్యోతీ...." అన్నాడు రమేష్, ఆనందంగా.

"అవును, నిర్మలలేని లోటు తీర్చటానికి ప్రయత్నిస్తా" అంది జ్యోతి.


"జ్యోతీ, నీవుమాయింటికి వచ్చినప్పుడు నిర్మల తిరిగి వచ్చిందా అనుకుని ఆనందించాను. నీతో ఎన్నోసార్లు చెబుదామనుకున్నాను కాని చెప్పలేకపోయాను.

భగవంతుడే నిర్మల రూపంలో నిన్ను నాదగ్గరకు పంపాడేమో" అని ఆనందంతో ఆమెను దగ్గరగా తీసుకున్నాడు.

రమేష్ పాదాలను కళ్ళకద్దుకుని నమస్కారం చేసింది జ్యోతి. ▢▢▢

అతనికంటె ఘనుడు

వాళ్ళిద్దరికీమధ్యా పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుందని ఆబాల గోపాలానికి తెలుసును. అయితే నిజంగా పచ్చగడ్డి తీసుకువెళ్ళి వాళ్ళిద్దరిమధ్యాన వేసి, అప్పుడు వచ్చినమంటని చూశామని చెప్పిన వాళ్ళెవరూ లేరు కాని, మంట వచ్చి తీరుతుందని మాత్రంనిస్సందేహంగా యావన్మందీ చెప్తారు.




అందుకే రామనాథానికి గోపాలం కొంత సొమ్ము నోటుమీద ఇచ్చాడన్నా, గోపాలం వద్దకు రామనాథం సొమ్ము కావాలంటూ వెళ్ళి, నోటువ్రాసి యిచ్చి ఆసొమ్ము తెచ్చుకున్నాడని ఆ సమయంలో అక్కడున్న వాళ్ళు, సాక్షుత్తూ ఆ నోటుమీద సాక్షి సంతకం చేసినవాళ్ళు చెప్పినా కాని నమ్మలేక పోయారెవ్వరూ.

ఎవరు నమ్మినా, ఎవరు నమ్మకపోయినా అలా జరిగిన విషయంమాత్రం నిజం.

అసలు రామనాథానికి, గోపాలానికి చుక్కెదురు. ఆ వైరం కేవలం వాళ్ళ స్వార్జితమే కాదు. పిత్రార్జితమూను. వాళ్ళ తండ్రుల కూడా ఒకరంటే ఒకరికి పడేది కాదు. దాని కొక్కారణం ఇద్దరూ ఒక్క వ్యాపారంలోనే ఉండటమే; యాచకుడికి యాచకుడు శత్రువవు తాడన్నది సామెత ఇద్దరూ వడ్డీ వ్యాపారమే చేస్తూండటం, సదరు వ్యాపారానికి ముడి పదార్థమైన ఋణగ్రహీతలు బహు కొద్దిమంది కావటం, ఆ కొద్దిమంది అవసరాలమీదే ఆధారపడి వాళ్ళిద్దరూ తమతమ భవిష్యత్తులను నిర్మించుకోవలసి రావటం కారణాలుగా ఒకరి చేష్ట మరొకరికి నచ్చక అంతకంతకు వైరం పెరిగిపోయింది. అవతారాలు చాలించేముందు తమ వంశాంకురాలను పిలిచి, చెవిలో వైనం యావత్తూ ఊదేసి, తమ పరువు ప్రతిష్ఠలను యథాతథంగా కాపాడవలసినదని ఒకసారికి పదిసార్లు హెచ్చరించి, మరీ కన్ను మూశారని వినికిడి. అనాటినుంచీ రామనాథం, గోపాలంకూడా పితృవాక్య పరిపాలనా దక్షులు గనుక పిత్రార్జితమైన ఆ వైరాన్ని అలానే పెంపొందించుకుంటూ తమస్వశక్తిని వృద్ధిచేసుకుంటూ వస్తున్నారు.

అలాగని వాళ్ళిద్దరూ వీధినపడి కొట్టుకున్న సందర్భమూలేదు; పోనీ ఏసావిట్లోనో పేచీపడ్డ జాడాలేదు; కనీసం వాగ్యుద్ధమైనా చేసినట్లూ వినలేదు. వారికి జరుగుతున్నది ఇప్పటి రాజకీయ భాషలో చెప్పాలంటే ప్రచ్ఛన్నయుద్ధం. ఈయుద్ధాని కాహుత యేది. నష్టపోయేది ఇటునుంచి అటు, అటు నుంచి ఇటు మూటలు మోసే మధ్యవర్తులు మాత్రమే కాని, వాళ్ళిద్దరూ మాత్రంకాదు. అలాగని వాళ్ళిద్దరూ మాట్లాడుకున్న సందర్భమూ లేదు.

ఇలా ఉండగానే ఒకానొకరోజున తెల్లవారగానే రామనాథం గోపాలం యింటికి వచ్చాడు. వస్తూనే "గోపాలంగారూ !" అని ఆప్యాయంగా పిలిచాడు కూడా.

రెండో డోసు కాఫీ చప్పరిస్తున్న గోపాలం లోపల్నుంచే "ఎవరు వారూ?...." అంటూ వీధిలోకి వచ్చాడు. వస్తూనే తన గుమ్మంలో నుంచున్న రామనాథాన్ని చూసిన గోపాలానికి అప్పుడే త్రాగిన గ్రుక్కెడు కాఫీ గుటకా పడక, బయటకూ రాక ఒక్క క్షణం తటపటాయించింది. ఎలాగో గుటక వేసి, నీళ్ళునములుతూ, "దయచెయ్యండి ! దయచెయ్యండి ! ఎంత దయ !.... ఎంత అదృష్టం ! మీరు మా యింట్లో అడుగు పెట్టటం - నిజంగా నా అదృష్టం.... అమ్మాయ్ ! రామనాథంగారు వచ్చారు - కాఫీ తెచ్చిపెట్టమ్మా !...." అని అరుస్తూనే "నుంచునే పోయారు....రండి! కూచోండి. ...." అన్నాడు.

రామనాథం మాత్రం ఏం తక్కువ తిన్నాడని ? "ఫరవాలేదు. వస్తానండి!.... ఇంతవరకూ వచ్చాక లోపలకి రాకుండాను; కూచోకుండాను వెళ్ళనుగా!...." అన్నాడు అక్కడే ఉన్న కుర్చీలో కూచుంటూ.

"ఏమే ! అమ్మాయ్ ! కాఫీ తేలేదు...." అని మరోసారి లోపలకి కేక వేశాడు గోపాలం.

"నేను కాఫీ త్రాగేవచ్చానండీ !.... అనవసరంగా వారిని ఇబ్బందిపెట్టకండి! ...." అన్నాడు మర్యాదగా రామనాథం.

"మాబాగా అన్నారు కాదూ ! మీకు లేదా, పోనీ ! మీరు త్రాగలేదనా ? మా ఇంటికి వచ్చారు. ఇది నాకర్తవ్యం: అంతే! ఇంక మీరేం అనవద్దు !...." అని అప్పుడే కూతురు తెచ్చిన కాఫీగ్లాసు రామనాథానికి అందించాడు గోపాలం.

"సరే ! మీ ఇష్టం !...." అని అందుకున్నాడా గ్లాసు నతడు.

ఇద్దరూ కాఫీ త్రాగుతున్నారన్నమాటే గాని, ఏ ఒక్కరి దృష్టి కాఫీమీద లేదు.

తనకి బద్ధశత్రువైన రామనాథం, తన పేరు చెవితేనే మండిపడి నానామాటలూ అనే రామనాథం ఈరోజు ఇలా తనయింటికి యెందుకొచ్చాడో ఎంత ఆలోచించినా అంతు చిక్కటంలేదు గోపాలానికి.

తను వచ్చేటప్పటికి యింత ఆదరణ, అభిమానమూ గోపాలం చూపిస్తాడని కలలో కూడా అనుకోని రామనాథంకూడా కొంచెం ఖంగారు పడ్డాడు.

మధ్యమధ్య ఒక్కొక్క గుక్కెడు కాఫీ చప్పరిస్తూ పొడిపొడిగా ఏదో సంభాషణ ఎందునా పొందని విషయాలను గురించి సాగిస్తున్నారుగాని, ఆ సంభాషణపట్ల ఇద్దరికీ శ్రద్ధా లేదు; ఆసక్తీలేదు.

చిట్టచివరకు కార్యార్థియై వచ్చినవాడు కనక రామనాథమే అన్నాడు-"నేను మీతో కొంచెం పనుండి వచ్చాను" అని.

"ఎంతమాట ! నాతో మీకు పనా ! అందుకు మీరు రావాలా ? కాస్త కబురుచేస్తే రెక్కలు కట్టుకు వాలకపోయానా - మీ యింట్లో ? ...." అన్నాడు గోపాలం.

"అవుననుకోండి ! మనిద్దరికీ అటువంటి ఇదేమీలేదు ...కాని, అవసరం నాదికాదా ! అందుకని నే రావటమే ధర్మం !" అన్నాడు రామనాథం

"అదంతా మీ అభిమానం, నా అదృష్టమూను.... కనుకనే మీకు నామీద ఇంత దయ కలిగింది. ఇంతకీ నేను మీకు చెయ్యగలిగేది—"

"ఉంది !....కనుకనే నేను రావల్సి వచ్చింది. మీకైతే అదొక పెద్ద యిదికాదు గాని, నాకుమాత్రం మహోపకారం అవుతుంది. ఇప్పటి నా యీ స్థితిలో... "

"చెప్పండి ! మీకు ఉపకారం చెయ్యగలిగితే అంతకంటెనే కోరుకునే దేముంటుంది ? చెప్పండి ? ...." అన్నాడు గోపాలం.

అన్నాడే కాని రామనాథం ఏమి అడగబోతున్నాడో ఊహించలేక పోయాడు, ఎంతగా సతమతమైనా. అంతలోకి రామనాథమే బయట పెట్టాడు - చల్లగా.

"అర్జంటుగా ఓ పదివేలు రొక్కంకావలసి వచ్చింది. సమయానికి చేతిలో లేక పోయింది. తప్పనిసరిగా కావాలి ! ఏం చెయ్యాలో తెలవలేదు. సరే ! మీదగ్గరకొస్తే సర్దుతారు గదా అని వచ్చాను ! మీ రీ సాయం చేశారంటే జన్మ జన్మలకి ఋణపడి ఉంటాను - మీకు. మీకిదో లెక్కలోది

మధుర భానుమూర్తి

కాదు. కాని నాకుమాత్రం గొప్ప సహాయమవుతుంది. నోటు వ్రాసి యిస్తాను...." అన్నాడు రామనాథం బ్రతిమలాడుతూ.

"ఇంకా నయం! మీవంటివారు అడగటం. నేను కాదనటమూనా? అయితే అంత రొఖ్ఖం ఉందా? లేదా? అనిగాని.... అయితేనేం? నాదగ్గర లేకపోతే ఎక్కడో ఒకచోట తెస్తాను-ఇస్తాను.... మీ అవసరమొకటీ, నా అవసరమొకటీనా?" అన్నాడు గోపాలం.

రామనాథం తనని బదులు అడగటంలోని అంతర్యం ఏమిటా అని కాస్సేపు తర్జన భర్జన చేసుకున్నాడు కాని, ఎలాగూ నోటు వ్రాయించి పుచ్చుకునేటప్పుడు తనకింకేం భయముండదని, పైగా ఆ రామనాథంగాడి జుట్టు ఈ విధంగా తన చేతిలో చిక్కినట్లయితే వాణ్ణి ఒక ఆట ఆడించి తరతరాలుగా వస్తున్న తన కక్షను సాధించవచ్చునని ఆశించి, అంగీకరించాడు గోపాలం.

నెలకి నూటికి రెండు రూపాయలు, రెండున్నర వడ్డీకి తనని బ్రతిమిలాడి పట్టుగెడుతున్నారని, రామనాథం వంటివాడు వచ్చి అడిగాడు గనక రూపాయన్నరచేసి ఇస్తానని, మూడేళ్ళకయ్యే వడ్డీ మినహాయించుకుని మిగిలినదే ఇవ్వటం మామూలేనని గోపాలం చెప్పిన షరతులకు వెంటనే అంగీకరించాడు రామనాథం.

రామనాథం స్వదస్తూరీని ప్రో నోటు వ్రాశాడు. వ్రాస్తూ, వ్రాస్తూ సగంలో ఆగిపోయాడు: "అయ్యో! చిన్నపొరపాటు జరిగిపోయింది. ఇవాళ జనవరి 24 కాదూ? పొరపాటున 23 అని వ్రాసేశాను ...పోనీ దిద్దమంటారా? అన్నాడు.

ప్రోనోటుమీద దిద్దుబాటులు, తుడుపులు ఎందుకులెమ్మనీ, అంతకన్న ముఖ్యంగా ఆ రోజు పుచ్చుకున్న సొమ్ముకి అంతకు ముందురోజునుంచి వడ్డీ వస్తుంది గదా అని ఆలోచించినవాడై "ఫరవాలేదు. అలా ఉంచెయ్యండి! దిద్దటమెందుకు?...." అన్నాడు గోపాలం.

"అల్లాగే! మీరెలా చెయ్యమంటే అల్లాగ చెయ్యటానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటాను ..సరే! 23 వ తేదీ అని ఉంచేశాను ..." అని రెట్టించాడు. రామనాథం.

"ఫరవాలేదండీ! అయినా మనలో మనకి ఈరాత కోతలన్నీ ఎందుకుచెప్పండి? ఏదో వ్యవహారం కదా అని వ్రాసుకోవటం గాని?...." అంటూనే రామనాథం వ్రాసిన నోటు అందుకున్నాడు, గోపాలం.

"అవుననుకోండి! అయినా సొమ్ముతో పనిచూడండి! వ్యవహారం వ్యవహారంలాగ చేసుకుంటేనే స్నేహాలు శాశ్వతంగా ఉండిపోతాయి....మీ సొమ్ము వీలయినంత త్వరగా ఇచ్చేస్తాను. వడ్డీతో సహా! సమయానికి ఆదుకున్నారు - మీరు గనక. మీ ఋణం తీర్చుకోలేను! మీ రివందా ఊరికే ఇచ్చినట్టుగానే భావిస్తాను ..." అంటూనే వడ్డీ మినహాయించుకుని గోపాలం యిచ్చిన సొమ్మును అందుకున్నాడు కృతజ్ఞతతో - రామనాథం.

రామనాథం వెళ్ళిన తరువాత గోపాలం ఆలోచనలు పరిపరివిధాల పోయాయి. అసలు రామనాథం ఇలా సొమ్ము కావాలంటూ ఎందుకు వచ్చాడన్నది దురూహ్యమయిపోయింది. రామనాథం స్వతహా బాగా డబ్బున్నవాడు. తనకంటె ఎక్కువ సొమ్మే వడ్డీలకు తిప్పుతున్నాడు పదిమంది అవసరాలూ అతను తీర్చటమే ఉంది. కాని, అతనికి అవసరం వచ్చిన సందర్భం ఇదివరకెన్నడూ తానెరుగడు. ఒకవేళ అటువంటి అవసరం వచ్చినా తనవద్దకు వస్తాడని

కలలోకూడా అనుకునే అవకాశం లేదు. అందుకనే అంతగా ఆలోచించాడు గోపాలం. కాని చిట్టచివరకు మనస్సును సరిపెట్టుకున్నాడు. అతడు తనదగ్గరకు ఎందుకు వస్తేనేం? నోటు వ్రాసియిచ్చాడు. సాక్షి సంతకాలు వగైరాలతో సహా అన్నీ కట్టుదిట్టంగా వ్రాయించి పుచ్చుకుని, వడ్డీ మినహాయించుకుని మరీ యిచ్చాడు సొమ్ము. ఇంక తనకేం భయం? ఇలా అనుకున్నాక మనస్సుకు ఊరట కలిగిందతనికి.

ఇలా కొంతకాలం గడిచింది. కొద్ది రోజుల్లోనే సొమ్ము ఇచ్చేస్తానన్న రామనాథం తిరిగి ఆ విషయమే స్మరించలేదు. ఆలస్యమైనకొద్దీ వడ్డీ మరికాస్త పెరుగుతుందనే ఆశతో కాలక్షేపం చేశాడు గోపాలం.

కాని ఎంతకాలానికీ సొమ్మిచ్చే ప్రయత్నం రామనాథం చెయ్యకపోయేసరికి గోపాలానికి అంగారుపుట్టి రామనాథం వద్దకు వెళ్ళాడొకనాడు.

రామనాథంకూడా గోపాలానికి చాలా మర్యాదచేశాడు. అనేక విషయాలు ప్రసంగిస్తాడుగాని ఈ బాకీమాట రామనాథం ఎంతకూ తలబెట్టక పోయేసరికి ఉండబట్టలేక గోపాలమే అన్నాడు: "మీకు అవసరమంటే అప్పుడు సర్దాను. ఇప్పుడు నాకు అవసరమొచ్చింది. అందుచేత ఆ సొమ్ము సర్దుతారేమోనని...."

"ఏ సొమ్ము? మీ రనే దేమిటో నాకు అర్థం కావటంలేదు...." అన్నాడు రామనాథం తొణక్కుండా, బెణక్కుండా.

"అదే! అవాళ నా దగ్గర తీసుకున్న పదివేల బాపతు....ఈ నోటు తాలూకు...." అని నోటుకూడా చూపించాడు గోపాలం.

"ఇదేదో తమాషాగానే ఉందే! నేను మీ దగ్గర డబ్బెప్పుడు తీసుకున్నాను? నోటెప్పుడు వ్రాశాను? అసలు నా కటువంటి అవసరమే రాలేదే?" అన్నాడు రామనాథం తాపీగా.

"మరి ఈ నోటు మాటేమంటారు?" అని అడిగాడు. ఇటువంటి జవాబు చెప్తాడని యెదురుచూడని గోపాలం.

"ఏమో? నాకేం తెలుసు!...." నిర్లిప్తంగానే అన్నాడు రామనాథం.

గోపాలానికి ఉడుకుమోతుతనం, కోపం పెరిగాయి. "అయితే ఆయనకాడికి సొమ్మంతా తీసుకెళ్ళి, ఆవాళ లేదంటావుటయ్యా? అన్నాడు.

రామనాథం ప్రశాంతంగా, "మీరు అనవసరంగా ఆవేశపడుతున్నారు. ఇందులో నేను అబద్ధమాడినదేమీలేదు. నేను మీవద్ద ఎన్నడూ సొమ్ము పుచ్చుకోలేదు. అమాటే చెప్పాను. అంతే! ..." అన్నాడు.

"ఏదీ! ఈనోటు చూసి చెప్పు. అదే మాట!" అని రోషంగా అడిగాడు గోపాలం.

రామనాథం నోటుకేసి చూసి, "ఇదే సృష్టిలో విచిత్రం. మనిషిని పోలిన మనిషి, రాతని పోలినరాత ఉంటాయి. నా వ్రాతలాగే ఉంది. అంతవరకూ నిజమే! కాని సరిగ్గా నా వ్రాతలాగే వ్రాయించగలిగిన మిమ్మల్ని వ్రాయగలిగిన ఆ పెద్దమనిషిని నిజంగా అభినందించాలి!...." అన్నాడు.

"ఇంతకీ మీ రనే దేమిటి?"

"ఇందాకనే చెప్పానుగా!"

"ఇంత అన్యాయమా? ఇంత నమ్మకద్రోహమా? అసలు సొమ్మే పుచ్చుకోలేదంటున్నారు-ఇదేమైనా బాగుందా? ఇది న్యాయమా?"

"అదే నేనూ అడుగుతున్నాను. లేనిపోని అప్పులు నా మెడకి చుట్టటం మీకు న్యాయమా అని?"

ఇంక కోపాన్ని అపుకోలేక పోయాడు గోపాలం. "అయితే సరే! ఈ కబుర్లేమిటో కోర్టులో చెపుదురుగాని; నేనూ చూస్తాను. అహాఁ! నా దగ్గరా ఇవన్నీను" అని రుసరుసలాడాడు.

రామనాథం మాత్రం స్తిమితంగానే అన్నాడు: "అలా అన్నారు-బాగుంది. ఎప్పటికేనా నిజానిజాలు తేలవలసినది అక్కడే కదా! కాని మీ శ్రేయోభిలాషిని గనక ఒక్కమాట! మీ శ్రేయస్సుకోరి చెప్తున్నాను. కోర్టుల కెక్కితే ఖర్చులు దండగతప్ప ప్రయోజన ముండదు. అంచేత అనవసరంగా తొందరపడి నష్టపోవద్దని నా సలహా!...." అన్నాడు.

"చాల్చాల్లేవయ్యా! నీ సలహా ఎవరికి కావాలి? బోడి సలహా నువ్వూను..." అని లేచి చక్కా పోయాడు గోపాలం. తాను సీరియస్‌గా మాట్లాడుతున్నకొద్దీ రామనాథం చల్లచల్లగా తాపీగా మాట్లాడితే చిర్రెత్తు కొచ్చింది - గోపాలానికి.

అక్కడనుంచి వెళ్లాక అన్నంతపనీ చేసి తీరాడు గోపాలం. కోర్టు కెక్కించి చెవులు మెలేసి మరీ తనసొమ్ము రామనాథం చేత కక్కించాలని గోపాలం కోరిక. కాని రామనాథం మాత్రం కోర్టుకు రమ్మని కాగితం వచ్చిన నాడుకూడా కంగారు పడ లేదు. సరికదా కోర్టులోకూడా అంత తాపీగానే జవాబు చెప్పాడు.

"ఏమయ్యా! గోపాలంగారి దగ్గర నువ్వు సొమ్మేమైనా అప్పు తెచ్చావా?...." అని జడ్జీ అడిగితే. "లేదండి!" అని బదులు చెప్పాడు.

"మరి ఈనోటు!...."

"నాకు తెలీదండి!...."

"ఈ దస్తూరీ!...."

"నాది కాదండీ!"

"నీ దస్తూరీ ఇలాగే ఉందే!"

"అవునండి! నా దస్తూరీలాగే ఉంది. ఎవరు వ్రాశారోగాని!"

"అయితే ఇది నీది కాదంటావ్!"

"కాదండి!"

"మరి సాక్షి వ్రాలు చేసినవాళ్ళుకూడా నువ్వే వ్రాసి యిచ్చావంటున్నారే!"

"అనొచ్చండి! ఈ నోటే సృష్టించిన వాళ్ళకి. ఇటువంటి సాక్ష్యాలు తేవటం కష్టమాండి?"

"మరి నువ్వు చెప్పేదానికి సాక్ష్యం?"

"ఉందండి! ఏలినవారు చిత్తగిస్తానంటే మనవి చేస్తాను ..."

"చెప్పు!"

"ఈ నోటు జనవరి 23 న వ్రాసినట్టుంది కాదండీ?"

"అవును!"

"అసలా జనవరి 23న నేనిక్కడ లేనేలేనండి!...."

"మరెక్కడున్నావు ...?"

"చిత్తం! హైకోర్టులో సాక్ష్యం చెప్పటానికని హైదరాబాదు వెళ్ళానండి! ఏలినవారి కాగితాలు చిత్తగిస్తే నిజం తమకే తెలుస్తుంది!...." అని కాగితాలు కొన్ని అందించాడు.

వాటినిబట్టి జనవరి 23 న రామనాథం గ్రామంలో లేడని. హైదరాబాదు వెళ్ళి హైకోర్టులో ఏదో కేసులో సాక్ష్యమిచ్చాడని రుజువయిపోయింది.

గోపాలం నెత్తీ, నోరు బాదుకున్నాడు. ఆనాడు తేదీ వెయ్యటం దగ్గిర జరిగిన కథ యావత్తూ చెప్పాడు. రుజువు చెయ్యబోయాడు. కాని అదంతా అరణ్యరోదనమైంది. కేసుకొట్టేశారు.

"రామనాథం అక్కట్టినుండి వెళ్ళిపోయే ముందు కోర్టువారితో "అయ్యా! ఒక్కమనవి! డబ్బు అంటే ఆశఉండటం సహజం! మిత్రులు గోపాలంగారు ఏదో పొరపాటున ఈ పని చేశారు. నోటూ, అవీ సృష్టించారు. కాని ఇది ప్రథమ తప్పిదంగా భావించి. ఏలినవారు వారిని విడిచిపెట్టాలని నా ప్రార్థన" అని చెప్పి మరీ వెళ్లాడు.

అందరూ అతని ఔదార్యాన్ని పొగిడారు. ఏదీ వినిపించటం, కనిపించటం, అర్థంకావటం మానేసి అయోమయ స్థితిలోవున్న గోపాలం మాత్రం నిశ్చేష్టుడై అలాగే ఉండిపోయాడు.

000

పఠాభి పంచాంగము

సెప్టెంబరు

1. జిహ్వపని వాదించుట కాదు
ఆస్వాదించుట.

2. చికిత్సలోన ఫలముండవలయు
నన్న
విచికిత్స వుండరాదు.

3. శనివారం కొందరికి
సినివారం.

4. ఆటమిక నాగరికతకు
ఆటవిక నాగరికతకు
అట్టే వ్యత్యాసం లేదు.

5. నాలుగు కాళ్ళు ఒకచే
అవుతుంది.

6. సినిమా నటీమణి ఆశ
మాత గావాలని కాదు
నిర్మాత గావాలని మాత్రమేను

7. నవనారులకు
వంటలలోకన్నా
వడ్డింపులలో నేర్పు.

8. వాలుగంటిగాదు సవాలుగంటి.

9. ప్రజల నమ్మువారు
ప్రజానాయకులున్ను, ప్రజా
ద్రోహులున్ను.

10. మిత్తినే జయించునది మత్తు

11. వేనోళ్ళ కొనియాడబడేది
''బబుల్‌గం''

12. ఫ్రీలవ్ వారికి
సెక్సు ఉచితమే సదా.

13. మనకు అహంభావము పోయి
''హం'' భావము వచ్చినదాకా
గతి లేదు.

14. సాహసికుడు కావచ్చుకాని
ఘూర్ఖాను నిజంగా మూర్ఖా అనాలి

15. సనాతనులు వేదంవల్ల రాజ్య
నిర్వహణ
కావాలంటారు
వాదంవల్ల అని అధునాతను
లంటారు.

16. కల్లు త్రాగవద్దు; అవి చాలా
ఉపద్రవం.

పఠాభి పంచాంగము

17. మంచి దర్జీవాడు
ఎలాగయినా కుట్టగలడు.

18. ఈనాటి యువతీ యువకుల్లోన
వ్రీడలేని ప్రేమ.

19. ఈ నాడు మందబుద్ధిగా
వుంటేనేగాని
ప్రజానాయకుడు కాజాలడు.

20. ఆంధ్ర సారస్వతంలో
సంస్కృతంమీద
విహిత భక్తి గోచరిస్తుంది

21. దంతాలు సరిగ్గా లేకున్న
దంత వైద్యునివద్దకు
పో పలుమారు

22. సత్తుకన్నా సత్తువకే
నోరు ఇప్పుడు

23. డాంబికుని మాటలన్నీ
పయిపూతగాని
వేరుకాదు.

24. చిట్టిపాపాయి, ఇది
చిల్లి పీపాయి

25. ఏ ఆఫీసుకు పోయినా
దక్షిణ లేనిదే ఉత్తరం లేదు.

26. నిజానికి
కాకాబట్టువారేను
కాబట్టువారు.

27. సత్తివానికి నా వందనాలు.

28. కూరలందేగాదు, తాకూరు
లందుకూడా
వంగ చాలా ప్రసిద్ధి.

29. మన దేశపు దిగుమతులందు
ఆహార పదార్థాలు ప్రాధాన్యం

30 పత్రికలమధ్య చాలా ప్రతి స్పర్థ

అనుమానం


కొత్త పట్టుచీరె కట్టుకొన్న శోభ, ఈజీచైరులో తీరిగ్గా కూర్చుని భగవద్గీతా పారాయణ చేస్తున్న అత్తగారి పాదాలకు వంగి నమస్కరించింది.

ఒక్కసారి తల పైకెత్తి కళ్ళజోడులో నుంచి చూసి.

"ఎందుకమ్మా కాళ్ళకు మొక్కుతున్నావ్?" అంది సుందరమ్మగారు.

"కొత్తచీరె కట్టుకున్నా నత్తయ్యా" అంది శోభ.

తలెత్తి ఈసారి కోడలిని పరకాయించి చూచిందామె. సన్నగా, పొడుగ్గా, తెల్లగా వున్న కోడలికి ఆ చీరె ఎంతో బాగుంది. నవ్వుతున్న శోభ ముఖం, నిజాన్ని దాచలేము అన్నట్లున్న ఆ పెద్దపెద్ద కళ్ళూచూచి ముఖం దించుకొని మళ్ళీ పుస్తకంలోకి చూడసాగింది. అత్తయ్య ఏదో అడగబోతూంది అని నిలబడ్డ శోభ మాట్లాడకుండా ముందుకు సాగింది.



"శోభా" కర్ణకఠోరంగా వినబడ్డ కేకకు వెనుకకు తిరిగిచూచింది శోభ. గుమ్మంలో తన భర్త మధు నిప్పులు కురిపించే కండ్లు, అదిరిపోయే పెదవులు, వణికిపోయే శరీరంతో కనిపించాడు. ఆ ఆకారాన్ని చూచిన శోభ హడలిపోయింది. తను కాపురానికి వచ్చిన ఈ నాలుగేండ్లలో ఎన్నడూ ఇలాంటి రూపాన్ని చూడని శోభ స్తంభితురాలే అయింది. కొంచెం తేరుకొన్న తర్వాత దగ్గరకువచ్చి—

"ఏమండీ వంట్లో బాగాలేదా? పడుకొందురుగాని రండి" అంటూ చేతిని పట్టుకొంది. ఆ చేతిని ఒక్క విదిలింపు విదిలించి గదిలోకి వెళ్ళాడు మధు. వెనుకనే పిల్లిలా అనుసరించింది శోభ. రెండు చేతుల్లోను తల పట్టుకొని కూర్చున్న భర్త దగ్గరగా వెళ్ళి భుజంమీద చెయ్యివేసి -

"ఏమిటి బాధ పడుతున్నారు? నాకు చెప్పరూ?"

అతడు అమాంతంగా లేచి నిలబడి ఆమె భుజాలు గట్టిగా పట్టుకొని కుదుపుతూ -

"నిజం చెప్పు. శేఖర్ నీకిదివరకే తెలుసుగదూ?"



"తెలుసు"

"వాడిని ప్రేమించావుగదూ ?"

"అబద్ధం. ఎవరన్నారు మీతో. పెళ్ళికి పూర్వం అతనితో నా పరిచయం కూడా తక్కువ."

"కాదు. మీ యిద్దరిమధ్యా వుత్తరాలు కూడా నడుస్తున్నాయి. పెళ్ళికాకముందే నీకు వాడితో సంబంధం వుంది. నాడబ్బుని చూసి నన్ను చేసికొని యిప్పుడు వాడితో కులుకుతున్నావ్ ?" అంటూ ఒక్కతోపు తోశాడు. ఆ తోపుకు గోడకు కొట్టుకొన్న ఆమె తిరిగిలేస్తూ -

"మీరు ఆ వేశం లో ఏమంటున్నారో మీకే తెలియటంలేదు. అతన్నే ప్రేమించి వుంటే డబ్బు ప్రశ్న ఎందుకు ? నా ఆస్తి చాలదా మాకు ? మీ మనస్సులో ఎవరో విషబీజం నాటారు. నామాట నమ్మండి. మీ పాదాలసాక్షిగా చెపుతున్నాను. మీ స్నేహితుడుగానే అతన్ని నేను గౌరవిస్తున్నాను. అంతే."

"ఛీ. నోర్ముయ్"

"ఎందుకు మూయాలి ? లేనిపోని అభాండాలు పైనవేస్తే సహించి ఊరుకోమన్నారా ?"

"ఊరుకోకపోతే నడువు పట్టింటికి"

"ఇది నాయిల్లు. నే నెక్కడికీ వెళ్ళను."

తలుపు విసురుగావేసి వెళ్ళాడతను. అంతవరకూ ఆపుకొన్న దుఃఖం ఒక్కసారి పెల్లుబికింది శోభకు. మంచంమీద పడి హృదయభారం తగ్గేవరకు ఏడ్చింది. తన తనభర్త....తనను పువ్వుల్లోపెట్టి పూజిస్తున్న భర్త తన చిరునవ్వుకు తపించిపోయే భర్త ! ఎలాంటి నిందవేశాడు ! శోభ తలపులు ఒక్కసారి గతంలోకి పయనించాయి.

నాలుగేళ్ళ క్రితం ఈ ఇంట్లో అడుగు పెట్టింది తను. ఒక్క పది రోజులుమాత్రం కొత్తగావుంది ఎవరితోను ఎక్కువ మాట్లాడేది కాదు. ఇంట్లోవారు ...ఇద్దరుతోటి కోడళ్ళు, అత్తగారూ, ఆడపడుచు లిద్దరూ చాల ఆప్యాయంగా చూచేవారు. చిన్నకోడలికి ఎప్పుడూ సుస్తీ. పిల్లల్ని పెంచటంలో అట్టే శ్రద్ధచూపేదికాదు. ఆమె ఇద్దరి పిల్లలకూ రోజూ స్నానంచేయించటం, వారి ఆలనా పాలనా చూడటం శోభ వచ్చినదగ్గర నుండీ తనపైనే వేసికొంది. ఆ నాలుగేళ్ళ రవి, ఆరేళ్ళ సుధ పిన్నినివదిలి ఒక్క క్షణం వుండరు. ఇక పెద్ద కోడలికి ఒక్కడే కొడుకు. పన్నెండేండ్లవాడు. సురేష్. వాడు నెలకు పదిరోజులు బడికి వెళ్తాడు. ఇక ఇంట్లో వున్నంతసేపు తల్లి కొడుకులకు క్షణం పడదు. తల్లి అంటే భయంగాని, గౌరవంగాని వాడికి ఏకోశానా లేవు. డబ్బుకోసం తల్లిని పీడించటం, ఇవ్వకపోతే గ్లాసులు, అద్దాలు పగలగొట్టి తన ప్రతాపం చూపడం వాడి అలవాటు. కోపంవస్తేతండ్రిచావగొట్టేవాడు. తల్లిదండ్రులకూ, తాత ముత్తవలకూ సురే ఒక పెద్ద సమస్య అయి కూర్చున్నాడు. ఇంత చిన్న వయస్సులో వున్న కొడుకూ ఇలా తయారయినందుకు ఆ తల్లిదండ్రులెంతో బాధపడేవారు.

అలాటి సురేష్ ఒకరోజు తండ్రి దగ్గరకు వెళ్ళి -

"నాన్నగారూ ! ఈలెక్క ఎంతచేసినా ఆన్సరు రావటంలేదు. కొంచెం చెపుతారా?" అంటూ వచ్చాడు. అప్పుడే రాత్రి భోజనం చేసి పేపరు చూస్తున్న రామారావు ఆశ్చర్యంగా చూశాడు. తన కొడుకు ఒకలెక్క చేయటం రాలేదని తెలిసికొన గోరటం ఆయనకు వింతగాతోచి -

"లెక్క ఎవరు చేయమన్నారురా ?" అన్నాడు.

"ఎవరేంటి ? స్కూలు హోంవర్క్"

"అయితే స్కూలుకు వెళ్ళావేంటి ఈ రోజు."

"ఈరోజేకాదు నాన్నగారు. నేను రోజు బడికి వెళ్తున్నాగా ? అందుకే పిన్ని నాకు రోజూ ఇష్టమైన టిఫిన్ చేసి పెడుతుంది. రాత్రి మంచిమంచి కథలు చెబుతుంది. పిన్ని నన్నెప్పుడూ కోప్పడదు నాన్నా. అమ్మకంటే పిన్నే చాల మంచిది." అని చెప్పుతు పోయాడు.

ఏ బిడ్డ అయితే ఎందుకూ పనికిరాడనీ, పుట్టకపోయినా బాగుండేదనీ నిందించేవాడో, ఆ కొడుకునుకూడా ప్రయోజకుణ్ణి చేసింది శోభ. చేతిలోని పేపరుతో అలాగే కూర్చున్న నాన్నను "లెఖ్ఖ చెప్పరా నాన్నా" అంటూ జ్ఞాపకంచేశాడు సురేష్.

అటువైపుగా వచ్చిన శోభ "నే చెబుతా రా సురేష్. నాన్న చదువుకుంటున్నారు" అంది.

"లేదమ్మా. నేను చదవటం లేదు. నీ గురించే ఆలోచిస్తున్నాను. ఏ దేవుడు నిన్ను తయారుచేశాడు. నీలో ఇంత సహనం, ఓర్పు, నేర్పు ఎలా వున్నాయి ? నీవు మా యింటికే శోభను తెచ్చావుతల్లీ. నిన్ను దేవుడు చల్లగా చూస్తాడు."

బావగారి మాటలకు సిగ్గుతో కుంచించుకుపోయిన శోభ భుజంనిండా చెంగు కప్పుకొని తలుపుప్రక్కకు తప్పుకొంది. ఇది వారిద్దరికీ అలవాటే. చనువుగా ఆయన మరదల్ని ప్రశంసించటం, బావగారి ఎదుటకే రావటానికి సిగ్గుపడే శోభ తలుపుప్రక్కనక్కటం

"పిన్నీ పిన్నీ ! అన్నం పెట్టవూ ? ఆకలవుతోంది" అంటూ వచ్చిన రవి మాటలకు ఈ లోకంలో పడింది శోభ. ఎత్తుకోమని చేతులందిస్తున్న రవిని మూగపోయిన హృదయానికి హత్తుకొని యింట్లోకి నడిచింది.

2

రాత్రి పన్నెండైంది. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. బూట్ల చప్పుడు విని లేచి తలుపు తీసింది శోభ. మాట్లాడకుండా తనగదిలోకి వెళ్ళి బట్టలు మార్చుకుంటున్న మధుకు ట్రేలో భోజనం తెచ్చి బల్లమీద వడ్డన చేస్తున్న శోభ కనిపించింది. మంచంవైపు నడుస్తున్న భర్తతో -

"భోంచేసి పడుకోండి" అంది.

"నా కక్కర్లేదు." కటువైన సమాధానం.

"మీ ఆరోగ్యం అసలే బాగుండలేదు. ఇంతరాత్రివరకూ నిద్రలేకుండా భోజనం కూడాచేయకపోతే ఎలా ? కొంచెం పెరుగు అన్నమైనా తినండి."

"అక్కర్లేదని చెబుతుంటే ఏమిటా గోల ?"

"నామీద కోపంతో కడుపు కాల్చుకుంటారా ? నా మాట వినండి. పోనీ ఆ చక్రకేళీలు రెండు తినండి. మజ్జిగ తెస్తాను."

"నా కేమీ అక్కర్లేదు. నువ్వు పోతావా? నన్ను పొమ్మన్నావా ?" ఆ కంఠంలో క్రోధం, అసహ్యం అన్నీ మిళితమై వున్నాయి.

"వద్దు. నేనే వెళ్తాను. నా ఉనికి అంత కష్టంగావుంటే రేపే నేను అమ్మదగ్గరకు వెళ్తాను. కాని ఒక్క మాట. మీ "శోభ మాత్రం మీ కెలాటి ద్రోహం చెయ్యలేదు. మీరు ఇప్పుడా నిజాన్ని నమ్మరు. కాని ఒక రోజు....నేను నిర్దోషినని గ్రహించిన రోజు పశ్చాత్తాపంతో నా దగ్గరకు వచ్చి తీరతారు."

అభిమాన ధనురాలైన శోభ ఇంకేమీ చెప్పలేక కన్నీళ్ళు తుడుచుకుంటూ వెళ్ళిపోయింది.

"అదేంది శోభమ్మగారూ! వట్టి చాప మీద పడుకున్నారు?" అంటూ ఇల్లు వూడుస్తున్న లచ్చి లేపేవరకు మెలకువ రాలేదు శోభకు. రేడియోలో వార్తలు అప్పుడే పూర్తవుతున్నాయి. ఎదుటి గోడపై గడియారం ఏడుంబావు చూపిస్తున్నది. సిగ్గుతో శోభముఖం కందిపోయింది. ఏడు దాటింది. రోజూ తాసివేళకు ఎన్నిపనులు చక్కబెట్టేది. పూజగదిలోనుండి గంట వినిపిస్తోంది. అత్తయ్య పూజకూడా అయిందన్నమాట. రోజూ పూజకు అన్నీ తాను సిద్ధపరచి అత్తయ్యను పిలిచేది. ఈ రోజు మామగారికి బెడ్‌కాఫీ ఎవరు అందించారో? వంటవాడికి టిఫిన్ ఎవరు పురమాయించారో? రవికి ముఖం ఎవరు కడిగారో అనుకుంటూ బాత్‌రూంలోకి వెళ్ళింది.

ముఖం కడుక్కొని డైనింగు హాల్లోకి అడుగుపెడుతున్న శోభకు చిన్న ఆడబిడ్డ నిర్మల వంటవాడి మీద పెద్దగా కేకలెయ్యటం విన్పించింది.

"ఏమిటి నిర్మలా" అంటూ వచ్చిన వదినమీద విరుచుకుపడింది నిర్మల.

"ఏముందీ. నీవేమో రాణీగారిలాగ యిప్పుడు లేచివచ్చావు. ఈ రాముడేమో వట్టి పూరీలు చేసి మా ముఖాన వేశాడు. ఎలా తింటామనుకున్నాడో ఏమో?"

"కాదమ్మగారూ! ఇంట్లోనేమో నాలుగు కోడిగ్రుడ్లు వున్నాయి. అవేమో ఆమ్లెట్లు వేసి అయ్యగార్లకు వుంచాను. బంగాళదుంపలు వండితే కొందరు తింటారు. కొందరు తినరు. నేనేం చేయనమ్మా" అన్నాడు రాముడు.

"అ! ఏంచేస్తావ్! మా కడుపులు మాడుస్తావ్" కోపంగా అంది నిర్మల.

"సరే! రాముడూ నిర్మలమ్మకు ఒక ఆమ్లెట్ యిచ్చెయ్యి. తర్వాత చూచుకొందాం. కూరలేకుండా ఆమె పూరీలు తినదని నీకుమాత్రం తెలీదూ?" అని మందలించింది శోభ.

"నాకసలు టిఫీనే అక్కర్లేదు." అని ప్లేటు ముందుకు తోసి లేచింది నిర్మల.

"సరే! ఈరోజుకు నన్ను క్షమించి తిను నేను బందరు వెళ్తున్నాను. రేపటి నుండి నీవే ఆర్డరిచ్చి కావలసినవి వండించుకో."

"మానిమ్మీ మంచిది. చక్కగాతింటుంది" అని వదిన బ్రతిమలాడుతుందని ఊహించిన నిర్మల ఈ జవాబుకు విస్తుపోయి-

"నిజంగా వెళ్తున్నావా వదినా!" అంది.

"ఎందుకూ నేనిలా విసిగిస్తున్నాననా? ఇంకెప్పుడూ విసిగించను వదినా" అంటూ చెంపలు వేసికొంది.

అప్పుడు నిర్మలను చూచి నవ్వుతూ శోభ-

"అయినా నిమ్మీ. నీనోరు కొంచెం కంట్రోలులో వుంచుకొంటే మంచిది." అని వెళ్ళిపోయింది.

"అరె! నిజంగానే పిన్ని వెళ్ళిపోయేటట్లుందే" అన్నీ నోరుతెరిచాడు సురేష్. భర్త అనుమానాన్ని ఎక్కడా బయటపెట్టకుండా అమ్మను చూసి పదిరోజుల్లో వస్తానని చెప్పి బయల్దేరింది శోభ.

3

శోభను దిగవిడిచి మరునటి రోజు వెడుతున్న మరిది రమేష్ చెప్పటానికి ఒదిన గదిలోకి వెళ్ళాడు. శూన్యంలోకి చూస్తూ ఒంటరిగా కూర్చున్న ఒదిననుచూచి విభ్రాంతుడయ్యాడు. ఎప్పుడూ నవ్వుతూ, కళకళలాడుతూ తీరుబడేలేనట్లు తిరిగే వదిన, ఏడ్చేవాళ్ళనుకూడా నవ్వించే వదిన ఇలా వుందేమిటి? నిస్పృహ, నిర్లిప్తత కూడగట్టుకొన్న ఆ ముఖం పాలిపోయినట్లుంది.

"ఒదినా-"

ఉలిక్కిపడి చూచింది మరదివంక. ఆ చూపులో జీవంలేదు. ఆ కళ్ళల్లో కాంతి లేదు.

"ఒదినా! అన్నయ్యకు నీకు ఏమైనా గొడవ జరిగిందా? ఒకవేళ జరిగినా అన్నయ్యే కాళ్ళబేరానికి వస్తాడుగా. మరెందుకిలా చేశావ్?"

"రమేష్."

"దాచాలని ప్రయత్నించకు. నిన్ను వెంటవచ్చి రైలెక్కించకుండా అన్నయ్య ఎప్పుడువున్నాడు? అలాంటిది నిన్నటినుండి ఆయన ఇంట్లోనే లేడు. కనీసం నీవు వెళ్ళేవేళకుకూడా రాలేదు. అసలు ఏం జరిగింది వదినా?"

"ఏం జరిగింది? ఏ అన్యాయమైతే ఆడదానికి జరుగకూడదో అదే జరిగింది రమేష్."

"కాని వదినా జరిగిందేమిటో నీవు కనీసం అమ్మకైనా చెప్పాల్సింది."

"చెప్పి ఏం లాభం? ఆమె నన్ను రానివ్వరు. అన్నయ్యను ఇబ్బంది పెడతాడు. ఆయన ఆకోపంతో ఏమైనా చేయవచ్చు. అందుకే బాగా ఆలోచించికొన్నాళ్ళు దూరంగా వుండటమే మంచిదని వచ్చాను. నీవు కూడా ఎవరికీ తెలియనీయనని మాటివ్వు"

"అలాగే కాని మళ్ళీ ఎప్పుడొస్తావ్?"

"ఆరోజు త్వరలోనే రావాలని కోరుకొంటున్నాను. ఇష్టమైనవారు ప్రార్థన చేస్తే కోరిక నెరవేరుతుందట. నా తరపున భగవంతుడిని నీవుకూడ ప్రార్థించు."

"అదే నిజమయితే ఒక్కసారికాదు. వదినా వందసార్లు ప్రార్థిస్తాను" అన్నాడు కళ్ళు తుడుచుకొంటూ. శోభకూడా కళ్ళు తుడుచుకుంటూనే సాగనంపింది మరదిని.

గతంలో ఒకనాడు ఏదో మాటవస్తే ఈ మరది—

"నీ మాటకు ఈ యింట్లో తిరుగెక్కడిది? నీ ఆజ్ఞలేకుండా స్వర్గానికి వెళ్ళేవాడు కూడా ఈ యింట్లో లేడు" అంటే—

"ఏం. ఈమధ్య బెంగాలీ సాహిత్యమేమన్నా చదువుతున్నావా?" అంటూ తేల్చిపారేసింది తను. అలాంటి ఇంట్లో నేడు ఒక దోషిగా ఎలా నిలువగలుగుతుంది తను

"అదేమిటక్కా. మబ్బులేని వానలాగ ఊడిపడ్డావ్?" అంటూ సురేఖ ఊపేసరికి తెలివిలోకి వచ్చిందిశోభ.

● ఒకవృద్ధుడు: నా చిన్నప్పటి కోరికల్లో ఒక్కటిమటుకే నెరవేరింది.

రెండో వృద్ధుడు: ఏమిటది?

మొదటి వృద్ధుడు: మా మేష్టరు నన్ను స్తమానం జుట్టుపట్టి గుంజేవాడు. జుట్టు లేకపోతే ఎంతబావుండును అనుకునేవాణ్ణి.

"ట్యూషన్ టైమయిందా సురేఖా."

"కాదక్కా! అమ్మకు వారం నుండి జ్వరం. ఈ రోజు పథ్యం పెట్టమన్నారు. పిన్ని నడిగి కొంచెం నిమ్మకాయవచ్చడి తీసికెళ్దామని వచ్చాను. రాజా మృదంగం, వీణ విన్నావా? ఎంత బాగా వాయిస్తున్నాడని. అక్కా! నే చెపుతున్నా చూడు. మళ్ళీ సంవత్సరం ఆలిండియా కాంపిటిషన్‌కు పంపుతాను." అంటూ లోపలకు వెళ్ళింది సురేఖ.

అబ్బ! సురేఖ ఎంత మారింది? రెండు సంవత్సరాల క్రితం ఆ వీధిలో ఒక పెంకుటింట్లో దిగారు సురేఖవాళ్ళు. సురేఖకు అమ్మ, మామయ్య, అత్త తప్ప ఎవరూ లేరు. అత్త అచ్చు సినిమాలో సూర్యకాంతం అంటుంది సురేఖ. చిన్నప్పటి నుంచి సురేఖను వాళ్ళమ్మ అల్లారుముద్దుగా పెంచింది. చదువుతోపాటు వీణకూడా నేర్పించింది. అసలే సురేఖది శ్రావ్యమైన కంఠం. దానికితోడు వీణ మీటుతుంటే హృదయ తంత్రులను మీటుతున్నట్లు వుంటుంది. సురేఖ స్కూలుఫైనలు ప్యాస్‌కావడం, వాళ్ళమ్మ ఆరోగ్యం దెబ్బతినడం యించుమించు ఒకసారే జరిగాయి. సురేఖను ఒంటరిదాన్ని చేయటం ఇష్టంలేక అన్నదగ్గరకు వచ్చి వున్న డబ్బు, నగలతోపాటు సురేఖనుకూడా అన్నకు అప్పగించింది. ఫలితం—సాధారణంగా చాలమంది అన్నలు చేసినట్లు ఆ డబ్బు దస్కం తీసుకోవడమే కాకుండా సురేఖ టీచరుచేసి సంపాదిస్తున్న జీతం, సంగీతం ట్యూషన్ల జీతంకూడా హరిస్తున్నాడు మామయ్య.

అభిమానవతియైన సురేఖ మావయ్య పద్ధతులు, అత్త సూటీపోటీ మాటలు గిట్టక వేరే వెడదామంటుంది. కాని తనుఎన్నాళ్ళో బ్రతకనని, సురేఖ వంటరిగా వుండటం మంచిదికాదని తల్లి అభిప్రాయం. ఇలాంటి సురేఖ పరిచయం శోభకు తమాషాగా కలిగింది..ఒకరోజు శోభ, వాళ్ళ తమ్ముడు (పెద్దనాన్న కొడుకు) రాజా బజారునుండి వస్తూ, ఆ ఇంట్లోనుండి వినబడిన వీణా నాదానికి తన్మయులై ఇంట్లోకి వెళ్ళారు. సురేఖ తల్లిని చూస్తే శాంతి అహింసలకు మారురూపమేమో అనిపిస్తుంది. ఆ మొదటి పరిచయంలోనే సురేఖను రాజాకు వీణ నేర్పడానికి మాట్లాడి తీసికొనివచ్చి పెదనాన్నకు పరిచయం చేసింది.

"అక్కా సాయంత్రం మళ్ళీవస్తాను. ఇప్పుడు అమ్మకు అన్నం పెట్టాలి." అంటూ వెళ్ళింది సురేఖ

"అక్కా, ఈరోజు సినిమాకువెడదాం." అన్నాడు రాజా.

"నే రాలేనురా బాబూ" అంది శోభ.

"ఎందుకు రావు? పిక్చరుపేరు వింటే పరిగెత్తుకొస్తావ్! ఏమిటో తెలుసా? సాహెబ్ - బీబీ ఔర్‌గులాం. గురుదత్ పిక్చరు మిస్ అవుతావా?" అని ఊరించాడు రాజా.

"ఏం శోభగారూ! మనవాడు చూస్తే ఇంతవున్నాడో లేడో గురుగత్తును పొగడుతున్నాడు" అంటూ ప్రవేశించాడు రమణ.

"అహా! అంతేనా. ఇప్పుడు శంకర్, జైకిషన్‌లు ఎన్ని పిక్చర్లకు మ్యూజిక్ యిస్తున్నారో, షకీల్ బదాయూనీ ఎన్ని పిక్చర్లకు పాటలు రాస్తున్నాడో కూడా చెపుతాడు. కాని, అద్దాలకు ప్రసిద్ధి చెందినదేశం, ఏదీ అనండి బ్బెబ్బెబ్బె అంటాడు."

"ఏమీ అనను అద్దాలకు ప్రసిద్ధి చెందిన దేశం బెల్జియం. నాకు తెలీదా," అని అందుకున్నాడు రోషంగా రాజా.

"కరెక్టు నీకన్నీ తెలుసు. వెళ్ళి అన్నయ్యను లేపు. పిక్చరుకు వెడదాం" అన్నాడు రమణ.

"ఓ. కే" అంటూ పరుగుతీశాడు రాజా.

"రాజా చాలా తెలివిగలవాడు. వీడిని చూస్తుంటే భగవంతుడు కళలన్నీ వీడిలో పోసి సృష్టించాడా అనిపిస్తుంది. మొన్న బాలానందం ఫంక్షన్‌లో వీడు వీణ వాయిస్తుంటే హాలంతా ఎంత నిశ్శబ్దంగా వుందనుకున్నారు? చీమ చిటుక్కుమంటే ఒట్టు. మీరు గమనించారో లేదో వాడు బొమ్మలు కూడా బాగా వేస్తాడు మన ప్రోత్సాహం వుంటే మంచి చిత్రకారుడవుతాడు."

"అవును రమణగారూ! పెదనాన్న వాడికి ఇప్పటికే విశ్రాంతిలేదు అంటున్నారు. ఇప్పట్లో అది కుదరదు. కాని వాడిని చూసినప్పుడల్లా ఇంత చక్కటి బిడ్డను కని, వానిని పెంచుకోడానికి నోచుకోలేని ఆ తల్లి మీద జాలికలుగుతూ వుంటుంది. పెద్దమ్మ ఎన్నో సంవత్సరాలు బిడ్డకోసం తపించిపోయింది. కాని వీడు పుట్టిన తర్వాత అయిదేళ్ళకూడా బ్రతుకలేదు. అసలు వీడు నాలుగేళ్ళ వయస్సులోనే డబ్బాలమీద, వంటింట్లో పళ్లాలమీద ఎప్పుడూ మద్దెల వాయిస్తూ వుండేవాడు ఎప్పుడూ మోతచేస్తాడని పెద్దమ్మ అవి అందకుండా దాచేది. ఏదీ అందకపోతే వాడు బల్లలమీద, తలుపుల మీద వాయించేవాడు. ఆ రోజుల్లో నాన్నగారి స్నేహితుడు ఒకాయన తబలిస్టు మనయింటికి వచ్చినప్పుడు వీడు చాల బాగా వాయిస్తాడని, తప్పక మృదంగం నేర్పించమని చెప్పారు. అప్పుడుగాని మేము వాడు వేస్తున్నదానిలోని లయ గమనించలేకపోయాము."

"అక్క ఎందుకురాదో నేను చూస్తాను పద అన్నాడు అన్నయ్య. కాబట్టి అక్కా బి-రెడీ" అంటూ పరిగెత్తాడు రాజా.

"నిజ. గా తల్లిలేకపోయినా రాజా అదృష్టవంతుడు" తృప్తిగా నిట్టూర్చాడు రమణ.

హృదయంలో ఎంత ఆవేదనవున్నా ఇలాగే స్నేహితులతోనూ, రాజాతోనూ, అమ్మ అన్నయ్యల ఆదరణతోనూ శోభకు రోజులు దొర్లిపోతున్నాయి.

5

మనస్సులు బావున్నా లేకపోయినా, కష్టాల పరంపరలతో జీవితాలు దుఃఖభూయిష్ఠాలు అవుతున్నా, కాలం దానిదారిన అది నడిచిపోతుంది. మంచిమనస్సులు వక్రించాయంటే కాలమే దానిని సరిదిద్దాలి కాని మానవుడేమీ చేయలేడు.

ఉదయాన్నే లేచిన మధు తోటలో కొంచెంసేపు పచార్లుచేసి సిమెంటు బెంచీ మీద కూర్చున్నాడు. చేతి మీద పడిన మంచుబిందువులను చూడగానే ఒక్కసారి క్రిందికి చూపు మరల్చాడు. మంచుబిందువులచే కప్పబడిన గడ్డి కనిపించింది. దానితో పాటు -

"చూడండి పచ్చని తివాసీమీద రవ్వల్లా ఎలా మెరిసిపోతున్నాయో మంచుబిందువులు" అనే శోభమాటలు గుర్తువచ్చాయి.

"ఆహా! ఆ రవ్వలు ఏరి నీకొక నెక్లెసు చేయించనా" అని నవ్వేవాడు తను.

ప్రకృతిని చూసి శోభ పరవశురాలైతే, ఆమెనుచూసి తాను పరవశుడయ్యేవాడు. అబ్బ! తాను ఎంతగా ప్రేమించాడు ఆమెను. కాని శోభ ఎందుకిలా చేసింది? తాను ఏమి అన్యాయం చేశాడని? పువ్వుల్లో పెట్టి పూజించాడే! దేవతలాగ ఆరాధించాడే! అలాంటి భర్తపట్ల ఇంత అన్యాయం చేసి అతని మనశ్శాంతిని దోచుకొనేదికూడా స్త్రీయేనా? కాదు....రాక్షసి....ఇన్నాళ్ళా ఆ రాక్షసిని తాను దేవతగా భ్రమించాడు.

"నీ ముఖంలాగుంది. నే చదువుతాను చూడు. ప్రేమ వ్యవహారం తెలీకపోయినా కనీసం యాక్ట్‌చెయ్యటంకూడ రాకపోతే ఎలారా?"

వెనుకకు తిరిగిచూచిన మధుకు రమేష్, స్నేహితుడు వేణు పొగడచెట్టుక్రింద కనిపించారు. లేచి వారివైపు నడక ప్రారంభించాడు మధు.

"నా శరీరమైతే యిక్కడుంది గాని మనస్సు మీ చుట్టూ పరిభ్రమిస్తున్నది. నా యీ మూగ హృదయ ఘోషను మీ కెలా విన్నవించుకోను? శరీరంలోని ప్రతి అంగమూ, నాలోని ప్రతి రక్తపుచుక్కా మీ పేరునే ఉచ్చరిస్తున్నాయి. నా హృదయాన్ని ముక్కలుచేసినా ఆ ముక్కలు మిమ్మలనే స్మరిస్తాయి."

"వేణూ"

మధు వేసిన పిడుగులాటి కేకకు వేణు రమేష్ అదిరిపోయి అటుచూశాడు. కోపాన్ని అణచుకొంటూనే వేణు చేతిలోని కాగితాలు తీసుకొన్నాడు అవును అదే నీలంరంగు లెటర్‌పాడ్ కాగితం. శోభ వ్రాసిన ప్రేమ కలాప సంభాషణ వణికిపోయాడు మధు

"ఏమిటిది రమేష్. ఇది వదిన వుత్తరం కాదా!"

"బలే వాడివన్నయ్యా. ఎల్లుండే గా యానివర్సరీ. అందులో డ్రామాలో నేను వీడిని ప్రేమిస్తావన్నమాట. అదే పోర్షన్ చదువుకొంటున్నాము."

రమేష్ అచ్చు అమ్మాయిలాగే వుంటాడు. స్టేజిమీద మీరు చూసి తీరాల్సిందే." అన్నాడు వేణు.

"అయితే వదిన ఎందుకు రాసింది ఇది" మధు అనుమానంగా అడిగాడు.

"నేనే టైమ్‌లేక వదినతో వ్రాయించుకొన్నాను."

"అది సరేగాని రమేష్, ఈ కాగితాలు ఎవరికైనా యిచ్చావా? ఆలోచించిచెప్పు."

"ఎవరికీ యివ్వలేదుగాని ఆరోజు శేఖరు గారు చదువుతూ చదువుతూ మర్చిపోయి జేబులో పెట్టి కెళ్లానని మర్రోజు తెచ్చి ఇచ్చారు."

కొయ్యబారిపోయాడు మధు.

"ఏం అన్నయ్యా. అలా అడుగుతున్నావ్?"

"అబ్బే. ఏంలేదురా." అంటూ భారంగా అడుగులు వేసుకొంటూ వెళ్ళాడు. ఛీ! తానెంత నీచంగా ప్రవర్తించాడు. ఇటు కట్టుకొన్న భార్యనూ అటూ ప్రాణస్నేహితుణ్ణి ఎంత నీచంగా ఊహించాడు. ఆరోజు శేఖర్ బల్లమీద ఈ కాగితాలు చూచి తానెంత అపోహ పడ్డాడు! తాను శోభను ఎందుకడగలేదు? ఓహ్! అద్దంలాంటి శోభ మనసు పాడుచేశావే? ఏం చెయ్యాలి? శోభను క్షమాపణ కోరేవరకు మనసు నిలవడం లేదు.

"బాబుగారూ! సిన్న మీకు వచ్చిన వుత్తరాలు" అంటూ నౌకరు బల్లమీద నాలుగు కవర్లు, రెండు కార్డులు పెట్టిపోయాడు. పై కవరుమీద ముత్యాలకోవలాంటి అక్షరాలను అప్రయత్నంగా ముద్దుపెట్టుకొని కవరు చింపాడు మధు. రెండే రెండు ముక్కలు వ్రాసింది శోభ.

"మీకు అవసరం వున్నా లేకపోయినా, ఆనందం కలిగినా కలుగకపోయినా నా బాధ్యత గనుక తెలుపుతున్నాను. మీరు తండ్రి కాబోతున్నారు."

ఆనందంతో "అమ్మా" అంటూ పెద్దగా అరిచాడు మధు.

"ఏమిట్రా ఆ కేకలు" అంటూ అమ్మ వచ్చింది.

గబగబా నాలుగు గుడ్డలు సూట్‌కేసులో కుక్కుకొని,

"అమ్మా నేను బందరు వెడుతున్నా నమ్మా. నీకు మనుమడు పుడతాడట" అంటూ బయటకు పరుగుతీసి "డ్రైవర్. కారు బయటకుతీయ్" అని కేకపెట్టాడు.

"అదేమిట్రా! వట్టిచేతులతో ఎలా వెడతావ్. కోడలు వట్టిమనిషికూడా కాదాయె. మిఠాయిలు, పళ్ళు తీసికొని రేపు వెడుదువుగాని" అంటూంటే-

"అవన్నీ తీసికొని రేపు నువ్వురా. నే నిప్పుడే వెడతా" అంటూ కారుడోర్ మూశాడు.

"పిడి సంబరం బంగారంగాను. లేడికి లేచిందే పరుగని యిలా బయల్దేరాడేం!" అంటూ దవడ నొక్కుకుంది సుందరమ్మ గారు కొడుకు-కోడళ్ళ మధ్య జరిగిన కథ తెలీక.

□□□

-అక్కల సరస్వతీ బాబూరావు

● జ్ఞాపకశక్తి ఎక్కువకావడానికి ఏవో మందులు తింటున్న ఆసామీని మరొకడు:

"ఇప్పుడెలా వుందండీ, మీ జ్ఞాపకశక్తి?"

"కొంత ఫరవాలేదండి; ఏదో మరిచిపోయినట్టు జ్ఞాపకం రావడందాకా వచ్చింది — అదేదో జ్ఞాపకం రాకపోయినా."

పాలతెలుపు నీలంకవరు



రావు దంచికొట్టేస్తున్నాడు – అంతా నోళ్ళు తెరుచుకుని వింటూన్నారు.

ఓఢ్ర దేశం అంతా ఆవనూనే వాడతారు. ఆవనూనె వేడి అయినా ఆ దేశానికి అది పడుతుంది.

మళయాళీలు కొబ్బరినూనె వంటినే పోసేసుకుంటారు. వారి ఆచార వ్యవహారాలు వేరు. ఆడవానికి తండ్రి ఆస్తి వెడుతుంది. మేనల్లుడికే రాజ్యం అన్నాడు.

ఆపైన కాఫీలు త్రాగారు అందరూ. రావు మాత్రం టీ తెమ్మన్నాడు. కాఫీ పైత్యం-ఆకలి చంపుతుంది. టీ ఆకలిని పుట్టిస్తుంది. హాట్ డ్రింక్స్ అంటే బ్రాంది. విస్కీ వగైరాలు కూడా కాఫీ కన్న మంచివే. కాఫీ అంత భయంకరమైనది.

ఈసారి కాఫీలు త్రాగుతున్న వారంతా తెల్లబోయి చూశారు. సులోచన మరీ కంగారు పడింది. ఆమె రామకృష్ణరావు భార్య. చదువుకుంది. కోలముఖం. అందమైన కళ్ళు. పాల తెలుపు. నొక్కు-నొక్కులజుట్టు.ఆకర్షించేవంటితీరు. బ్రాకేడ్ జాకెట్టు తొడిగింది - పెరిలిన్ పెద్ద పువ్వుల నీలిరంగు చీర కట్టింది. మెళ్ళో గొలుసు. చేతులకు గాజులు. చాలా అందంగా వుంటుంది. ఆమె కంగారుపడింది. కాఫీ అంటే రావుగారికి ఇంత అయిష్టమా అని -

రామకృష్ణ నవ్వేసి - 'ఉప్మా ఎలా చేస్తారట' అన్నాడు ఉడికించడానికి. రావు సీరియస్‌గా తీసుకుని. నీటుగా ఆ విషయం అంతా చెప్పేడు. బొంబాయి రవ్వ, గోధుమ రవ్వ ఈ రెంటి తేడాలతోసహా. ఇతనికి నిజంగానే తెలుసు అనుకున్నారు. ఈగలు వాలాయి ఓ కప్పుమీద - 'ఇవి సంగీతం వినగలవు తెలుసా' అంటూ షెర్‌లాక్ హోమ్స్ అంతా చెప్పేసి. స్పానిష్ ఆర్మడా అంత పెద్ద నౌకాబలాన్ని అంతటినీ, ఇద్దరూ సాధారణ బ్రిటిష్ పౌరులు ఎలా గెలిచింది చూసినట్టు చెప్పేశాడు: డ్రేక్, హాకిన్స్. తనూకలిసిచేశారా అవని అన్నంత బాగా -

శివం, అచ్యుతరామయ్య. గురునాథం, రామకృష్ణ, సులోచన-అంతా వింటూన్నారు. నేను నరేసరి సిగరెట్ తీసుకుని కాల్చుకున్నాను. 'వెధవగోల ఎప్పుడూ ఉండేదే' అని . .

వాడు ఊరుకుంటేనా "జీసస్ చరిత్రలో పదేళ్ళకాలం అసలు చరిత్రకారులకే తెలియదు. ఆ కాలమంతా ఆయన మనదేశంలో బౌద్ధులతో కలిసి ప్రసంగించాడు. అందుకే జాతక కథలు ప్రాక్టికల్స్ ఓలాగే ఉంటాయ్" - అన్నాడు.

సులోచన విచిత్రంగా చూస్తోంది-తతిమావారు 'వీడెక్కడివాడురా! అబద్ధం' అన్నట్టు చూశారు .

గురునాథం బి. ఏ., బి. యల్. వకీలు-ఈ హోటలులోనే మకాం చేశాడు. మూడు రోజులుండి దగ్గర లోయలుచూసి పోదామని-

అట్లాగే అచ్యుత రామయ్యగారు గుంటూరులో ఎఫ్. సి. ఏ., చాలా లీడింగ్ చార్టర్డ్ ఎకౌంటెంట్. సరదాగా వచ్చాడు ఒక్కడూ. శివం ఉన్నవాడు-ఏదో ట్రాక్టర్స్ వ్యాపార విషయంలో వచ్చాడు బిజినెస్‌మన్.

రామకృష్ణ డేవిడ్ అండ్ గోలియత్ కంపెనీలో సేల్స్ రిప్రజెంటేటివ్ - నెలకు ఐదారు వందలు వస్తాయి. ఎప్పుడూ తీరుబడే ఉండదు. ఓ వారం రోజులు శెలవు పెట్టి. ప్లెజర్ ట్రిప్‌గా వచ్చాడు భార్య సులోచనతోసహా. అంతా యీ హోటల్లోనే దిగడం కొంచెం యించుమించు అందరి ధ్యేయం వెకేషన్‌కోసం రావడమే కాబట్టి స్నేహితులయ్యారు. ఊరుచూడ్డం, కబుర్లాడుకోడం, కాలక్షేపం. అందుకనే ఒకటయ్యారు. పైగా ఈ మరాఠా దేశంలో తెలుగువాళ్ళు. యీ హోటల్లో దిగినవాళ్లు. వాళ్ళే కాబట్టి ఒకటి రెండు రోజుల్లోనే ఎక్కువ స్నేహంగా మసలారు. వారు దిగింది పూనాలోని చక్కటి హోటల్సులో ఒకటి.

ఇంకేంతా - రెండు మూడు రోజుల్లో ఎవరివూళ్ళకి వాళ్ళు వెళ్ళిపోతారు.

అప్పటిదాకా రమ్మీ ఆడుకున్నారు ఆ వేళమధ్యాహ్నం. ఆ తర్వాత నేనూ రావూ వెళ్ళగానే ఆట కట్టేసి రావుని మాట్లాడమన్నారు.

రావు ఇంటిపేరూ రావే. రావుకి ప్రపంచంలో ఉన్న అన్నీ తెలుసని నమ్మకం. అన్ని విషయాలు కూలంకషంగా మాట్లాడ

ఆదుర్తి వెంకట నరసింహమూర్తి

గలడు. చూస్తే పనిగట్టియ్యగలడు: ఈ విషయం ఈ రెండురోజుల్లో వాళ్ళకి తెలిసి పోయింది.

సిగరెట్లు ఎలా తయారవుతాయి?

సినిమాలు ఎలా తీస్తారు?

బంట్రోతు ఉద్యోగంలో సాధక బాధకాలు -

బంజర బయళ్ళు ఎలా సాగులోకి తీసుకురావచ్చు - చెప్పాడు చాలాసేపు: మొదట పెళ్ళిళ్ళు ఎలా వుండేవి. సెక్సు. దాని మంచిచెడ్డలు. ఫ్రాయిడ్ -

డాస్టోవ్‌స్కీ గొప్పతనం.

అక్కడితో ఆవలేదు. సైకాలజీ, సైకియాట్రీ. ఇవేమిటి? సినిక్ ఎలా తయారవుతాడు. సమాజానిది ఎంతదాకా బాధ్యత. క్లెప్టొమానియా - అంటే సరదాకి దొంగతనం చేయడం. ఎలా అరికట్టవచ్చు. సైకో ఎనాలిసిస్. సైకో సినిమా - ఆస్కార్ వైల్డు. ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్. డంకన్. డగ్లస్. శ్రీశ్రీ గేయం. చలం సాహిత్యం మినప్పప్పు పచ్చడి. పచ్చ కర్పూరం వెంకటరమణమూర్తికి ఎంత ఖర్చవుతుంది? స్టేట్ ట్రాన్స్‌పోర్టు. ట్రాఫిక్ రూల్సు. ఆడపిల్లల పద్ధతి. హారిజాంటల్‌బార్. బందిపోటుల పద్ధతి. డిటెక్టివ్‌ల వేర్పు. అన్నీ చెప్పుకు పోతున్నాడు.

రామకృష్ణా సులోచనా దంపతులకు కూడా రావంటే ఇష్టం ఏర్పడింది. శివం. అచ్యుతరామయ్య. గురువాధం బలే ఇదయ్యారు.

ఆవకాయ పెట్టడందగ్గరనుంచి హైడ్రోజన్ బాంబుదాకా కూలంకషంగా తెలుసుకున్న రావు కబుర్లు ఉల్లాసం ఇచ్చాయి. అతనికి 'సర్వజ్ఞుడు' అని బిరుదు ప్రసాదించి. గులాబీపూల మెళ్ళో వేశారు.

ఈ సాయంత్రం మళ్ళీ అందరం అచ్యుతరామయ్యగారు తీసుకున్న హోలు గదిలో జేరాము. ఫేన్ తిరుగుతోంది. కూల్ డ్రింక్స్ త్రాగాము. అంతా మస్తాబై ఉన్నాం. ఓ గంట రావుని విని ఏ సినిమాకన్నా పోదామనీ.

నీలంరంగు నైలాన్ చీరె. నీలంరంగు నైలాన్ జాకెట్టు. మెళ్ళో మాంఛి మెరిసే నెక్లెస్. వీటితో ముస్తాబైంది సులోచన. సులోచన కళ్ళు మెరుస్తూఉంటాయి. సంతోషంవస్తే మరీనూ!

సర్వజ్ఞుడు కీ ఇచ్చిన గ్రామఫోనులా మొదలెట్టాడు.

ఎన్‌సైక్లోపీడియా తెరిచినట్టే.

సెక్ సై-దాని పుట్టుక.

ఫ్రెంచిదేశపు బా.

అమెరికన్ అవుట్ ఫిట్టర్స్.

కాస్సేపు ఇవి మాట్లాడి తెలుగుదేశపు స్త్రీల ఆభరణాలలోకి దిగిపోయాడు.

పాపిడి పిందెలు.

జిగిపి గొలుసు.

దండకడియం.

పొంజేబు పట్టాలు.


అందెలు. కడియాలు.

వడ్డాణం. నాగరం. చామంతి పువ్వు. వీటి విలువలు - ఇవి ఆధునికంగా ఎలా రూపెత్తాయో. ఆ వివరాలూ!

శివం. అచ్యుతరామయ్య వాళ్లూ మురిసిపోతున్నారు.

రామకృష్ణ. బాగా వయస్సులోవాడు. బురిడీకొట్టించాలని సరదా!

'అలాగేం! అయితే యీ నెక్లెస్ ఖరీదెంతుంటుందీ?' అన్నాడు తన భార్య మెళ్ళో నెక్లెస్ చూపెట్టి -



వినురుగా మాట్లాడేస్తున్న రావు అంత వేగంలోనూ -

'దానికేం ఆరుకాసుల బంగారం-ఖరీదైన అసలు వజ్రాలు-తొమ్మిదివేల చిల్లర' అనేశాడు. అంటూ రామకృష్ణవంక, మావంక చూశాడు.

రామకృష్ణ పగలబడి నవ్వి 'అయింది సర్వజ్ఞుడి రంగు తేలింది' అన్నాడు.

'ఏం? ఏం? ఏం?' అన్నారు అంతా చాలా ఆదుర్దాగా!

నీలంరంగు దుస్తుల్లోని సులోచన కళ్ళప్పజెప్పి చూస్తోంది.

రావు మరోసిగరెట్టు టకాలున ముట్టించాడు -

రామకృష్ణ. నవ్వుతూనే 'మిష్టర్ రావ్! నేనేం జమీందారుని కాను. రెక్కలాధారం - కనీసం ఈ రెండు రోజుల్లో మీ కా విషయం తెలుసు - అది తెలిసేనా మీరు ఆ నెక్లెస్ ఖరీదుకట్టవచ్చే-'

రావు వెంటనే-

'నోనో-నా లెఖ్ఖ తప్పదు కావాలంటే పందెంవేస్తాను-

ఇంతకీ అదెంతంటారూ?'

రామకృష్ణ ఈసారి నవ్వకుండానే-

'నకిలీ బంగారం, గాజురాళ్ళు-

మోజుపడి. మోడల్ బావుందని.

మా ఆవిడ కొనుక్కుంది.

ఐదు పందలు.'

రావు చాలా ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో-

'ఇంపాసిబుల్' అంటూ అరుస్తూ సులోచనవైపు తలతిప్పాడు. అప్పుడా అమ్మాయి రావువంక చూట్టంలేదు.

రామకృష్ణ ఇంకా హుషారుగా 'బెట్' అన్నాడు.

రావు తగ్గలేదు. 'ఓ యస్. పందెమే!' అన్నాడు.

రామకృష్ణ అట్టుడికిపోయినట్టు.

'కమాన్ ఎంత?'

'ఐదు వందలు !'

'మాట తప్పకూడదు'

'నాన్‌సెన్స్, నా మాటకు తిరుగుండకూడదు'

రామకృష్ణ ఇంకా సీరియస్‌గా

"నకిలీదైతే మీరు నాకు ఐదువందలు ఇవ్వాలి.

నిజంగా మీరు కట్టిన ధరదైతే నేను ఇవ్వాలి. అంతేగా?"

'అంతే!'

అప్పుడు రామకృష్ణ 'అయినా ఎందుకేనా మంచిది. వివరంగా చూసుకుని మరీ మాట్లాడండి' అంటూ సులోచన మెళ్లో నెక్లెస్ తియ్యబోయాడు.-సులోచనే తీస్తోంది తల ప్రక్కకు తిప్పుకుని. రావు 'అక్ఖర్లేదు. అది షోరూమ్‌లో ఉండేనే ఖరీదుకట్టగలనే. ఎదురుగా దానికి తియ్యాలా-వద్దు"అన్నాడు.

అంతా చాలా ఉబలాటంగా, ఉద్రేకంగా ఉన్నారు. నా కంగారు నాది. ఎక్కడి దిక్కుమాలినసంత అని.

విజిట్ కోసం వచ్చిన శివం 'పదండి - అయితే - గోవర్ధనదాస్ అండ్ మురళీదాస్ జ్యూయలర్సుకి వెళ్ళదాం!'

పదండి అంటే పదండి అనుకున్నారు.

'నా కారులో అంతా పట్టాం' అన్నాడు అచ్యుతరామయ్యగారు -

ఆయన పెద్దమనిషి. 'ఈసరదాచూడాలి' అని ఉత్సాహం! -

అంతా ముందు నడిచాం. సులోచన వెనకాల వస్తోంది.

స్టీరింగ్ వద్ద అచ్యుతరామయ్యగారు కూర్చున్నారు. ప్రక్క నేనూ, నా ప్రక్క రావూను. ఈ చివరగా వెనుకవరుసలో సులోచన, ఆమె ప్రక్క రామకృష్ణ, తర్వాత శివం, తర్వాత గురునాధం కూర్చున్నారు

నడిబజార్లో కారువెడుతోంది. ట్రాఫిక్ ఎక్కువగాఉన్నా కారు వేగంగానే వెడ్తోంది. ఆరుమైళ్ళుంది అక్కడికి గోవర్ధనదాస్-మురళీదాస్ కంపెనీ.

మధ్యమధ్య రామకృష్ణ-రావ్‌ని హెచ్చరిస్తూన్నాడు.

"నిష్కారణంగా ఐదువందలు - ఆలోచించుకోండి" అంటూ. అందుచేత రామకృష్ణతో మాట్లాడ్డంకోసమే రావు మధ్య మధ్య వెనక్కుతిరిగి రామకృష్ణ వైపుచూస్తూ

"లేదు బ్రదర్. మీరబద్ధం చెప్పారు. అది పదివేలే!" అని ఖచ్చితంగా అంటున్నాడు.

ఇంతసేపూ తల అవలివైపు త్రిప్పుకొని గ్లాస్ విండోలోంచి బయట జనాన్ని చూస్తున్న సులోచన ఈసారి చటుక్కున తల యిటుతిప్పి రావుని చూసింది.

అప్పుడు రావు ఆమెను చూశాడు.

ఆమె కన్నులల్లార్చి తల త్రిప్పేసుకుంది బయటి జనంవేపు.

కారు టర్నింగ్ తిరుగుతోంది.

ఇంక అవతల ఫర్లాంగు దూరంమటుపే ఆ జ్యూయలర్స్ కంపెనీ -

రావ్ ఏదోఆలోచిస్తున్నాడు. ఉన్నట్టుండి చటుక్కున పర్సుతీసి 'వెరీసారీ రామకృష్ణగారూ! ఇంతదాకా తెస్తారు అనుకోలేదు. నేనే ఓడిపోయాను. ఇవిగో ఐదు వందలు" అంటూ ఐదు వంద రూపాయల నోట్లు వెనక సీట్లోకి అందిస్తున్నాడు. అచ్యుతరామయ్యగారు కారుక్రింద మనిషి పడిపోతే ఆపుచేస్తారే అలా ఆపేశారు. దిగ్భ్రాంతి చెందారు అంతా!

రామకృష్ణ, పగలబడినవ్వుతూ

'వాట్! ఏమైంది సర్వజ్ఞుడి పని - అయితే నకిలీవేనా!'

'ఓయస్!'

'మరి కారువెనక్కుతిప్పేయమంటారా?' అన్నాడు అచ్యుతరామయ్యగారు -

'ప్లీజ్. తప్పకుండా!' అన్నాడు రావు - పాపం! సిగ్గుపడిపోతున్నాడు రావు అని అంతా గుర్తించారు - రామకృష్ణ డబ్బుక్కర్లేదన్నాడు.

'ప్లీజ్ పందెం పందెమే!" అంటూ - ఆయన చేతుల్లో పెట్టేశాడు.

కారు మళ్ళీ హోటల్ పోర్టికోలోకొచ్చి ఆగింది - అంతా కిలకిలా నవ్వుతూ దిగేశారు. రావు వీపు నచరిచి అచ్యుతరామయ్యగారు.

'డోంట్ వరీ, మీరు చెప్పేవి నిజం అయినా కాపోయినా చాలా బాగా ఉంటాయ్' అన్నాడు. రావు ఆదోలా చూసి 'అ, ఎప్పుడూ నిజమే అవుతాయి టండి. అంటూ వచ్చేశాడు.

ఎవరి గదికి వారు వెళ్ళిపోయారు.

మా గదిలోకి మేము వచ్చాం. అపాదమస్తకం దహించుకుపోతోంది నాకు.

'ఓరి వెధవా! నీ సర్వజ్ఞత తగులబడిపోనూ! ఐదువందలు తగలేసుకున్నావ్! బుద్ధొచ్చిందా? ఇప్పుడు కొంప ఎలా జేర్తావ్? మళ్ళీ ఆ ముసలానిది రెండొందలు టి. ఎమ్. వో. పంపాల్సిందేనా? ఒరేఒరే ఆ తల్లిని నానావిధాల ఏడిపిస్తున్నావురా! ఇంకైనా "అన్నీ తెలుసు" అని గప్పాలు కొట్టకు" అని గద్దిం పెట్టాను.

వాడు నవ్వుతూ పక్కమీద వాలి,

'నాకన్నీ తెలుసురా!' అన్నాడు ధీమాగా!

'ఛీ! సిగ్గులేని వెధవా! ఇంత జరిగినా నీ బుద్ధి నీకు!' అని అపెంకి ఘటంతో ఎందుకని - ఫ్లాస్క్‌లో కాఫీ త్రాగి పడుకున్నాను.

ఆరాత్రి పన్నెండు దాటింది. నాకేమిటో నిద్రపట్టలేదు. వాడు నిద్రపోయాడో లేదో నాకేం తెలుసు అంతరాత్రివేళ మా గది బయట - మాగది తలుపువద్ద అవతల వరండాలో అలికిడి అయింది.

లేచాను.

రావులేచి 'ష్! అని సంజ్ఞగానే 'నాకన్నీ తెలుసురా' అన్న నటన చేసి చూపాడు. చంపేద్దామనుకున్నాను

ఇంతలోనే గది తలుపుకు, నేలకు మధ్యనున్న సందులోంచి ఒక నీలం కవరు లోపలకు వచ్చింది. మెల్లిగా వెళ్ళి ఆశ్చర్యంగా తీశాను 'ఏమిటా?' అని. రావు నవ్వుతూ ఫ్లాస్కులో కాఫీ పోసుకుని త్రాగుతూ - దగ్గరగా వచ్చి 'వెధవా! నాకన్నీ తెలుసురా!' అన్నాడు రహస్యంగా, గంభీరంగా.

కవరులో పది వంద రూపాయల నోట్లు ఒక ఉత్తరం ఉన్నాయి. ఉత్తరంలో ఇలా ఉంది


"రావుగారికి,

మీకు అన్నీ తెలుసు.

మీరే పందెం గెలిచారు. నేను ఆ నెక్లెస్ పదివేలకే కొనుకున్నాను. మీకు సర్వదా కృతజ్ఞురాలిని"

(సోమర్‌సెట్ మామ్ కథకు అనుసరణ)

□□□





(గతసంచిక తరువాయి)

కాని స్పృహ పోలేదు.

"మాట్లాడండి" అన్నాడతను.

"ఉహూ, నేను మాట్లాడను" జయంతి తల అడ్డంగా వూపింది. తనకసలు యేడుపెందుకు రావటంలేదో ఆశ్చర్యంగా వుంది.

"మాట్లాడు జయంతీ. భయం దేనికి. యిలా పిక్నిక్‌కి వెళ్ళివస్తున్నామని. లేటు అయిందని. యాక్సిడెంటు అయిందని చెప్పు."

"నేను చెప్పను. చెప్పను. మీకు తెలియదు" మరింత గట్టిగా తలూపుతూ అంది.

"ఇందాక సికింద్రాబాద్‌నుంచి వస్తుంటే లిఫ్టు యిస్తున్నానని చెప్పావు. మళ్ళీ ఇప్పుడు యిదా!" పోలీసు అధికారి కోపంగా అన్నాడు.

ప్రకాశం వాళ్ళ మాటలు లక్ష్యపెట్టలేదు. చేతిలో వున్న సిగరెట్ గుమ్మంలోనుంచి అవతలకు గిరాటెట్టి జయంతికి దగ్గరగావచ్చి "నువ్వు భయపడితే- లాభంలేదు జయంతీ" అన్నాడు.

జయంతి మాట్లాడలేదు. కళ్ళనిండా నీళ్ళు తిరిగినాయి. సబిన్స్పెక్టర్ మళ్ళీ ఫోన్‌లో మాట్లాడటం మొదలుపెట్టాడు "హలో. ఆ అమ్మాయి మాట్లాడటాని కిష్టపడటంలేదు బొత్తిగా. అతనేమో మాట్లాడమని బలవంతం చేస్తున్నాడు. ఆ-ఆ-యేమిటీ వర్ణించమంటారా?" క్షణంసేపు నెత్తిగోక్కున్న అతను జయంతివైపు చూస్తూ "యెలా-ఒకపనిచేస్తాం. ఎలాగో మీ నిద్ర పాడుచేశాం. మీరు ఒక్క నిమిషం అనుమతియిస్తే వీళ్ళని తీసుకుని మీ దగ్గర కొస్తాం. పదినిమిషాలకంటె యెక్కువపట్టదు - యిప్పుడే" అని ఫోన్ పెట్టేశాడు.

అంతా చెవులప్పగించి వింటున్న జయంతి కళ్ళు పెద్దవయినాయి. ఇప్పుడా! ఈసమయంలో యిలాటి పరిస్థితుల్లోనా అతని దగ్గిరకి వెళ్ళటం? జయంతి ఆలోచిస్తుండగానే పోలీస్‌వాన్ రాజశేఖరం యింటి ఆవరణలోకి వచ్చి ఆగింది.

శేఖరం ముందుహాల్లో సోఫాలో కూర్చుని వున్నాడు. ముందు వెళ్ళిన సబిన్స్పెక్టర్ని చూసి విష్ చేశాడు. వాళ్ళ వెనక పాలిపోయిన మొహంతో, చెదిరిపోయిన జుట్టుతో నిద్రలో నడుస్తున్నదానిలా వస్తున్న జయంతిని చూసి తెల్లబోతూ 'జయంతీ!' అంటూ లేచి నిలబడ్డాడు.

జయంతి చూపులు నేలకంటుకు పోయినాయి.

వచ్చినవాళ్ళు జరిగిందంతా చెప్పారు.

"ఫోన్లో మాట్లాడకపోతే నాకు అనుమానం వేసింది." అన్నాడు యెలాగో అయిపోయిన శేఖరం.

అతను మళ్ళీ జయంతివైపు చూడలేదు. ప్రకాశం ముందుకు వచ్చి జరిగిందంతా చెప్పాడు.

అతనెవరో శేఖరానికి తెలియదు. ఇంతకు ముందు యెక్కడా చూసినట్టుగూడా గుర్తు లేదు.

అతనే శివరామ్ స్నేహితుడనని చెప్పుకున్నాడు.

"సారీ సర్, మీకు ట్రబుల్ యిచ్చి వెళ్తున్నాం వస్తాం." కరచాలనంకోసం చెయి జాస్తూ అన్నాడు సబిన్స్పెక్టర్.

యద్దనపూడి సులోచనారాణి

"పర్వాలేదు. థాంక్స్." శేఖరం వాళ్ళని బైటవరకూ పంపించటానికి వచ్చాడు.

వరండా దిగబోతుండగా సబిన్స్పెక్టర్ "మరి ఆమె యింటికి." అన్నాడు సందేహంగా.

"నేను తీసుకెళ్ళి వాళ్ళవాళ్ళకి చెప్పి డ్రాప్ చేస్తాను." అన్నాడు శేఖరం.

ప్రకాశంగూడా వాళ్ళతో వెళ్ళిపోయాడు.

అందరూ వెళ్ళిపోయింతర్వాత వెంటనే బైటికెళ్ళి కారు గేరేజ్‌నుంచి తీసి బైటకు తెచ్చాడు. జయంతి మెల్లగా వచ్చింది. వెనక సీట్లో కూర్చుందామని వెళ్ళబోతున్న జయంతి అప్పటికే శేఖరం డోరు తెరచి పట్టుకోవటంతో ముందుసీటులోకి వచ్చి కూర్చోక తప్పలేదు.

అతనేం మాట్లాడలేదు. జయంతికూడా మాట్లాడలేదు. కారు యింటివగ్గర కొచ్చేస్తుండగా శేఖరం హఠాత్తుగా "ప్రకాశానికి నీకు ఎన్నాళ్ళనుంచి పరిచయం" అన్నాడు. అతని కంఠస్వరం మామూలుగా వున్నట్టే అనిపించినా అడిగే తీరు జయంతికి పూర్తిగా కొత్తగా అన్పించింది. ఏ సమాధానం చెప్పటానికి నోట్లోంచి మాటే రాలేదు.

కొంచెంసేపు సమాధానంకోసం ఎదురు చూచిన అతను జయంతి యేం మాట్లాడక పోవటంతో "చెప్పటం యిష్టం లేకపోతే ఫర్వాలేదు" అన్నాడు.

"శివరామ్ పరిచయం చేశాడు" ఎలాగో అంది జయంతి.

"శివరామ్‌తో నీ పరిచయం యెంత ? ఎన్నాళ్ళనుంచి ?"

జయంతి కెందుకో కోపంవచ్చింది. ఆ మాటకొస్తే రాజశేఖరం పరిచయం మటుకు యెంత ? ఆ రోజు మొట్టమొదటే యెన్ని ప్రశ్నలు అడగలేదూ తను.

"శివరామ్‌తో నీ పరిచయాన్నిగాని, ప్రకాశం పరిచయాన్నిగాని నేను కాదనటం లేదు జయంతీ. మనిషి అన్న తర్వాత స్నేహితులుగాని దగ్గిరవాళ్ళుగాని లేకుండా యెలా ? కాని, యివాళ వెంట్రుకవాసిలో యెంత అసహ్యాన్నుంచి తప్పించుకున్నావో చూడు. ఒంట్లో బాగాలేక నేను అనుకోకుండా తిరిగి రాకపోతే యీ రోజు యేమయ్యేది ? నీ ఖంగారుచూసి వాళ్ళకి మరింత అనుమానం కలిగిందని చెప్పారు. పోలీస్ స్టేషన్‌లో-అదెంత చిన్నదైనాసరే - పేరు రిజిష్టర్ కావటం యెంత భయంకరమో తెలుసా ; అందులో నువ్వు ఆడపిల్లవి వయసులోవున్నదానివి !" జయంతి చేతి గోళ్ళవైపు చూసుకోవటం తప్ప యేం మాట్లాడలేదు.

"ఇంత ఆలస్యంగా వస్తే మీ బామ్మ యేమీ అనదూ ?"

"భయపడుతుంది ముందు. నేను వెళ్ళగానే చీవాట్లువేస్తుంది."

"నే నింటిదాకావచ్చి యేదయినా చెప్పనా ?" కారాపుతూ అడిగాడు శేఖరం.

"థ్యాంక్స్. అఖ్ఖర్లేదు."

"రేపు కొంచెం త్వరగారావాలి-పనుంది" అన్నాడు.

దానికేం సమాధానం చెప్పకపోగా కనీసం వస్తాను అనిగూడా అనకుండా గిరుక్కున వెనక్కు తిరిగి యింటివైపు గబగబా అడుగులువేసింది

ఇంటితలుపులు దగ్గిరగా వేసివున్నాయి. లోపల లైటు వెలుగుతూనే వుంది. అంటే బామ్మ నిద్రపోలేదన్నమాట. జయంతి యింటి గుమ్మందగ్గరకి చేరుకున్న తర్వాత శేఖరం కారు స్టార్ట్‌ అయింది.

"సెక్రటరీ" సీరియల్—జరిగిన కథ

అనగనగా ఒక జయంతి. ఆమె కొక బామ్మ. జయంతికి లేకలేక ఒక ఉద్యోగం దొరుకుతుంది-"వనితావిహార్" అనే మహిళా సంఘం సెక్రటరీగా. ఆ ఉద్యోగంపై ఎన్నో ఆశలు. కలలు నిర్మించుకున్న జయంతి అక్కడి సభ్యురాళ్ళ సంకుచితత్వాన్ని ఏవగించుకుంటుంది. ముఖ్యంగా, ఒక సభ్యురాలి భర్త తనపట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో రిజైన్ చేస్తుంది.

వనితావిహార్‌లోనేకాక, ఊళ్ళోకూడా గొప్ప పలుకుబడిగల రాజశేఖరం ఆమెకు తనవద్ద సెక్రటరీగా ఉద్యోగమిస్తాడు. అతడు అందగాడు యువకుడు, ధనికుడు, మంచివాడు. తరువాత ఆమెకు పరిచయమైనవారు అదివరకు రాజశేఖరంవద్ద పనిచేసి మరొక మంచి ఉద్యోగంలోకి వెళ్ళిపోయిన శివరామ్, అతని స్నేహితుడు ప్రకాశం. వీ రిద్దరితోను, మరికొంతమంది స్నేహితురాళ్ళతోను ఆమె ఒకనాడు పిక్నిక్ వెడుతుంది. తిరిగి అర్ధరాత్రివేళ ప్రకాశం కారులో ఆమె తిరిగివస్తుండగా ఏదో చిన్న ప్రమాదం జరిగి, వారిద్దరిని పోలీసులు స్టేషనుకు తీసుకుపోయి రాజశేఖరానికి ఫోను చేస్తారు. జరిగినదానికి అత డేమంటాడో నని భయంతో జయంతికి స్పృహతప్పినంత పని అవుతుంది.

"ఎక్కడికెళ్ళావే యింతసేపు ? కాస్త యీమధ్య యింటికి వేళపట్టున వస్తున్నావని సంతోషిస్తుంటే మళ్ళీ మొదలుపెట్టావా ?"

"లేదు బామ్మా ! సునందా నేను కలిసి రెండో ఆట సినిమాకి వెళ్ళాం." బాధఅనిపించినా అబద్ధం ఆడకతప్పలేదు జయంతికి.

"ఏదీ యిటు తిరిగి చెప్పు సునందతో నువ్వు సినిమాకి వెళ్ళావా ?"

"అవును యేం ?"

బామ్మగారు నిర్ఘాంతపోయినట్టు చూసి జయంతి దగ్గరగా వచ్చి "జయంతీ ! నువ్వు అబద్ధాలు ఆడటం యెప్పుడు నేర్చుకున్నావు ? సునంద యిందాక యిదేదో పనిమీద వచ్చి మనింటికికూడా వచ్చి నువ్వింకా రాలేదంటే 10 గంటలవరకూ కూర్చొని వెళ్ళింది."

జయంతి గతుక్కుమంది. ఏం చెపుతుంది తను ? ఆడిన అబద్ధం అతకలేదు. చెప్పుకోటానికి యే సంజాయిషీ దొరకడం లేదు.

"జయా ! యేదయినా తప్పుచేస్తే దాన్ని బైటపెట్టుకోటానికి భయపడ్డప్పుడు అబద్ధం ఆడాల్సి వస్తుంది. నువ్విప్పుడేం తప్పు చేశావు ? నిజంగా చెప్పు' అన్నారావిడ మనవరాలివంక నిశితంగా చూస్తూ.

"బామ్మా !" జయంతి గభాల్న వచ్చి ఆవిడని చుట్టుకుంది. "బామ్మా ! నీతో యెప్పుడూ అబద్ధం ఆడలేదు. ఆడే అవసరంకూడా లేదు" అంటూ పిక్నిక్ సంగతి చెప్పింది. కారు యాక్సిడెంటుకి బదులు ట్రబులిచ్చిందని చెప్పింది.

బామ్మగారేమీ అనలేదు. మనమరాలి తల నిమురుతూ "జయా ; మనకి వుద్యోగాలు, బైట తిరగడాలు సరిపోవు. నువ్వు త్వరలో వుద్యోగం మానేస్తే నాకు మనశ్శాంతిగా వుంటుంది తల్లీ" అంది. జయంతి మెల్లగా ఆవిడ చేతుల్ని తప్పించుకుని బట్టలు మార్చుకోవటానికి వెళ్ళిపోయింది. తర్వాత ఆవిడ నోటినుంచి రాబోయే మాటలు సుపరిచితమే. అవే వచ్చాయికూడా.

"నిన్నో యింటిదాన్ని చేసేస్తే - మర్చి పోయానే రేపు శ్యామలమ్మగారి అక్క కొడుకు వస్తున్నాట్ట. నిన్నుచూసి - నువ్వు ఆ అబ్బాయికి తప్పకుండా నచ్చుతావని ఆవిడ చెప్తోందిమరీ - "

"బామ్మా ! ఆకలేస్తోంది."

"ఇదుగో పెట్టున్నా - ఆస్తేమీలేదుట,

యేదో వుద్యోగం. పోయే వుద్యోగం కాదట ! స్థిరపడిపోయిందట !"

బామ్మగారి మాటలు వింటూనే పరధ్యాన్నంగా ఆలోచిస్తున్న జయంతి అలవాటుగా మంచంమీద పడుకుని నిద్రపోయింది.

● ● ●

మర్నాడు శేఖరం దగ్గరకు వెళ్ళకూడదని లేస్తూనే నిశ్చయించుకున్న జయంతి తాపీగా ఆ పని యీ పని చూడటం మొదలు పెట్టింది.

"అమ్మా జయా ! ఈ పూట వెళ్ళక పోయినా ఫర్వాలేదా ?" అని అడిగింది బామ్మగారు.

"యెందుకు ?" యాదాలాపంగా అడిగింది జయంతి.

"అబ్బాయి వస్తాడని చెప్పలా ? అత నేదో మళ్ళీ రాత్రి ట్రయిన్‌లో అర్జంట్‌గా వెళ్ళిపోవాలిట. అంతగా అయితే మీ సుమిత్రాదేవికి రాలేనని చీటి రాసిపంపు."

జయంతి మొహం త్రిప్పేసుకుంది. పిచ్చి బామ్మ ! సుమిత్రాదేవి దగ్గరే ఇంకా చేస్తున్నాననుకొంటోంది. జయంతి నిట్టూర్పు విడిచింది. రాజశేఖరం వంటరివాడని, అతని దగ్గర తను సెక్రటరీగా చేస్తున్నానని తెలిస్తే బామ్మ కాళ్ళు విరగ్గొట్టి యింట్లో కూర్చో పెట్టుంది.

"యేం రాస్తున్నావా సెలవుచీటీ ?"

"లేదు బామ్మా ! నేనివాళ అర్జంట్‌గా వెళ్ళాలి" జయంతి పెళ్ళిచూపుల బేరం తప్పించుకోటానికి రోజుకంటె ముందుగా తయారై ఆఫీసుకు బయలుదేరింది.

● ● ●

ఆ రోజు ఒంటి గంటకి భోజనానికి వచ్చి నప్పుడు శేఖరం "నిన్న సాయంత్రం వెళ్ళేటప్పుడు కామేశ్వరమ్మగారు రమ్మన మని కబురుచేసింది. సాయంత్రం అయితే ఆలస్యంఅవుతుంది అనుకుంటే ఒంటిగంటకే వెళ్ళిపో" అన్నాడు. జయంతి తలెత్తి చూసింది. అతనిమొహం మామూలుగానే వుంది. రాత్రి జరిగిన సంఘటనకి విసుక్కున్నట్టుగాని, అసహ్యించుకున్నట్టుగాని యేమీ లేదు.

జరిగింది తను వివరంగా చెప్తే శేఖరానికి యింకొంచెం బాగా అర్థం అవుతుందని అన్పించిన జయంతి యేదో చెప్పబోతుండగా శేఖరం మధ్యలోనే వారిస్తూ "ఆ విషయం నేను మర్చిపోయాను. మీరుగూడా మర్చి పొండి అందరి జీవితాల్లోనూ యేదో ఒకటి జరుగుతూనే వుంటుంది. కాకపోతే ఆ జరి గింది యెదటవాళ్ళ జీవితాలకి ముడిపడితే బాధనిపిస్తుంది. ఇప్పటివరకూ మీరు నా సెక్రటరీగా చేస్తున్నారని చాలామందికి తెలియనే తెలియదు" అన్నాడు.

అతను బైటకు వెళ్ళిపోయేముందు కామేశ్వరమ్మగారి దగ్గరకు వెళ్ళటం మానటంగాని, మర్చిపోవటంగాని చెయ్యొద్దని మరోసారి హెచ్చరించి వెళ్లాడు.

జయంతి సాయంత్రం అవుతుండగా శేఖరం కారులోనే కామేశ్వరమ్మగారి దగ్గరకు వెళ్ళింది.

"రామ్మారా ! ఇదుగో కావుడూ మీ అమ్మాయి వచ్చింది" ముందు గదిలో కూర్చుని యేదో పేపరు చదువుకుంటున్న డాక్టరుగారు బిగ్గరగా లోపలికి కేకవేశారు.



యేదో పని చూసుకుంటున్న ఆవిడ అదలాగే వదిలేసి వచ్చి "వచ్చావా? వస్తావో రావో అనుకున్నాను." అంటూ రెండు చేతులూ జాపి దగ్గరకు తీసుకుంది.

ఆవిడ కబురుచేసిన అసలు విషయం రేపు గీత పుట్టినరోజుట. సునంద, జయంతి తప్పకుండా యింటికి భోజనానికి రావాలిట ఇప్పుడు జయంతితోపాటు తనుగూడా స్వయంగా వచ్చి సునందని, జయంతి బామ్మని పిలుస్తానంది.

"వద్దండీ ! మీకు శ్రమదేనికి ? రేపు నేనూ సునంద తప్పకుండా వస్తాం. బామ్మ గుండెదడమనిషి. ఎక్కడికీ రాదు. మరో సారెప్పుడైనా మిమ్మల్ని మాయింటికి తీసు కెళ్తాను." అంది జయంతి. ఇప్పు డీవిడ యింటికివస్తే భోజనంమాట దేవుడెరుగు, బామ్మకి తను వనితా విహార్‌లో వుద్యోగం వదిలేసి శేఖరందగ్గర చేరినట్టు తెలుస్తుంది.

మర్నాడు సునంద జయంతితోపాటు శేఖరంగూడా భోజనానికి వచ్చాడు. కాని

అత నెక్కువసేపుండలేదు. వచ్చిన అర గంటకే వెళ్ళిపోయాడు. వెళ్ళిపోయేముందు జేబులోనుంచి కార్డుతీసి కామేశ్వరమ్మగారి చేతికిస్తూ "సాయంత్రం 5 గంటలకి కారు పంపుతాను. రవీంద్రభారతిలో సోవియట్ బాలెట్ వుంది మీరు నలుగురూ రండి" అని వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిపోయిన తర్వాత శేఖరం కుటుంబంతో తన కుటుంబానికి యెన్ని సంవత్సరాలనుంచి పరిచయంవుందో, చిన్న ప్పటినుంచి గీతా-శేఖరం యెలా కలిసివుండే వాళ్ళో-యెంత ఆత్మీయతగా పెరిగారో కథలా చెప్పటం మొదలుపెట్టింది. పైకి కన్పించకపోయినా గీత మరణంతో శేఖరం గూడా చాలా దెబ్బతిన్నాడని, అతని హృద యంలోగూడా చాలా వెలితి యేర్పడిందని మునుపటంతటి వుత్సాహంగా లేడని ఆవిడ చెప్తుంటే జయంతి, సునంద వింటూ కూర్చుండిపోయారు.

సాయంత్రం శేఖరం చెప్పినట్టే అందరూ రవీంద్రభారతికి వెళ్లారు. వాళ్ళు వెళ్ళి కూర్చున్నతర్వాత శేఖరం యెప్పుడో వచ్చాడు. వెంట నలుగురైదుగురున్నారు.

బాలెట్ అయిపోగానే బైటకివస్తుండగా కలిసిన శేఖరం ఒక్కక్షణం జయంతీ వాళ్ళ దగ్గిర ఆగి "జయంతీ! రేపు వుదయం నువ్వు రాకు. సాయంత్రం 5 గంటలకి రా! ఆనందవిహార్‌లో వీళ్ళకి పార్టీవుంది" అని మరో మాటకి అవకాశంయివ్వకుండా వెళ్ళి పోయాడు.

వచ్చేస్తుండగా "అతని కారు మనకిచ్చే కాడు యింటికెలా వెళ్తాడు" అంది సునంద.

"కార్లకేం కొదువ. ఎవరో ఒకరు డ్రాప్ చేసేస్తారు" అన్నారు కామేశ్వరమ్మ గారు.

"మిమ్మల్ని దించేసిన తరువాత క్లబ్‌కి తీసుకురమ్మన్నారు కారుని" అన్నాడు డ్రైవర్.

● ● ●

మర్నాడు సాయంత్రం జయంతి శేఖరం చెప్పినట్టే వుదయం రాకుండా సాయంత్రం వచ్చింది. జయంతి వచ్చేసరికి ముందు హాల్లో శేఖరంతోపాటు కామేశ్వరమ్మగారు సుబ్రహ్మణ్యంగారుకూడాకూర్చునివున్నారు. వాళ్ళిద్దరూ జయంతిని చూస్తూనే మొహా ల్నిండా ఆదరం నింపుకుని "రా! రా!" అని ఆహ్వానించారు.

మధ్యసోఫాలో అంతవరకు ఏదో మాట్లాడిమాట్లాడి అలిసిపోయినట్టు వెనక్కి జారగిలబడి కూర్చున్న శేఖరం అలాగే కూర్చుని జయంతిని క్షణంసేపు పరిశీలనగా పరికించినట్టు చూసి ఆ వెంటనే విసుగ్గా కనుబొమలు ముడుస్తూ "నీకా చీర తప్ప యింకోటి లేనట్టుందే!" అన్నాడు.

డాక్టరు దంపతులని చూస్తూనే వికసించిన మొహంతో కామేశ్వరమ్మగారి వైపు వస్తున్న జయంతి మధ్యలోనే ఆగి శేఖరం అంటున్నదేమిటో అర్ధం గానట్టు నిర్ఘాంత పోయి చూడసాగింది.

"నిన్న ఆ చీర కట్టుకొచ్చింది. ఈరోజు కూడా అదే. అవసరానికి లేకపోతే గీత చీరెలు బోలెడున్నాయి. కట్టుకోగూడదూ!" కామేశ్వరమ్మగారివైపు చూస్తూ అన్నాడు.

క్షణకాలం జయంతి మొహం యెర్రబడింది. కళ్ళలో సుళ్ళు తిరగబోతున్న నీళ్ళని బలవంతాన నిగ్రహించుకుంది. మరు క్షణం అక్కడనుంచి పారిపోయి యెక్కడైనా మొహం దాచేసుకోవాలనిపించింది. తన పేదరికాన్ని యింత సూటిగా, చులకనగా అందరిముందు వేలెత్తి చూపిస్తాడని కల్లోగూడా అనుకోలేదు. తనమీద తనకి

జాలి, శేఖరంటే అసహ్యం రెండూ కలిగాయి. డాక్టరుగారు, కామేశ్వరమ్మగారు కూడా తెల్లబోవటంతో క్షణంసేపు హాలంతా మౌనం ఆవరించింది.

సుబ్రహ్మణ్యంగారు వున్నట్టుండి నవ్వు తెచ్చిపెట్టుకుంటూ "శేఖరం! నువ్వు ఆడవాళ్ళ చీరెలు గుర్తుపెట్టుకోవడం యెప్పటి నుంచి నేర్చుకున్నావ్! కొత్తగా వుందే! నీ నోటినుంచి యిలాటి మాటలు వినటం యిదే మొదటిసారి. ఆశ్చర్యంగా గూడా వుంది" అంటూ స్థాణువులా నిలబడిపోయిన జయంతి వైపు మరింత ఆదరంగా చూస్తూ "రామ్మా! రా!" అన్నారు. శేఖరం జయంతివైపు చూసి తల తిప్పేసుకున్నాడు. సిగ్గుతో హఠాత్తుగా అనుకోకుండా కలిగిన అవమానంతో నరనరం మెలిదిరిగిపోతున్న జయంతి క్షణంసేపు తనకి ఒంట్లో బాగోలేదని, యింటికి వెళ్ళిపోనిమ్మని అడగాలని పించింది. కానీ అది మరీ అసాధ్యంగా తోచి, మెల్లగా యెలాగో వచ్చి కామేశ్వ గారి ప్రక్కన కూర్చుండిపోయింది.

"ఏదీ వెనక్కి తిరుగు. నీకోసం పూలమాలకట్టి తెచ్చాను" అంది కామేశ్వరమ్మగారు టేబిల్‌మీద పెట్టినకాగితం పొట్లంతీసి అందులో నుంచి మాలతీస్తూ. సన్నజాజులు, మరువం అక్కడక్కడా కనకాంబరాలు కలిపికట్టినమాల. దాని

అందాన్ని పరికించేస్థితిలో లేని జయంతి యాంత్రికంగా అందుకుని అది చేతిలో పట్టుకుని అలాగే కూర్చుండిపోయింది.

ఇంతలో నాయర్ టీ తీసుకురావటంతో ప్రసంగం మారిపోయింది సుబ్రహ్మణ్యం గారు తెలివిగా ఆ ప్రసక్తి మర్చిపోయేలా చేశారు. టీ తాగిం తర్వాత అందరూ బైట కొచ్చి కారులో కూర్చుని బైలుదేరబోతుండగా వెనకసీటులో కూర్చున్న కామేశ్వరమ్మగారు-

"శేఖరం! ఒక్క నిమిషం వెనక్కి త్రిప్పి మా యింటికి తీసుకెళ్లాలి" అంది.

"యెందుకు?" ముందుసీట్లో శేఖరం ప్రక్కనకూర్చున్న డాక్టరుగారు వెనక్కి తిరిగి అడిగారు.

"పనుంది" ముక్తసరిగా అంది ఆవిడ.

"పైన మెక్కువ లేనట్టుంది" చేతివాచీ చూసుకుంటూ శేఖరం కారు డాక్టరుగారి యింటివైపు తిప్పాడు.

కామేశ్వరమ్మగారి ప్రక్కన నెత్తురుచుక్కలేని మొహంతో బైటకు చూస్తూ కూర్చున్న జయంతి యిదేం వినలేదు.

కారు యింటిముందుకు వచ్చి ఆగీ ఆగగానే కామేశ్వరమ్మగారు దిగుతూ "ఒక పావుగంట ఆలస్యం అవుతుంది. మీరు దిగి లోపలికివచ్చి కూర్చున్నాసరే లేకపోతే

● ధర్మామీటరు చూడ్డంలో పొరబాటుపడిన ఒకావిడ డాక్టరుకు ఫోనుచేసి ; "డాక్టరుగారూ ! మీరు అర్జంటుగా రావాలి. మావారికి 120 డిగ్రీల జ్వరం వచ్చింది."

డాక్టరు : "సరే, నేనువచ్చి చేసేదేమీ లేదు. ఫైరింజను వాళ్ళను పిలిపించండి."

కాదటో కూర్చుని కాలం గడిపినానరే మీ యిష్టం" అనేసి "రా జయంతీ!" అంటూ జయంతి చేతిని పుచ్చుకుని తనతో లోపలికి తీసుకెళ్ళింది

జయంతి చేతిని వదలకుండా అలాగే పట్టుకుని లోపలకి లాక్కెళ్ళిన ఆవిడ వెంటనే ఓ చిన్న బీరువా తెరుస్తూ—

"నువ్వు బట్టలు మార్చుకో జయంతీ. చూడు యీ చీరెల్లో నీ కేది నచ్చిందో. చూసుకో" అంది.

"నేనా! యిప్పుడా" ఆశ్చర్యం అంతా రెండుకళ్ళలోనూ నింపి అడిగింది జయంతి.

"అవును. నువ్వే. నువ్వు వచ్చేముందు వరకూ నీ సంగతే మాట్లాడుతున్నాం. ఒక్క క్షణం శేఖరం ఆగివుంటే ఆ మాట నేనే అని వుండేదాన్ని. ఆ మాట నా నోటినించి వస్తే నీ కంత కష్టం కలిగించేలా వుండేది కూడా కాదు. నిజంగా శేఖరం అన్నాడని కాదు. ఈ చీర నలిగిపోయింది. ఇక్కడ చూడు యెలా మాసిపోయిందో"

జయంతి మొహం కందగడ్డలా తయారైంది మాసిపోయినచోట చీరని చూసుకుంటూ "చాకలతను బట్టలు తీసుకెళ్ళి పదిహేను రోజులైంది. అంతులేదు. అందుకని" ఈసారి జయంతి కళ్ళల్లో నీళ్ళు యెంత బిగబట్టినా ఆగలేదు కట్టలు తెంచుకుని ప్రవహించసాగినాయి.

"అయినా! నా బట్టల్ని గురించి మాట్లాడే అధికారం అతనికి లేదు" బొంగురుపోయిన కంఠంతో చీరకొంగుతో గట్టిగా కన్నీళ్ళు ఒత్తుకుంటూ అంది.

"నిన్ను అతను వేరే వుద్దేశ్యంతో అన లేదు జయంతి! నువ్వు పొరపాటుగా అర్థం చేసుకోటం నా కిష్టంలేదు. నిన్ను మాలో ఒకదానిగా చూస్తున్నాడు. ఆ చనువుతోనే పైకి అనేశాడు."

"ఆ చనువు నా కసహ్యం" స్పష్టంగా అంది జయంతి.

క్షణంసేపు జయంతివైపు చూస్తుండిపోయిన కామేశ్వరమ్మగారు తెప్పరిల్లినట్టుగా "పోన్లే-ఆ సంగతి మర్చిపోదాం. నాకోసం కట్టుకో. ఇదుగో యీ తెల్లచీర గీతకి చాలా యిష్టం. నాక్కూడా. అసలు నిన్ననే అడగాలనుకున్నాను. కాని చచ్చిపోయిన పిల్ల వాడిన వస్తువులు యిస్తే ఏమంటావో అనుకుని-" ఆవిడ మధ్యలోనే ఆగిపోయింది.

"యేమీ అనుకోను. మీ కలాటి సరదా వుంటే యింకోసారి తప్పకుండా తీసుస్తాను. కాని యిప్పుడు-యిప్పుడుమటుకు నావల్ల కాదు. నా కసలు ఒంట్లో బాగా లేదు. ఇంటికెళ్ళిపోతాను. మీరు కొంచెం చెప్పండి" అంది జయంతి.

"జయంతీ! నాకోసం-" కామేశ్వరమ్మగారు యింకోసారి అడిగారు.

"క్షమించాలి. మీ రేమీ అనుకోవద్దు" దృఢంగా అంది జయంతి.

"ఇదుగో-పావుగంట అన్నావు. అర గంట దాటింది. ఆ పనేమిటో యింకా తేలలేదా?" గది బైటనుంచి డాక్టర్‌గారు కేక వేశారు.

"ఇదుగో వస్తున్నా-యేం జయంతీ?"

"ప్లీజ్! మీరు నాకు తల్లిలాంటివారు. మిమ్మల్ని కాదనటం నాకు సిగ్గనిపిస్తుంది ఇంకోసారి ఎప్పుడైనా-"

జయంతి తనే ముందులేచి గుమ్మంవైపు వచ్చేస్తూ అంది. కామేశ్వరమ్మగారు చేసేది లేక చీరలన్నీ బీరువాలో పడేసి జయంతి వెనకే బైటకొచ్చింది.

"అదేం! బట్టలుమార్చుకోలేదా?" ముందుగదిలో కుర్చీలో యేదో పేపరు



మనస్సు, తమస్సు (కథ)

—జె. టి. భూపతిరాజు.

భంగవంతం (కథ)

—కొడవటిగంటి కృష్ణమూర్తి.

చూసుకుంటూ కూర్చున్న డాక్టరుగారు జయంతిని చూస్తూ భార్యని ప్రశ్నార్థకంగా మొహంపెట్టి అడిగారు.

కిటికీదగ్గర రెక్కమీద చెయ్యివేసి బైట రోడ్డు మీదకి చూస్తున్న శేఖరం వెనక్కి తిరిగి చూశాడు. జయంతి మొహం కళ్ళు ఎర్రబడివున్నాయి. లోపల యేడ్చి యేడ్చి వచ్చినట్టు కొద్దిగా వుబ్బినట్టున్న కళ్ళు స్పష్టంగా తెలుపుతున్నాయి.

"బట్టలు మార్చుకోవడం యేమిటీ? యెవరు-నేనా" తెచ్చిపెట్టుకున్న కోపంతో అంది కామేశ్వరమ్మగారు.

"నువ్వుగాదు-" ఆయన జయంతివైపు చూసి అర్థోక్తిలో ఆగిపోయారు.

"పదండి-మీకు టైమౌతోంది."

అందరూ కారువైపు నడిచారు.

● ● ●

కారు హోటల్ చేరుకుంది. శేఖరం మోగించిన హారన్ వింటూనే మేనేజర్ పరుగెత్తుకొచ్చాడు. శేఖరం కారు పక్కన పెట్టటానికి తీసుకెళ్లాడు. కామేశ్వరమ్మగారు, డాక్టరుగారు, జయంతి దిగి పైకి వచ్చారు. పైన రూఫ్‌గార్డెన్ జయంతి యింతకుముందు చూసినదానికంటె అందంగా, అద్భుతంగా వుంది. గుమ్మందగ్గర పూల తోరణాలమధ్య రంగు రంగు దీపాలతో ఇంగ్లీషులోను, తెలుగులోను, రష్యన్‌భాషలోను స్వాగతం అనివుంది లోపల విశాలంగావున్న ఆవరణలో వరసల ప్రకారం తెల్లటి బట్టలతో కప్పిన టేబిల్స్, వాటిముందు కుర్చీలు అమర్చబడివున్నాయి. మధ్యలో అక్కడక్కడ పెద్దపెద్ద పూలకుండీ లున్నాయి. టేబిల్స్‌మీద దూరదూరంగా వయ్యారంగా ఓప్రక్కగా వంగి నిలబడి తళతళ లాడుతున్న లోహపు విగ్రహాల నెత్తిమీదున్న గిన్నెలలోనుంచి చిన్నచిన్న వలయాలుగా తిరుగుతున్న అగరొత్తుల పొగలు కమ్మటి సువాసనలు వెదజల్లుతున్నాయి. అక్క

దక్కడావున్న ట్యూబ్‌లైట్లు తమ వునికిని తెలియచేయకుండా జాగ్రత్తపడుతూ కంటికి ఆహ్లాదంగా వుండే వెన్నెలలాటి వెలుగుని ప్రసారం చేస్తున్నాయి. తెల్లటి యూనిఫారమ్ ధరించిన వెయిటర్లు టేబిల్స్‌కుమధ్య అవీ యివీ సర్దుతూ చకచకా తిరుగుతున్నారు.

లోపలికివచ్చి ఓ ప్రక్కగా కాస్త మూలగావున్న టేబిల్‌దగ్గర డాక్టరుగారితో కూర్చున్న జయంతి కళ్ళు విశాలంగా చేసుకుని అన్నీ పరికించసాగింది. అంతా అందంగా, పొందిగ్గా క్రమపద్ధతిలో యెంతో బాగుంది.

జయంతీ వాళ్ళు వచ్చేసిన పదినిమిషాల తర్వాత శేఖరం పైకివచ్చాడు. వస్తూనే అన్నీ సవ్యంగా వున్నాయో లేవో నని స్వయంగా పరీక్షచేసి చూశాడు.

ఒక్కొక్కళ్ళే రావటం మొదలుపెట్టడంతో శేఖరం గుమ్మంవైపు వెళ్ళిపోయాడు. గుమ్మదగ్గరంనిలబడిన అతన్ని దూరంనుంచి చూస్తుంటే అందరిలో పొడుగ్గా, ఠీవిగా వున్న అతని విగ్రహంలో యేదో ప్రత్యేకత వున్నట్టు స్పష్టంగా తెలుస్తోంది.

''జయంతీ!'' వున్నట్టుండి శేఖరం చటుక్కున వెనక్కుతిరిగి పిలిచాడు

కామేశ్వరమ్మగారి ప్రక్కన కూర్చుని రెప్పవాల్చకుండా అన్నీ చూస్తున్న జయంతి వులిక్కిపడింది.

''జయంతీ'' శేఖరం మరోసారి పిలిచాడు.

శేఖరంవైపు చూస్తుండిపోయిన జయంతి లేవలేదు. కనీసం కదిలే ప్రయత్నంగూడా చెయ్యలేదు.

''నిన్నేనమ్మా'' డాక్టరుగారు చెప్పారు.

''నిన్నే యిలారా'' ఇంకోసారి పిలిచాడు శేఖరం. ఈసారి అతనికంఠంలో విసుగు స్పష్టంగా కన్పిస్తోంది.

''వెళ్ళమ్మా'' కామేశ్వరమ్మగారుకూడా చెప్పటంతో జయంతి లేచివెళ్ళింది.

ముందుకు వచ్చేస్తుండగా వెనకనుంచి ''కావుడూ! అచ్చు వెనకనుంచి ఆ నడక గూడా గీతలా లేదూ'' అని డాక్టరుగారు అనటం ఆవిడ వెంటనే ''అవునవును'' అనటం విన్పించింది.

"ఇదిగో! ఇలారా! ఈ పూలగుత్తుల దగ్గర నిలబడి అందరికి తలోకటి యివ్వు" అన్నాడు శేఖరం తన ప్రక్కగా టేబిల్ మీద గుట్టలావున్న గుత్తుల్ని చూపిస్తూ.

మధ్యగులాబీతో చుట్టూ మరువం, దవనం, మల్లెలు, కనకాంబరాలు అంచుగా కట్టిన గుత్తి అందంగా వుండి ఘుమ్మని సువాసనలు వెదజల్లుతూ తమ వునికిని ఆడంబరంగా చాటుకుంటున్నాయి.

కళ్ళు వాల్చుకుని పూలగుత్తులవైపే చూస్తూ నిలబడిపోయిన జయంతి వైపు చూస్తూ "వూరికే బొమ్మలా బిగుసుకుపోయి నిలబడితేగాదు. కాస్త నవ్వాలి. నమస్తే చెప్పాలి." అన్నాడు శేఖరం. జయంతి చటుక్కున తలెత్తి చూసింది. శేఖరం కళ్ళలో పెదవుల చివర చిరునవ్వు మెదలింది హఠాత్తుగా అతని కంఠం ఆర్ద్రంగా పలుకుతూ "సారీ! జయంతీ! ఇందాక నామాట నిన్ను నొప్పిస్తే క్షమించాలి"

జయంతి గబుక్కున చుట్టూ చూసింది. థాంక్‌గాడ్! చుట్టుప్రక్కల యెవరూ లేరు.

"హలో! గుడీవెనింగ్" శేఖరం వెనక్కుతిరిగి ఆహ్వానించాడు.

"గుడీవెనింగ్." వచ్చినవాళ్ళెవరో జయంతికి తెలుసు.

ఆయన జస్టిస్ పార్థసారథి. పక్కన ఆయన సతీమణి.

''ఎవరూ యింకా రానట్టుందే'' అన్నారాయన - జయంతి అందిచ్చిన పూలగుత్తి అందుకుని ప్రశ్నార్థకంగా చూస్తూ.

'టైమవుతోంది. ఇప్పుడిప్పుడే వస్తున్నారు.'' శేఖరం వాచీ చూసుకుంటూ జవాబుచెప్పాడు. పొట్టిగా లావుగావున్న ఆయన బట్టతల రంగురంగు లైట్లమధ్య రకరకాలుగా నీడలుతేలుతోంది. ఆయన వెళ్ళినవైపే తలతిప్పి చూస్తున్న జయంతి శేఖరం మళ్ళీ ''జయంతీ'' అని పిలవటంతో వెనక్కు తిరిగింది.

ఏదో చెప్పబోయిన శేఖరం ఆగిపోయి ''అడుగో శివరామ్ వస్తున్నాడు'' అన్నాడు. జయంతి గుండెలు గబగబ కొట్టుకున్నాయి. ఆరోజు యాక్సిడెంట్ తర్వాత అతను కన్పించటం యిదే మొదటిసారి.

''సారీ సర్. మీరు ఫోన్‌చేసినట్టుగా ముందుగా రావాలని యెంత ప్రయత్నం చేసినా వీలుకాలేదు. చాలా ఆలస్యం అయినట్టుందిగదూ! పెధవది-నన్ను మీరు తీసుకెళ్ళి ఆ జైలులో పారేశారు. పాడు వుద్యోగం- బొత్తిగా దేనికీ స్వతంత్రంలేదు" వస్తూనే శివరామ్ వినయంగా అన్నాడు.

''ఫర్వాలేదులే. జాగ్రత్తగా కొద్దిరోజులు కష్టపడి చేశావంటే ముందుముందు మంచి అభివృద్ధిలోకివస్తావు" శివరామ్ భుజంతడుతున్న శేఖరం హఠాత్తుగా ఆగి ''అడుగో! ఆయన వస్తున్నారు'' అంటూ రెండడుగులు ముందుకువేశాడు. వచ్చింది మంత్రిగారు. ఆయన శేఖరంతో కరచాలనంచేస్తూ ''యేమయ్యా! ఆ ద్రాక్ష తోటల స్కీమ్స్‌ని గురించి నువ్వు బొత్తిగా మర్చిపోయినట్టుంది" అన్నారు.

"లేదండీ! ప్రపోజల్స్ తయారుచేస్తున్నాను. పూర్తయిపోయినాయి రెండుమూడు రోజుల్లో పంపిస్తాను."

"పంపించటంగాదు. నువ్వే స్వయంగా తీసుకురా. మళ్ళీ మధ్యలో యేవైనా అనుమానాలువస్తే అక్కడక్కడ సరిచేసేసుకోవచ్చు అదేదో త్వరగా కానివ్వు. నాకు దానికోసం ఆదుర్దాగా, ఆసక్తిగా వుందని తెలిసి నువ్వు ఆలస్యంచేస్తున్నావులా వుంది."

"అబ్బెబ్బె! అదేం లేదండీ." నవ్వుతూ అన్నాడు శేఖరం.

"ఇదుగో చూడబ్బాయి చెబుతున్నాను అయిదు సంవత్సరాలు తిరిగేసరికి ఆంధ్రప్రదేశ్ మిగతా అన్ని రాష్ట్రాలకి అనాబ్‌షాహి ఎగుమతి మొదలుపెట్టగలిగి వుండాలి. అనాబ్‌షాహి అంటే ఆంధ్రప్రదేశ్.

● మేస్త్రి: "వాళ్ళంతా రెండుచేతుల్తో రెండేసి బకెట్లు తెస్తుంటే నువ్వు ఒక్కొక్కటే తెస్తావేం;

కూలీ: వాళ్ళకి బద్ధకమండి, ఇంకోసారి తిరగాల్సి వస్తుందని.

ఆంధ్రప్రదేశ్ అంటే అనాటీషాహి గుర్తొచ్చేంతటి అవినాభావ సంబంధం యేర్పడిపోవాలి." మంత్రిగారు రెండడుగులు ముందుకువేసి జయంతి యిచ్చిన పూలగుత్తి అందుకుంటూ ఆగిపోయి-

"ఈ అమ్మాయి యెవరు?" అన్నారు.

"జయంతి. నా సెక్రటరీ" శేఖరం చాలా మామూలుగా చెప్పాడు.

"నీ సెక్రటరీనా?" మంత్రిగారి కళ్ళలో ఆశ్చర్యం స్పష్టంగా కన్పించింది. అది దాచుకోవాలనే ప్రయత్నం చెయ్యకుండానే- "ఇదివర కెక్కడో చూసినట్టు జ్ఞాపకమే" అన్నారు జయంతిని పరీక్షగా పరిశీలిస్తూ.

"అవును. వనితావిహార్ సెక్రటరీగా చేసింది" శేఖరం సంశయనివృత్తి చేశాడు. జయంతి గుండెలు మళ్ళీ గుబగుబలాడాయి.

"అవుననుకుంటా! యెక్కడో అలాటి చోట్లోనే చూశాను." ఆయన ఆయనతో పాటువచ్చినవాళ్ళు శేఖరం అంతా ముందుకు వెళ్ళిపోయారు.

మంత్రిగారు వెడుతూనే సుబ్రహ్మణ్యం గారి భుజంమీద చరిచి పలకరించి ఆయన ప్రక్కనే కూర్చునారు.

"హు! యెంత నిగర్వి! చిన్నప్పుడు యెప్పుడో కలిసి చదువుకున్న చిన్న స్నేహం. ఆ స్నేహాన్ని ఆయ నింకా మర్చిపోలేదు."

వెనకనుంచి మాటలు విన్పించటంతో జయంతి ప్రక్కకు తిరిగింది. అక్కడే నిలబడివున్న శివరామ్ జయంతి వెనక్కు తిరగటంతో నాలిక్కరుచుకుని "సారీ! వెధవది మనసులో అన్పించిన ప్రతి మాటా పైకి అనెయ్యటం-ఆ వెధవ అలవాటు యెంత ప్రయత్నంచేసినా మానుకోకుండా వున్నాను. మీ రెలావున్నారు?" అన్నాడు.

"మీరు ఆ రోజు....ఆ రోజు...." అస్పష్టంగా అంది జయంతి. జయంతి చెప్పబోతున్న దేమిటో-తెలుసుకున్న శివరామ్ "అవును విన్నాను. ప్రకాశం ఆ రాత్రి వచ్చి చెప్పాడు. వెరీవెరీసారీ. మర్నాడు నేనే శేఖరంగారికి ఫోన్‌చేసి క్షమార్పణ చెప్పుకున్నాను. నా బలవంతం మీదనే మీరు వచ్చారని చెప్పాను."

"ఆయనేం అనలా?"

"అనలేదు. ఈసారి ఆడపిల్లలతో పిక్నిక్‌కి వెడితే మళ్ళీ వాళ్ళు సవ్యంగా యింటిదగ్గర చేరేలా చూడమని చిన్న వార్నింగ్ యిచ్చారు. అంతే-అయినా-"

మంత్రిని ఆయన అనుచరులని కూర్చోపెట్టి యిటు వచ్చేస్తున్న శేఖరాన్ని చూసి యేదో చెప్పబోయిన శివరామ్ ఆపేసి పెదవులు మూసుకుని బుద్ధిమంతుడిలా నిలబడ్డాడు.

ఇంతలో రష్యన్ బృందం రానేవచ్చింది. శేఖరం అందరికీ వరసగా జయంతిని. శివరామ్‌ని యిద్దర్నీ పరిచయం చేశాడు.

'హలో' 'హౌడుయుడూ' లాటి చిన్న మాటలతో వాళ్ళంతా జయంతిని అత్యంత శ్రద్ధతో పలకరించారు. నిటారుగా-బొమ్మలా నిలబడిన జయంతి అందరికీ నమస్కారం చేసింది. అందరిచూపులూ జయంతిని పరీక్షగా పరికించాయి.

వాళ్ళందర్నీ తీసుకుని శేఖరం వెళ్ళిపోయాడు. గుమ్మందగ్గర జయంతి, శివరామ్ యిద్దరే నిలబడిపోయారు. జయంతికి నరనరంలోనూ వుత్సాహం నిండినట్టు అన్పించింది. ఇలాటి చిన్నచిన్న అవకాశాలనే తను వనితావిహార్‌లో కోరుకుంది. దానివల్ల ప్రత్యేకించి చూస్తే యే లాభంలేకపోయినా యేదో ప్రత్యేకత కలిగినట్టు పొందే అనుభూతిమటుకు అపారం. మనసు

హాయిగా వుల్లాసంగావుంటుంది. తను చేసిన పనికి ప్రతిఫలం దొరికిందనే సంతోషం మిగులుతుంది.

పరధ్యానంగా యెటోచూస్తూ ఆలోచిస్తున్న జయంతి "అదుగో! వనితావిహార్ బృందం వస్తోంది" అని శివరామ్ అనటంతో గతుక్కుమని యిటువైపు తిరిగింది. ముందు సుమిత్రాదేవి, మిసెస్ కరుణాకరం. వెనక రేఖారాణి, ప్రమీల వస్తున్నారు. జయంతికి హఠాత్తుగా పూలగుత్తులు వదిలేసి వెళ్ళి నిశ్శబ్దంగా కామేశ్వరమ్మగారి ప్రక్కన కూర్చోవాలనిపించింది. చుట్టూ అంతచక్కటి గాలివీస్తున్నా, గాలి పీల్చుకోలేని మనిషిలా వుక్కిరిబిక్కిరి అయింది.

'హలో' 'రండి' 'బాగున్నారా' 'నమస్కారం' అంటూ శివరామ్ పేరుపేరునా మనిషి నో విధంగా పలకరిస్తున్నాడు.

"ఇదుగో! శివరామ్. నేను రాజశేఖరానికి మొన్న సాయంత్రం ఓ నోటు పంపాను. అది కొంచెం" మధ్యలో ఆగిపోయిన సుమిత్రాదేవి జయంతిని వింతగా ప్రశ్నార్థకంగా చూడసాగింది. హఠాత్తుగా యేదో పోగొట్టుకున్నదానిలా పూలగుత్తుల మధ్య తలవంచి కెలుకుతున్న జయంతికి ఆవిడ తనవైపు చూస్తున్నట్టు. వెంటనే మొహంలో భావాలు మారుతున్నట్టు తలెత్తకపోయినా స్పష్టంగా తెలుస్తోంది.

"ఏమిటి జయంతా? ఇక్కడా?" మిసెస్ కరుణాకరంగూడా తెల్లబోయింది. ఈలోపల వెనక మెల్లగా వస్తున్న రేఖారాణి - ప్రమీల కలుసుకున్నారు.

"నేను శేఖరంగారి సెక్రటరీగా మానేసి చాలారోజులయిందండీ" అన్నాడు శివరామ్. అతను వీళ్ళచూపులు, వాలకం, జయంతి వంచిన తల వీటన్నిటి అర్థం కనిపెట్టకపోలేదు.

"అలాగా! నాకు తెలియదే! యెప్పుడు యెందుకు మానేశావు?" అంది సుమిత్రాదేవి శివరామ్‌వైపు. జయంతివైపు మార్చి మార్చి చూస్తూ.

"ఇంకో వుద్యోగం వచ్చింది. అక్కడ జీతం - హోదా రెండూ యెక్కువ. శేఖరంగారే నన్ను అటువైపు తోసేశారు."

"మరి ఆయనకిప్పుడు సెక్రటరీగా యెవరూ లేరా?"

"ఇదుగో! ఇప్పుడు నా ప్రక్కన నిలబడి నావిడే ఆయన సెక్రటరీ. మీకు తెలియనే తెలియదా! అరె చాలా ఆశ్చర్యంగావుందే మీరు పంపే పేపర్లన్నీ జయంతిగారు చూసింతర్వాతనే వారిచేతుల్లోకి వెడతాయి. ఇదుగో వస్తున్నా" దూరంనుంచి యెవరో పిలవటంతో శివరామ్ వెళ్ళిపోయాడు.

అందరూ క్షణంసేపు నిశ్శబ్దంగా నిలబడిపోయారు. అందరిచూపులు సూటిగా జయంతిమీదకు తిరిగి గుచ్చిచూస్తున్నాయి. జయంతికి హఠాత్తుగా "నేను రాజశేఖరం సెక్రటరీని కాదుబాబోయ్" అని అరిచి ఆ చుట్టుప్రక్కల యెక్కడా కన్పించకుండా దూరంగా పారిపోవాలనిపించింది.

"ఆహా! అందుకేనన్నమాట. ఆ రోజు నిష్కారణంగా అంత దురుసుగా మాట్లాడి

● ఒకడు: "నీకు మూడు భాషలు వచ్చునన్నావు, ఏమేమిటి?"

రెండోవాడు: "కృష్ణాజిల్లాభాష, రాయలసీమభాష, తెలంగాణాభాష!"

రిజైన్ చేసింది" కొద్దిగా తెప్పరిల్లిన సుమిత్రా దేవి ఈ లోకంలోకి వస్తూ అంది.

"అసలు వనితావిహార్ సెక్రటరీగా చేసి రిజైన్ చేసినతర్వాత రాజశేఖరం ఎలా పెట్టుకున్నాడు?" అంది మిసెస్ కరుణాకరం.

"అన్నింటికంటే ఆశ్చర్యం అసలు మనకి తెలియనే తెలియదు. రాజశేఖరం చెప్పకపోవటానికి కారణం? ఏం రేఖారాణీ" అంది సుమిత్రాదేవి.

"నాకేం తెలుసు? నేను బొంబాయినుంచి వచ్చింది నిన్న సాయంత్రమేగా! అయినా అసలు అతనికేం చెప్పిందో" రేఖారాణి జయంతిని మరింత నిశితంగా చూస్తూ అంది, అందంగావున్న ఆమె కనుబొమలు అర్థంగానట్టు సూచిస్తూ ముడిపడ్డాయి.

ఈమాటలన్నీ వాళ్ళు జయంతి మొహంమీదనే బాహాటంగా అనేస్తున్నారు.

ఏదో పెద్దతప్పుచేసి హఠాత్తుగా అనుకోకుండా పట్టుబడినదానిలా తెల్లబోయి వాళ్ళందరివైపు వెర్రిదానిలా చూడటం తప్ప జయంతి యింకేం చెయ్యలేకపోయింది.

"ఇది యెన్నాళ్ళ ముచ్చటో చూద్దాంలే!"

"ఎంత గడుసుతనం. మనకి మాట మాత్రంగూడా తెలీలేదు."

అందరూ ముందుకు నడిచి వెళ్ళిపోయారు.

వాళ్ళు వెళ్ళిపోయిన వైపే పాలిపోయిన మొహంతో చూస్తున్న జయంతికి దూరంగా శేఖరం వాళ్ళని కలుసుకోవటం సీట్లు చూపించి కూర్చోపెడుతూ యేదో మాట అంటూ ప్రమీల భుజంమీద చిన్నదెబ్బ కొట్టటం కన్పించింది.

వీళ్ళకెందుకు తెలియదు! ఆరోజు ప్రమీల తనని శేఖరం ఆఫీసులోంచి పిక్నిక్‌కి వస్తుంటే చూడలేదూ! శివరామ్ చెప్పలేదూ! అసలు ప్రమీల యేం మాట్లాడకుండా అలా మూగదానిలా నిలబడిపోయిందెందుకు? కనీసం శివరామ్‌తోనైనా మాట్లాడచ్చుగా.

"జయంతీ!" కళ్ళార్పకుండా దూరంగా చూస్తున్న జయంతి యెవరో పిలవటంతో వెనక్కి తిరిగింది. తిరుగుతూనే వులిక్కిపడింది. ఎదురుగుండా దెయ్యపు ఇకిలింపులాటి నవ్వుతో మిష్టర్ వర్మ నిలబడి వున్నాడు. అతని కళ్ళలో ఆశ్చర్యంతో పాటు మొహంనిండా ఆనందంగూడా కన్పిస్తోంది. జయంతి కిసారి వూపిరిపోయినట్టే అనిపించింది.

ఏమిటిమిటి! ఈరోజున లేచినవేళెంత మంచిది. యెంతదృష్టం." వర్మ కంఠం తగ్గించి జయంతిని పలకరిస్తున్నట్టు మొహం దగ్గరగా పెట్టి అంటున్నాడు. శివరామ్‌కోసం జయంతి చూపులు చుట్టు వెతికాయి. ఆతనెక్కడున్నాడో కన్పించలేదు.

"జయంతీ! నీకోసం మా ఆఫీసులో టైపిస్ట్ పోస్ట్ ఒకటి అలాగే వుంచేశాను తెలుసా! మంచి జీతం. పనెక్కువ వుండదు. నువ్వక్కడ రిజైన్ చేశావని తెలిసి నీ అడ్రస్‌కోసం ఎంతగానో ప్రయత్నించాను."

అత్రంగా అంటున్న అతన్ని చూస్తుంటే జయంతికి చాచి దిమ్మతిరిగేలా చెంపమీద కొట్టాలనిపించింది.

"చెప్పు ఏమంటావు?"

"థ్యాంక్స్. మీ దయా-ధర్మం మీరే అట్టిపెట్టుకోండి. నే నిప్పుడు రాజశేఖరం గారి సెక్రటరీగా చేస్తున్నాను." మొట్టమొదటిసారిగా ఆమాటకి పూర్తివిలువయిస్తూ గర్వంగా అంది. వర్మకళ్ళు నమ్మలేనట్టు చూశాయి. "నిజంగానా?" అన్నాడు.

"మీరు కొంచెం కళ్ళుతెరిచి యిక్కడసలు నే నెందుకు నిలబడ్డానో చూస్తే తెలుస్తుంది."

వర్మ కొంచెం వెనక్కి తగ్గాడు. "జమే! జయంతి అంధుసి అహ్వా: స్తూ పూలగుత్తు లిచ్చేచోట నిలబడింది.

అతని మొహంలో వికృతమైన భావం ఒకటి అస్పష్టంగా మెలికలు తిరిగింది. స్వరంలో హేళన నింపి-

"ఓహో! నువ్వేదో కష్టపడి పైకివచ్చే అమ్మాయివనుకున్నాను. అయితే పెద్ద వుద్దేశ్యంలోనే వున్నావన్నమాట. జాగ్రత్త. రాజశేఖరం బంగారుపిచ్చుకని మురిసిపోతున్నావేమో! ఆ పిచ్చికచుట్టు చాలా విషవలయాలున్నాయి."

జయంతి తీవ్రంగా, ఘాటుగా యేదో దీగ్గరగా సమాధానం చెప్పబోయింది. క్షణంలో జరగబోయే రసాభాసని శివరామ్ దేవుడిలావచ్చి కాపాడాడు.

"హలో! వర్మగారా! శ్రీమతిగారు రానట్టుందే? కులాసానా?" శివరామ్ పలకరింపుతో వర్మ హఠాత్తుగా మామూలుగా అయిపోయాడు. ప్రతినమస్కారం చేసి నవ్వి, జయంతి యివ్వకుండానే టేబిల్ మీదున్న పూలగుత్తి తనే తీసుకుని గబగబా వెళ్ళిపోయాడు. వెళ్ళేముందు జయంతివైపు క్రూరమైన చూపొకటి విసిరి గుండెలు కొట్టుకునేలా చేసి మరీ వెళ్ళాడు.

ఆ తర్వాత యెవరెవరు వచ్చారో జయంతి అంతగా పట్టించుకోలేదు. చాలాసేపయింతర్వాత-శివరామ్ "దాదాపు అంతా వచ్చేసినట్టే. టిల్స్ అన్నీ నిండిపోయినాయి. మనంగూడా వెళ్ళి కూర్చుందామా?" అన్నాడు.

"పదండి" అంది జయంతి నీరసంగా అరచేతుల్లో పట్టిన చెమట తుడుచుకుంటూ.

ఇద్దరూ వస్తుండగా దూరంగా శేఖరం రేఖారాణిని, ప్రమీలని గెస్ట్స్‌కి పరిచయం చేస్తున్నాడు. టేబిల్స్ అన్నీ నిండిపోయినాయి. ఎక్కడా ఖాళీలేదు. డాక్టరిగారి ప్రక్కన సీటుగూడా యెవరో ఆక్రమించుకున్నారు.

చివరి కెలాగో ఓ ప్రక్కగా మూలగా వున్న టేబుల్‌దగ్గర ఒకే ఒక కుర్చీ ఖాళీ వుంది. శివరామ్ మరో కుర్చీ తెచ్చుకుని జయంతి కెదురుగుండా కూర్చున్నాడు.

ఎదురుగుండా కన్పిస్తున్న చిన్న స్టేజీ మీద వాద్యబృందం చక్కటి అధునాతన సంగీతం విన్పిస్తోంది. రేఖారాణి, ప్రమీల, శేఖరం అంతా ఒకేచోట రష్యన్ బృందం దగ్గరగా కూర్చున్నారు.

ప్రమీలావాళ్ళు వచ్చింతర్వాత శేఖరం తనని పిలవలేదు. పలకరించే ప్రయత్నం చెయ్యలేదు. తనసలు యెక్కడుందో కూడా గమనించలేదు. జయంతి దృష్టినుంచి యిది దాటిపోలేదు.

"రేఖారాణి భర్త యేం చేస్తుంటాడు?" పార్టీ జరుగుతుండగా మధ్యలో అడిగింది జయంతి దూరంగా కూర్చున్న రేఖారాణిని చూస్తూ.

"పేకాడుతుంటాడు. పీకలవరకూ తాగుతూంటాడు. భార్యకి పార్టీలకి, సినిమాలకి తిరగటానికి రకరకాల చీరలు, నగలు సప్లై చేస్తుంటాడు"

"అంటే?" ఆశ్చర్యంగా అడిగింది జయంతి.

"అంటే యేంలేదు. కొన్నివిషయాలు చెబితే విని వూరుకోవాలి.

ప్రశ్నలు వెయ్యగూడదు"

"నా కర్థంగావటంలేదు."

"మీ కర్థంగాదని నాకు తెలుసు. మీ మొహంలోలాగానే మీ మనసులోగూడా యింకా పసితనం పోలేదని, ప్రపంచానుభవం లేదని స్పష్టంగా తెలుస్తుంది."

జయంతి మొహం ఎర్రబడింది.

"ఆయ నేం చేస్తుంటాడో చెప్పమంటారా! వుద్యోగం అదీ ఏంలేదు. ఊరికే తిరుగుతూ వుంటాడు. తాత ముత్తాతలు వడ్డీవ్యాపారం మీద సంపాదించిన ఆస్తి ఈయనిలా ఖర్చు చేసినా మరో రెండు తరాలవరకూ సరిపడేంత వుంది. అది ఖర్చుపెట్టటమే ఆయన వుద్యోగం."

"ఆయన రాలేదెందుకు? ఎప్పుడు చూసినా ఆవిడ ఒక్కత్తె కన్పిస్తుంది."

"రాడు. అంతే."

"అంటే? ఇలాటి పార్టీలివి అంటే యిష్టంలేని మనిషా?"

"అదుగో మీరు మరీ ప్రశ్నలు వేస్తున్నారు. ఇష్టంలేకకాదు ఆయన రానిది. రేఖారాణితో బైటకివస్తే ఆవిడముందు తనెంత తక్కువగావుంటాడో, యిద్దరిమధ్య యెంత వయసు తేడావుందో, అదెంత కొట్టొచ్చినట్టు కన్పిస్తుందో ఆయనకి అనుభవపూర్వకంగా అర్థమైంది. చూసేవాళ్ళకి అకారణంగా రేఖారాణి అంటే జాలి యేర్పడుతుంది. అసలు ఆవిడకి అంతమంది అభిమానులుండటానికికారణంగూడా అదే."

జయంతి వింటూ కూర్చుండిపోయింది.

"పాపం. ఈవిడని చేసుకున్నతర్వాత ఆయన వంశపారంపర్యంగా వస్తున్న వడ్డీవ్యాపారానికి నీళ్ళొదిలేసి తాగుడికి అలవాటు పడ్డాడు."

"మరి అలా టాయన్ని ఆవిడెలా చేసుకుంది?"

"డబ్బండీ! డబ్బు. ఈ రోజుల్లో డబ్బుంటేచాలు. మనిషిగా గుర్తింపబడొచ్చు. దాన్ని ఆయుధంగా చేసుకుని యింకెన్నయినా గెలుచుకోవచ్చు."

"అవుననుకోండి. కాని మరి ఆవిడ పరిస్థితులేమిటో! ప్రపంచంలో ప్రతి ఆడపిల్లకి తనెంత కురూపిఅయినా సరే అందగాడు, డబ్బున్నవాడు, సమర్థుడు, యువకుడుగావున్నవాడు భర్తగాకావాలనిపిస్తుంది."

"మీరు పొరబడుతున్నారు. ఈ నాలుగు గల మనిషి లభించడని ఈ రోజుల్లో ప్రతి ఆడపిల్లకి తెలుసు.

ఈనాలుగింటిలో యేఒకటో చూసుకుంటారు. అందులో రేఖారాణి డబ్బుకి ప్రాధాన్యం యిచ్చింది."

"రేఖారాణిలాటి మనిషి." జయంతి పూర్తిచెయ్యనేలేదు. శివరామ్ అందుకున్నాడు. "అవునండీ రేఖారాణి లాటి మనుష్యులు డబ్బుకోసంపెళ్ళిచేసుకుంటారు. ప్రేమకోసం స్నేహాలు చేస్తారు. భగవాన్! నేను కేదయినా సహిస్తాను కాని డబ్బు కక్కుర్తిపడే ఆడదాని నీడగూడా భరించలేను."

"ఆ బలహీనతకి ఆడా, మగా భేదం లేదనుకుంటా.

"ఒప్పుకుంటా. మీరు తెలివారే. నాచేత తెగవాగిస్తున్నారు."

"రేఖారాణి ఆ డబ్బుతో సుఖపడుతోందనే అంటారా?"

"ఎందుకంటాను? నన్నడిగితే యింత వుండీ ఘోరమైన నరకం చూస్తోందంటాను. అలాటివాళ్ళ జీవితం అంతా బైట వెలుగుమాత్రమే. ఇంటికి వెడితే అంతా చీకటే."

"అంటే?"





"అదుగో! మీరు ప్రశ్నలువెయ్యటం మానలేదు. అయినా ఆవిడకేంలెండి. సంఘంలో పేరు ప్రతిష్ఠ లున్నవాళ్ళంతా మిత్రులు-కావలసినవాళ్ళు. అందరిలోకి అన్నివిధాల వున్నవాడు. ప్రేమించుకున్నవాడు అప్పుడు."

"నా కర్థంగావటంలేదు" అంది జయంతి.

"కొద్దిరోజులు పోతే మీకే అర్థమౌతుంది" రాజశేఖరంగారు ఆవిడకి దగ్గరమనిషి అంతకంటే యింకేం అదృష్టం కావాలి"

"బాగుంది. ఆయన దగ్గరమనిషి అయినంతమాత్రాన ఈవిడకి జీవితంలో సుఖం యెలాదొరుకుతుంది!"

శివరామ్ మొహం తిప్పేసుకున్నాడు. "మీరు మరీ చిన్నపిల్లల్లా మాట్లాడితే నేను కొంచెం విడమర్చి చెప్పాల్సివస్తుంది. కాని నా కిష్టంలేదు, అసలిది అందుకు సమయం గాదు. స్థల గాదు."

"అవునవును. మనం యిక్కడ కూర్చుని యిలా మాట్లాడుకోవటం బాగాలేదు" ఒప్పుకొంది జయంతి చుట్టూచూస్తూ.

"అదేం లేదులెండి. ఇక్కడ గ్రూపులుగా కూర్చున్న వాళ్ళంతా యిలాటి విషయాలే గుసగుసలాడతారు." అన్నాడు శివరామ్.

ఇద్దరూ క్షణంసేపు చుట్టూ చూస్తూ మౌనంగా వుండిపోయారు.

"ప్రమీల మనల్ని చూసిగూడా అలా యెరగనట్టు వూరుకుంది?"

ప్రసంగం మారుస్తూ అంది జయంతి.

ఎటో చూస్తున్న శివరామ్ చూపులు క్షణంసేపు జయంతి మొహంమీద నిలిచి వెంటనే క్రింద ప్లేటుమీదకు వాలిపోయినాయి.

"మిసెస్ కరుణాకరానికి అంతస్తులభేదం అడుగడుగునా కావాలి. మనలాటివాళ్ళతో ప్రమీల కలవటం ఆవిడ యిష్టపడదు."

"ప్రమీల చిన్నపిల్లగాదు. నచ్చచెప్పొచ్చుగా."

"అవును. చెప్పొచ్చు. అరుగో అతిథులు వెళ్ళిపోతున్నట్టున్నారు."

అందరూ లేవటంతో శివరామ్ జయంతి గూడా లేచారు.

మంత్రిగారు, రష్యన్ బృందం వెళ్ళిపోయారు. శేఖరం, అతనితోపాటు రేఖారాణి, ప్రమీలగూడా వాళ్ళని సాగనంపటానికి వెళ్లారు. ఒక్కొక్కళ్ళే వెళ్ళిపోవటం ప్రారంభించారు. చూస్తుండగానే ఆవరణంతా ఖాళీ అయిపోయింది. జయంతి, శివరామ్‌ని వదలకుండా నిలబడింది. అతనిప్రక్కన నిలబడితే కాస్త ధైర్యంగావుంది. దూరంగా డాక్టరుగారితోగూడా యెవరో చాలామంది మాట్లాడి సెలవు తీసుకుంటున్నారు.

"హలో శివరామ్! యెన్నాళ్ళకెన్నాళ్లకి దర్శనం." పొట్టిగా నల్లగా కళ్ళద్దాలతో సూటులోవున్న ఒకతనువచ్చి శివరామ్ చెయ్యిపట్టుకున్నాడు.

"హలో-పూనానుంచి యెప్పుడొచ్చావు" శివరామ్‌గూడా ఆప్యాయంగా అడిగాడు. శివరామ్ ప్రక్కగా నిలబడిన జయంతి యిద్దరిని చూస్తుండిపోయింది.

"దర్శనం కరువై సంవత్సరాలయిందనుకో. ఉత్తరాలుగూడా వ్రాలేదే. పెళ్ళి చేసుకున్నానని ఒక్క కార్డుముక్క రాసిపడేస్తే సరాసరి మీ యింటికే అతిథిగా వచ్చేవాడినిగా."

జయంతివైపు చూస్తూ శివరామ్‌కి తను చాలా కావాల్సినవాడిని అన్నట్టు అన్నాడు.

● "నాకు నువ్వు అయిదురూపాయలుబాకీవున్నావు. మరిచిపోయావా."

"అప్పుడేనా? ఇంకొద్దిరోజులు పోతేనేగాని—"

"ఏమిటి. నీమొహం" శివరామ్ కంగారు పడ్డాడు.

జయంతి కళ్ళు వెడల్పు చేసుకుని వచ్చినతనివైపు చూడసాగింది. దూరం నుంచి యెవరో 'ప్రసాద్' అని కేక వేశారు. 'ఇదిగో వస్తున్నా' అని వెనక్కి తిరిగి వాళ్ళకి చెప్పి "రేపు ఆఫీసుకివస్తా! అదే ఆఫీసుగా." అని శివరామ్‌తో అని జయంతివైపు తిరిగి,

"ఏమండోయి ఇంటికి భోజనానికి వస్తా మర్చిపోకండి"

అని గబగబా వెళ్ళిపోయాడు.

"వట్టి అధికప్రసంగి. దానికితోడు తొందరపాటు జాస్తీ."

శివరామ్ స్వగతం చెప్పుకున్నాడు. జయంతి మొహం యెరుపురంగుకి తిరిగింది.

"ఏమ్మా! మేంవెడుతున్నాం" ఇంతలో డాక్టరుగారు కామేశ్వరమ్మగారు వచ్చారు

"మమ్మల్ని ఫ్రెండ్స్ డ్రాప్ చేస్తాం అన్నారు. నువ్వు యెలా?" కామేశ్వరమ్మగారు అన్నారు.

"ఆ కారులో చోటు లేదుకూడాను" అన్నారు డాక్టరుగారు.

"వుంది. శేఖరం కారులో వచ్చెయ్యి" అందావిడ.

జయంతిచూపులు చుట్టూ శేఖరంకోసం వెతికినాయి. అప్పుడే పైకి వస్తున్న శేఖరం సుమిత్రాదేవి. మిసెస్ కరుణాకరం కూర్చున్నవైపు వెడుతున్నాడు. అతని ప్రక్కన ప్రమీలవుంది. మాట్లాడుతూ, మాట్లాడుతూ నడుస్తూనే ప్రమీల భుజంమీద దెబ్బవేశాడు. ప్రమీల నవ్వుతూ యేదో అంటోంది. శేఖరం ప్రమీల చెవిపుచ్చుకుని మిసెస్ కరుణాకరం దగ్గరకి లాక్కెళ్ళి నవ్వుతూ యేదో చెబుతున్నాడు. అందరూ నవ్వుతున్నారు. జయంతి కెందుకో వాళ్ళంతా చాలా హాయిగా ఆనందంగా వున్నట్టు, తను వాళ్ళెవరికీ చెందకుండా ఓ మూలగా వంటరిగా వున్నట్టు అనిపించింది.

"మీరు వెళ్ళే కారులో ఖాళీ లేకపోతే నేను రిక్షాలో వెళ్ళిపోతాను ఫర్వాలేదు." అంది జయంతి.

"అబెబ్బె. అదేమిటి - యింతరాత్రి ఒంటరిగా" డాక్టరుగారు కంగారుగాఅన్నారు.

"పోనీండి. వాళ్ళకి రామని చెప్పండి. అంతా అయేదాకావుండి - శేఖరం కారు తిరిగి రాగానే అందులో వెడదాం. కాని చాలా ఆలస్యం అవుతుందేమో" అన్నారు కామేశ్వరమ్మగారు.

"మీ కభ్యంతరం లేకపోతే నాకారులో డ్రాప్ చేస్తాను." అన్నాడు శివరామ్.

"పోనీ ఆపని చేద్దాం. మీరు వెళ్ళి వాళ్ళతో చెప్పిరండి" కామేశ్వరమ్మగారు డాక్టర్‌గార్ని పంపేసి జయంతి వైపు తిరిగి.

"అయితే అతనితో వెళ్ళి చెప్పిరా. వెళ్ళిపోదాం." అంది.

"ఫర్వాలేదు లెండి. ఆయన బిజీగా వున్నారు." అంది జయంతి.

శివరామ్ వెళ్ళి శేఖరానికి చెప్పివచ్చాడు. కనీసం శివరామ్‌ని చూసినప్పుడైనా శేఖరానికి జయంతి గుర్తురాలేదు.

నలుగురూ క్రిందకు వచ్చేశారు.

కారులో వచ్చేస్తుండగా డాక్టరుగారు 'కావుడూ: ప్రమీలని చేసుకుంటానని రాజా ఖాయంగా చెప్పాడా?" అన్నారు.

"ఏమో! అప్పు డనుకున్నారు. మళ్ళీ యేమైందో తెలియదు. ఏదయినా త్వరగా పెళ్ళిచేసుకుంటేనే మంచిది. ఇప్పటికే చాలా ఆలస్యం అయిపోయింది."

"ప్రమీలని యివ్వాలి అనుకున్నవాళ్ళు రేఖారాణితో అంత స్నేహంగా యెలావుండగలుగుతున్నారబ్బా!"

"మీరు చెప్పేది మరీబాగుంది. అసలు వాళ్ళకి శేఖరం పరిచయం అయింది రేఖారాణిద్వారానే గదా!"

"అయితే,"

"అసలీ పెళ్ళి ప్రసక్తితెచ్చింది రేఖారాణే గదా!"

జయంతి, శివరామ్ మెదలకుండా వింటూ కూర్చున్నారు.

(సశేషం) ೦೦೦

చిత్రరధుని

చైత్రయాత్ర

"అగ్గిపిడుగు"

స్పష్టంగా భిన్నమైన భూమికలు రెండింటిని తెలుగువారు తెలుగు చిత్రంలో మేలుగా నిర్వహించడం శ్రీ విఠల్ ప్రొడక్షన్స్ "అగ్గిపిడుగు"తో ప్రారంభమైనదని చెప్పాలి.

లోగడ వచ్చిన ద్విపాత్రాభినయాలు ప్రేక్షకుల మెచ్చుకోలు పొందిన మాట వాస్తవమే. అయితే అవి రెండూ సౌమ్యమైనవి. వైరుధ్యం తక్కువ. "అగ్గిపిడుగు" ద్విభూమికల విశిష్టత ఆ వైరుధ్యంలోనే వుంది. భిన్నపాత్రల లక్ష్యం ఒక్కటే. కవలపిల్లలు కావడంచేత ఒక మనిషి అనుభూతి మరొకరిపై వుండడమనేది ''అగ్గిపిడుగు''లో మరొక కొత్త విశేషం. ఇది మానసికమైనదీ, శారీరకమైనదీకూడా కవలలకు ఇట్టి ప్రత్యక్ష పరోక్షసంబంధం ఎక్కువగా కాల్పనికమైనది. కొందరు కవలల విషయంలో అట్టి అవిచ్ఛిన్నబంధం నిరూపిస్తూ తుదకు ఒకరు మరణిస్తే మరొకరు జీవించివున్నట్లు చూపడంకద్దు. విజ్ఞానికది సహజవిరుద్ధం. అట్టి వికృతి ''అగ్గిపిడుగు''లో లేదు. ఒకరి అనుభూతి మరొకరిపై ప్రకోపించినవిధం చిత్రీకరణలో దర్శక, నిర్మాత శ్రీ విఠలాచార్య, సహదర్శకుడు ఎస్ డి లాల్ ప్రత్యేక నైపుణి కానవచ్చినది. బస్తీవీరుడుగా కంటె. వనవీరుడుగా రామారావు నటన భాసించింది.

మరదే వదినను వధించడం. శృంగార ఘట్టాలు కొంతమోతాదుమించి చిత్రస్థాయిని ఒకించుక దెబ్బతీశాయనే చెప్పాలి.

అలెగ్జాండర్ డ్యూమాస్ రచించిన "కార్సికన్ బ్రదర్స్" ఆధారంగా శ్రీ బి. వి. ఆచార్య "అగ్గిపిడుగు" కథ రచించారు. జానపద రీతిలో సాంఘికపు సొగసులలో విద్యుద్వేగంతో పరుగులిడిన కథలో ఆంగ్ల సంప్రదాయాలు దొర్లినవి. చాలా ఏళ్ళక్రితం జెమిని వాసన్ "అపూర్వ సహోదరులు" పేరిట తెలుగు, తమిళ చిత్రాలను, "నిషాన్" పేరిట హిందీ చిత్రాన్ని నిర్మించారు. తమిళ, చిత్రాన్ని నిర్మించారు. తెలుగు చిత్రంలో సోదరుల భూమికను ఎమ్. కె. రాధ



"అగ్గిపిడుగు"లో రాజశ్రీ

తమిళ, హిందీ చిత్రాలలో రంజన్ నిర్వహించారు. మూడింటిలో మగువ నిరుపమ భానుమతి. హిందీలో విలనుగా ఆర్. నాగేంద్రరావు ("భూకైలాస్" నారదుడు) అభినయం అమరం. ఆ జెమిని చిత్రాలకు స్టోరీ డిపార్టుమెంటులో సహాయకునిగా పని చేసినవారు "అగ్గిపిడుగు" కథానిర్మాణంలో సహాయపడ్డారు. "అగ్గిపిడుగు" రామారావు నటన, ముఖ్యంగా స్వేచ్ఛానటన, పల్లె మనిషిగా ప్రవర్తన, ఇంతో పూర్వపు చిత్రాలకంటే విశిష్టం.

అన్న మహేంద్రరాజుకు కవలపిల్లలు కలగడంతో వారసత్వం పోయిన తమ్ముడు వీరేంద్రుడు (రాజనాల) రాజును, రాణిని వధించి అధికారం హస్తగతం చేసుకొంటాడు. కవల శిశువుల శరీరాలను విడదీసిన డాక్టర్ (ముక్కామల) వీరయ్య (నాగయ్య) పిల్లలను రక్షిస్తారు. బస్తీలో డాక్టర్‌వద్ద మాధవ్, పల్లెలో వీరయ్యవద్ద రాజా పెరిగి పెద్దవారవుతారు. మాధవ్ మాలతిని (కృష్ణకుమారి) ప్రేమిస్తాడు. రాజాకు రోజా (రాజశ్రీ) తారసిల్లిన అన్న ప్రేమానుభూతితో సంకట పరిస్థితిలో పడతారు. మాధవ్, రాజాలు (రామారావు) తమను పెంచినవారిద్వారా వీరేంద్రుని పాతకం సంగతి తెలుసుకొని పగ సాధించి, రాజ్య, ప్రణయ సామ్రాజ్య పట్టాభిషిక్తులవుతారు. ఈమధ్య జలక్రీడలు, శృంగార క్రీడలు, గుర్రపు స్వారీలు, కత్తియుద్ధాలు తమ అభిమాన ప్రేక్షకుల ఈలలను సంపాదిస్తవి.

మొత్తానికి అగ్గిపిడుగుల్లా ధనం వర్షింపజేయగలశక్తి "అగ్గిపిడుగు"కు వుందనిపిస్తుంది.

సాంకేతిక బృందంలోని మిగిలిన ముఖ్యుల పేర్లివి:

రచన; జి. కృష్ణమూర్తి, సంగీతం: రాజన్, నాగేంద్ర; పాటలు: సి. నారాయణరెడ్డి, జి. కృష్ణమూర్తి, కెమెరా: రవికాంత్ కో ప్రొడ్యూసర్: బి. వి. శ్రీనివాస్.

"షెహర్ ఔర్ సప్నా"

లోగడ బెంగాల్, మహారాష్ట్రలు, బిమల్ రాయ్ వంటి బెంగాలీలు కొన్ని 'అతి వాస్తవిక' చిత్రాలను అందించివున్నారు. అంతే పేద భారతదేశ ప్రతిబింబ మనదగిన కథా చిత్రాలను తీసి మెప్పుపొందారు. జియా సర్హాదీ "హమ్ లోగ్" (బొంబాయి), బిమల్ రాయ్ "దో బిఘా జమీన్" (బొంబాయి) వంటి హిందీ చిత్రాలు మధ్యతరగతివారికో, తక్కువ తరగతి వారి సమస్యలను హృదయాలకు హత్తుకునేటట్లు చిత్రించినవి. జియాసర్హాడీ "ఫుట్‌పాత్" పేరిట కాలబాటల ప్రజల జీవితం చిత్రించబోయి, దారితప్పి మీనాకుమారి సౌందర్య నిరూపణకోపడి అభాసపాలయినాడు. కార్మికులపై లోగడ "నీచానగర్" వంటి విశిష్టమైన సహజ చిత్రాలు బొంబాయినుంచే వచ్చాయి.

అటు విదేశాలసంగతి చూస్తే ముందుగా కన్పించేది ఇటలీ. ఆ దేశంలో ముందుగా కన్పించే దర్శకుడు విట్టోరియా డీసికా. "మిరకిల్ ఇన్ మిలాన్" అనే ఇటాలియన్ చిత్రంలో కానుకు నోచుకొని మురికిపేట ప్రజాకోటి ఊహలు, స్వప్నాలు, వాస్తవిక జీవితంలో తద్భిన్నమైన బాధలు వ్యధలు, నిరుపమ రీతిలో చిత్రీకరించాడు డీసికా, దర్శక చక్రవర్తి. అడుగు ఎండకోసం వారి తాపత్రయం, చీపురుకట్టలనే గుర్రాలుగా యెంచి ఎక్కి వారు విహరించిన స్వప్నసీమ చలనచిత్రకళకు అరని వెలుగు.



"అగ్గిపిడుగు"లో రామారావు, కృష్ణకుమారి.

ఇన్నాళ్ళకు బొంబాయిలో - రాతిభవనాల క్రింద, రాతిగుండెల క్రీనీడల నివసించే ప్రజల జీవితానుభవాలపైన, వారు ఇంతలో నిర్మించగా, అంతలో కూలిపోయే ఆశా సౌధాలపైన కవితాధోరణిలో ఓ చక్కటి చిత్రం "షెహర్ ఔర్ సప్న" (నగరము-స్వప్నము) రావడం మిక్కిలి హర్షదాయకం. బొంబాయివారు హిందీలో ఈ చిత్రం నిర్మించడం, ఢిల్లీదొరలు స్వర్ణపతకమిచ్చి హుషారెత్తించడం, కార్లొవీవారి ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌వారు చిత్ర లాలిత్యాన్ని మెచ్చి అకాడమీ ప్రైజ్ యివ్వడం, అందులో ముఖ్యభూమికలు నిర్వహించిన పైని (లీప్‌రాజ్ (హైదరాబాద్ జైరాజ్ కుమారుడు), కాలేజీ విద్యార్థిని సురేఖ చెకొస్లొవాకియా ఉత్సవపు ఉత్తమ యువతి. యువకులుగా నిర్ణయించబడడంచూస్తే ఈ రోజులలోకూడా శ్రమకు సత్ఫలితం లేకపోలేదనిపిస్తూంది.

దర్శక నిర్మాత ఖ్వాజా అహమ్మద్ అబ్బాస్ ఈ చిత్ర నిర్మాణంలో పడిన యిబ్బందులు భారత, భాగవత, రామాయణ కాలంనాటి కష్టాలు జ్ఞప్తికి తెచ్చేటటువంటివి.

నటీనటులు, సాంకేతిక బృందంవారు మొత్తం 15 మంది దమ్మిడీ తీసుకోకుండా, తమ శక్తినే పెట్టుబడిగా పెట్టి నటించారు. ఒక వారపత్రికలో సీరియల్‌గాపడిన వ్యాసాలను ("బ్లిట్జ్''లో కె. ఏ. అబ్బాస్ రచించిన బాక్ పేజ్ వ్యాసాలు) ఆధారం చేసుకొని చిత్రం కథ వ్రాయడమనేది కూడా భారత చలన చిత్రరంగానికి కొత్తే. ఆవ్యాసాలకు ఇదమిత్థమైన అంతం లేకపోవడమనే దోషం "షెహర్ ఔర్ సప్నా''లో కూడా దొర్లింది. చిత్రం ఎక్కడ ముగుస్తుందో ఎవ్వరూ చెప్పలేరు. ఓపికున్నద్దీ చిత్రంతీసి 'ఇక చాలు' అని ముగించినట్లున్నది. మామూలు సినీపరిభాషలో కథస్వరూపం ఈ హిందీ చిత్రంలో లేకపోవడంవల్ల చిత్రానికి ఎక్కడ ''శుభం'' చెప్పినా చెప్పవచ్చునని పించింది. ఆర్థికపు యిబ్బందులవల్ల చిత్ర నిర్మాణంలో జాగు జరిగింది. కొత్త లీడ్ జంటనే కాక జె. పి. కౌశిక్ అనే సంగీత దర్శకుని కూడా ఈ చిత్రంద్వారా పరిచయం చేశారు. డ్యూయెట్‌లు కాని, కొట్టవచ్చే పాటలు కాని లేవు. అవేశంలో వినాదాలపాటలు పాడే ''ఓవర్ కీ కవి'' (మన్‌మోహన్‌కృష్ణ) అవసరమైనప్పుడు వచ్చి రెండు మూడు కూనిరాగాలు తీసి పోతాడు. ఇవికూడా లేకపోతే బాగుండేది. ఎందుచేతనంటే రాతిమనుషులు, రాతి గుండెలు అనే వ్యర్థ వినాదాలవల్ల చిత్రం ఔన్నత్యం, స్థాయి తగ్గుతుందే కాని పెరగదు. ఆపాటలకు కూడా రండోలు అర్కెస్ట్రేషన్ లేదు.

పోతే నేపథ్య సంగీతంలోకూడా కొత్త పుంత త్రొక్కారు. చెవులు చిల్లులుపడే నేపథ్య సంగీతపు రణగొణధ్వనులు లేవు. సందర్భోచితంగా ఫిడేలు వాయించే గోవా గడ్డపువాడు - నవనీత హృదయం కల క్రైస్తవుడి భూమిక ఒకటి వుంది. అతడు కథా సందర్భానుసారం వినిపించే ఫిడేలు వాద్యమే చిత్రానికి నేపథ్య సంగీతం.

సమకాలిక సినిమా (బాక్స్ ఆఫీస్) సిద్ధాంతాలను కాలదన్ని ఫిల్మ తీయాలి అంటే ఆర్థిక సహకారం లభించదు. అది లేక అబ్బాస్ చాలా యాతనలు పడ్డారు. తీరా పిక్చర్ తీసి విడుదల చేద్దామా అంటే థియేటర్లు యిచ్చినవారు లేరు. రాష్ట్రపతి స్వర్ణపతకం లభించినమీదట కొద్దిగా థియేటర్ ఆఫర్స్ వచ్చినవి. శతదినోత్సవాలు కూడా జరిగినవి.

ఇక "షెహర్ ఔర్ సప్న"లో సమకాలిక చిత్రాలలో సాధారణంగా అరుదయ్యే కొన్ని అంశాలున్నవి. వాటిని ప్రస్తావించడం రసజ్ఞతను మెచ్చుకొనడమే అవుతుంది. మంచి చిత్రం తీయడంకంటేకూడా మంచి విషయాలను అందరూ గ్రహించవలెనని దర్శకులు ఉవ్విళ్ళూరుతారు. "సప్నా" లోని విశిష్టాంశాలను యిలా ఉదహరించవచ్చు

భోలా (దిలీప్‌రాజ్) అనే నవయువకుడు ఓ పల్లెటూరునుంచి బొంబాయివస్తాడు - ఇక్కడేదో మేడలు కడదామని ఒక దూరపు బంధువు యింట్లో బస చెయ్యవచ్చు కదా అని ఆ అడ్రసు పుచ్చుకువస్తాడు. తీరా చేరితే ఆ బంధువు కొద్దిరోజులక్రితమే మరణించినట్లు తెలుస్తుంది.

దొంగలు భోలాసామగ్రిని అపహరిస్తారు. ప్రేమికులకు ఉల్లాసం కలిగించేటట్లు ఫిడేలు వాయించే ముదుసలి గోవా వాద్యగాడు జానీ (నానా పాలిస్కర్) కరుణించి

భోలాను తన కాలిబాట పడకకు తీసుకు వెడతాడు. అచ్చట వాళ్ళకు సహనివాసి అన్వర్ మియాసాహెబ్ (అన్వార్ హుస్సేన్) అనే ధాన్యములేని స్టేజినటుడు; ఆవేశపూరితుడైన దీవానా (మన్‌మోహన్ కృష్ణ) అనే కవి. వీళ్ళకే చిల్లిగవ్వలేకపోతే, కాలిబాటపై పడుకోనిచ్చినందుకు వీరి వద్ద డబ్బు గుంజి పీడించే జగ్గా అనే రౌడీ వుంటాడు. కాలిబాటకు కొత్తగావచ్చిన భోలా "మామూలు" చెల్లించక పోయేసరికి జగ్గా చేతిలో దెబ్బలు తింటాడు. అయినా సుఖంగానే వున్నానని భోలా అమ్మకు కార్డు వ్రాస్తాడు. వీళ్ళందరు యిచ్చే అడ్రసు కేరాఫ్ ఓ కిల్లీషాప్.

అసలే ఆకబయట కాలిబాట జీవితం రాత్రి వర్షం కురిసింది. దీవానా కవి వ్రాతప్రతులు వర్షంలో తడిసిపోయినవి. చినుకుల నుంచి వాళ్ళు కాపాడుకునేందుకు భోలా ప్రక్కకు పరుగిడితే ఖాళీగావున్న ఓ డ్రెయినేజ్ పంపు వుంది. గజం డయామీటర్, నాలుగు గజాల పొడవు వుంది. అందులో తలదాచుకొన భోలా వెడితే అందులోనే ఓ అతివ కాపురం చేస్తున్నది. పేరు రాధ. పదహారేళ్ళ వడుచు. పనిమనిషి. ఒడిలో కత్తిపెట్టుకొని ఆ 'సొరంగం'లో క్షణక్షణ గండంగా బ్రతుకు సాగిస్తున్నది.

జాగ్రత్తగా మెలగుతానని భోలా హామీ యిచ్చేసరికి కాల్వ పీపాపంపులోనికి రాధ (సురేఖ) రానిచ్చింది.

వారిరువురిమధ్య ప్రేమ క్రమవికాసం పొందింది.

ఉద్యోగంకోసం ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజికివెళ్ళిన భోలా పాండూ పహిల్వానుకు (డేవిడ్) ఉద్యోగం దరఖాస్తు పూర్తిచేసి యిస్తాడు. మిల్లులో ఒకే ఒకపని ఖాళీగావుంది. అది కాస్తా పహిల్వానుకు దొరుకుతుంది. దరఖాస్తు పూర్తిచేసినందుకు కృతజ్ఞతగా పహిల్వాను ఆపని తాను తీసుకోక భోలాకే యిప్పిస్తాడు. ఆవిధంగా ఆ యిద్దరూ మిత్రులౌతారు. వర్షాకాలం కాబట్టి కాలిబాటల పౌరులు జానీ, అన్వార్, పాండు







''బభ్రువాహన''లో
ఎస్. వరలక్ష్మి

ఓ మురికిపేటలో ఓ పూరికొంప అద్దెకు తీసుకొని దానికి "పారడైజ్" అనే నామకరణం చేస్తారు.

ఉద్యోగం దొరికిన భోలా రాధను వివాహ మాడి పౌర్ణమను ఆ ద్దెకు తీసుకోవాలని ప్రయత్నిస్తాడు కాని వేంకు వేలు 'ప్రగీ' చెల్లించలేక పోతాడు. భార్య గర్భవతి గతి లేదు. అట్టి తరుణంలో వెయ్యిరూపాయల పర్సు దొరుకుతుంది. ఐదారు భవనాలు కల శేట్ పదియాపాయల పారితోషికం యిస్తాడు. ఆ భవంతిలో అనేక గదులున్నాయి. ఒక్క గది యిమ్మంటాడు. పర్సు పేరుతోదో చెయ్యడానికి వచ్చావా? అని శేట్, భోలాను తరిమివేస్తాడు.

కుర్చీలు, బల్లలు, డైనింగ్ టేబిల్సు, విశ్రాంతిగా నిద్రిస్తున్న ఆ సువిశాల మందిరంలో అవన్నీ 'మాయాబజార్'లోలా తొలగిపోయినట్లు. కాలిబాటలవాళ్ళకని ఓ వంద పడకలు వేయబడినట్లు భోలా కలకంటాడు. మరుక్షణంలో నౌకరువచ్చి అర్ధచంద్రప్రయోగం చేస్తాడు.

పురిటిరోజులు. భోలా సతీసమేతంగా "పారడైజ్" వంచచేరుతాడు. అచ్చటి హిందూ, ముస్లిం క్రైస్తవ మిత్రులు దైహికశ్రమచేసి పురిటికి డబ్బులు ప్రోగుచెస్తే యజమాని ఎజెంటువచ్చి బకాయీల క్రింద వసూలుచేసుకుపోతాడు.

... రాధకు నొప్పులు వచ్చినవి. బాధపడుతున్నది. ఆ మురికిపేట యజమాని శేట్ బుల్‌డోజర్ తిసుకొనివచ్చి ఆ పాకలను నిర్మూలించి, ప్రదేశం చదును స్తున్నాడు. 'పారడైజ్' ప్రాంగణానికి బుల్‌డోజర్ మహాశబ్దంతో వచ్చింది. రాధ ప్రసవించింది.

భోలా, రాధ, పాప మళ్ళీ ఆ కాల్వ పీపాలోనే బ్రతుకువామని వెళ్ళిపోతుంటూ పోతారు, కాని ఆ సమయానికి ఆ పంపును భూమిలో పూడ్చేస్తున్నారు. చివరకు ఆ కుటుంబానికి ఆ నీడా లేకపోయింది.

మళ్ళా మొదలు. కొత్తరాతిమేడలు. రాతిగుండెల బొంబాయి మహానగరంలో ముగ్గురు పట్టే చోటుకు.

రెండంతస్తుల కొత్త భవనాలు అనేకం లేస్తున్నవి. కాని వీళ్ళకు మూడుగజాల చోటులేదు. ఆ భవనంపై "ది ఎండ్" అన్న అక్షరాలు వస్తవి. ఆ వెనువెంట "అర్ ది బిగినింగ్" అన్న అక్షరాలు వస్తవి ఒక గాధ ముగిసిందా? ప్రారంభమైందా? అన్న ప్రశ్నతో భావుకుడు అబ్బాస్ చిత్రాన్ని ముగించారు.


"మహానగర్"

టాగూర్, రామన్‌ల తర్వాత భారతదేశానికి అంతటి అంతర్జాతీయ ఖ్యాతి సంపాదించి నిలుపుతున్న సినీ మేధావి సత్యజిత్ రాయ్ భారత సినీ కిరీటానికి యీయన ఇటీవల సాధించిన తురాయ్ "మహానగర్" (కలకత్తా) బెంగాలీ చిత్రానికి బెర్లిన్ ఉత్తమ దర్శకత్వపు బహుమతి.

నరేంద్రనాథ్ మైత్రా రచించిన కథ ఆధారంగా అర్. డి. బన్సాల్ నిర్మించిన ఈ చిత్రానికి దర్శకుడు. సంగీత దర్శకుడు సత్యజిత్‌రాయ్. భారత ప్రభుత్వపు ద్వితీయ యోగ్యతాపత్రం ఈ చిత్రానికి లభించింది.

బాగా బ్రతికిన ఓ ముజుందారీ కుటుంబంలో, కుటుంబ పరిస్థితివల్ల బిడ్డ తల్లి, కోడలు అయిన ఆరతిముజుందార్ ఉద్యోగం చెయ్యవలసి వచ్చి బజారున పడడంవల్ల కుటుంబంలో రేగే తుఫానును 'మహానగర్' చిత్రించింది.

వృద్ధ ముజుందార్‌కు కళ్ళపరీక్ష జరగాలి. కళ్ళద్దాలు కావాలి. తన సంపాదన లేదు. కొడుకు సంపాదన చాలదు. కోడలు



"దాగుడుమూతలు"లో రామారావు, బి. సరోజాదేవి.

ఉద్యోగం చెయ్యరాదంటాడు. అప్పులు మటుకు చేస్తూ వుంటాడు. తనుమారేవయసు దాటిపోయిందంటాడు. పెళ్ళి కావలసిన 14-15 ఏళ్ళ కూతురు కూడా వుంది. వృద్ధ సతి వంట చాకిరీ చేస్తూ ఆదర్శ అత్తగారుగా వుంటుంది.

కొడుకు ముజుందార్‌కు అకలకత్తా మహానగరంలో బ్యాంకులో పని. ఈతనికి ముద్దులొలికే కొడుకు. తన సంపాదన 'బాబూ కుట్టుపోగులకు చాలదు." కుటుంబంలో అందరూ కష్టపడాలి; అందరూ సంపాదించాలంటాడు. భార్య ఆరతి రూపవతి. సీతవంటిసుశీల. తండ్రి వద్దన్నా సేల్స్‌గరల్‌గా గంలో ప్రవేశపెట్టుతాడు. భార్య ఉద్యోగిని. భర్తకు దురదృష్టవశాత్తూ ఉద్యోగం పోతుంది. భార్య హ్యాండ్‌బ్యాగ్‌లో లిప్‌స్టిక్ ముక్క చూశాడు. నల్లకళ్ళజోడుతో వీధులలో పోవడం చూశాడు, మగవారితో హోటలుకు వెడుతున్నది. యజమాని కారులో తిరుగుతున్నది. ఓక్షణం బాధపడ్డాడు. అయినా కాలం ఒత్తిడి భార్య ఉద్యోగిని - స్థితిని గ్రహించాడే కాని అనుమానించి బాధించి పీడించలేదు. ఉత్తముడు.

ఆరతి అందగత్తె. లిప్‌స్టిక్ అంటే ఏమిటో తెలియదు. పరాయి పురుషుని కన్నెత్తి చూడలేదు. అయినా కుటుంబ పరిస్థితి దృష్ట్యా ఉద్యోగంలో చేరింది. ఇళ్ళళ్ళకు వెళ్ళి ఇళ్ళవాళ్ళను ఆకర్షించి యంత్రాలుఅమ్మేఉద్యోగమది. బిడియపడితే ఎలా, జరుగుతుంది. అనేలా ఆకర్షవంతంగా

ఓ మురికిపేటలో ఓ పూరికొంప అద్దెకు తీసుకొని దానికి "పారడైజ్" అనే నామకరణం చేస్తారు.

ఉద్యోగం దొరికిన భోలా రాధను వివాహమాడి ఫోర్షను అద్దెకు తీసుకోవాలని ప్రయత్నిస్తాడు కాని వేంకు వేలు 'పగ్రీ' చెల్లించలేక పోతాడు. భార్య గర్భవతి గతిలేదు. అట్టి తరుణంలో వెయ్యిరూపాయల పర్సు దొరుకుతుంది. ఐదారు భవనాలు కల శేఠ్ పదిరూపాయల పారితోషికం యిస్తాడు. ఆ భవంతిలో అనేక గదులున్నాయి. ఒక్కగది యిమ్మంటాడు. పర్సు పేరుతోదో చెయ్యడానికి వచ్చావా? అని శేఠ్, భోలాను తరిమి వేస్తాడు.

కుర్చీలు, బల్లలు, డైనింగ్ టేబిల్సు, విశ్రాంతిగా నిద్రిస్తున్న ఆ సువిశాల మందిరంలో అవన్నీ 'మాయాబజార్'లోలా తొలగిపోయినట్లు. కాలిబాటలవాళ్ళకని ఓ వంద పడకలు వేయబడినట్లు భోలా కలకంటాడు. మరుక్షణంలో నౌకరువచ్చి అర్థచంద్రప్రయోగం చేస్తాడు.

పురిటిరోజులు. భోలా సతీసమేతంగా "పారడైజ్" వంచచేరుతాడు. అచ్చటి హిందూ, ముస్లిం క్రైస్తవ మిత్రులు దైహికశ్రమచేసి పురిటికి డబ్బులు ప్రోగుచేస్తే యజమాని ఏజెంటువచ్చి బకాయీల క్రింద వసూలుచేసుకుపోతాడు.

...రాధకు నొప్పులు వచ్చినవి. బాధపడుతున్నది. ఆ మురికిపేట యజమాని శేఠ్ బుల్‌డోజర్ తీసుకొనివచ్చి ఆ పాకలను నిర్మూలించి, ప్రదేశం చదును చేస్తున్నాడు. 'పారడైజ్' ప్రాంగణానికి బుల్‌డోజర్ మహాశబ్దంతో వచ్చింది. రాధ ప్రసవించింది.

భోలా, రాధ, పాప మళ్ళీ ఆ కాల్వ పీపాలోనే బ్రతుకుదామని వెళ్తున్నాండగా పోతారు, కాని ఆ సమయానికి ఆ పంపును భూమిలో పూడ్చేస్తున్నారు. చివరకు ఆ కుటుంబానికి ఆ నీడా లేకపోయింది.

మళ్ళా మొదలు. కొత్తరాతిమేడలు, రాతిగుండెల బొంబాయి మహానగరంలో ముగ్గురు పట్టే చోటుకు.

రెండంతస్తుల కొత్త భవనాలు అనేకం లేస్తున్నవి. కాని వీళ్ళకు మూడుగజాల చోటులేదు. ఆ భవనంపై "ది ఎండ్" అన్న అక్షరాలు వస్తవి. ఆ వెనువెంట "ఆర్ ది బిగినింగ్" అన్న అక్షరాలు వస్తవి. ఒక గాథ ముగిసిందా? ప్రారంభమైందా? అన్న ప్రశ్నతో భావుకుడు అబ్బాస్ చిత్రాన్ని ముగించారు.


"మహానగర్"

టాగూర్, రామన్‌ల తర్వాత భారతదేశానికి అంతటి అంతర్జాతీయ ఖ్యాతి సంపాదించి నిలుపుతున్న సినీ మేధావి సత్యజిత్ రాయ్ భారత సినీ కిరీటానికి యీయన ఇటీవల సాధించిన తురాయ్ "మహానగర్" (కలకత్తా) బెంగాలీ చిత్రానికి బెర్లిన్ ఉత్తమ దర్శకత్వపు బహుమతి.

నరేంద్రనాథ్ మైత్రా రచించిన కథ ఆధారంగా ఆర్. డి. బన్సాల్ నిర్మించిన ఈ చిత్రానికి దర్శకుడు. సంగీత దర్శకుడు సత్యజిత్‌రాయ్. భారత ప్రభుత్వపు ద్వితీయ యోగ్యతాపత్రం ఈ చిత్రానికి లభించింది.

బాగా బ్రతికిన ఓ ముజుందారీ కుటుంబంలో. కుటుంబ పరిస్థితివల్ల బిడ్డ తల్లి, కోడలు అయిన ఆరతిముజుందార్ ఉద్యోగం చెయ్యవలసి వచ్చి బజారున పడడంవల్ల కుటుంబంలో రేగే తుఫానును 'మహానగర్' చిత్రించింది.

వృద్ధ ముజుందార్‌కు కళ్ళపరీక్ష జరగాలి. కొత్త అద్దాలు కావాలి. నా సంపాదన లేదు. కొడుకు సంపాదన చాలదు. కోడలు



"దాగుడుమూతలు"లో రామారావు, బి. సరోజాదేవి.

ఉద్యోగం చెయ్యరాదంటాడు. అప్పులు మటుకు చేస్తూ వుంటాడు. తనుమారేవయసు దాటిపోయిందంటాడు. పెళ్ళి కావలసిన 14-15 ఏళ్ళ కూతురు కూడా వుంది. వృద్ధ సతి వంట చాకిరీ చేస్తూ ఆదర్శ అత్తగారుగా వుంటుంది.

కొడుకు ముజుందార్‌కు అకలకత్తా మహానగరంలో బ్యాంకులో పని. ఈతనికి ముద్దులొలికే కొడుకు. తన సంపాదన 'బాబూ కుట్టుపోగులకు చాలదు." కుటుంబంలో అందరూ కష్టపడాలి; అందరూ సంపాదించాలంటాడు. భార్య ఆరతి రూపవతి. సీతవంటిసుశీల. తండ్రి వద్దన్నా సేల్స్‌గరల్‌గా గంలో ప్రవేశపెట్టుతాడు. భార్య ఉద్యోగిని. భర్తకు దురదృష్టవశాత్తూ ఉద్యోగం పోతుంది. భార్య హ్యాండ్‌బ్యాగ్‌లో లిప్‌స్టిక్ ముక్క చూశాడు. నల్లకళ్ళజోడుతో వీధులలో పోవడం చూశాడు, మగవారితో హోటలుకు వెడుతున్నది. యజమాని కారులో తిరుగుతున్నది. ఓక్షణం బాధపడ్డాడు. అయినా కాలం ఒత్తిడి భార్య ఉద్యోగిని - స్థితిని గ్రహించాడే కాని అనుమానించి బాధించి పీడించలేదు. ఉత్తముడు.

ఆరతి అందగత్తె. లిప్‌స్టిక్ అంటే ఏమిటో తెలియదు. పరాయి పురుషుని కన్నెత్తి చూడలేదు. అయినా కుటుంబ పరిస్థితి దృష్ట్యా ఉద్యోగంలో చేరింది. ఇళ్ళిళ్ళకు వెళ్ళి ఇళ్ళవాళ్ళను ఆకర్షించి యంత్రాలుఅమ్మేఉద్యోగమది. బిడియపడితే ఎలా, జరుగుతుంది. అనెలా ఆకర్షవంతంగా

తయరౌతుంది. తోటి ఉద్యోగిని ఓ ఆంగ్లో ఇండియన్ గరల్. ఆరతి భర్తను చూసి తెలియక 'బామ్‌ఫ్రెండా' అని అడిగేసింది. ఆకర్షకంగా వుండేందుకు లిప్‌స్టిక్ యిచ్చింది ఆరతికి. వద్దంటే బొట్టు పెట్టుకొనేవారు. పాపిడికి కుంకుమ పెట్టుకునేవారు ఉద్యోగ ధర్మం రీత్యా పెదవికి రంగువేసుకొంటే తప్పేమిటని ప్రశ్నించి కవ్వించింది. కోపం వచ్చింది ఆరతి. ఇంటినుంచి బైటపడగానే 'లిప్‌స్టిక్' వేసుకోవడం, రాత్రి ఇంటిలో తిరిగి ప్రవేశించేముందు కడిగి వేసుకొనడం ప్రారంభించింది. రంగుముక్క మటుకు హ్యాండ్‌బ్యాగ్‌లో వుండేది. భర్త చూసింది ఆ దాచిన ముక్కనే.

ఆంగ్లోఇండియన్ గరల్, ఆరతికి నెమ్మదిగా ఓ కూలింగ్ గ్లాస్ కళ్ళజోడు కూడా బహూకరించింది. అది ధరించిన ఆరతి బజార్లలో టిప్‌టాప్‌గా నడుస్తుంటే భర్త గుండెపై ఇనుపపాదాలు పడ్డట్టున్నవి. విధి బలీయం.

ఓ రోజున ఆంగ్లోఇండియన్‌గరల్ సెలవు పెట్టేసరికి బెంగాలీ యజమాని డిస్మిస్ చేశాడు. ఆ బాలిక ఏడుస్తూవుంటే ఆరతి గుండె కరిగి ఎందుకన్నది. "మీ బెంగాలీలూ మీరూ ఒక్కటి నేను ఆంగ్లోఇండియన్‌ను...." అని కవ్వించింది. ఆ సెలవు వ్యవహారంలో తన ప్రమేయంకూడా వున్నందున ఆమె తరపున యజమానితో ఆరతి వాదించింది. నీకూ ఆ గతే పట్టుతుందని హెచ్చరించాడు. పరుల బాధలు చూడలేని పడతి, పరులకు అన్యాయం సహించలేని కోపం తన కుటుంబం దరిద్రావస్థలోవున్నా, తన భర్తకు ఉద్యోగం లేకపోయినా సంకుచెయ్యక తన ఉద్యోగానికి రాజీనామాయిచ్చి బైటపడుతుంది. స్త్రీలు



సత్యజిత్ రాయ్

ఈకాలపు బస్తీ కటికఉద్యోగాలు చెయ్యలేరు అన్న 'నోట్'తో చిత్రాన్ని ముగింపజేశారు రాయ్.

ఉన్న కథను యథాతథంగా తెరకెక్కించడం తప్పితే సినిమా కళావైభవంతో కళాకాంతిని పెంచినట్లు తోచదు. రాయ్ పూర్వపు చిత్రాలు-ముఖ్యంగా అపూర్‌సన్సార్, తీన్‌కన్యవంటి చిత్రాలలో కానవచ్చిన సృజనాత్మక శక్తి మహానగర్‌లో కనుమరుగైంది. సింపుల్‌గా, స్ట్రెయిట్‌గా ప్రాబ్లెమ్‌ను ప్రెజెంట్ చేశారే కాని లోతులకుపోయి పరిష్కరించినట్లు తోచదు. రాయ్ చిత్రాలలో కథావస్తువు నిజానికి రాయి అంత కఠినమైనదైనా ఆయన శిల్పం పుణ్యమాఅని ఉత్సుకత తొంగిచూచేది. మహానగర్‌లో అటువంటి ఉత్సాహం అంతగాలేదు. డ్రాగింగ్‌గావుంది. మరి బెర్లిన్ ఫిలింఫెస్టివల్‌వారు ఉత్తమ దర్శకత్వానికి 'సిల్వర్ బేర్' బహూకరించారు.

ఆరంభానిక అడుగుల మేధావి రాయ్ స్వయంగా చెప్పుకొన్నట్లు పాశ్చాత్యరాజ్యాల సినీ కళారంగంలో నిరాడంబరత్వం (సింప్లిసిటీ) వదలి కొత్తప్రయోగాలకు పరుగులిడుతున్నారు ఐరోపాలో నేటికీ చిన్న కథను సూటికథను సూటిగా తెరకెక్కించడం హర్షించబడడం తనకే ఆశ్చర్యం కలిగించిందని రాయ్ అన్నారు.

"మహానగర్"లోని ఒకే ఒక విశేషం సూటికథను సూటిగా చిత్రీకరించడం

ఈ చిత్రంలో మరికొన్ని విశిష్టాంశాలు లేకపోలేదు.

కలకత్తా మహానగరంలో జరిగిన కథ కాబట్టి మహానగరానికి చిహ్నంగా ట్రాముపైనే రు. చిన్న చక్రం తీసుకొని టైటిల్స్ అన్నీ దానిపైనే చూపారు.

పాత్రలన్నీ ఉదాత్తమైనవి అయినా వాటినుంచి సంఘర్షణలు సృష్టించడంకూడా గొప్పతనమే.

ముంజుదార్ కుటుంబం మధ్యతరగతిదని, లేమిలోవున్నదని ఒక్క చిన్న సన్నివేశంద్వారా నిరూపించారు. హీరో చెల్లెలు పెన్ను ఎంత దులిపినా వ్రాయదు. నేలంతా ఖరాబు అన్న పెన్ను తీసేసుకొంటుంది. మంచిపెన్నుకుకూడా నోచుకోని కుటుంబం ఆర్థికస్థితి ఏపాటిదో ఇట్టే ఊహించవచ్చు

మన సినిమాలలో గ్లామర్ పేరిట, సెక్స్ పేరిట ఎన్ని కృత్రిమ అలంకారాలు చేస్తారో వేరే వ్రాయ నవసరంలేదు. నిజ సహజ సౌందర్యం వున్నప్పుడు, కృత్రిమపు పోకడలు అనవసరమని రాయ్ హీరోయిన్ మాధవి ముఖర్జీ నిరూపించింది. భారతస్త్రీ సౌందర్యమంతా ఆమెలో మూర్తీభవించి వున్నది. కృత్రిమాలంకారాలు లేకుండా నేత్రోత్సవంగా కన్పట్టిన దా తార.

రాయ్ చిత్రాలలో దాదాపు ప్రతీది ఏదో ఒక అంతర్జాతీయ బహుమతి సాధించడం హర్షదాయకం. ఈ స్థాయికి రావడానికి రాయ్ చాలాకష్టాలు పడ్డారు. 1921 లో జన్మించిన రాయ్‌కి మరి రెండేళ్ళకే తండ్రి కరువైనాడు. మామయ్య యింట్లో పేదరికంలో పెరిగారు. 19 వ ఏట పట్టభద్రుడైనారు. 1940 లో శాంతినికేతనంలో చేరారు. టాగోర్ గురువు, సచివుడు, దైవము అయినారు. 1943 లో డి. జె. కీమర్ అండ్ కంపెనీలో కమర్షియల్ ఆర్టిస్టుగా చేరారు. మరి నాలుగేళ్ళలో కంపెనీ చిత్రకళాశాఖ అధినేత అయినారు. 1952 లో "పథేర్‌పాంచాలి" నిర్మాణానికి ఉపక్రమించారు. పుస్తకాలు కుదువబెట్టి, అమూల్యవస్తువులు కుదువబెట్టి, ప్రభుత్వ సహాయం అర్థించి 1954 లో పూర్తిచేశారు. కేన్స్, శాన్‌ఫ్రాన్సిస్కో, స్ట్రాట్‌ఫర్డ్, వాంకోవర్, న్యూయార్క్, మనిలా, ఎడిన్‌బరో, వాటికన్, బెర్లిన్, లండన్, మెల్బోర్న్ అవార్డులు, సెల్జినిక్ గోల్డెన్ ట్రాఫీ, లారెల్ సంపాదించారు. దర్శకత్వమే కాక స్వయంగా సంగీతం, స్క్రిప్టు సమకూర్చుకొంటారు.

దాదాపు 17 సంవత్సరాలక్రితం నెహ్రూ విరచితమైన "డిస్కవరీ ఆఫ్ ఇండియా" గ్రంథం జాకెట్‌కు-సత్యజిత్‌రాయ్ డిజైను వేశారు. అప్పట్లో రాయ్‌కు అంత ప్రఖ్యాతి లేనందువల్ల ఆయన పేరును చీమసైజు అక్షరాలలో ఉదహరించారు. ఇప్పుడు పునర్ముద్రిత గ్రంథాలలో రాయ్ పేరు కాటికాయంత అక్షరాలలో వేస్తున్నారు.

చార్లీచాప్లిన్ తన చిత్రం "లైమ్‌లైట్"కు పోస్టర్లను రాయ్‌చేత వేయించారు. కోరి కోరి వేయించినారట.

రాయ్ పని, ఊహలు, ఆశయాలపై డి. బి. గార్గ్ ఓ డాక్యుమెంటరీ చిత్రం తీశారుకూడా. 'మహానగర్'కు రాయ్ ఎలా పనిచేసిందీ అందులో వుంది రాయ్ స్వయంగా ఆంగ్లవ్యాఖ్యానంచెప్పి వుండడం ఈ చిత్రంయొక్క మరొక విశిష్టాంశం

మద్రాసులో అక్కినేని కార్యక్రమాలు

అక్కినేని నాగేశ్వరరావు మద్రాసులో ఆగష్టు 12వ తేదీనుంచి నాలుగైదురోజులు వుండి వివిధకార్యక్రమాలలో పాల్గొన్నారు.

ఒకవివాహమహోత్సవానికి హాజరుకావడం నిమిత్తం 12వ తేదీ మధ్యాహ్నం విమానంలో హైద్రాబాద్‌నుంచి మద్రాసు వచ్చారు. ఆ రాత్రి పి. ఏ. పి. అసోసియేట్ డైరక్టర్ తాతినేని రామారావుకు, జైహింద్ ఫొటోగ్రాఫర్ స్టిల్స్ సత్యం కుమార్తె జయశ్రీకి జరిగిన వివాహ మహోత్సవంలో ప్రముఖ పాత్ర వహించారు. శ్రీ సత్యంకు శ్రీ నాగేశ్వరరావు దగ్గర బంధువు. స్వాగత కార్యక్రమంలో సయితం నాగేశ్వరరావు పాల్గొన్నారు. శ్రీ ఎన్. టి. రామారావు రాగా ఎదురువెళ్ళి కరచాలనం చేసి తోడుకొని వచ్చారు. డైరెక్టర్ బి. ఏ. సుబ్బారావు ఫొటోగ్రాఫర్‌లు అపూర్వోత్సాహం చూపి చకచక ఫొటోలు తీశారు. కళ్యాణ సమయంలో పైవస్త్రమును నాగేశ్వరరావు, రామారావు, గుమ్మడి, జగ్గయ్య నాలుగు వైపులా పట్టుకొనగా వెనుక "పి. ఏ. పి." అనుమోలు సుబ్బారావు వున్నారు. ఆహూతులందరితోను అక్కినేని కులాసాగా పిచ్చాపాటీ జరిపారు.

15 వ తేదీ రాత్రి దక్షిణ భారత ఫిలిం వాణిజ్యమండలి శ్రీ నాగేశ్వరరావుకు ఘన సన్మానవిందు చేసింది. అది అమెరికా విజ్ఞాన యాత్రను జయప్రదంగా జరిపించి వచ్చినందుకు యేర్పాటయింది. మండలి ఉపాధ్యక్షులు ఏ. ఎల్. శ్రీనివాసన్ అధ్యక్షత వహించారు.

శ్రీ నాగేశ్వరరావు సమాధానమిస్తూ అమెరికాలో కళాకారులు, సాంకేతికజ్ఞులు గిల్డుగా ఏర్పడి బహుముఖ వికాసానికి కృషి చేస్తున్నారని, భారతదేశంలోకూడా ఇట్టి ఏర్పాటు అభిలషణీయమనిసలహాయిచ్చారు.

అన్నపూర్ణ పిక్చర్స్ అధినేత శ్రీ దుక్కిపాటి మధుసూధనరావు ఆగస్టు 12 న మద్రాసు వచ్చి సంస్థ కార్యకలాపాలను చూచుకొన్నారు.

రామారావు కార్యక్రమం

శ్రీ ఎన్. టి. రామారావు ఆగస్టులో "దాగుడుమూతలు" మిగిలిన వర్క్ పూర్తి చేసి "మంచిమనిషి" పని ముగించి "బభ్రువాహన" పనిమాని స్వంతచిత్రం "శ్రీకృష్ణ పాండవీయం" నిర్మాణ సన్నాహాలు జరిపించారు.

"మంచిమనిషి" ప్యాచ్‌వర్క్‌లో గాయపడ్డ రామారావు ప్రేయసీ డాక్టరూ అయిన జమున వద్ద చికిత్స పొందటం ఒక ముఖ్య ఘట్టం. ఛాయాచిత్రావారి తదుపరి చిత్రంలోను ఆత్మా ఆర్ట్స్ తొలి చిత్రంలోకూడా రామారావు నటించగల సూచనలు కాన వచ్చినవి.

పోతే "శ్రీకృష్ణపాండవీయం"కు అక్టోబర్ 27 న పూజ జరిపి నవంబరు 12 న పాటలరికార్డింగ్ ప్రారంభించి, డిసెంబర్ ఆరంభంలో షూటింగ్ మొదలెట్టాలని అనుకుంటున్నారు.

మాధవ ప్రొడక్షన్స్‌వారి "పాండవ వనవాసం"లో భీముడుగానటిస్తున్న రామారావు స్వంత చిత్రంలోకి భీమపాత్రధారి దొరక్క కలవరపడుతున్నారు, భీముడికి పెద్దపోర్షను



స్టిల్స్ సత్యం కుమార్తె చి॥సౌ॥జయశ్రీకి చి॥ తాతినేని రామారావుకు ఇటీవల వివాహం జరిగింది

వున్నదని,యువకుడు స్థూలకాయుడు అయిన వ్యక్తికోసం గాలిస్తున్నారని చెప్పారు. కె. ఆర్. విజయ అనే తమిళ నటి కాని కాంచన అనే తెలుగు నటి కాని "కృష్ణ పాండవీయం"లో నటించవచ్చు. సముద్రాల రాఘవాచార్య స్క్రిప్టు సిద్ధం చేశారు.

సెప్టెంబర్‌లో రామారావు "వీరాభిమన్యు" "పాండవ వనవాసం" "ప్రమీలార్జునీయం" "హరిశ్చంద్ర" "మంగమ్మ శపథం" మొదలైన చిత్రాల కాల్‌షీట్‌లకు హాజరౌతారు.

కొత్తగా యాక్సెప్ట్ చేసిన చిత్రాలు సురేష్ ప్రొడక్షన్స్‌వారి "శ్రీకృష్ణతులాభారం" రాజలక్ష్మిప్రొడక్షన్స్‌వారి "కైకుదుత్త దైవం" (చేతికందినదేవత)' డి. బి. ఎన్. వారి తదుపరి చిత్రం, అపర్ణావారి చిత్రం మొదలైనవి.

సెప్టెంబర్‌లో విజయవాడలో రామారావుకు ఘనసన్మానం జరగబోతున్నది. నగర అగ్నిబాధితులకు లక్షరూపాయల విరాళమిచ్చినందున పురప్రముఖులు సన్మానించబోతున్నారు సన్మానసభకు ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి అధ్యక్షత వహిస్తారు. పురపాలకసంఘ అధ్యక్షుడు ఎస్. ఎమ్. ఏ. ఖుద్దున్ అధ్యక్షుడుగా, ఎమ్. ఫణిభూషణరావు కార్యదర్శిగా సన్మాన సంఘం పనిచేస్తున్నది.

విద్యార్థులతో రేలంగి తమాషాలు

హాస్యనటుడు రేలంగి వెంకటరామయ్య ఆగస్టు 15 వ తేదీ ఉదయం మైలాపూర్ కేసరి హైస్కూలులో స్వాతంత్ర్యదిన వార్షికోత్సవాలలో పాల్గొని తమాషాగా మాట్లాడి విద్యార్థులను హుషారెత్తించారు. జెండా ప్రతిష్ఠాపనచేస్తూ ఆయన ఇలా అన్నారు:

"నేను ఇంకెక్కడా జెండాలు పాతలేదు. ఇక్కడే ఇప్పుడే పాతుతున్నాను. నేను అంతచదువుకొన్న వాణ్ణికాను మీరయినా బాగా చదువుకొని పైకిరావాలి. నేను కాస్త చదువుకొన్న రోజుల్లో ఎటునుంచి చూచినా ఫస్టున వుండేవాణ్ణి తక్కువ మార్కులలో నేను ఫస్టు ర్యాంకులలో చివరినుంచి ఫస్టు. సినిమా వాళ్ళం డబ్బు వుంది. కాని ప్రభుత్వంవారు పన్నులేసి నడుం విరగ్గొట్టుతున్నారు. అయినా లేని అవసర సందర్భాలలో సహాయం చేస్తూనే వుంటాము."

నాగిరెడ్డి, చక్రపాణి కార్యక్రమాలు

విజయాప్రొడక్షన్స్ శ్రీ బి. నాగిరెడ్డి శ్రీ చక్రపాణి ప్రొడక్షన్ ఎక్స్‌పాన్షన్‌లో నిత్యనిమగ్నులైవున్నారు.

"ఆలీబాబా 40 దొంగలు" బహుశా, రంగులలో పునర్నిర్మించేందుకు చక్రపాణి, నరసరాజు స్క్రిప్టుపై చర్చలు జరుపుతున్నారు. శ్యామ్‌సుందర్ కాండో ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేయవచ్చునని తెలుస్తున్నది.

శ్రీ చక్రపాణి ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ సభ్యులయిన మీదట పరిషత్తు ద్వారా పరిశ్రమ వికాసానికి పథకాలు తయారు చేస్తున్నారు.

శ్రీ నాగిరెడ్డి శ్రీ కె.వి.రెడ్డి దర్శకత్వంలో "సత్యహరిశ్చంద్ర" నిర్మాణం సాగిస్తున్న "కృష్ణలీలలు" కలర్ చిత్రానికి పచ్చజెండా చూపారు. చాణక్య రంగులలో తమిళంలో "రాముడు - భీముడు" (ఎమ్. జి. ఆర్. సరోజ) తీసేందుకు ఈలవేశారు.

శ్రీ కె. వి. రెడ్డి "సత్యహరిశ్చంద్ర"కు కొత్తరూపమివ్వడంలో తీసుకొన్న శ్రద్ధాసక్తులు గణనీయం. స్వయంగా అనేక గ్రంథాలను పరిశోధించి, కవి పింగళితో చర్చించి, పూర్వం వచ్చిన చిత్రాలలోని లొసుగుల గురించి సంభాషించి, ఈకాలం ప్రేక్షకులను-సాహిత్యాభిమానులనురంజింపచేసే రీతిలో కథాగమనం రూపొందించారు

ఈమధ్య వచ్చిన ఒకహిందీ హరిశ్చంద్రలో హరిశ్చంద్రుడు కాయకష్టంచెయ్యడం, విశ్వామిత్రుడు డైరక్ట్‌గా చంద్రమతిని మాంగల్యం యిచ్చివెయ్యమని 'డిమాండ్' చెయ్యడం వంటి అసందర్భాలు దొర్లినవి. ఇతర సాహిత్యాలలో హరిశ్చంద్ర పాత్ర నిర్మాణం గురించి కూడా శ్రీ రెడ్డి, శ్రీ పింగళి, విజయాయూనిట్ పరిశీలనలు జరిపారు. విజయ హరిశ్చంద్ర మున్నెప్పుడూ రాని హరిశ్చంద్రాంశాలతో శోభిల్లగలదని అంటున్నారు. రామారావు, ఎస్. వరలక్ష్మి, ముక్కామల, రమణారెడ్డి, రాజనాల, రేలంగి, మీనాకుమారి, రాజశ్రీ మొదలైనవారు తారాగణంలో కలరు.

ఒక చెంపన ప్రొడక్షన్ షెడ్యూలు జోరుగావుంటే వేరొక చెంప కలర్‌ఫ్లోర్, వైడ్‌స్క్రీన్‌ఫ్లోర్, కలర్‌లాబ్, రీ రికార్డింగ్ రూమ్ నిర్మాణాల సంపూర్తికి శ్రీ నాగిరెడ్డి శరవేగంతో పనిచేస్తున్నారు. చాలామంది బొంబాయి నిర్మాతలుకూడా యిచ్చటకు రాబోతున్నారు. స్వంత చిత్రాలకు సంబంధించినంతవరకు నాగిరెడ్డి "ప్రూఫ్ సబ్జెక్టు"కే మొదటి వాటా యివ్వదలచారని అనుకొంటున్నారు. కొత్తకొత్త కథలు, ప్రయోగాత్మక చిత్రాలగురించికూడా నాగిరెడ్డి ఆలోచించగలరని పరిశ్రమ ఆశిస్తున్నది.

ఈ విషయమై శ్రీ నాగిరెడ్డి ఒక సమావేశంలో ప్రస్తావించి నిర్మాతకు చివరకు మిగిలేది సున్నకు సున్న హళ్ళికి హళ్ళి అన్నారు.

మద్రాసులో శతదినోత్సవం జరుపుకొన్న ఒక చిత్రం వసూళ్ళను ఆయన వివరిస్తూ యిలా అన్నారు:

"శతదినోత్సవం జరుపుకొన్న ఒకచిత్రం ఒక థియేటర్‌లో రూ. 8335-50 పైసలు వసూలుచేసింది. ఇందులో పన్నులుమింగింది రూ. 3261.15 పైసలు. థియేటర్ షేర్ పోగా డిస్ట్రిబ్యూటర్‌కు వచ్చింది 3020 రూపాయలు. డిస్ట్రిబ్యూటర్‌కు 15 వంతుల కమిషన్ పోగా నిర్మాత చేతిలో రాలింది 2567 రూపాయలు. పబ్లిసిటీ ఖర్చులుపోతే జేబులో బిక్కుబిక్కుమంటూవున్న డబ్బు 1500 రూపాయలు."

పన్నులు తగ్గించి పరిశ్రమకు సహాయపడాలని భారత ప్రభుత్వానికి ఆంధ్ర, మద్రాసు ప్రభుత్వాలకు శ్రీ నాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు.



"మంచిమనిషి"లో రామారావు, జమున.

ప్రసాద్ కార్యక్రమాలు

శ్రీ ఎల్. వి. ప్రసాద్ త్వరలో మద్రాసులోనే ఒక ఫిలిం స్టుడియో నిర్మించ నిశ్చయించారని తెలుస్తున్నది. ప్రస్తుతానికి సస్పెన్స్, డిటెక్టివ్ చిత్రం "పేపర్‌వర్క్" పూర్తిచేశారు. రచన ముళ్ళపూడి. దర్శకుడు సంజీవి త్వరలోనే మరొక తెలుగుచిత్రం కూడా ప్రారంభించబోతున్నట్లు తెలుస్తున్నది.

పూర్తి అయిన చిత్రాలు, మొదలైన చిత్రాలు

భరణీవారి "వివాహబంధం" షూటింగ్ రీ రికార్డింగ్ పూర్తి అయినవి. కన్నాంబ మృతివల్ల కొంతజాగుజరిగింది. రామారావు, భానుమతి, బాలయ్య, ప్రభాకరరెడ్డి, పద్మనాభం, నాగయ్య, వాసంతి, సూర్యకాంతం తారాగణంలో కలరు. మూలం "సాత్‌పాకే బంధ". ఆ బెంగాలీ చిత్రంలో నాయిక పాత్రధారిణి సుచిత్రాసేన్ ఒక అంతర్జాతీయ ఉత్సవంలో ఉత్తమ నటనకు బహుమతి పొందింది. ఇక భానుమతి సంగతి వేరే చెప్పాలా?

ఛాయాచిత్రావారి "మంచిమనిషి" షూటింగ్ పూర్తి అయింది. ఈసారి ఔట్‌డోర్‌కు ప్రాధాన్యం వుండే చిత్రం తీస్తారు. దర్శకుడు ప్రత్యగాత్మ.

థియేటర్లుగా మారుతున్న దుకాణాలు

అమెరికాలో జాన్‌హారిస్, ఆల్విన్‌ఫాస్టగారలు దుకాణాలను చిన్న సినిమా థియేటర్లుగా మార్చివేస్తున్నారు ఒక్కొక్క థియేటర్‌లో నూరుమంది ప్రేక్షకులకు వసతి వుంటుంది. రాత్రల్లా ప్రదర్శనలు నిర్విరామంగా జరుగుతూనే వుంటవి. పెద్దపెద్ద థియేటర్లపై పెద్దపెద్ద పెట్టుబడులు పెట్టడంకంటె కొద్దిపెట్టుబ‘తో మంచి వ్యాపారం సాగించడానికిది చక్కటి మార్గమౌతున్నది. ఈ సంవత్సరం లోనే ఇటువంటి ‘‘లిటిల్ సినిమాలు" మరి 200 నిర్మాణం కావచ్చు.

రాజలక్ష్మీ ప్రొడక్షన్స్‌వారి "వీరాభిమన్య"లో ఆగస్టులోనే రెండుమూడు నెల్లపై పనిజరిగింది. ఉత్తరకుమారుడు పద్మనాభం ఉత్తర కాంచనతో కోసిన కోతలు (వాహిపీలా) షూట్‌చేశారు. సెప్టెంబర్ నాడు భీముడు దండమూడి రాజగోపాల్‌కాండో కాల్‌షీట్లు ప్రారంభమౌతవి. ఫిబ్రవరి వరకు నిర్విరామంగా షూటింగ్ సాగుతుంది. రామారావు (కృష్ణుడు), కాంతారావు (అర్జునుడు), శోభన్‌బాబు (అభిమన్యుడు), రాజనాల (ఘటోత్కచుడు) ధూళిపాళ (ధర్మరాజు), ముక్కామల (దుర్యోధనుడు), దేవిక (ద్రౌపది), ఎస్. వరలక్ష్మి (సుభద్ర), రేలంగి మొదలైన వారు తారాగణంలో వున్నారు రచన సముద్రాల రాఘవాచార్య, దర్శకుడు వి. మధుసూదనరావు, నిర్మాతలు సుందరలాల్ నహతా, డూండీ. మొదటివారంలో జరిగిన షూటింగ్‌లో శోభన్‌బాబు, కాంచన, కాంతారావు, మాలతి, వేమూరి రామయ్య, రామకోటి మొదలైనవారు పాల్గొన్నారు.

వి. ఎస్. ఫిలిమ్స్‌వారి "భక్త రామదాసు" నిర్మాణం పునః ప్రారంభమైంది. 1957 లో ప్రారంభమైన ఈ చిత్రంలో మొత్తం 31 పాటలు వుంటవి. వాటిలో 14 నాగయ్యగారు పాడేవి. సంక్రాంతికి విడుదలచెయ్యాలని సంకల్పం. ఇప్పటికి 13 రీళ్ళు తయారైనవి. నాగేశ్వరరావు, రామారావు, రేలంగి, అంజలిదేవి గెస్ట్‌ఆర్టిస్టులుగా కనిపించగలరు. వైకుంఠ దృశ్యాలు, రామలక్ష్మణ దర్శనం రంగులలో తీయదలచారు. తానీషాభార్యగా నటించిన సూర్యకుమారి ప్రస్తుతం అమెరికాలో వున్నారు. అయితే ఆమె పోర్షను ఈవరకే షూట్ చెయ్యబడిందట. గోవిందరాజుల సుబ్బారావు, జంధ్యాల గౌరీనాథశాస్త్రి, కన్నాంబ, సి. ఎస్. ఆర్. ఆంజనేయులువంటి కీర్తిశేషులు ఈ చిత్రంలో నటించివున్నారు.

శ్రీనివాస ఉత్సవం

తిరుపతికి ఆరుమైళ్ళ దూరంలో బాగ్రాపేట రోడ్డులోవున్న మంగాపురంలో (అలివేలుమంగాపురంకాదు) శ్రీ కళ్యాణ శ్రీనివాస స్వప్న నిదర్శన ఉత్సవం ఈ మధ్య అతివైభవంగా జరిగింది. తిరుపతి కొండపైని మూలవిరాట్టుకంటె ఈ మూర్తి రెండు అడుగుల ఎత్తు ఎక్కువ. స్వప్న నిదర్శన ఉత్సవాలలో ఎ. ఏ. కె. రంగారావు, చిట్టిబాబు, శ్రీ వేంకటేశ్వర సంగీత కళాశాల విద్వాంసులు, ఇంకా అనేకమంది కళాప్రియులు పాల్గొన్నారు. బొబ్బిలి రాణీవారు విద్వాంసులను సముచితరీతిని సత్కరించారు. స్వామి చిత్రపటం రెండేసి రూపాయల వెలకు క్రింది చిరునామావద్ద లభించగలదు. ఊహా ఎంటర్ ప్రైజెస్. 1. పైక్రాఫ్ట్స్ గార్డెన్స్, మద్రాసు-6.



తిరుపతివద్ద జరిగిన ఉత్సవంలో వీణా ప్రవీణుడు చిట్టిబాబును రాణీ లక్ష్మి సుభద్రాయమ్మగారు సత్కరిస్తున్న దృశ్యం

టార్జాన్ టైప్ చిత్రం

కొత్తరుచుల దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు ఈసారి టార్జాన్‌టైపుచిత్రంతెలుగులో నిర్మించదలచినట్లు తెలుస్తున్నది. విజయభట్ మూవీస్‌వారికి వీరు తీస్తున్న చిత్రానికి "తోడు నీడ" అని నామకరణం చేశారు. ఆగస్టులోనే బాబూమూవీస్‌వారి "తేనెమనసులు", అశోకావారి "సుమంగళి" (నాగేశ్వరరావు, సావిత్రి) షూటింగ్ కొనసాగించారు.

తమిళచిత్రంలో తెలుగుపాట

సావిత్రి అద్భుతంగా నటించిన "కైకొడుత్త దైవం" తమిళచిత్రంలో సుబ్రహ్మణ్యభారతికవి తెలుగుపై వ్రాసిన చరణం "సుందర తెలుంగు"తోపాటు ఒక తెలుగుపాట వుంది. ఆ చిత్రాన్ని తెలుగులో రాజలక్ష్మీవారు తీయనున్నారు.

దేవయాని

మనవాళ్ళు చాలా గొప్పవాళ్ళు. వాళ్ళకి ఇరవయ్యో శతాబ్దంలో సినిమాలనేవి వస్తాయని ఏనాడో తెలుసు. అందుకనే సినిమాలు తీయడానికి నిర్మాతలు కథల కోసం వెతుక్కోనక్కరలేకుండా ఒకటో రకం కథలు - ప్రేమ కథలు, వీరకథలు, భక్తి కథలు - రకరకాలవి రాసి, రాశి పెట్టారు. వీటిలో "కచదేవయాని" కథ ఎంతో మనోహరమైనది; రసవంతమైనది. ఎన్నిసార్లు సినిమాతీసినా జనం ఎన్నిసార్లు చూచినా రక్తికట్టించేటంత అందంగా ఈ కథ రాశారు మనవాళ్ళు. శుక్రాచార్యుని కూతురు దేవయాని దేవగురు పుత్రుడైన కచుని ప్రేమించడం, అతడామె ప్రేమను నిరాకరించడం - ఈ కథ అందరికీ తెలిసినదే అయినా, పునః పునర్జనరంజకంగా శ్రీ పొట్లూరి నిర్మిస్తున్నారు. మాట, పాట అయనే. దేవయాని బి. సరోజాదేవి. వాణీ విడుదల.

□□□

నయాగరా జలపాతంతో శంకర్ సంగీతం

"సంగం" సంగీతదర్శకులలో ఒకరైన హైదరాబాద్ శంకర్ ఈమధ్య అమెరికా సందర్శించినప్పుడు నయాగరా జలపాతం వద్ద కొన్ని గంటలు గడిపారు. ఆ జలపాత ధ్వని ఈ సంగీతకర్త సృష్టి సీమలో ప్రతిధ్వనించి శాశ్వతస్థానం పొందింది. శంకర్ సంగీత దర్శకత్వం వహిస్తున్న ఒక చిత్రంలో ఒక పాటకు పూర్తిగా నయాగరా జలపాత ధ్వనిని నేపథ్య సంగీతంగా వినియోగించబోతున్నారు.

అద్వైతి సుబ్బారావు

అధిక సంఖ్యాకుల అభిరుచులను అంచనా వేయటంలో ఆరితేరిన వాడు ఆదుర్తి. ఆయన ఉండేల్ దెబ్బ గురి తప్పకుండా గుండెకు తగులుతుంది. ఆయన చలనచిత్ర సోపానపటంలో నిచ్చెనలే గానీ పాములు లేవు. మెట్లు ఎక్కడమే గానీ దిగటం చేతకాదు ఆయనకు.

అధికసంఖ్యాకుల పట్ల ఆపేక్ష ఎక్కువైనా అల్పసంఖ్యాకుల పట్ల నిర్లక్ష్యభావం లేదు ఆయనకు. పండితులు, పామరులు, వృద్ధులు, యువకులు, స్త్రీలు, పురుషులు పిన్నలు, పెద్దలు. ఈద్వైతంలో అద్వైతాన్ని స్థాపించటం ఆయనలక్ష్యం. 'కళ' కళ కోసమే అనే జనులు కొందరు. కళ విశ్వ శ్రేయస్సుకోసం అనే జనులు మరికొందరు. ఈయన ఉభయ జన మిత్రుడు.

కీర్తి అంటే ఆయనకు ప్రేమ. డబ్బంటేనూ[illegible]డా ప్రేమే. ఒకదానికోసం రెండవదాన్ని వదులుకోలేదు ఆయన. కాని కీర్తి డబ్బు సవతులు. రెండింటికీ ఎడ మొగం, పెడమొగం. ఒకటి వస్తే రెండోది రాదు. కానీ రెండింటినీ లొంగదీసుకొనే ఒడుపు ఆయనకు తెలుసు.

అంగుళం బీరుపోకుండా అంచనా వేయగలశక్తి ఆయనకు ఉంది. పండితులు ఎంత స్థాయివరకు దిగగలరో, పామరులు యెంత స్థాయివరకు యెక్కగలరో అంచనావేసి, ఉభయవర్గాలకు ఒక ఉమ్మడి సరిహద్దు గీస్తాడు. యువకులు యెంత శోకాన్ని భరించగలరో, వృద్ధులు ఎంత రొమాన్సును క్షమించగలరో, స్త్రీలు ఎంత హాస్యాన్ని సహించగలరో చూచి కనిష్ఠ సామాన్య గుణిజాన్ని (ఎల్. సి. ఎం) లెక్కవేస్తాడు. విడివిడిగా రేఖలు గీస్తాడు. ఈ రేఖలన్నీ కలిసే బిందువును ఒకదాన్ని కనిపెట్టి, అక్కడ తన ప్రాస్తావును పాతేస్తాడు.

పార్థసారథి



డైరెక్టర్ శ్రీ ఆదుర్తి సుబ్బారావుకు రాజమండ్రిమునిసిపల్ చైర్మన్ శ్రీ నిడమర్తి నరసింహం పౌరసన్మానపత్రం సమర్పిస్తున్నప్పటిచిత్రం


అన్నివర్గాల ప్రేక్షకులను అక్కడ సమావేశపరిచి, సమాధానపరుస్తాడు. అది ఆయన విజయానికి కీలకం.

వేసిన అంచనాకు—వాసి తేడా రాకుండా చిత్రాన్ని నిర్మించగల ప్రతిభ ఆయనకు ఉంది. బాక్సాఫీసు సూత్రాలు అందరికీ కంఠస్థమే. దివాళాదర్శకులకు మరీ బాగా కంఠస్థం. కానీ వాటిని గుప్పిట్లో ఇరికించుకోగల ఒడుపు చాలా కొద్దిమందికే ఉంది. ఆ కొద్దిమందిలో అగ్రగణ్యుడు ఆదుర్తి.

చిత్రాన్ని నిర్మించటం అంటే ఏడు గుర్రాల రథాన్ని నడపటం లాంటిది. ఏడు గుర్రాల కళ్లాలనూ చేతుల్లో పట్టుకుని, అన్నిటినీ సమానమైన వేగంతో తాను నిర్దేశించిన మార్గంలో నడిపించటం అంటే అది అశ్వ హృదయం తెలిసిన సారథికే సాధ్యం. నటీనటులు, రచయిత, సంగీత దర్శకుడు, గాయకులు, సాంకేతిక నిపుణులు ఏటి కొకళ్ళు కోటి కొకళ్ళులాగకుండా, తాను గీసిన హద్దులమధ్య నడిచేటట్లు చేయాలంటే దర్శకుడు కళా హృదయం తెలిసినవాడై ఉండాలి. ఆదుర్తికి అది తెలుసు. కనుకనే ఆయన చిత్రాలు పకడ్బందీగా ఉంటాయి.

ఆయన చిత్రాలలో సాధారణంగా కుటుంబ జీవితం ఇతి వృత్తంగా ఉంటుంది. యువతీ యువకుల చెట్టాపట్టాలు వేసుకుని చూసేంత హుషారుగా, రిటైరై రెస్టు తీసుకుంటున్న వారు సకుటుంబంగా వెళ్ళి [illegible] ఎబ్బెట్టులేని విధంగా ఉంటా[illegible] చిత్రాలు. అందుకే ఆయన [illegible] నోట్లు పండుతున్నాయి.

చైత్రయాత్ర [illegible] సాగిస్తున్న ఈ [illegible] మంత్రిగా [illegible]



Edited and Published by V. V. Raghavaiah for Jyoti Publications
and Printed by him at Thrinadh Art Printers, Vijayawada-2

J. Nageswara Rao



Wrapper Printed at Neo Art Press, Madras 2